

ఈనాడు



విజయవాడ 25-11-2025 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 105

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 12

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



రాష్ట్రపతి భవన్‌లో జస్టిస్ సూర్యకాంత్‌తో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

హాజరైన ఉపరాష్ట్రపతి, ప్రధాని, లోక్‌సభ స్పీకర్, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్

7 దేశాల ప్రధాన న్యాయమూర్తుల రాక ● తొలిరోజే 17 కేసులు విచారించిన సీజేఐ

ఈనాడు, దిల్లీ: జమ్మూ కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దుతోపాటు బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) వంటి అంశాల్లో పలు కీలక తీర్పులను వెలువరించిన ధర్మాసనాల్లోని సభ్యుడైన జస్టిస్ సూర్యకాంత్.. సోమవారం సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో అతిరథ మహారథుల సమక్షంలో ఉదయం 10 గంటలకు ఆయన చేత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రమాణం చేయించారు. జస్టిస్ సూర్యకాంత్ హిందీలో.. దైవ సాక్షిగా ప్రమాణం చేశారు. దేశ న్యాయ వ్యవస్థలో అత్యున్నత పదవి చేపట్టిన తొలి హరియాణా వాసిగా రికార్డు సృష్టించారు. 2027 ఫిబ్రవరి 9 వరకూ 15 నెలలపాటు ఆయన సీజేఐగా కొనసాగుతారు. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, (మిగతా 3లో)



దిగ్గజ నటుడు ధర్మేంద్ర కన్నుమూత

'షోలే'తో బాలీవుడ్‌లో తిరుగులేని గుర్తింపు

రొమాంటిక్, యాక్షన్ చిత్రాలకు ప్రసిద్ధి


ఈనాడు, సినిమా విభాగం: హిందీ చిత్రసీమ అందగాడు... కమర్షియల్ విజయాలకు చిరునామాగా నిలిచిన దిగ్గజ నటుడు ధర్మేంద్ర(89) ఇకలేరు. కొన్ని రోజులుగా శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆరోగ్యం క్షీణించి సోమవారం కన్నుమూశారు. ధర్మేంద్ర అనారోగ్యానికి గురవడంతో కుటుంబ సభ్యులు అక్టోబరు 31న ముంబయిలోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో ఆయన చనిపోయారంటూ సామాజిక మాధ్యమాల్లో వార్తలు చక్కర్లు కొట్టాయి. ధర్మేంద్ర ఆరోగ్యం నిలకడగానే ఉందని, అభిమానులు ఆందోళన చెందొద్దని ఆయన సతీమణి హేమామాలిని, కుమారుడు సన్నీ దేఓల్ అప్పుడు విజ్ఞప్తి చేశారు. అయితే సోమవారం ధర్మేంద్ర ఆరోగ్యం విషమించడంతో కన్నుమూశారు. రొమాన్స్, యాక్షన్, డ్రామా, కామెడీ.. అన్ని రకాల పాత్రల్లోనూ (మిగతా 3లో)

భారతీయ సినిమా హీ-మ్యాన్ సినిమాలో



మార్కాపురం, మదనపల్లె, రంపచోడవరం

కొత్త జిల్లాలు!



సీఎం చంద్రబాబు సమీక్ష.. నేడు మరోసారి సమావేశం

- నేతలు చెబితేనే ఎన్టీఆర్ జిల్లాలో పెనమలూరు చేరుస్తారా?
- మంత్రివర్గ ఉపసంఘం మరెందుకని ప్రశ్నించిన సీఎం

ఈనాడు, అమరావతి: మార్కాపురం, మదనపల్లె కేంద్రాలుగా రెండు కొత్త జిల్లాలతోపాటు పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంతో రంపచోడవరం కేంద్రంగా మరో జిల్లా ఏర్పాటు అంశం తాజాగా తెరమీదకు వచ్చింది. రంపచోడవరం, చింతూరు డివిజన్లు కలిపితే తూర్పుగోదావరి జిల్లా మరింత పెద్దదిగా తయారవుతుందని భావిస్తున్న నేపథ్యంలో ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల సరిహద్దుల మార్పులు, చేర్పులపై సీఎం చంద్రబాబు సోమవారం సచివాలయంలో మంత్రులు, అధికారులతో సమీక్షించారు. మంగళవారం మరోసారి చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సందర్భంగా మంత్రివర్గం పలు ప్రతిపాదనలతో కూడిన ప్రజంటేషన్‌ను సీఎంకు అందించింది. అందులోని అంశాలపై కొద్దిసేపు చర్చించిన చంద్రబాబు.. జిల్లాల సరిహద్దుల మార్పు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపై మరిన్ని సూచనలు చేశారు. మార్కాపురం (ప్రస్తుతం ప్రకాశం జిల్లా), మదనపల్లె (ప్రస్తుతం అన్నమయ్య జిల్లా), రంపచోడవరం కేంద్రాలుగా కొత్త జిల్లాల ఏర్పాటుకు సీఎం పచ్చజెండా ఊపారు. అవసరం మేరకు, పరిమిత స్థాయిలోనే మార్పులు, చేర్పులు ఉండాలన్నారు. మంగళవారం మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. (మిగతా 3లో)

ప్రకాశం జిల్లాలోకి అద్దంకి, కందుకూరు

అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో చేర్చాలనే ప్రతిపాదనకు సీఎం పచ్చజెండా ఊపారు. కొత్తగా అద్దంకి, మడకశిర రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు సానుకూలత వెలిబుచ్చారు. బనగానపల్లె రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ప్రతిపాదనను ప్రస్తుతానికి పక్కన పెట్టినట్లు తెలిసింది. గూడూరు డివిజన్‌ను తిరుపతి జిల్లా నుంచి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో కలపాలని.. చిత్తూరు జిల్లాలోని నగరి రెవెన్యూ డివిజన్‌ను తిరుపతి జిల్లాలో కలపాలని ప్రతిపాదించారు. వీటిపై మంగళవారం చర్చించనున్నారు.

ఆయుధాలను వదిలేస్తాం.., కాల్పులు విరమించండి

ఫిబ్రవరి 15 వరకు గడువు కోరుతూ మావోయిస్టుల ప్రతిపాదన

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌ల సీఎంలకు వినతి

పీఎల్‌జీఏ వారోత్సవాలను నిలిపివేస్తున్నట్లు అనంత్ ప్రవక్తే పేరిట లేఖ

లోపలి పేజీల్లో

నేడే రామాలయంపై ధ్వజారోహణం

ఆవిష్కరించనున్న ప్రధాని మోదీ

100 టన్నుల పూలతో కోవెల ముస్తాబు

డిమాండ్ ఆధారిత పంటలు వేయండి

'రైతన్నా మీ కోసం' ప్రారంభోత్సవంలో మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు డిజిటల్-మచిలీపట్నం, ఘంటసాల, న్యూస్‌టుడే: "మారుతున్న ఆహారపు అలవాట్లకు తగ్గట్టుగా పంటలు పండించాలి. డిమాండ్ ఆధారిత పంటలపై దృష్టిపెడితే ఎన్ని విపత్తులు వచ్చినా తట్టుకోగలం. వ్యవసాయం, అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వం 'రైతన్నా మీ కోసం' కార్యక్రమం చేపట్టింది" అని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. (మిగతా 11లో)



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, చిత్రంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు తదితరులు



దేవాలయానికి కేటాయించిన 30 ఎకరాల భూ హక్కు పత్రాలను ద్వారకాతిరుమల ఈవో మూర్తికి అందజేస్తున్న పవన్‌కల్యాణ్. చిత్రంలో మంత్రి నాదెండ్ల మనోహర్

లక్ష్మీనరసింహుని సేవలో పవన్‌కల్యాణ్

ఐఎస్ జగన్నాథపురం ఆలయానికి 30 ఎకరాలు

అధికారులకు భూహక్కు పత్రాలు అందించిన ఉప ముఖ్యమంత్రి

ఏలూరు జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ఈనాడు, ఏలూరు: ఏలూరు జిల్లా ఐఎస్ జగన్నాథపురంలోని లక్ష్మీనరసింహస్వామిని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారికి ఉప ముఖ్యమంత్రి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. గతేడాది నవంబరులో (మిగతా 3లో)

కుటుంబం నుంచే నైతికత మొదలు కావాలి

ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు

విద్యపై పార్టీల రంగుల ప్రభావం లేకుండా చేశాం: మంత్రి లోకేశ్



ప్రవచనం చెబుతున్న చాగంటి కోటేశ్వరరావు. చిత్రంలో లోకేశ్

విజయవాడ(విద్యాధరపురం), న్యూస్‌టుడే: నైతికత అనేది కుటుంబం నుంచే ప్రారంభం కావాలని రాష్ట్ర ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'విలువల విద్యా సదస్సు'లో మంత్రి లోకేశ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. చాగంటి కాళ్లకు లోకేశ్ నమస్కారం చేసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం కోటేశ్వరరావు మాట్లాడారు. "తల్లి కడుపును శంకరాచార్యులు గర్భాలయంగా పోల్చారు. గర్భాలయం నుంచి శిశువు బయటకు వచ్చేటప్పుడు తల్లి పురిటి నొప్పులు భరిస్తుంది. సంతానం కోసం ప్రాణాలు పణంగా పెట్టే ధైర్యం ఒక్క మాతృమూర్తికే ఉంటుంది. తల్లిదండ్రులు, గురువులను గౌరవించలేని వారికి నైతికత గురించి మాట్లాడే అర్హత ఉండదు. తోబుట్టువులు, సోదరులు అనే కుటుంబం విస్తరిస్తే సమాజం అవుతుంది" అని కోటేశ్వరరావు చెప్పారు. లోకేశ్ మాట్లాడుతూ "ఎన్టీఆర్, చంద్రబాబు, భువనేశ్వరిల నుంచి నైతిక విలువలు, సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉండే విధానాన్ని అలవరచుకున్నాను. (మిగతా 3లో)

కేసు రాజీ జరుగుతుంటే.. మీరేం చేశారు?

- తితిదే పూర్వ వీజీవో గిరిధర్‌పై సీఐడీ బృందం ప్రశ్నల వర్షం
- 'పరకామణి' కేసు దర్యాప్తు వేగవంతం

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: "పరకామణిలో కానుకల చోరీకి పాల్పడ్డ రవికుమార్ ఎన్ని విదేశీ కరెన్సీ నోట్లు మీకు అప్పగించారు? ఎక్కడో ఉన్న అప్పటి ఏవీఎస్‌వో సతీష్‌కుమార్‌ను పిలిచి ఫిర్యాదు ఇమ్మని చెప్పడం వెనక ఎవరున్నారు? దర్యాప్తు గురించి మీకు ఏమి తెలుసు? ప్రభుత్వ ఉద్యోగైన సతీష్‌కుమార్ పరకామణి కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుంటుంటే మీరేం చేశారు?" అని సీఐడీ బృందం అప్పటి తితిదే వీజీవో గిరిధర్‌ను ప్రశ్నించింది. సోమవారం తిరుపతి పద్మావతి అతిథిగృహంలో సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ (మిగతా 11లో)

లోపలి పేజీల్లో

చిట్టి బుర్రలు.. గట్టి ఆవిష్కరణలు

'ఈనాడు' వైజ్ఞానిక ప్రదర్శనకు విశేష స్పందన

85 ప్రాజెక్టులను రూపొందించిన 170 మంది విద్యార్థులు

ఎవరి సిమ్ దుర్వినియోగమైతే వారిదే బాధ్యత

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- టెలికాం విభాగం హెచ్చరిక

బంగాళాఖాతంలో రెండు అల్పపీడనాలు



రెండు రోజుల్లో తుపాను ఏర్పడే అవకాశం

ఇదీ సంగతి!



అడ్డాకూలీలుగా 'లేపాక్షి హబ్' రైతులు

కర్ణాటక వెళ్లి పనులు చేసుకుంటున్న వైనం

వైఎస్ హయాంలో దుర్మార్గంగా జరిగిన భూసేకరణే కారణం

ఇప్పటికీ అనేక మందికి అందని పరిహారం

బాధితుల గోడు పట్టించుకోని తదుపరి ప్రభుత్వాలు

'ఈనాడు - ఈటీవీ' క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడి

ఎన్.విశ్వప్రసాద్
ఈనాడు ప్రత్యేక ప్రతినిధి
అనంతపురం జిల్లా యంత్రాంగం



శిథిలావస్థకు చేరిన లేపాక్షి హబ్ ప్రధాన కార్యాలయం

అభివృద్ధి.. ఈ పేరే ఆకర్షణీయం. శక్తిమంతం. అందుకే అభివృద్ధి కోసమని ప్రభుత్వాలు భూ సేకరణ చేపట్టినప్పుడు సమాజంలో కొన్ని వర్గాలు వెంటనే ఆమోదిస్తాయి. పరిస్థితులను లోతుగా గమనిస్తే 'అభివృద్ధి'కి వెనుక మరో కోణమూ కనిపిస్తుంది. భూసేకరణ వెనక ప్రజల మేలు కాక, కొందరు నేతలు, వారి సన్నిహితుల దోపిడీ ఉంటే అదొక నేరం. భూమిని కోల్పోయే రైతుల రక్షణకు ప్రభుత్వాలు ముందే జాగ్రత్త తీసుకోకపోతే అది అన్యాయం. రోడ్డున పడ్డ రైతులను దశాబ్దాలుగా గాలికి వదిలేయడం వారి పట్ల ఘోరంగా వ్యవహరించడం. ఇలాంటి అన్ని దారుణాలూ చోటు చేసుకున్న ప్రదేశం సత్యసాయి జిల్లాలోని 'లేపాక్షి నాలెడ్జ్ హబ్'. అక్కడ దాదాపు 18 ఏళ్లుగా పరిహారం అందక భూములు కోల్పోయిన వందల కుటుంబాలు అల్లాడుతున్నాయి. (మిగతా 11లో)

ఉర్దూ వర్సిటీకి మంత్రి భరత్ రూ.కోటి విరాళం



మంత్రి భరత్‌ను సత్కరిస్తున్న వీసీ షావలీఖాన్ తదితరులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: కర్నూలులోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీకి మంత్రి టీజీ భరత్ రూ.కోటి విరాళం అందించనున్నట్లు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ షావలీఖాన్ తెలిపారు. సోమవారం ఆయన నగరంలో మంత్రిని కలిశారు. ఈ మొత్తాన్ని ఓర్వకల్లు వద్ద అసంపూర్తిగా ఉన్న వర్సిటీ భవనాల నిర్మాణం పూర్తిచేసేందుకు వినియోగించనున్నట్లు వీసీ చెప్పారు. రిజిస్ట్రార్ లోకనాథ, హజ్ కమిటీ రాష్ట్ర సభ్యుడు సూరి మన్సూర్ అలీఖాన్, డీఎండబ్ల్యూవో సబీహా పర్వీన్ పాల్గొన్నారు.

5 వేల మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు పదోన్నతి

పత్రాలు అందజేసిన మంత్రి సంధ్యారాణి



అంగన్‌వాడీ కార్యకర్తలకు పదోన్నతి పత్రాలు అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి, తదితరులు

పార్వతీపురం పట్టణం, పార్వతీపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఐదు వేల మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు పదోన్నతులు కల్పించినట్లు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి తెలిపారు. సోమవారం పార్వతీపురం పట్టణం వన్‌స్టాప్ కేంద్రం ఆవరణలో జరిగిన 'బేటీ బచావో' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. "రాష్ట్రంలో 7,000 మినీ అంగన్‌వాడీల్లో 5,000 అంగన్‌వాడీలను ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేశాం. దాంతో అక్కడి కార్యకర్తలకు పదోన్నతి లభించింది. మిగిలిన రెండు వేల పోస్టు కార్యకర్తలు పదో తరగతి ఉత్తీర్ణత కాలేదు. దీనికి ప్రభుత్వం ఏడాది గడువు ఇచ్చింది. ఈలోగా వారంతా పదో తరగతి ఉత్తీర్ణత పొందితే పదోన్నతి పొందుతారు. రూ.250తో ప్రారంభమైన కార్యకర్తల జీతాలు నేడు రూ.11,500కు చేరాయి" అని సంధ్యారాణి చెప్పారు. పదోన్నతుల పత్రాలను కార్యకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ జగదీశ్వరి, ఎమ్మెల్యే జయకృష్ణ, కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న బస్సులు.. ఏడుగురి మృతి

పలువురికి గాయాలు • తమిళనాడులో ఘటన



ఘటనాస్థలంలో బస్సులు

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: తమిళనాడులో రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఏడుగురు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం మేరకు.. తెన్కాశి నుంచి శ్రీవిల్లిపుత్తూరుకు సోమవారం ఉదయం ఓ ప్రైవేటు బస్సు బయల్దేరింది. శంకర్ కోవిల్ నుంచి తెన్కాశి వైపు మరో ప్రైవేటు బస్సు బయల్దేరింది. ఈ రెండింట్లో 60 మందికి పైగా ప్రయాణికులున్నారు. బస్సులు కడయనల్లూరు సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. వాహనాల ముందు భాగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అటువైపు వెళ్తున్న వాహనదారులు.. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. దుర్ఘటనలో పులియంగుడికి చెందిన వనరాజ్(36), మల్లిక(55), కడయనల్లూరుకు చెందిన తేన్మొళి(55), శంకరన్‌కోవిల్‌కి చెందిన కర్పగవల్లి(50), మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. వారి వివరాలు తెలియాల్సి ఉంది. పొక్లెయిన్ సాయంతో బస్సుల్లో చిక్కుకున్న వారిని కాపాడారు. క్షతగాత్రులను వివిధ ఆసుపత్రులకు తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఓ బస్సు లైసెన్స్ రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ కమల్ కిశోర్ తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.3 లక్షలు, తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వారికి రూ.లక్ష, స్వల్పగాయాలతో చికిత్స పొందుతున్న వారికి రూ.50 వేల చొప్పున సాయాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు.

లేబర్ కోడ్‌ల అమలుతో శ్రామికవర్గంపై కేంద్రం దాడులు

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



మాట్లాడుతున్న రాఘవులు. పక్కన శ్రీనివాసరావు

కృష్ణలంక (రాఘవయ్య పార్క్ కూడలి), న్యూస్‌టుడే: లేబర్ కోడ్‌ల అమలు కోసం కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడం శ్రామికవర్గంపై దాడి చేయడమేనని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పేర్కొన్నారు. సోమవారం ఆయన విజయవాడలో విలేకర్లతో మాట్లాడారు. "యాజమాన్యాలకు అనుకూలంగా కేంద్రం లేబర్ కోడ్‌లు తెచ్చింది. వాటి అమలు కోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను మేం వ్యతిరేకిస్తున్నాం. ఈనెల 26న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు చేపట్టిన ఆందోళనకు సీపీఎం మద్దతు ఇస్తోంది" అని చెప్పారు. రాష్ట్రంలో సంజీవని పథకాన్ని అమలు చేయడమంటే ఆరోగ్య సేవలను ప్రైవేటు పరం చేయడమా అని ముఖ్యమంత్రి చంద్రబాబును రాఘవులు ప్రశ్నించారు. ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్లను కేంద్రం ఆపాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల మంది కౌలుదారులకు అన్యాయం జరిగిందని, పంటలకు గిట్టుబాటు ధర ఎందుకు కల్పించలేదని కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు.

'18 నెలల్లో పేదలకు 3 లక్షల ఇళ్లు ఇచ్చాం'

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ 18 నెలల్లో 3 లక్షల ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు అప్పగించామని మహిళా సహకార ఆర్థిక సంస్థ ఛైర్‌పర్సన్ పీతల సుజాత తెలిపారు. వైకాపా హయాంలో పెండింగ్‌లో పెట్టిన ఇళ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు.

1.40 కోట్ల కుటుంబాలకు

క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు

- వచ్చే ఏడాది జూన్ నాటికి పంపిణీ
- అందులో పీ4 సహా 25 రకాల వివరాలు
- ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ విధానంపై సమీక్షలో సీఎం చంద్రబాబు



ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌పై వైద్య ఆరోగ్యం, పౌర సరఫరాలు, పురపాలక, ఐటీ శాఖలతో పాటు ప్రణాళిక విభాగం ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ప్రతి కుటుంబ సాధికారతే లక్ష్యంగా రాష్ట్రంలోని 1.40 కోట్ల కుటుంబాలకు 2026 జూన్ నాటికి క్యూఆర్ కోడ్ కలిగిన స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు జారీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, పౌరసేవలు, ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి.. 25 రకాల వివరాలతో పాటు పీ4 లాంటి అంశాలనూ పొందుపరచాలని సూచించారు. సుపరిపాలనలో భాగంగా అర్హులైన వారందరికీ పథకాలతో పాటు సులభంగా పౌరసేవలు అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు వివరించారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం ఆయన ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ విధానం (ఎఫ్‌బీఎంఎస్)పై సమీక్షించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సీఎం పలు సూచనలు చేశారు.

★ కుటుంబం యూనిట్‌గా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలు చేయాలి.

★ ప్రతి పౌరుడికి సంబంధించిన అన్ని వివరాలూ ఈ కార్డులో నమోదు చేయాలి.

★ ఈ కార్డు ద్వారా అన్ని ప్రభుత్వ సేవలు, పథకాలు అందాలి.

★ రియల్‌టైమ్ గవర్నెన్స్ నిర్వహించే డేటాలేక్ ద్వారా సమాచార సేకరణ జరగాలి.

★ ఆర్టీజీఎస్ వద్ద ఉన్న సమాచారాన్ని.. వివిధ ప్రభుత్వ శాఖలు వినియోగించుకోవాలి.

★ స్టాటిక్ డేటా, డైనమిక్ డేటా వివరాల్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి.

★ టీకా, ఆధార్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, కుల ధ్రువీకరణ, పాస్‌పోర్టు, రేషన్ కార్డు, స్కాలర్‌షిప్, పెన్షన్ వివరాలు ఉండాలి.

★ వేర్వేరు ప్రభుత్వ పథకాలు, సేవలను ఈ కార్డు ద్వారా ట్రాకింగ్ చేయాలి.

★ కొన్ని పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో ఎదురయ్యే సమస్యలకు ఈ వ్యవస్థ పరిష్కారం చూపేలా ఉండాలి.

★ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వర్ణాంధ్ర విజన్ యూనిట్ ద్వారా కుటుంబ వివరాల్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి.


★ 2026 జనవరికి పూర్తి సమాచారం క్రోడీకరించి.. జూన్ నాటికి కార్డులు పంపిణీ చేయాలి.

ఆయుధాలను వదిలేస్తాం.. కాల్పులు విరమించండి

- ఫిబ్రవరి 15 వరకు గడువు కోరుతూ మావోయిస్టుల ప్రతిపాదన
- అనంత్ ప్రవక్తే పేరిట లేఖ

ఈనాడు, హైదరాబాద్: ఆయుధాలను త్యజించి, ప్రభుత్వం కల్పించే పునరావాస పథకం అంగీకరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామంటూ మావోయిస్టులు ప్రకటించారు. ఇందుకు ప్రభుత్వం కాల్పుల విరమణ పాటించాలని కోరుతూ మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్-మధ్యప్రదేశ్ ప్రత్యేక జోనల్ కమిటీ ప్రతినిధి అనంత్ ప్రవక్తే పేరిట సోమవారం ఒక ప్రకటన విడుదలైంది. ఆయా రాష్ట్రాల సీఎంలు దేవేంద్ర ఫడణవీస్, విష్ణుదేవ్ సాయి, మోహన్ యాదవ్‌లను ఉద్దేశించి లేఖ రాశారు. "ఆయుధాలను త్యజించడానికి మాకు ఫిబ్రవరి 15 వరకు సమయం ఇవ్వాలి. అప్పటివరకు భద్రతా బలగాల గాలింపు చర్యలను నిలిపివేయాలి. ఆయుధాలు వదిలేయడం ద్వారా సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని కేంద్ర కమిటీ సభ్యులు సోనూ దాదా, చంద్రన్నలు ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని మేం సమర్థిస్తున్నాం. అయితే మా పార్టీ ప్రజాస్వామ్య కేంద్రీకరణ సూత్రాలకు కట్టుబడి ఉన్నందున మిగతా వారికి ఈ సమాచారాన్ని చేరవేయడానికి కొంత సమయం పడుతుంది. అందుకే ఫిబ్రవరి 15 వరకు గడువు అడిగామే తప్ప ఇందులో మరె లాంటి ఉద్దేశం లేదు. ఈ విషయంలో మమ్మల్ని నమ్మాలని అభ్యర్థిస్తున్నాం. మేం ఏటా నిర్వహించే పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) వారోత్సవాలను సైతం నిలిపివేస్తున్నాం. రాబోయే రోజుల్లో సాయంత్రం ప్రాంతీయ వార్తల ప్రసారానికి ముందు రేడియోలో మేం చేసిన ప్రకటనతోపాటు ప్రభుత్వ స్పందన కూడా ప్రసారం చేయాలి. ఎందుకంటే రోజువారీ వార్తలు తెలుసుకోవడానికి మా సహచరులకున్న ఏకైక మార్గం రేడియోనే. దీని తర్వాత మేం మరొక ప్రకటన విడుదల చేయడంతోపాటు ఆయుధాలను త్యజించడానికి కచ్చితమైన తేదీని ప్రకటిస్తాం. ఈలోగా కొందరు ప్రజాప్రతినిధులను, పాత్రికేయులను కలిసే అవకాశం మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు మాకు ఇస్తాయని ఆశిస్తున్నాం" అని అనంత్ ఆ లేఖలో ఆకాంక్షించారు.

ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షుడిగా సంజయ్ కపూర్



దిల్లీ: ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్టు సంజయ్ కపూర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన హార్డ్ న్యూస్ ఎడిటర్‌గా ఉన్నారు. ప్రస్తుత అధ్యక్షుడు అనంత్ నాథ్ నుంచి ఆయన బాధ్యతలు చేపడతారని ఎడిటర్స్ గిల్డ్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. సంస్థ ప్రధాన కార్యదర్శిగా ద హిందూ బిజినెస్ లైన్ మాజీ ఎడిటర్ రాఘవన్ శ్రీనివాసన్, కోశాధికారిగా థంబ్‌ప్రింట్ ఎడిటర్ ఇన్-చీఫ్ థెరెసా రెహ్మాన్ ఎన్నికయ్యారు.

తిరుపతి వందేభారత్‌కు అదనపు కోచ్‌లు

ఈనాడు, హైదరాబాద్: సికింద్రాబాద్, తిరుపతి మధ్య రోజూ నడిచే 20701, 20702 వందేభారత్ రైళ్లకు ఈ నెల 26 నుంచి అదనంగా 4 ఏసీ ఛైర్‌కార్ కోచ్‌లను పెంచుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. బుధవారం నుంచి 18 ఏసీ ఛైర్‌కార్ కోచ్‌లు, 2 ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌లతో నడుస్తుందని వివరించింది.

వారానికి 48 పనిగంటలు మించితే.. ఓవర్‌టైమ్ వేతనాలు ఇవ్వాల్సిందే!

- కార్మిక కోడ్ అమలుకు కేంద్రం చరిత్రాత్మక నిర్ణయం
- తెలుగు రాష్ట్రాల డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ బిశ్వభూషణ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిశ్వభూషణ్ ప్రుష్టి, మురళీకృష్ణ

ఈనాడు, హైదరాబాద్: కార్మికులందరికీ న్యాయం చేసేలా 29 కార్మిక చట్టాలను క్రోడీకరించి నాలుగు కార్మిక కోడ్‌లుగా తీర్చిదిద్దాలని కేంద్రప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని తెలుగు రాష్ట్రాల కేంద్ర కార్మికశాఖ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ బిశ్వభూషణ్ ప్రుష్టి తెలిపారు. కాంట్రాక్టు, రెగ్యులర్ కార్మికులకు జాతీయ వేతన నివేదిక (ఫ్లోర్‌వేజ్) కన్నా తక్కువగా వేతనాలు చెల్లించడానికి వీల్లేదని, ఈ మేరకు వేతన కోడ్‌లో స్పష్టంగా వెల్లడించామన్నారు. ఈ కోడ్‌ల అమలుకు త్వరలో విధివిధానాలు సిద్ధం చేస్తామని, వీటిపై కార్మిక సంఘాలు, ఉద్యోగులు ఎవరైనా అభిప్రాయాలు తెలియజేయవచ్చన్నారు. పని, వ్యక్తిగత జీవితం సమతౌల్యంగా ఉండేలా వారానికి 48 గంటలు పని చేయాలని, అంతకు మించితే తప్పనిసరి ఓవర్‌టైమ్ వేతనం చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. గతంలో 100కి మించి ఉద్యోగులున్న సంస్థను మూసివేయాలంటే ప్రభుత్వ అనుమతి అవసరమయ్యేది. కానీ తాజా కోడ్‌లో ఆ సంఖ్యను 300కి పెంచడంతో కార్మిక సంఘాల నుంచి విమర్శలు వస్తున్నాయన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మురళీకృష్ణతో కలిసి విలేకరులతో మాట్లాడిన వివరాలివి...

★ ఏళ్లుగా 44 కార్మిక చట్టాలు అమల్లో ఉండేవి. వాటిలో కొన్నింటిని తొలగించి, మిగతా చట్టాలను ఏకం చేసి.. కేంద్రం నాలుగు కోడ్‌లు తీసుకు వచ్చింది. కొత్త వేతనకోడ్‌లో సమాన వేతనాలు, బోనస్‌తోపాటు అన్నివర్గాల కార్మికులు, ఉద్యోగులకు మేలు జరుగుతుంది.

★ పారిశ్రామిక సంబంధాలు, సామాజిక భద్రత, వృత్తిపరమైన భద్రత - ఆరోగ్యం - పని పరిస్థితుల కోడ్‌లు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. జాతీయస్థాయిలో వేతన కమిటీ వేర్వేరు రంగాలకు ఖరారు చేసే వేతనాలు ప్రస్తుతం కన్నా ఎక్కువగా ఉంటాయి.

★ సామాజిక భద్రత పరిధిలోకి బీడీ, గిగ్ కార్మికులను తీసుకువచ్చాం. ఇకనుంచి ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగులకు అపాయింట్‌మెంట్‌లు అందుతాయి. ఫిక్స్‌డ్‌టర్మ్ కార్మికులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఉంటాయి.

★ గతంలో కొన్ని యాజమాన్యాలు మూలవేతనం, డీఏ తక్కువగా చూపెట్టి, ఇతర ఎలవెన్సులు ఎక్కువగా చెల్లించేవి. దాంతో ఉద్యోగులకు ఈపీఎఫ్, గ్రాట్యుటీ, బోనస్ తక్కువగా వచ్చేవి. ఇకనుంచి ఈ సదుపాయాలకు మొత్తం వేతనంలో 50శాతాన్ని తీసుకోనున్నారు.

★ వలస కార్మికులు స్వీయ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఏడాది పనిచేసిన కార్మికులు గ్రాట్యుటీకి అర్హులు. సంస్థ నుంచి వెళ్లిపోయినవారు వేతన బకాయిలు, ఇతర సదుపాయాల కోసం ఆరునెలల్లో అప్పీలు చేసుకోవాల్సి ఉండేది. ఈ గడువు మూడేళ్లకు పెంచాం.

★ సామాజిక భద్రత నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై కార్మికశాఖ జరిమానా విధించేది. ఇక నుంచి ఆ జరిమానాను సంబంధిత సంస్థ, ఆ తరహా బాధిత ఉద్యోగుల బాగోగుల కోసం ఖర్చు చేస్తాం.

★ మహిళలకు ప్రసూతి సెలవులు 12 వారాల నుంచి 26 వారాలకు పెరిగాయి. ఈ సమయంలో వారి సమ్మతి మేరకు వర్క్ ఫ్రం హోమ్ సదుపాయాన్ని ఆయా యాజమాన్యాలు కల్పించవచ్చు. పిల్లల బాగోగులు చూసేందుకు అన్ని సంస్థల్లో తప్పనిసరి ఆలనా పాలనా కేంద్రాలు నెలకొల్పాలి.



కార్యక్రమంలో చర్చిస్తున్న భాజపా జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్, మాధవ్, పురందేశ్వరి, సత్యకుమార్ తదితరులు

రాష్ట్రంలో బలమైన అడుగులు వేద్దాం

భాజపా ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో బలమైన అడుగులు వేసే దిశగా ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త పనిచేయాలని ఏపీ భాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. భాజపా ఆధ్వర్యంలో కార్యక్రమాల విశ్లేషణ, భవిష్యత్తు కార్యాచరణపై విజయవాడ భవానీద్వీపంలో సోమవారం ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. మాధవ్ మాట్లాడుతూ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అందిస్తున్న ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. ప్రధాని మోదీ ఏపీపై ప్రత్యేకంగా దృష్టి సారించి సహకారం అందిస్తున్నారని వెల్లడించారు. భాజపా జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్, మంత్రి సత్యకుమార్, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జగన్ పులివెందుల పర్యటన

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్ మూడు రోజుల పాటు పులివెందులలో పర్యటించనున్నారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు పులివెందుల చేరుకుని.. క్యాంప్ కార్యాలయంలో రాత్రి 7గంటల వరకు ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. 26న బ్రాహ్మణపల్లిలో అరటి తోటలు పరిశీలించి, రైతులతో మాట్లాడతారు. 27న పులివెందుల నుంచి తిరుగు ప్రయాణం అవుతారు.

పాత అలవాట్లతో జీవితం మారదు



ఇప్పటివరకూ మీరు కొనసాగించిన అలవాట్లే ప్రస్తుత మీ జీవితానికి కారణం. ఇంతకన్నా మెరుగైన స్థితికి చేరుకోవాలంటే, కొత్తగా ఏయే అలవాట్లు అలవర్చుకోవాలో తెలుసుకోండి. అంతేకాదు.. మీకు ఉపయోగపడని పాత అలవాట్లను తక్షణం త్యజించండి. అప్పుడే మీరు కోరుకున్న లక్ష్యాన్ని వేగంగా చేరుకోగలరు.

– జూలీ గుర్నెర్, పర్ఫార్మెన్స్ కోచ్

గ్రహం అనుగ్రహం

25–11–2025 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం;
హేమంత రుతువు, మార్గశిర మాసం, శుక్లపక్షం
పంచమి: సా.6-49 తదుపరి షష్ఠి; **ఉత్తరాషాఢ:** రా.9-00 తదుపరి శ్రవణ
వర్జ్యం: రా.1-09 నుంచి 2-49 వరకు; **అమృత ఘడియలు:** మ.2-14 నుంచి 3-55 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.8-26 నుంచి 9-10 వరకు తిరిగి రా.10-29 నుంచి 11-20 వరకు; **రాహుకాలం:** సా.3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6.13; **సూర్యాస్తమయం:** సా.5.20

చలి-పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	19.0	29.0
హైదరాబాద్	19.0	30.2
శ్రీకాకుళం	21.0	30.0
అనంతపురం	21.3	33.1
కడప	22.0	29.0
రాజమహేంద్రవరం	22.0	36.0
కర్నూలు	22.5	33.0
విజయవాడ	23.6	31.4
నరసాపురం	23.7	32.3
విశాఖపట్నం	23.8	30.8
గుంటూరు	24.0	31.0
ఒంగోలు	24.6	31.4
నెల్లూరు	25.4	30.2
తాడేపల్లిగూడెం	26.0	31.0

ఎమ్మెల్యే సుదర్శనం హత్య కేసులో ముగ్గురు బవేరియా దొంగలకు జీవితఖైదు



దోషులను కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా కలకలం సృష్టించిన తమిళనాడులోని అన్నాడీఎంకే ఎమ్మెల్యే హత్య కేసులో ముగ్గురు బవేరియా దొంగలకు జీవిత ఖైదు పడింది. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి నియోజకవర్గ అన్నాడీఎంకే ఎమ్మెల్యే సుదర్శనం నివాసం ఉన్న పెరియపాళెయం సమీపం తానాకులంలోని ఇంట్లోకి 2005 జనవరి 9 తెల్లవారుజామున ఐదుగురు బవేరియా దొంగలు చొరబడ్డారు. సుదర్శనాన్ని తుపాకీతో కాల్చి చంపి, ఆయన భార్య, కుమారులపై దాడిచేసి 62 సవర్ల నగలు దోచుకెళ్లారు. నిందితులను పట్టుకోవడానికి ఐజీ జాంగిడ్ నేతృత్వంలో ఐదు ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఏర్పాటయ్యాయి. హరియాణాకు చెందిన ఓం ప్రకాశ్, జగదీశ్ తదితర తొమ్మిది మందిని అరెస్టు చేశారు. బెయిలుపై బయటకొచ్చిన ముగ్గురు మహిళలు పరారీలో ఉన్నారు. ఓంప్రకాశ్ సహా ఇద్దరు జైల్లోనే మృతిచెందారు. అరెస్టయిన జగదీశ్, రాకేశ్, అశోక్, జైల్దారాంసింగ్‌లపై చెన్నై అదనపు సెషన్స్ కోర్టులో విచారణ జరిగింది. జగదీశ్, రాకేశ్, అశోక్‌లను దోషులుగా పేర్కొంటూ ఈ నెల 21న కోర్టు తీర్పు ఇచ్చింది. శిక్ష వివరాలను సోమవారం ప్రకటించింది. ముగ్గురికి జీవితఖైదు విధించింది. జైల్దారాంసింగ్‌ను విడుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. బవేరియా దొంగలను పట్టుకున్న సాహస కథ ఆధారంగా 'ధీరన్ అధిగారం ఒండ్రు' (తెలుగులో 'ఖాకీ')అనే సినిమా కూడా తెరకెక్కింది. బవేరియా ముఠా తమిళనాడులో 1995-2005 మధ్య జాతీయ రహదారుల వెంట పలు నివాసాల్లో దోపిడీలు, హత్యలకు పాల్పడింది.

సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్


రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో తాజా మాజీ సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్, సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్

(మొదటి పేజీ తరువాయి)

భాజపా అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ, పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, హర్‌దీప్‌సింగ్ పురీ, హెచ్‌డీ కుమారస్వామి, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌లతోపాటు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, భూటాన్, కెన్యా, మలేసియా, బ్రెజిల్, మారిషస్, నేపాల్, శ్రీలంక ప్రధాన న్యాయమూర్తులు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారానంతరం రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, ఇతర కేంద్ర మంత్రులు, మాజీ రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతులకు మర్యాదపూర్వకంగా జస్టిస్ సూర్యకాంత్ నమస్కరించారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన కుటుంబ పెద్దల పాదాలకు నమస్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. మాజీ సీజేఐ జస్టిస్ గవాయ్ ఆయనను ఆలింగనం చేసుకుని అభినందించారు. ● ప్రమాణ స్వీకారం అనంతరం రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని, సీజేఐ, మాజీ సీజేఐ, న్యాయశాఖ మంత్రి కలిసి ఫొటో దిగారు. ● 'జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారానికి హాజరయ్యా. ఆయన పదవీ కాలం ఘనంగా కొనసాగాలని కోరుకుంటున్నా. శుభాకాంక్షలు' అని అనంతరం ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

కోర్టు కేసుల పెండింగ్‌పై దృష్టి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా తనకు రెండు ప్రాధామ్యాలున్నాయని ఇటీవల జస్టిస్ సూర్యకాంత్ వెల్లడించారు. అందులో దేశంలోని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న 5 కోట్ల కేసుల పరిష్కారం దిశగా అడుగులు వేయడం, వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వాన్ని ప్రత్యామ్నాయంగా తీసుకురావడం ఉన్నాయి. మధ్యవర్తిత్వం అనేది గేమ్ ఛేంజర్‌గా ఆయన భావిస్తున్నారు.

తొలి రోజే కీలక నిర్ణయం

సీజేఐగా బాధ్యతలు చేపట్టిన రోజే.. జస్టిస్ సూర్యకాంత్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అత్యవసరంగా విచారించాల్సిన కేసులపై విజ్ఞప్తులను లిఖితపూర్వకంగా సమర్పించాలని ఆదేశించారు. ధర్మాసనం ఎదుట మౌఖిక అభ్యర్థనలను అనుమతించబోమని స్పష్టం చేశారు. మరణ శిక్ష, వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన కేసుల్లోనే నేరుగా ప్రస్తావించడానికి అనుమతిస్తామని తేల్చి చెప్పారు. తొలిరోజు ఆయన రెండు గంటలపాటు జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనంలో గడిపారు. ఈ సమయంలో 17 కేసులను విచారించారు. ఓ ప్రైవేటు సంస్థపై హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం వేసిన కేసులో తొలి తీర్పు ఇచ్చారు.

అధికారిక కారును వదిలేసి వెళ్లిన జస్టిస్ గవాయ్

పదవీ విరమణ చేసిన సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రపతి భవన్‌లో జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారానికి హాజరైన ఆయన.. తాను వచ్చిన అధికారిక బెంజ్ కారును కొత్త సీజేఐ కోసం రాష్ట్రపతి భవన్‌వద్దే వదిలేసి వెళ్లారు. ఆయన తన వ్యక్తిగత కారులో ఇంటికి వెళ్లిపోయారు.


సీజేఐగా ప్రమాణం చేసిన అనంతరం సంతకం చేస్తున్న జస్టిస్ సూర్యకాంత్

● సీజేఐ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరుకాకపోవడాన్ని భాజపా తప్పుబట్టింది. ఆయనకు రాజ్యాంగంపై గౌరవం లేదని వ్యాఖ్యానించింది.

● రాజ్యాంగ విలువలను కాపాడటంతోపాటు న్యాయ వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా జస్టిస్ సూర్యకాంత్ పని చేస్తారని ఆశిస్తున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. సీజేఐగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రబాబు శుభాకాంక్షలు

ఈనాడు, అమరావతి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ సూర్యకాంత్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. 'న్యాయం, రాజ్యాంగ విలువలను బలోపేతం చేసేలా ఆయన పదవీకాలం విజయవంతంగా, స్ఫూర్తినిచ్చేలా సాగాలని కోరుకుంటున్నాను' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.



సీజేఐగా ప్రమాణం చేసిన అనంతరం తమ కుటుంబ పెద్దల ఆశీర్వాదం తీసుకుంటున్న జస్టిస్ సూర్యకాంత్

మధ్యతరగతి కుటుంబం నుంచి..

జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిస్సార్ జిల్లా పెటావర్‌లో మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించారు. 1984లో రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీలో లా డిగ్రీ చేశారు. తర్వాత హిస్సార్‌లోని జిల్లా కోర్టులో అదే సంవత్సరం నుంచి న్యాయవాదిగా సాధన ప్రారంభించారు. 1985లో పంజాబ్, హరియాణా కోర్టుకు మారి అక్కడే రాజ్యాంగం, సర్వీసు, క్రిమినల్ కేసులు వాదించారు. 2000 జులై 7న అత్యంత పిన్న వయసులోనే హరియాణా అడ్వొకేట్ జనరల్‌గా నియమితులయ్యారు. సీనియర్ న్యాయవాది హోదా పొందారు. 2004 జనవరి 9న పంజాబ్, హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యేంతవరకూ అడ్వకేట్ జనరల్‌గా సేవలందించారు. న్యాయమూర్తి హోదాలో 2007 నుంచి 2011 వరకు జాతీయ న్యాయసేవల ప్రాధికార సంస్థ పాలక మండలి సభ్యుడిగా పని చేశారు. న్యాయమూర్తిగా పని చేస్తుండగానే న్యాయశాస్త్రంలో కురుక్షేత్ర యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పొందారు. 2018 అక్టోబరు 5న హిమాచల్ ప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2025 మే 14 నుంచి నల్సా ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఉన్నారు. ఇప్పుడు ప్రధాన న్యాయమూర్తి అయ్యారు.

పలు కీలక తీర్పుల్లో భాగస్వామిగా..

- గవర్నర్లవద్ద బిల్లుల పెండింగ్‌పై ఇటీవల తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనంలోనూ జస్టిస్ సూర్యకాంత్ సభ్యుడిగా ఉన్నారు.
- బ్రిటీష్ కాలంనాటి దేశద్రోహ చట్టాన్ని అబేయన్స్‌లో పెట్టిన కీలక తీర్పులో ఆయన భాగస్వామి.
- సుప్రీంకోర్టుతోపాటు అన్ని కోర్టుల బార్ అసోసియేషన్లలో 30శాతం పదవులను మహిళలకు కేటాయించాలని ఆదేశాలిచ్చిన న్యాయమూర్తుల్లో జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు.
- సైనిక దళాల్లో ఏకరూప పెన్షన్ విధానాన్ని సమర్థించిన ధర్మాసనంలో ఆయన సభ్యుడు.



బంగాళాఖాతంలో రెండు అల్పపీడనాలు

రెండు రోజుల్లో తుపాను ఏర్పడే అవకాశం

ఈనాడు, విశాఖపట్నం: బంగాళాఖాతంలో నెలకొంటున్న పరిస్థితులు వాతావరణ నిపుణులను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఒక అల్పపీడనం కొనసాగుతుండగానే.. మరోటి ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ రెండు అల్పపీడనాలూ మనుగడ కోసం పోటీ పడనున్నాయి. రాబోయే రోజుల్లో రెండూ కలిసిపోయే అవకాశముంది. మలక్కా జలసంధి సమీపంలో ప్రస్తుతం తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ మంగళవారం నాటికి వాయుగుండంగా, గురువారంలోగా తుపానుగా బలపడుతుందని భారత వాతావరణ విభాగం అంచనా వేస్తోంది. ఇది తుపానుగా బలపడేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. తదుపరి కదలికలపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. గత గణాంకాల ప్రకారం.. నవంబరులో ఏర్పడే తుపాన్లు చాలావరకు పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ వైపు వెళుతుంటాయి. కొన్ని మాత్రం ఏపీ, తమిళనాడు తీరాలను తాకాయి. సాధారణంగా అల్పపీడనం ఏర్పడ్డాక దాని గమనంపై దాదాపు స్పష్టత వస్తుంది. ఇప్పటివరకు దీనిపై సరైన స్పష్టత లేదని, తుపానుగా బలపడిన తర్వాతే దీని దిశ, గమనం, తీరాన్ని తాకే కేంద్రంపై అంచనాకు రాగలమని నిపుణులు తెలిపారు.

29 తర్వాత భారీ వర్షాలు: కొమొరిన్ ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో మంగళవారం నైరుతి బంగాళాఖాతంలో కొమొరిన్, శ్రీలంక పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని ఐఎండీ తెలిపింది. తర్వాత ఇది మరింత బలపడుతుందని అంచనా వేస్తోంది. వీటి ప్రభావంతో మంగళ, బుధవారాల్లో కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురవొచ్చని ఐఎండీ తెలిపింది. 29న రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు, 30న బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. సముద్రం అలజడిగా మారనున్న నేపథ్యంలో గురు, శుక్రవారాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించింది. ఇప్పటికే వెళ్లిన మత్స్యకారులు గురువారం లోగా ఒడ్డుకు చేరుకోవాలని విజ్ఞప్తి చేసింది. ● మలక్కా జలసంధి సమీపంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం.. వాయుగుండంగా బలపడుతుందని, ఈ నెల 30 నాటికి బలహీనపడుతుందని పలు వాతావరణ నమూనాలు అంచనా వేస్తున్నాయి. కొమొరిన్ ప్రాంతంలో ఏర్పడనున్న అల్పపీడనం తర్వాత బలపడుతుందని, డిసెంబరు 1 నాటికి తమిళనాడు, దక్షిణ కోస్తా మధ్యలో తీరం దాటుతుందని సూచిస్తున్నాయి.

మార్కాపురం, మదనపల్లె, రంపచోడవరం.. కొత్త జిల్లాలు!

(మొదటి పేజీ తరువాయి)

దీంతో అధికారులు ముఖ్యమంత్రి సూచనలకు అనుగుణంగా మరో నివేదిక తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

పెనమలూరును ఎన్టీఆర్ జిల్లాలో ప్రతిపాదించరా?: విజయవాడ నగరంలో భాగమైన పెనమలూరును విస్మరించి.. అంతకంటే ఎక్కువ దూరంలోని గన్నవరం, నూజివీడు నియోజకవర్గాలను ఎన్టీఆర్ జిల్లాలో కలిపే ప్రతిపాదన ఏంటని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. 'ప్రజాప్రతినిధులు చెబితేనే చేరుస్తారా? భౌగోళిక పరిస్థితులు చూడాల్సిన బాధ్యత లేదా? అలాంటప్పుడు మంత్రివర్గ ఉపసంఘం ఎందుకు' అని ప్రశ్నించారు. ఎన్టీఆర్, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో మార్పులు, చేర్పులకు సంబంధించిన అంశంపై కొద్దిసేపు చర్చ జరిగింది. కృష్ణా జిల్లాలోని గన్నవరం, ఏలూరు జిల్లాలోని నూజివీడు నియోజకవర్గాలను ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని ఉపసంఘం ప్రతిపాదించింది. ఈ సందర్భంగా పెనమలూరు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలిపే ప్రతిపాదన చేయకపోవడంపై సీఎం ప్రశ్నించారు. ఎన్టీఆర్ జిల్లాలో మార్పులు, చేర్పులపై తర్వాత ఆలోచిద్దామని చెప్పారు.

తూర్పుగోదావరి జిల్లా పెద్దదిగా అవుతుందనే

రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లు ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్నాయి. చింతూరు నుంచి జిల్లా కేంద్రమైన పాడేరు వెళ్లాలంటే 215 కి.మీ. ప్రయాణించాలి. ఈ రెండు డివిజన్లనూ తూర్పుగోదావరి జిల్లాలో కలిపితే అక్కడి జనాభా 24.48 లక్షలకు చేరుతుంది. 10 నియోజకవర్గాలతో పెద్ద జిల్లాగా తయారవుతుంది. ఈ నేపథ్యంలో రంపచోడవరం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు అంశం పరిశీలనకు వచ్చింది. పోలవరం ముంపు ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా అక్కడ జిల్లా ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. అందుకు అనుగుణంగా ముంపు గ్రామాల వివరాలతో అధికారులు నివేదిక తయారు చేశారు. దీనిపై మంగళవారం చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

విశ్వసనీయతకు మారుపేరు మార్గదర్శి

- 63 ఏళ్లుగా సంతృప్తికర సేవలందిస్తున్నాం
- సంస్థ ఎండీ శైలజాకిరణ్
- నంద్యాలలో 128వ శాఖ ప్రారంభం



జ్యోతి వెలిగిస్తున్న మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ శైలజాకిరణ్. చిత్రంలో కడప, విజయవాడ లబ్బీపేట బ్రాంచీల మేనేజర్లు డి.శేషుబాబు, ఎస్.వెంకటేశ్, సీఈవో పాతూరి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ (డెవలప్‌మెంట్) బలరామకృష్ణ, నంద్యాల, అనంతపురం మేనేజర్లు రవికృష్ణ, గోపాలకృష్ణ ● చందాదారుడు ఆర్.మారుతీకుమార్ నుంచి నెలవారీ చిట్ సొమ్ము స్వీకరిస్తున్న శైలజాకిరణ్

ఈనాడు, కర్నూలు: విశ్వసనీయతకు మారుపేరు మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ అని ఆ సంస్థ ఎండీ శైలజాకిరణ్ పేర్కొన్నారు. నంద్యాలలోని సంజీవనగర్ టూరిస్ట్ ఆర్కేడ్ భవనంలో మార్గదర్శి చిట్‌ఫండ్ కార్యాలయాన్ని సోమవారం ఆమె పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ పూజలు చేసి, జ్యోతి వెలిగించి ప్రారంభించారు. చందాదారుల నుంచి నెలవారీ చిట్ సొమ్మును స్వీకరించి రసీదు ఇచ్చారు. ఈ సందర్భంగా శైలజాకిరణ్ మాట్లాడుతూ నంద్యాలలో మార్గదర్శి 128వ శాఖను (ఆంధ్రప్రదేశ్‌లో 40వ శాఖ) ప్రారంభిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. రూ.2.50 లక్షల నుంచి రూ.కోటి వరకు చిట్ గ్రూపులు అందుబాటులో ఉంచామని తెలిపారు. శుభకార్యాలు, పిల్లల చదువులు, పెళ్లిళ్లు, వ్యాపారాలు చేసుకోవడానికి, ఇల్లు, ఇతర ఆస్తులు సమకూర్చుకోవడానికి వీలుగా చిట్‌లను నిర్వహిస్తున్నామని చెప్పారు. మార్గదర్శి 63 ఏళ్లుగా అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం నాలుగు రాష్ట్రాల పరిధిలో 60 లక్షల మందికిపైగా చందాదారులకు సేవలందిస్తోందని తెలిపారు. చిట్‌లు పాడుకున్న వారికి మరింత వేగంగా చెల్లింపులు చేసేందుకు వీలుగా అధునాతన పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్నామని చెప్పారు. భవిష్యత్తులో వారం, పది రోజుల్లోపే సొమ్ము చెల్లించేందుకు కృషి చేస్తామన్నారు. ఏపీ, తెలంగాణల్లో త్వరలోనే మరిన్ని శాఖలు ప్రారంభిస్తామని ఆమె వెల్లడించారు. రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ రామోజీరావు ఎప్పుడూ ప్రజా సంక్షేమాన్నే కోరుకునేవారని శైలజాకిరణ్ గుర్తుచేశారు. నంద్యాల శాఖ మేనేజర్ ఒ.రవికృష్ణ, ఇతర సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్గదర్శి జీఎం రవీంద్రనాథ్, ఈనాడు కర్నూలు యూనిట్ ఇన్‌ఛార్జి ఎస్కే ఖాదర్ అలి తదితరులు పాల్గొన్నారు.

రూ.50 లక్షల చిట్ వేసే స్థాయికి ఎదిగా

– ఆర్.మారుతీకుమార్, అధినేత, సెవెన్‌హిల్స్ ఆసుపత్రి, నంద్యాల



మార్గదర్శిలో సుమారు 20 ఏళ్ల కిందట రూ.25 వేల చిట్ కట్టి చందాదారుడిగా చేరా. వ్యాపారాన్ని క్రమంగా విస్తరిస్తూ 8 మెడికల్ షాపులు, రెండు పాలీ క్లినిక్‌లు, ఒక ఆసుపత్రి నిర్మించా. ప్రస్తుతం రూ.50 లక్షల చిట్ కట్టే స్థాయికి ఎదిగా. గతంలో నాకు క్యాన్సర్ వచ్చినప్పుడు నగదు అవసరమైతే మార్గదర్శి సంస్థ వెంటనే సొమ్ము సమకూర్చిన విషయాన్ని మరిచిపోలేను.

నా వ్యాపారాభివృద్ధికి అండగా నిలిచింది

– కె.భూపాల్, సిరి ఫర్నిచర్, నంద్యాల



మార్గదర్శి.. నా ఫర్నిచర్ వ్యాపారాభివృద్ధికి అండగా నిలిచింది. 18 ఏళ్లుగా చిట్‌లు కడుతున్నా. మార్గదర్శి సిబ్బంది చందాదారులతో ఎంతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తారు. సంతృప్తికరమైన సేవలు అందిస్తూ మా ఆర్థిక అవసరాలకు అండగా ఉంటున్నారు. నంద్యాలలోనే మార్గదర్శి శాఖ ప్రారంభించడం సంతోషంగా ఉంది.

కుటుంబం నుంచే నైతికత మొదలు కావాలి

(మొదటి పేజీ తరువాయి)


చాగంటికి పాదాభివందనం చేస్తున్న మంత్రి లోకేశ్

విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత స్కూల్ బుక్స్, బ్యాగులు, బూట్లు, యూనిఫాంలపై పార్టీ రంగుల ప్రభావం లేకుండా చేశాం. నైతిక విలువలతో కూడిన సంస్కరణలను అమలు చేసేందుకు చాగంటి సూచనలు, సలహాలు స్వీకరిస్తాం" అని తెలిపారు. అనంతరం చాగంటిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, కార్పొరేషన్ల ఛైర్మన్లు కొమ్మారెడ్డి పట్టాభిరామ్, రఘురామరాజు, విద్యాశాఖ కార్యదర్శి శ్రీధర్, కమిషనర్ విజయరామరాజు, సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు పాల్గొన్నారు.


చాగంటి కోటేశ్వరరావును సత్కరించిన మంత్రి లోకేశ్. చిత్రంలో పట్టాభి, గొట్టిముక్కల రఘురామరాజు, విజయరామరాజు, శ్రీనివాసరావు, కోన శశిధర్, ఎమ్మెల్యే బొండా ఉమా, ఎంపీ కేశినేని చిన్ని, కలెక్టర్ లక్ష్మీశ

లక్ష్మీనరసింహుని సేవలో పవన్‌కల్యాణ్

(మొదటి పేజీ తరువాయి)


లక్ష్మీనరసింహస్వామికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్. చిత్రంలో మంత్రి నాదెండ్ల మనోహర్ తదితరులు


ఐఎస్ జగన్నాథపురంలో నూతనంగా నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్‌లో నీరు ఇంకుతున్న తీరును పరిశీలిస్తున్న పవన్‌కల్యాణ్

ఆలయానికి వచ్చిన ఆయన.. ఆలయ అభివృద్ధికి హామీ ఇచ్చారు. స్థానికంగా ఉన్న 30 ఎకరాల కొండపోరంబోకు భూమిని ఆలయానికి కేటాయించేలా కృషి చేస్తానన్నారు. ఆలయ ప్రదక్షిణ మండపం, గ్రామం నుంచి కొండపైకి రహదారి, ప్రైన రిటెయినింగ్ వాల్ నిర్మాణాలకు హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధి అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ముఖ్యమంత్రి, దేవాదాయశాఖ మంత్రులను నిధులు కోరారు. కొండపోరంబోకు భూమిని కేటాయించడానికి మంత్రివర్గం ఆమోదం పొందేలా చేసి నాడు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఈ మేరకు దేవస్థానానికి 30 ఎకరాలు కేటాయిస్తూ జారీ అయిన భూ హక్కుపత్రాలను ద్వారకా తిరుమల ఈవో మూర్తికి అందజేశారు. ప్రభుత్వం నుంచి రూ.8.7 కోట్ల నిధులు మంజూరు చేయించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు.

బాగు పడిన రోడ్డు

పవన్‌కల్యాణ్ గతంలో ఐఎస్ జగన్నాథపురం ఆలయానికి చేరుకోవడానికి పొంగుటూరు-లక్కవరం రహదారి మీదుగా ప్రయాణించారు. గుంతలు పడి అధ్వానంగా మారిన ఆ రహదారిని చూశారు. వాహనం నుంచి కిందికి దిగి కొంతదూరం నడిచారు. ఆ రహదారిని పునరుద్ధరించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. దీంతో రూ.1.5 కోట్లతో రోడ్డును నిర్మించారు. సోమవారం పర్యటనలో భాగంగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి రాజవరం వద్ద ఆ రహదారిని పవన్‌కల్యాణ్ పరిశీలించారు. రోడ్డు బాగుపడిందని ఆనందం వ్యక్తం చేశారు. సమీపంలోని రెండు, మూడు గ్రామాల ప్రజలు వచ్చి తమ గ్రామ రహదారులనూ ఇలా నిర్మించాలని వినతిపత్రాలు అందజేశారు. ● ఐఎస్ జగన్నాథపురంలో ఉపాధి నిధులు రూ.77 వేలతో నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణ నాణ్యతను పవన్ కల్యాణ్ పరిశీలించారు. నిర్మాణంలో ఎన్ని పొరలు ఉంటాయి. ఎంత లోతులో నిర్మించారని అడిగి తెలుసుకున్నారు.

దిగ్గజ నటుడు ధర్మేంద్ర కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

ఒదిగిపోయి ఆల్‌రౌండర్ అనిపించుకున్నారు ధర్మేంద్ర. అగ్రనటులకు గట్టి పోటీ ఇచ్చి తిరుగులేని స్టార్‌గా కొనసాగారు. దాదాపు 300 చిత్రాల్లో నటించిన ఆయన చక్కటి హావభావాలు, అద్భుతమైన డైలాగ్ డెలివరీతో ఆకట్టుకుని కోట్ల మంది అభిమానుల్ని సంపాదించుకున్నారు.

ఎంపీగా గెలుపొంది..

1935 డిసెంబరు 8న పంజాబ్‌లో జన్మించారు ధర్మేంద్ర. ఆయన అసలు పేరు ధర్మేంద్ర కేవల్ క్రిషన్ డియోల్. కెరీర్ తొలినాళ్లలో రొమాంటిక్ పాత్రలకు చిరునామాగా నిలిచారు. 1975లో విడుదలైన 'షోలే'తో బాలీవుడ్‌లో తిరుగులేని నటుడిగా ఎదిగారు. ప్రకాశ్ కౌర్.. ధర్మేంద్రల సంతానం సన్నీడియోల్, బాబీ డియోల్, విజేత, అజీత. ఆ తర్వాత ఆయన హేమమాలినిని పెళ్లి చేసుకున్నారు. ఈ జంటకు పుట్టిన వాళ్లే ఇషా డియోల్, అహనా డియోల్. కుమారులు సన్నీడియోల్, బాబీ డియోల్ బాలీవుడ్‌లో హీరోలుగా గుర్తింపు తెచ్చుకున్నారు. 2004లో బీకానేర్ నుంచి భాజపా తరఫున లోక్‌సభ ఎంపీగా పోటీచేసి గెలుపొందారు. భారతీయ చిత్రసీమకు ఆయన చేసిన సేవలకు గుర్తుగా 2012లో భారత ప్రభుత్వం పద్మభూషణ్‌తో సత్కరించింది. ఆయన నిర్మించిన 'ఘాయల్' చిత్రానికి జాతీయ పురస్కారం దక్కింది. భారీగా తరలివచ్చిన అభిమానులు, సినీ, రాజకీయ ప్రముఖుల కన్నీటి వీడ్కోలుతో సోమవారం సాయంత్రం ధర్మేంద్ర అంత్యక్రియలు ముగిశాయి.

భారతీయ సినిమాకు తీరని లోటు: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

ప్రముఖ నటుడు, మాజీ ఎంపీ ధర్మేంద్ర మరణం భారతీయ సినిమాకు తీరని లోటు. అత్యంత ప్రజాదరణ పొందిన నటులలో ఆయన ఒకరు. దశాబ్దాలపాటు తన అద్భుత నటనతో ప్రేక్షకులను అలరించారు. భారతీయ సినీ చరిత్రలో మహోన్నత వ్యక్తిగా, యువ నటీనటుల్లో ఎంతో స్ఫూర్తి నింపారు. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి.

ఒక శకం ముగిసింది: ప్రధాని నరేంద్ర మోదీ

భారతీయ సినిమాలో ఒక శకం ముగిసింది. ధర్మేంద్ర తన నటనతో ఎన్నో పాత్రలకు వన్నె తెచ్చారు. ఎంతో మంది ప్రేక్షకుల హృదయాల్లో నిలిచారు. గొప్ప నటుడైనా.. వినయం, తోటివారిని ఆప్యాయంగా పలకరించే వ్యక్తిత్వం ఆయనకే సొంతం. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా.

పలువురు ప్రముఖుల సంతాపం

ధర్మేంద్ర మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు. ధర్మేంద్ర మరణంతో ఓ గొప్ప నటుణ్ని, ఒక మంచి మనిషిని కోల్పోయామంటూ ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సహా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతోపాటు సినీ ప్రముఖులు చిరంజీవి, మహేశ్‌బాబు, రవితేజ తదితరులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేశారు. ధర్మేంద్ర మృతికి నివాళిగా సోమవారం 'ఇఫి' చిత్రోత్సవాల్లో జరగాల్సిన కార్యక్రమాలను రద్దు చేశారు.

ఈనాడు

తిష్ఠవేస్తున్న బంగ్లాదేశీయులు!

ఇంటికి వచ్చినవారిని ఆత్మీయంగా ఆదరించడం భారతీయ సాంస్కృతిక వారసత్వ లక్షణం. 'అతిథి దేవోభవ' అన్న ఆ విశిష్ట భావన- ఇళ్లలోకి చొరబడే చోరులకు వర్తించదన్నది వాస్తవం. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణరక్షణకోసం ఆశ్రయం అర్థించి వచ్చేవారికి అభయమివ్వడం సమర్థనీయమే. కానీ, దొంగచాటుగా దేశంలోకి ప్రవేశించి సర్కారీ గుర్తింపు పత్రాలను సంపాదించి భారతీయుల్లా చలామణీ అవుతున్న విదేశీయులను ఉపేక్షించడం మాత్రం అనర్థదాయకం! ఇలా కొన్నేళ్లుగా భారతావనిలోనే తిష్ఠవేసిన బంగ్లాదేశీయులపై వెలువడుతున్న కథనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితాల ముమ్మర తనిఖీలు (ఎస్ఐఆర్) ప్రారంభమైనప్పటి నుంచి అక్కడి సరిహద్దుల్లో కనపడుతున్న దృశ్యాలు- అక్రమ వలసల సమస్య తీవ్రతను కళ్లకుకడుతున్నాయి. 'ఎస్ఐఆర్'తో తమ బాగోతాలన్నీ బయటపడతాయన్న భయంతో తిరిగి వెళ్లిపోవడానికి వరసకడుతున్న బంగ్లాదేశీయులతో పశ్చిమ బెంగాల్‌లోని ఔట్‌పోస్టులు కిటకిటలాడుతున్నాయి. వారిని కదిలిస్తే- రూ.5-7 వేలు ఖర్చుపెట్టి ఇండియాలోకి వచ్చామని, దళారులకు రూ.20 వేల వరకు ఇచ్చి ఆధార్, ఓటర్, రేషన్ కార్డులను తీసుకున్నామని చెబుతున్నారు. గడిచిన శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు వేశామనీ ఒప్పుకొంటున్నారు. చొరబాటుదారులు ఓటర్లయ్యి ప్రజాతీర్పును ప్రభావితం చేయడమంటే- భారత ప్రజాస్వామ్యానికి అంతకు మించిన ప్రమాదమేమి ఉంటుంది?

కాలక్రమంలో పెరిగే జనాభాకు తగినట్లు ఓటర్లు అధికం కావడం సహజమే. అందుకు భిన్నంగా ఓటర్ల జాబితాల్లో గంపగుత్తగా చేరికలు జరిగాయంటే కచ్చితంగా అనుమానించాల్సిందే. 2002లో 'ఎస్ఐఆర్' చేపట్టినప్పుడు పశ్చిమ బెంగాల్‌లో 4.58కోట్ల మంది ఓటర్లుగా నమోదయ్యారు. ఆపై 23ఏళ్లలో వారు 66శాతం పెరిగి 7.63 కోట్లకు చేరారు. బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని తొమ్మిది జిల్లాల్లోనైతే ఓటర్ల సంఖ్యలో పెరుగుదల 71శాతం నుంచి 105శాతం దాకా లెక్కతేలుతోంది. పశ్చిమ బెంగాల్‌లో ఉండాల్సిన వారికంటే 1.04 కోట్ల మంది ఓటర్లు ఎక్కువగా ఉన్నారని ఇటీవలే ఓ అధ్యయనంలో వెల్లడైంది. మమతా బెనర్జీ పార్టీ తృణమూల్ కాంగ్రెస్ తరఫున రాజ్యసభ ఎంపీగా పనిచేసిన మాజీ ఐఏఎస్ అధికారి జవహర్ సర్కార్ అయితే- 'రాష్ట్ర జనాభాను బట్టి చూస్తే 2025 నాటికి దాదాపు ఆరు కోట్ల మంది ఓటర్లు ఉండాలి. అలాంటిది వారి సంఖ్య 7.62 కోట్లు కావడమేంటి' అని ప్రశ్నిస్తున్నారు. దేశీయంగా జనతంత్రం మేడిపండు కాకూడదంటే- ఓటర్ల జాబితాల్లోని అనర్హులందరినీ ఏరేయాల్సిందే!

బంగ్లాదేశ్ నుంచి పోటెత్తుతున్న వలసలు- పశ్చిమ బెంగాల్, ఈశాన్య భారతంలో జనాభా తీరుతెన్నులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కొన్ని పార్టీలు అక్రమ వలసదారులకు వంతపాడుతున్నాయనే విమర్శలూ రేగుతున్నాయి. స్థానిక జనసమూహాల నడుమ వైషమ్యాలను రాజేస్తున్న ఈ పరిణామాలు- పౌరసేవలపై ఒత్తిడి పెంచుతున్నాయి. పరిమిత వనరులకు పోటీపడేవారి సంఖ్య అధికం కావడంతో ఆర్థిక, సామాజిక సమస్యలనేకం ఉత్పన్నమవుతున్నాయి. పొట్టకూటికోసం వస్తున్నవారి ముసుగులో ముష్కరులూ దేశంలోకి ప్రవేశిస్తున్నారన్న భయాందోళనలూ నెలకొన్నాయి. 'గ్రేటర్ బంగ్లాదేశ్' పేరిట భారతావనిలో పలు భూభాగాలు తమవేనంటూ ఢాకాలోని మతఛాందస శక్తులు ప్రచారం చేస్తుంటే- అక్కడి అధికారవర్గాలు దానికి పక్కతాళమేస్తున్నాయి. ఈ నేపథ్యంలో చొరబాటుదారులను గుర్తించి తిప్పిపంపడం ఎంత ప్రధానమో- భారత వ్యతిరేక కుట్రలకు బంగ్లాదేశ్‌ను అడ్డాగా మార్చుకుంటున్న ప్రతీపశక్తులను కేంద్రం సదా కనిపెట్టుకుని ఉండటం అంతే ముఖ్యం!



రివర్స్ ఆస్మోసిస్ యూనిట్లు అతిగా పెట్టడం వల్ల నీటి నాణ్యత, ఆరోగ్యాలపై విపరీత ప్రభావం పడుతోంది. ఈ విధానం వల్ల బయటికి వచ్చే నీటిలో కలుషితాలు ఎక్కువ. నీటి శుద్ధికి సంబంధించి ఏ విధానాన్నైనా అనుసరించే ముందు పరిశోధన ఎక్కువగా జరగాలి. నీటి నాణ్యత, ప్రయోజనాలను బట్టి ఏ టెక్నాలజీ వాడాలన్నది నిర్ణయించుకోవాలి.

– మిహిర్ షా, ఆర్థికవేత్త, జల నిర్వాహణ నిపుణులు

సహనమే ఆభరణం

తాత్విక కోణంలో చూస్తే, సహనం ఒక దైవిక లక్షణం. ఆధ్యాత్మిక ఉన్నతిని పొందేందుకు సోపానం. క్లిష్ట సమయాల్లో ఆలోచనాపరంగా స్థిరంగా, ఉద్రేకానికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉండటం, చుట్టూ ఉన్నవారిని ప్రశాంతంగా ఉంచగలగడమే సహనం వహించడమంటే.

మనోనిగ్రహానికి చిహ్నమే సహనం. ఓర్పును, దానికి పర్యాయపదంగా భావించడం పరిపాటి. కానీ ఓర్పునకూ సహనానికీ వ్యత్యాసముంది. ఓర్పు సహనానికి సంబంధించిన ఒకానొక లక్షణం. ఉదాహరణకు అన్యాయానికి లోనైనా తట్టుకుని నిలబడటం, కష్టాలు వచ్చినప్పుడు భగవంతుడిపై భారం వేయడం వంటివి ఓర్పు లక్షణాలు. కాగల కార్యాన్ని కాలానికి వదిలేయడం ఓర్పయితే, ఆ కాలాన్నే తనకనుగుణంగా మలచుకోగల నేర్పు సహనం. మనిషికి విలువైనదేదీ తొందరగా దక్కదు. లక్ష్యసాధనలో ఆటుపోట్లు తప్పవు. పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవాలన్నా, సంబంధ బాంధవ్యాలను సక్రమంగా కొనసాగించాలన్నా సహనం అవసరం.

అహం తప్ప ఆలోచన లేని దుర్యోధనుడి వక్రబుద్ధి, కోరి చావును ఆహ్వానించిన శిశుపాలుడి వాచాలత వంటివి అసహనానికి తార్కాణాలు. దురదృష్టవశాత్తూ నేటి సమాజంలో అసహనమనేది ఒక సామాజిక జాడ్యంగా మారి అనైక్యతకు, అశాంతికి మూలకారణమవుతోంది. దిగజారుతున్న మానవీయ విలువలకు కూడా సహనాన్ని కోల్పోవడమే కారణం. ప్రతి మార్పునకూ ఒక ప్రామాణికమైన సమయం అవసరం. దానికోసం వేచి ఉండటమే సహనం. భిన్నాభిప్రాయాలను, ఇతరుల ఆచార వ్యవహారాలను గౌరవించడం, సానుకూల దృక్పథంతో వ్యవహరించడం, సావకాశంగా వినడమే సహనశీలత.



అంతర్యామి

సహనం సంపదనిస్తుంది. నిర్దిష్టమైన గెలుపునిస్తుంది. వ్యక్తి విలువను పెంచి సామాజికంగా గౌరవాన్నిస్తుంది. నేలను నమ్మిన రైతు అతివృష్టి, అనావృష్టులకు భయపడడు. మరో ప్రయత్నానికి తాను సిద్ధమై భూమిని సంసిద్ధం చేసుకుంటాడు. పరిస్థితులు అనుకూలించేవరకు వేచి చూస్తాడు. ఒక దాని తరవాత ఒకటిగా శాస్త్రవేత్తలు విశ్వానికి పంచిన ఫలితాలన్నీ నిరాశ పొందకుండా ఎన్నోసార్లు ప్రయత్నించి సహనంతో సాధించినవే.

సహనం జీవితం పట్ల ప్రేమను పెంచుతుంది. శిశిరంలో రాలిన ఆకులను చూసి చెట్టు ఏడవదు. వేయి కళ్లతో వసంతం కోసం ఎదురుచూసి కొత్త చివుర్లు తొడుగుతుంది. కొన్ని పరిస్థితుల్లో సహనం వేదనను రగిలిస్తుంది. బాధ కలిగిస్తుంది. మూడు రోజులపాటు నిద్రాహారాలు మాని మరీ తనకు దారినీయమని వేడినా కరగని సముద్రుణ్ని నిర్జలం చేయబోతాడు శ్రీరామచంద్రుడు. దీన్ని చూస్తే, సహనాన్ని కోల్పోయే పరిస్థితి ఎవరికైనా తప్పదని అనిపించక మానదు. అయితే, ఆ అసహనం తాత్కాలికం. సముద్రుడే శ్రీరాముడికి సేతుబంధనమనే ఒక మార్గం చూపించి అసంభవాన్ని సంభవంగా మార్చాడు.


అన్నీ మనకు నచ్చినట్లు జరగవని ఒప్పుకోగలిగి, సంయమనంతో లభించిన దాన్ని స్వీకరించాలి. ఇది అలవరచుకుంటే మనిషిలో విజ్ఞత పెరుగుతుంది. తన కోసమే కాక పరులకోసం కూడా బతకడంలోని ఆనందాన్ని ఆస్వాదిస్తాడు. సహనశీలతలోంచి వచ్చే మానసిక ప్రశాంతత ద్వారా భగవదనుగ్రహం పొందగలుగుతాడు.

– నందిరాజు పద్మలత జయరాం

సైబర్ మోసాలకు ఏఐ విరుగుడు

టెలికమ్యూనికేషన్లు, ఇంటర్నెట్ వినియోగదారులపై రకరకాలుగా వల విసురుతున్న సైబర్ నేరగాళ్లు భారీ స్థాయిలో ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారు. డిజిటల్ అరెస్టుల పేరిట దోచుకుంటున్నారు. ఇలాంటి మోసగాళ్లకు కృత్రిమ మేధ (ఏఐ) బాగా ఉపకరిస్తోంది. ఇప్పుడీ ఉపద్రవాన్ని ఎదుర్కోవడం టెలికం రంగం ముందున్న పెద్ద సవాలు. అయితే, ఈ సమస్యను ఎదుర్కోవడానికి ఏఐనే ఆయుధంగా మార్చుకోవాల్సి ఉంది.

మానవ మేధతో చేసే పనులను యంత్రాలతో, అల్గోరిథమ్‌లతో చేయించడానికి తోడ్పడేదే ఏఐ. యంత్రాల్లో మానవ మేధను పోలిన నైపుణ్యాన్ని చొప్పించడం ఏఐ పని. అది ఇప్పటికే మానవుడికి తెలిసినదానికి మరింత పదునుపెట్టి ఉపయోగించుకోవడానికి తోడ్పడుతుందే తప్ప తెలియనిదాన్ని, కొత్త విషయాలను ఆవిష్కరించలేదు. మనిషి చాలా శ్రమించి, ఎంతో జాగ్రత్తగా చేయాల్సిన పనులను ఏఐ వేగంగా అవలీలగా చేసేయగలదు. అయితే, అవి ఎక్కువగా రొటీన్‌గా చేసే పనులే ఉంటాయి. డబ్బు, అధికారాలను మంచికీ చెడుకీ ఉపయోగించగలిగినట్లే- ఏఐని నిర్మాణాత్మక కార్యాలకూ, వినాశకర పనులకూ వాడొచ్చు. ఈ క్రమంలోనే సైబర్ నేరగాళ్లు జనాన్ని లాఘవంగా దోచుకోవడానికి ఏఐని దుర్వినియోగం చేస్తున్నారు. అయితే, అలాంటి నేరగాళ్ల ఆట కట్టించడానికి కృత్రిమ మేధ అంతకన్నా సమర్థంగా ఉపకరిస్తుంది.



డిజిటల్ ఇంటెలిజెన్స్...

కేంద్ర టెలికం విభాగంలో వైర్‌లెస్ ప్లానింగ్, సమన్వయ విభాగ ఛత్రం కింద రేడియో ఫ్రీక్వెన్సీలను కేటాయించే స్థాయీ సలహా సంఘం(శాక్పా) ఒకటుంది. అది టెలికం స్పెక్ట్రమ్ నిర్వహణకు, అనుమతుల ప్రక్రియ వేగవంతానికి ఏఐని ఉపయోగిస్తోంది. భారతదేశంలో వైర్‌లెస్ సర్వీసులకు గిరాకీ పెరిగిపోతున్న ఈ సమయంలో శాక్పా తన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తోంది. దేశంలో వినియోగదారుల సంఖ్య ఎక్కడ ఎక్కువగా ఉందో నిర్ధారించి అక్కడ కొత్త సెల్ టవర్ల ఏర్పాటుకు ఏఐ తోడ్పడుతుంది. టెలికం టవర్ల పరిస్థితి ఎలా ఉందో కనిపెట్టడానికి ఏఐ చోదిత డ్రోన్లు ఉపకరిస్తాయి. స్మార్ట్ స్పెక్ట్రమ్ మేనేజ్‌మెంట్‌కు ఏఐ కీలకమవుతుంది. విమానాశ్రయాల దగ్గర్లో ఎంత ఎత్తులో టవర్లు నిర్మించాలో ఏఐ సలహాలిస్తుంది. తద్వారా విమాన ప్రమాదాలను నివారిస్తుంది. నెట్‌వర్క్ పనితీరు సమర్థంగా ఉండేలా చూడటానికీ, విద్యుత్ కోత, అంతరాయాల గురించి ముందే హెచ్చరించడానికీ, నివారించడానికి కూడా ఏఐ తోడ్పడుతుంది. ఖాతాదారులకు ప్రత్యేక సేవలు అందించడమే కాదు, వైర్‌లెస్ నెట్‌వర్క్‌లపై సైబర్ దాడులను అడ్డుకుంటుంది. ఫోర్జరీని, నకిలీ పత్రాలతో ఫోన్ కనెక్షన్లను తీసుకున్నవారిని వేగంగా కనిపెట్టడానికి టెలికం విభాగం ఏఐ, బిగ్‌డేటాలను ఉపయోగిస్తోంది. 2025 ఆగస్టులో అలా 82 లక్షల కనెక్షన్లను గుర్తించి తొలగించింది. సైబర్ నేరగాళ్లు భారతీయ ఫోన్ నంబర్లతో విదేశాల నుంచి కాల్స్ చేసి మనవాళ్లను మోసగిస్తున్నారు. ఆ కాల్స్‌ను గుర్తించి నిరోధించే పద్ధతిని టెలికం శాఖ, టెలికం సర్వీస్ ప్రొవైడర్లు రూపొందించారు. ఇలాంటి నేరాలను నివారించడానికి టెలికం విభాగం డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్(డీఐపీ)ను ప్రారంభించింది. ప్రస్తుతం రిజర్వు బ్యాంకుతోపాటు పలు బ్యాంకులు, పోలీసు, భద్రతా విభాగాలు, టెలికం సర్వీసు ప్రొవైడర్లు (టీఎస్పీ), ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ)తోపాటు మొత్తం 540 సంస్థలు డీఐపీలో చేరాయి. సైబర్ నేరాల గురించి హెచ్చరించడానికి టెలికమ్యూనికేషన్ల విభాగం టెలికం సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్ (టీఎస్ఓసీ)ను నెలకొల్పింది. ఫిషింగ్ కాల్స్, నకిలీ ఎస్ఎంఎస్‌లను నిరోధించడానికి ఏఐ, మెషీన్ లెర్నింగ్‌లను ఉపయోగించాల్సిందిగా ట్రాయ్ టెలికం కంపెనీలకు సూచించింది. 2020 జనవరి 10న ప్రారంభమైన ఐ4సీ సైబర్ నేరాలపై పోరులో పోలీసు, ఇతర భద్రతా సంస్థలతో చేతులు కలిపి పనిచేస్తోంది.

టీఎస్పీలు నియోగించిన ఏఐ యంత్రాంగం 2024సెప్టెంబరు-2025జూన్ మధ్య 4,830 కోట్ల స్పామ్ కాల్స్‌ను గుర్తించి, 3.20లక్షల బోగస్ లింకులను అడ్డుకుంది. 2025 సెప్టెంబరు నుంచి ఆర్ జియో, ఎయిర్ టెల్ సంస్థల ఏఐ ఆధారిత యంత్రాంగాల చలవతో ఖాతాదారులకు సైబర్ మోసాల వల్ల నష్టాలు 68.7 శాతం తగ్గాయి. మరో టెలికం సంస్థ వీఐ 25 కోట్ల మోసపూరిత ఎస్ఎంఎస్‌లను అడ్డుకుంది. 2025 మధ్య నుంచి బీఎస్ఎన్ఎల్ జాతీయ యాంటీ స్పామ్, యాంటీ ఫిషింగ్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టింది. బీఎస్ఎన్ఎల్‌తో క్లౌడ్ కమ్యూనికేషన్ల ప్రొవైడర్ టాన్లా చేతులు కలిపింది. టెలికం రంగంలోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలన్నీ సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయడానికి తమ స్థాయిలో కృషి చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం సైతం కాలర్ ఐడీ, కాలింగ్ నేమ్ ప్రెజెంటేషన్ (సీనాప్) సౌకర్యాలను ప్రవేశపెట్టనుంది.

పెట్టుబడులు అవసరం

ఈ ఏడాది అక్టోబరులో దిల్లీలో జరిగిన ఇండియా మొబైల్ కాంగ్రెస్ సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడుతూ- ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, 6జీ, శాటిలైట్ కమ్యూనికేషన్లు, టెలికం, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ ఉత్పత్తిలో, సైబర్ నేరాల నిరోధంలో భారత్ పురోగతిని వివరించారు. డిజిటల్ అంతరాలను అధిగమించడానికి ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ కల్పించాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఏదిఏమైనా ఏఐలో భారతీయ టెలికం రంగం పురోగమించాల్సింది ఎంతో ఉంది. ఏఐ మౌలిక వసతుల సృష్టికి భారీ పెట్టుబడులు అవసరం. ఏఐ, మెషీన్ లెర్నింగ్‌లలో నిపుణ సిబ్బంది కొరతను తీర్చాలి. 2024లో సైబర్ మోసాల వల్ల భారతీయులు సుమారు రూ.22,845 కోట్లు నష్టపోయారు. అంతకుముందు ఏడాదిలో కోల్పోయింది రూ.7,465 కోట్లు. అంటే ఒక్క ఏడాదిలో 206 శాతం ఎక్కువ సొమ్మును మోసగాళ్లు కాజేశారన్న మాట. పరిస్థితి ఇలాగే ఉంటే ఈ ఏడాది భారతీయులు నష్టపోయే మొత్తం రూ.1.2 లక్షల కోట్లకు పైగానే ఉంటుందని కేంద్ర హోంశాఖ తెలిపింది. ప్రభుత్వం, మీడియా సంస్థలు ఎంతగా హెచ్చరిస్తున్నా విద్యావంతులు కూడా సైబర్ నేరగాళ్ల బారిన, డిజిటల్ అరెస్టుల ఉచ్చులో చిక్కుకుంటుండటం శోచనీయం. ఇలాంటి మోసాలను ముందుగానే గుర్తించి నివారించడానికి ఏఐని మరింత సమర్థంగా ఉపయోగించాల్సిన అవసరం ఉంది.



ఎం.ఆర్. పట్నాయక్
టెలికం రంగ నిపుణులు



కోరుకుందాం మనసారా!

పుట్టిన రోజని కాస్త తొందరగా లేచి, తయారయ్యి, దగ్గర్లోని గుడికెళ్లి దర్శనం చేసుకున్నాను. గుడిమెట్ల మీద కూర్చుని కొబ్బరి ముక్కను నోట్లో వేసుకుంటూ అటువైపు చూశాను. పెళ్లై వారం కూడా అయినట్లు లేదు. పసుపు రాసుకున్న ఆ అమ్మాయి కాళ్లు పచ్చగా పసిడి రంగులో మిలమిలలాడుతున్నాయి. గంధం పూసిన బుగ్గలు నిగనిగా మెరుస్తున్నాయి. జడ పొడవునా కనకాంబరాలు కళకళలాడుతున్నాయి. భుజం చుట్టూ చేయి వేసి అతడేదో అన్నాడు, సిగ్గు బరువు మోయలేక ఆమె కళ్లు రెండూ కిందికి వాలిపోయాయి. అన్యోన్యంగా ఉన్న ఆ జంటను చూడగానే మనసులో ఒకలాంటి హాయి!

సంతకు వెళ్లి కావాల్సిన కూరగాయలన్నీ కొనుక్కుని ఇంటిముఖం పట్టాను. రోడ్డుకు అవతలివైపు మరో జంట కనిపించింది. మూడేళ్ల కూతుర్ని భుజాల మీద కూర్చోబెట్టుకుని, కింద పడకుండా ఒక చెయ్యి ఆమె వీపు మీద వేసి, మరో చేత్తో కిరాణా సామాను ఉన్న సంచిని పట్టుకున్నాడు భర్త. అతని పక్కనే తలపైన చిన్న కట్టెలమోపుతో చంకలో బుడ్డోణ్ని ఎత్తుకుని, మరో చేత్తో టిఫిను డబ్బా పట్టుకుని ఉంది భార్య. మొక్కజొన్న పొత్తులు అమ్ముతున్న ముసలావిడ దగ్గర బేరమాడుతున్నారు. బాధ్యతా బంధమూ పెనవేసుకున్నట్లున్న ఆ కుటుంబాన్ని చూడగానే కడుపు నిండిపోయింది!

రోజంతా ప్రయాణం చేసి అలసిపోయి ఉన్న సూర్యుణ్ని సాగనంపడానికి వాకింగ్ పేరు చెప్పి చెరువు గట్టునున్న పార్కుకు వెళ్లాను. అటునుంచి ఇటు, ఇటునుంచి అటు రెండు రౌండ్లు నడిచి ఒక బెంచీలో కూలబడ్డాను. వారాంతం అనేమో ఫోన్లకి సెలవిచ్చి చాలా మందే పార్కుకు వచ్చారు. చిన్న చిన్న పిల్లలు, రంగు రంగుల దుస్తుల్లో సీతాకోక చిలుకలల్లే తుళ్లుతున్నారు. బుజ్జి బుజ్జి పాదాలకు బుల్లి బుల్లి బూట్లు వేసుకుని, అడుగేసినప్పుడు అవి కీచు కీచుమంటుంటే ఇంకొంచెం హుషారుగా పరుగులు పెడుతున్నారు. వారిని మురిపెంగా చూసుకుంటున్న అమ్మానాన్నల ఆనందం చూడగానే, అప్పటివరకూ అలసిన శరీరం సేదతీరినట్లు అనిపించింది. పక్క బెంచీ వైపు చూద్దును కదా డెబ్బైల్లో ఉన్న ఒక జంట... ప్రశాంతంగా కూర్చుని కబుర్లు చెప్పుకొంటూ వేయించిన వేరుశనగ పప్పు కొనుక్కుని తింటున్నారు. అది చూసి నా కడుపు ఇంకా నిండిపోయిందనుకోండి!

గుళ్లో పడుచు జంటతో మొదలుపెట్టి పార్కులో పిల్లలూ పెద్దల వరకూ ఎంతో సహజాతిసహజంగా ఉన్న ఆ దృశ్యాలను చూసినప్పుడు కలిగిన మానసిక అనుభూతిని మాటల్లో చెప్పలేం. ఎక్కడైనా, ఎవర్ని చూసినా మనకలాంటి అనుభూతి కలిగినప్పుడు వాళ్లందరూ చల్లగా ఉండాలని, వారి అనుబంధం కలకాలం ఉండిపోవాలని, సంతోషం వారి గుండెల్లో ఎప్పటికీ నిండిపోవాలని ఒకసారి మనసారా కోరుకుందాం. మనకోసం కాకుండా పక్కవాళ్ల కోసం కోరుకున్న కోరిక తప్పక నెరవేరుతుందట. మనం కూడా ఏదో ఒక రోజు, ఎవరికో ఒకరికి పక్కవాళ్లం అవుతాం కదా! ఏమంటారు?

– కొట్టం రామకృష్ణారెడ్డి



సేంద్రియ సేద్యం అరకొరే!

కృత్రిమ రసాయనాలతో పండించిన పంటల మూలంగా రకరకాల జబ్బులు చుట్టుముడతాయన్న స్పృహ ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో పెరుగుతోంది. దాంతో ఎంతోమంది సేంద్రియ ఉత్పత్తుల వైపు మొగ్గుతున్నారు. ఈ క్రమంలో సేంద్రియ సాగు విస్తరిస్తోంది. కానీ 2023 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న మొత్తం సాగు భూమిలో 2.1శాతంలోనే సేంద్రియ విధానంలో పంటలు పండుతున్నాయి. 2022తో పోలిస్తే ఆ తరవాతి ఏడాది కొత్తగా 25 లక్షల హెక్టార్ల భూమి సేంద్రియం కిందకు వచ్చింది. 2023 నాటికి ఆయా ఖండాల్లోని మొత్తం సాగు భూమిలో సేంద్రియ సేద్యం వాటా (లక్షల హెక్టార్లలో)...

ఓషియానియా	532
ఐరోపా	195
లాటిన్ అమెరికా	103
ఆసియా	91
ఆఫ్రికా	34
ఉత్తర అమెరికా	33

(ఆధారం: ద వరల్డ్ ఆఫ్ ఆర్గానిక్ అగ్రికల్చర్ నివేదిక–2025)

అమెరికా ఆర్థికానికి సౌదీ 'చమురు'

పశ్చిమాసియాలో కీలక పరిణామాలు సంభవిస్తున్న వేళ సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ (ఎంబీఎస్) అమెరికా యాత్ర జరిపారు. రెండు దేశాల మధ్య సంబంధాల పునరుద్ధరణకు అలా రంగం సిద్ధమైంది. ఎంబీఎస్‌కు వాషింగ్టన్‌లో ఘన స్వాగతం లభించడం, సౌదీ పట్ల అమెరికా వైఖరిని చాటిచెప్పింది. పశ్చిమాసియాలో పాగా వేయడానికి చైనా ప్రయత్నిస్తుండటంతో సౌదీ తన పట్టు నుంచి జారిపోకుండా అమెరికా జాగ్రత్త పడుతోంది.

మొదటి నుంచీ సౌదీ-అమెరికా సంబంధాలకు చమురు వ్యాపారమే పునాది. చమురును డాలర్లలో విక్రయించడం అమెరికాకు లాభదాయకంగా ఉంటూ వస్తోంది. దీనికి ప్రతిగా సౌదీకి అమెరికా రక్షణ ఛత్రం అందించింది. ఇది ఉభయులకూ ప్రయోజనకరమైన బంధం. కానీ కొన్నేళ్లుగా ద్వైపాక్షిక సంబంధాలలో అనిశ్చితి చోటుచేసుకుంది. అమెరికా పూర్వ అధ్యక్షుడు బైడెన్ సౌదీ ప్రభుత్వం మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడిందని ఆరోపిస్తూ ఆ దేశాన్ని దూరంపెట్టినట్లుగా వ్యవహరించారు. తరవాత సౌదీ పర్యటనకు వెళ్లినా రెండు దేశాల మధ్య మునుపటి సౌహార్ద భావం కొరవడింది. అయినా ఆచరణీయ దృక్పథంతో, వ్యాపార మనస్తత్వంతో, భవిష్యత్తుపై దృష్టితో ఎంబీఎస్ తెగేదాకా లాగకుండా సంయమనం పాటించారు. చమురుపై ఆధారపడటం తగ్గించి సౌరశక్తి, కృత్రిమ మేధ సాయంతో సౌదీని ఆధునిక ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో విజన్-2030ని చేపట్టారు. దాని కింద పలు మెగా ప్రాజెక్టులు చేపట్టారు. అవన్నీ విజయవంతంగా పూర్తికావాలంటే అమెరికా, ఐరోపా, చైనా వంటి దేశాలతో సహకారం, ఆర్థిక భాగస్వామ్యం తప్పనిసరి అని ఎంబీఎస్‌కు తెలుసు. బైడెన్ తరవాత అధికారంలోకి వచ్చిన ట్రంప్‌ది కూడా వ్యాపార మనస్తత్వం కావడంతో ఇరుపక్షాల మధ్య సహజంగానే సాన్నిహిత్యం ఏర్పడుతోంది.

ట్రంప్ పశ్చిమాసియా అజెండా

గాజాలో ఇజ్రాయెల్-హమాస్ పోరును ముగింపజేయడం, ఇరాన్ అణ్వస్త్ర తయారీ సామర్థ్యాన్ని దెబ్బతీయడం ట్రంప్ లక్ష్యాలు. తదనుగుణంగా ఆయన దృఢమైన చర్యలు తీసుకున్నారు. వైరి వర్గాలను సంప్రదింపులకు దిగేలా ఒత్తిడి చేశారు. అబ్రహం ఒప్పందాలను అమలు చేయడం, ఇండియా పశ్చిమాసియా ఆర్థిక నడవా(ఐమెక్) ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడం ట్రంప్ అజెండాలో ముఖ్యభాగాలు. పశ్చిమాసియాలో తన అజెండా అమలుకు అల్లుడు జేరెడ్ కష్నర్‌నూ, మాజీ దౌత్యవేత్త స్టీవెన్ విట్కాఫ్‌నూ నియమించారు. బైడెన్ హయాంలో పశ్చిమాసియాలో కోల్పోయిన అమెరికా పలుకుబడిని పునరుద్ధరించడానికి వీరు తెరవెనక కృషి చేశారు. వారి ప్రయత్నాలు తాత్కాలికంగా ఫలించినట్లే కనిపిస్తున్నాయి. కానీ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పాలస్తీనాకు నిజమైన స్వయంప్రతిపత్తిని ఇవ్వడానికి సిద్ధంగా లేరు. దాంతో గాజా యుద్ధం ఇప్పట్లో ముగుస్తుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గాజా పునర్నిర్మాణం కోసం ట్రంప్ రచించిన ప్రణాళికలకు ఇజ్రాయెల్ అంతర్గత రాజకీయాలు అడ్డుతగులుతున్నాయి. గాజాలో శాంతి సాధనకు ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల ప్రణాళికను ఐరాస భద్రతా మండలి ఆమోదించింది. ఈ క్రమంలో శాంతి స్థాపనకు ట్రంప్ ప్రయత్నాలు ఫలిస్తాయా అన్నది వేచిచూడాలి. గతంలో సౌదీ-ఇజ్రాయెల్ సంబంధాలు మెరుగుపడితేనే, సౌదీ-అమెరికా బంధం బలోపేతం అవుతుందనన్నట్లుగా వాషింగ్టన్ భావించేది. ట్రంప్ ఆ లంకెను తెంచేశారు. ఇజ్రాయెల్‌తో సంబంధాల మెరుగుదల అనేది ఇప్పట్లో సాధ్యమయ్యేది కాదని ఎంబీఎస్ అమెరికా పర్యటనలో తేల్చేశారు. హమాస్‌తో యుద్ధం విషయంలో పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ పట్ల వ్యతిరేకత తగ్గకపోవడమే ఇందుకు కారణం. ప్రభుత్వాలు ఇజ్రాయెల్‌తో సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చుకోవాలని అభిలషిస్తున్నా ప్రజాభిప్రాయం కారణంగా కుదరకపోవచ్చు. అందుకే నేరుగా అమెరికాతో సంబంధాల బలోపేతానికే ఎంబీఎస్ అగ్రప్రాధాన్యం ఇస్తున్నారు. ట్రంప్ కూడా ఈ వాస్తవాన్ని అంగీకరించారు.



ఉభయతారకంగా...

కృత్రిమ మేధ(ఏఐ), సెమీకండక్టర్ల వంటి అధునాతన సాంకేతికతల సముపార్జనకు సౌదీ అరేబియా ఆసక్తిగా ఉంది. చమురు సంపన్న సౌదీ నుంచి భారీ పెట్టుబడులను అమెరికా ఆశిస్తోంది. చమురుతో వచ్చే సంపాదనపైనే ఆధారపడితే చాలదని గ్రహించిన ఎంబీఎస్ అమెరికా టెక్ పరిశ్రమల్లో పెట్టుబడులకు అంగీకరించారు. అగ్రరాజ్యంతో రక్షణ బంధాన్ని పెంచుకోవాలని నిశ్చయించారు. సౌదీ పెట్టుబడులకు ప్రతిగా అత్యాధునిక ఎఫ్-35 యుద్ధ విమానాల విక్రయానికి ట్రంప్ సుముఖంగా ఉన్నారు. దోహాలో హమాస్ నాయకులపై ఇజ్రాయెల్ దాడి, ఇరాన్ ముప్పును దృష్టిలో ఉంచుకుని స్వీయరక్షణకు ఎఫ్-35లు అవసరమేనని సౌదీ భావిస్తోంది. అది నెరవేరే రోజు సమీపిస్తోంది. ఏఐ, చిప్ తయారీ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సెంటర్లకు నెలవులుగా రూపాంతరం చెందాలని సౌదీ అరేబియా, యూఏఈ ఆశిస్తున్నాయి. ఈ రూపాంతరీకరణ చైనా ద్వారా కాకుండా తన ద్వారానే జరగాలని అమెరికా భావిస్తోంది. దానికి అన్ని రకాలుగా తోడ్పడతానని సౌదీకి భరోసా ఇచ్చింది. ఈ క్రమంలోనే అమెరికా గత అధ్యక్షులకు భిన్నంగా ట్రంప్ పశ్చిమాసియాకు మళ్లీ అగ్ర ప్రాధాన్యం కల్పిస్తున్నారు.



డాక్టర్ వివేక్ మిశ్రా
డిప్యూటీ డైరెక్టర్,
అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్

స్వార్థం.. అనర్థం..!

హాయ్! బుజ్జీ!!

ఒక అడవిలో పెద్ద చెట్టు ఉండేది. దాని మీద కాకులు, పిచ్చుకలు, చిలుకలు, కోయిలలు గూడు కట్టుకుని నివసించేవి. ఆ పక్షుల అరుపులతో చెట్టంతా ఎప్పుడూ సందడిగా ఉండేది. అవన్నీ కలసిమెలసి ఆనందంగా ఉండేవి. ఒకరోజు వేరే చోటు నుంచి ఓ కాకి వచ్చి ఆ చెట్టు మీద వాలింది. దానికి అక్కడి వాతావరణం బాగా నచ్చడంతో అక్కడే నివాసం ఏర్పాటు చేసుకుంది. అలా రోజులు గడుస్తూ ఉన్నాయి. కొత్తగా వచ్చిన కాకి.. మిగిలిన వాటి ఆనందాన్ని చూడలేకపోయింది. దాంతో ఎలాగైనా వాటన్నింటినీ ఆ చెట్టు మీద నుంచి వెళ్లగొట్టాలని చూసింది. ముందు నుంచే అక్కడున్న కాకుల దగ్గరికి వెళ్లి.. 'పిచ్చుకలు, కోయిలలు, చిలుకల్ని ఇక్కడి నుంచి పంపించేస్తే ఎంచక్కా చెట్టంతా మనమే ఉండొచ్చు' అంటూ వాటికి ఏవేవో మాటలు చెప్పింది. ఆ కాకి మాటలు నమ్మిన కాకులు.. మిగతా పక్షులను చెట్టు నుంచి తరిమేశాయి. ఆ తరవాత చాలా రోజులు కాకులు మాత్రమే ఆ చెట్టుపై ఉండసాగాయి. ఇక అక్కడ.. పెద్దగా శబ్దాలేమీ లేకపోవడంతో చెట్టు మీదకి మెల్లమెల్లగా పాములు వచ్చి కాకులు పెట్టిన గుడ్లు తినసాగాయి. ఇదంతా గమనించిన కాకులకు విషయం అర్థమైంది. అప్పుడవి.. 'అరెరె.. మనం చాలా పెద్ద తప్పు చేశాం. అంతా కలిసి ఉండటమే బలం అని మరిచిపోయాం. ఇన్నిరోజులు చెట్టు మీద ఎక్కువ పక్షులు ఉన్నాయి కాబట్టి.. ఆ శబ్దాలు విని పాములు పైకి రావడానికి ధైర్యం చేయలేదు. ఒక వేళ వచ్చినా ఒకరికి ఒకరు చెప్పుకొని మనల్ని మనం కాపాడుకున్నాం. కానీ ఇప్పుడు.. ఆ అవకాశం లేకుండా పోయింది. స్వార్థంతో ఆలోచించి.. ఒకవైపు మిత్రులను మరోవైపు రక్షణనీ కోల్పోయాం' అని బాధపడ్డాయి. ఎలాగైనా ఆ పక్షులను మళ్లీ చెట్టు మీదకు తీసుకురావాలని నిర్ణయించుకుని అడవంతా వెతకడం మొదలుపెట్టాయి. చివరికి అవి ఎక్కడున్నాయో తెలుసుకుని.. వాటికి క్షమాపణలు చెప్పి మళ్లీ చెట్టు మీదకి తెచ్చుకున్నాయి.



– డాక్టర్ పూసపాటి వేదాద్రి

నేనెవర్ని?

1. నేనో అయిదక్షరాల ఆంగ్ల పదాన్ని. నాలోని 1,4,5 అక్షరాలను కలిపితే 'చీమ' అని.. మొదటి మూడు అక్షరాలను కలిపితే 'వయసు' అనే అర్థాన్నిస్తాను. నేనెవర్ని?
2. అయిదక్షరాల పదాన్ని నేను. నాలోని మొదటి నాలుగు అక్షరాలను కలిపితే 'నక్షత్రం' అని.. చివరి మూడు అక్షరాలను కలిపితే 'కళ' అనే అర్థాన్నిస్తాను. ఇంతకీ నేనెవర్ని?

జవాబు: 1.AGENT 2.START




'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన'ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు. వేదికపై కృష్ణా జిల్లా డీఈవో రామారావు, పి.వి.పి. సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శివాజీబాబు, శ్రీ చైతన్య విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ జీఎం ఎం.మురళీకృష్ణ, ఈనాడు ఏపీ బ్యూరో చీఫ్ కనపర్తి శ్రీనివాస్, ఈనాడు విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్‌కే కిషోర్‌కుమార్

ఈనాడు అమరావతి ఎన్టీఆర్

మంగళవారం నవంబరు 25, 2025

బాల ఉషస్సు.. భావి యశస్సు

ఆధునిక పరిజ్ఞానంతో.. సమస్యలకు పరిష్కారాలు

'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన'లో అబ్బురపరిచిన ఆవిష్కరణలు

– ఈనాడు, అమరావతి
– కానూరు, పటమట, న్యూస్‌టుడే

సమాజంలో ఎదురయ్యే ప్రధాన సమస్యలన్నింటికీ ఆధునిక పరిజ్ఞానంతో పరిష్కారం చూపించొచ్చని పలువురు విద్యార్థులు చాటిచెప్పారు. రహదారి ప్రమాదాలను నివారించేందుకు వాహనాలకు ఆటోమేటిక్ బ్రేక్ సిస్టమ్, నగరాల్లో స్మార్ట్ పార్కింగ్, వ్యవసాయంలో కీటకాల ముప్పును నివారించేందుకు సోలార్ ట్రాపర్స్, వరదల వేళ మునిగిపోకుండా ఉండే స్మార్ట్ వంతెనలు, కృత్రిమ మేధతో పనిచేసే ఫైర్ ఇంజిన్లు, రైలు ప్రమాదాలను నివారించే రోబో టెక్నాలజీ, కుక్క కాటు నుంచి రక్షించేందుకు చేతులు, కాళ్లకు కవచాలు, యాంటీ సూసైడ్ ఫ్యాన్లు, విద్యుత్తును ఆదా చేసేలా స్మార్ట్‌సిటీ ప్రణాళికలు.. ఇలా విద్యార్థులు రూపొందించిన 85 ప్రాజెక్టులు ఔరా అనిపించాయి. వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు నిర్వహించిన 'ఈనాడు వైజ్ఞానిక ప్రదర్శన'కు అనూహ్య స్పందన వచ్చింది. కానూరులోని పి.వి.పి.సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో.. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని ఆరు నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులకు సోమవారం నిర్వహించిన ఈ మెగా సైన్స్ ఫెయిర్‌ను తిలకించేందుకు వేలాదిగా విద్యార్థులు తరలివచ్చారు.

1 ఎనర్జీ ఎఫీషియన్సీ స్మార్ట్ సిటీ

విద్యార్థులు: తేజస్విని, భరత్, 10వ తరగతి, జడ్పీహెచ్ఎస్ కానూరు

ఆధునిక పరిజ్ఞానంతో సమస్యలకు పరిష్కారం చూపించే నగరం నమూనా. వాహనాలు వచ్చేటప్పుడు వీధి దీపాలు వెలగడం, జాతీయ రహదారులపై గాలి మరల ద్వారా ఆటోమేటిక్‌గా దీపాలను వెలిగించడం, సెన్సార్ల ద్వారా బ్యాంకు చోరీలు జరగకుండా అప్రమత్తమవ్వడం, స్మార్ట్ చెత్త డబ్బాలు, అగ్నిప్రమాదాల వేళ మంటలను నీటితో ఆర్పే సెన్సార్ల వ్యవస్థ.. ఈ ఆరు అంశాలతో రూపొందించిన ఈ ప్రాజెక్టుకు మొదటి బహుమతి వచ్చింది.



2 స్మార్ట్ బ్రిడ్జి

విద్యార్థులు: జి.రోహిత్(9వ తరగతి), ఆర్.దుర్గ(8వ తరగతి), శ్రీమల్లికార్జున హైస్కూల్, గన్నవరం

వరదల సమయంలో వంతెనలు మునిగిపోకుండా పరిష్కారం చూపించే ప్రాజెక్టు. నీటిలో ఉండే సెన్సార్ల ద్వారా వరద ప్రవాహం ఉద్ధృతి, ఎత్తును అంచనా వేసి. దానికి తగ్గట్టుగా వంతెన ఆటోమేటిక్‌గా పైకి వస్తుంది. దీని వల్ల వాహనాలకు వరద ముంపు ప్రమాదం ఉండదు. ఈ ప్రాజెక్టుకు రెండో బహుమతి వచ్చింది.



3 యాంటీ సూసైడ్ ఫ్యాన్

విద్యార్థులు: బి.కార్తికేయ, బి.వెంకట సందీప్, కె.కార్తీక్, క్రైస్ట్ ది కింగ్ పాఠశాల, క్రీస్తురాజపురం, విజయవాడ

హాస్టల్ గదులు, ఇళ్లు, హోటళ్లలో ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడేవారు ఫ్యాన్లకే ఉరేసుకుంటారు. వీటిని నివారించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. బరువు పెరిగిన వెంటనే ఆటోమేటిక్‌గా ఫ్యాన్ నేల మీదకి దిగిపోతుంది. వెంటనే ఈ ఫ్యాన్లను బిగించిన సమయంలో నమోదు చేసిన ఫోన్ నంబరుకు అలర్ట్ మెసేజ్ వెళ్లిపోతుంది. పెద్ద శబ్దంతో అలారం మోగుతుంది. ఈ ప్రాజెక్టుకు మూడో బహుమతి వచ్చింది.



ప్రాజెక్టులకు పేటెంట్ తెప్పించాలి

-విజయరామరాజు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్

విద్యార్థులు చేసే ప్రాజెక్టులకు పేటెంట్ కోసం సైన్స్ టీచర్లు దరఖాస్తు చేయాలి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు ఉండాలి. విద్యార్థులు ఏ ఆవిష్కరణ చేయాలన్నా సామగ్రి అందుబాటులో ఉండాలి. కొందరు ఇంజినీరింగ్ విద్యార్థుల్ని అడిగినా చెప్పలేని చిప్‌లు, సెన్సార్ల గురించి ఈ విద్యార్థులు చెప్పడం అభినందనీయం. ప్రభుత్వ పాఠశాలల్లోనూ అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రదర్శన ఏర్పాటు చేసినందుకు 'ఈనాడు'కు ధన్యవాదాలు.

మరిన్ని నిర్వహించాలి..

-పాలడుగు లక్ష్మణరావు, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి

వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థి జీవితంలో కీలకం. సుమారు 85 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని తమ ప్రాజెక్టులను ప్రదర్శించడం అభినందనీయం. 'ఈనాడు' ఆధ్వర్యంలో సమాజ చైతన్యం కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. భవిష్యత్తులోనూ మరిన్ని జరగాలి.



వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థినుల సందడే సందడి



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

ప్రోత్సాహక బహుమతులు

లేజర్ సెక్యూరిటీ అలారం

విద్యార్థులు: సీహెచ్.నవీన్, ఇస్మాయిల్, 9వ తరగతి, జడ్పీహెచ్ఎస్ బంటుమిల్లి

ఇళ్లకు పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేయడమే లక్ష్యం. ఇళ్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి సెన్సార్లతో అనుసంధానిస్తారు. ఎవరైనా వచ్చి దానిని తాకగానే పెద్ద శబ్దంతో అలారం మోగుతుంది. సెల్‌ఫోన్‌కు అలర్ట్ మెసేజ్ వెళ్లిపోతుంది.



రహదారులపై ప్రమాదాల నివారణ

విద్యార్థులు: పవన్‌కుమార్(10వ తరగతి), ప్రేమ్‌నాథ్(9వ తరగతి), ఎం.కె.బేగ్ హైస్కూల్, అజిత్‌సింగ్‌నగర్

వాహనం వెళ్లేటప్పుడు అకస్మాత్తుగా వచ్చే ప్రమాదాల వేళ ఆటోమేటిక్‌గా బ్రేకులు పడి ఆగిపోతుంది. వాహనానికి బిగించిన సెన్సార్ల ద్వారా.. నాలుగు వైపులా ఎంత దూరంలో ప్రమాదం ఉన్నా వెంటనే కారులో హెచ్చరిక సంకేతాలు వస్తాయి.



వినూత్నంగా ఆలోచిస్తే...

–రాజశేఖరబాబు, సీపీ

ప్రతి విషయాన్ని వినూత్నంగా ఆలోచించడం అలవాటు చేసుకోవాలి. అప్పుడే ఆకాశమే హద్దుగా చెలరేగిపోవచ్చు. ప్రతి సందర్భంలోనూ ఇంతకంటే బాగా ఎలా చేయొచ్చు అని ఆలోచించి ఆ దిశగా ప్రయత్నిస్తే మన ప్రయాణం అద్భుతంగా సాగుతుంది. ఏఐ, మిషన్‌లెర్నింగ్, డ్రోన్ ఇలా అన్నీ ఆధునిక పరిజ్ఞానం నుంచి పుట్టుకొచ్చినవే.ప్రతి రంగంలోనూ ఆవిష్కరణలు అవసరం.

పరిశ్రమల వ్యర్థాల నుంచి ఇంకు తయారీ

విద్యార్థులు: యు.ధనశ్రీనివాస్(10వ తరగతి), వేముల అఖిల్(8వ తరగతి), జడ్పీహెచ్ఎస్ పరిటాల

పరిశ్రమల నుంచి వాయువులను ఒడిసిపట్టి. వాటి నుంచి నల్లని ఇంకు తయారు చేయడం లక్ష్యం. ఒక కంటైనర్ లాంటి యంత్రాన్ని పరిశ్రమలు ఉండే ప్రాంతంలో పెడతారు. దాని ద్వారా వచ్చే గాలిలో నుంచి రసాయన వ్యర్థాలను తీసి పౌడర్‌గా మారుస్తారు. స్వచ్ఛమైన గాలిని వదిలేస్తారు. ఆ పౌడర్‌కు నూనెలను కలిపి ఇంకు తయారు చేస్తారు.



డాగ్ బైట్ సాక్స్

విద్యార్థులు: టి.విశ్వాస్, కుశల్ పవన్‌సాయి, 9వ తరగతి, జడ్పీహెచ్ఎస్ తేలప్రోలు

కుక్కలు కరిచినా గాయం కాకుండా తప్పించుకోవచ్చు. పలుచని కాపర్ రేకు, దానిపైన తోలు, గుడ్డతో సాక్స్ రూపంలో తయారు చేసి చేతులు, కాళ్లకు తొడుక్కోవచ్చు. ప్రస్తుతం వీధి కుక్కల బెడద పెరిగిపోయి చాలా మంది చిన్నారులు వాటి బారినపడుతున్నారు. ప్రధానంగా కాళ్లు, చేతులపైనే అవి కరుస్తున్నాయి. అందుకే ఈ డాగ్ బైట్ సాక్స్ తయారు చేశారు.




మరిన్ని వార్తలు, చిత్రాలు.. www.eenadu.net లో

అదిరే దందా.. ఆపేదుందా?!

పండగ వేళ ప్రైవేటు ట్రావెల్స్ బాదుడు

ఈనాడు – అమరావతి



ఇదీ... 2026 జనవరి 14న.. . హైదరాబాద్ నుంచి విజయవాడకు ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు నిర్ధారించిన టికెట్ ధర. ఒకరు రూ.3 వేలు, మరొకరు రూ.5 వేలు అని అడ్డగోలు ధరలు పెట్టేశారు. ఇది స్లీపర్, ఏసీ కాదు... నాన్ ఏసీ సీటు మాత్రమే. ఇదే ప్రయాణానికి ఆర్టీసీలో కేవలం. . రూ.450 చెల్లిస్తే చాలు.

★ విజయవాడవాసి విజయ్ చెన్నైలో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. సంక్రాంతి సెలవులకు భార్య, ఇద్దరు పిల్లలను జనవరి 10న విజయవాడ పంపాలని బస్ టిక్కెట్ కోసం ప్రైవేటు ట్రావెల్స్‌ను సంప్రదించారు. ఒక్కో టిక్కెట్ రూ.3,500 చొప్పున రూ.10,500లు అవుతుందని చెప్పారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఇది ఈ రోజు రేటు... రోజులు గడిచే కొద్దీ రేటు పెరుగుతుందన్నారు. చేసేది లేక తీసుకున్నారు. ఎంతో మంది పరిస్థితి ఇదే.

ప్రైవేటు ట్రావెల్స్ దందాతో సంక్రాంతి వేళ ప్రయాణం అంటేనే వెన్నులో వణుకు పుడుతోంది. ఆర్టీసీకి.. ప్రైవేటు ట్రావెల్ సర్వీసుల టిక్కెట్ల ధరకు పొంతన లేదు. రూ.వందల్లో ఉండాల్సిన ధరలు రూ.వేలల్లో దర్శనమిస్తున్నాయి. దీంతో సామాన్యుడికి పండగ ఖర్చు కంటే ప్రయాణ ఖర్చే భారంగా మారుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జనవరి 10-14 మధ్య టికెట్ ధరల తేడా (రూ.లలో)..

విజయవాడకు	ఆర్టీసీ	ప్రైవేటు
హైదరాబాద్	450	3,000
బెంగళూరు	1,087	2,990
చెన్నై	723	3,500
విశాఖ	579	1,490
తిరుపతి	508	2,900
నెల్లూరు	352	2,400
కాకినాడ	355	2,500

45 రోజుల ముందే ఇంతా?

పండగ ప్రయాణానికి 45 రోజుల ముందే ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల ధరలు ఆకాశంలో ఉంటే రానున్న రోజుల్లో మరింత పెరగనున్నాయి. ఆర్టీసీలో ప్రత్యేక సర్వీసులపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం... మరోవైపు రైళ్లు ఖాళీ లేక.. ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించక తప్పడం లేదు. అక్కడ మాత్రం నాన్ ఏసీ, సీట్ల ధరలే చుక్కలు చూపిస్తున్నాయి. తిరుగు ప్రయాణానికి ఇదే బాదుడు ఉండనుంది. మొత్తమ్మీద ఓ కుటుంబం ఇతర రాష్ట్రం నుంచి వచ్చి వెళ్లాలంటే రమారమి రూ.10-20 వేల వరకు భారం పడనుంది. అధికారులు ఇప్పుడే తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటే పరిస్థితి చక్కబడే వీలుంది. రవాణాశాఖ అధికారులను చరవాణిలో సంప్రదించే ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు.

పశ్చిమ బైపాస్.. ఎన్‌హెచ్-16లో విలీనం!

చినఅవుటపల్లి-కాజ ఆర్అండ్‌బీ స్టేట్ హైవేదే బాధ్యత

ఈనాడు – అమరావతి

పశ్చిమ బైపాస్ ఎన్‌హెచ్-16లో విలీనమయ్యే సమయం ఆసన్నం అవుతోంది. బైపాస్‌లో ప్యాకేజీ-1 గుండుగొలను-కలపర్రు, ప్యాకేజీ-2 కలపర్రు-చినఅవుటపల్లి ఇప్పటికే ఎన్‌హెచ్-16లో మమేకమయ్యాయి. ప్యాకేజీ-3, 4 నిర్మాణం దాదాపు కొలిక్కి వచ్చింది. ఈ నేపథ్యంలో బైపాస్‌లో భాగమైన చినఅవుటపల్లి-కాజ వరకు దాదాపు 47 కి.మీ ఎన్‌హెచ్-16లో కలవనుంది. దీంతో ప్రస్తుతం

ఎన్‌హెచ్-16లో భాగంగా గన్నవరం మండలం చినఅవుటపల్లి నుంచి విజయవాడ బెంజ్ సర్కిల్ మీదుగా గుంటూరు జిల్లా కాజ వరకు దాదాపు 40 కి.మీ ఆర్అండ్‌బీ రాష్ట్ర హైవేలకు అప్పగిస్తారు. పశ్చిమ బైపాస్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాగానే ఈ మార్పులు జరగనున్నాయి. అక్కడ నుంచి 40 కి.మీ నిర్వహణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి.



కాజ దగ్గర ఎన్‌హెచ్-16, పశ్చిమ బైపాస్ అనుసంధాన పనులు

వన్‌టైం ఇంప్రూవ్‌మెంట్ అనంతరమే...

★ ఎన్‌హెచ్ నిబంధనల ప్రకారం బైపాస్ నిర్మాణం చేపట్టినప్పుడు ఆ పరిధిలో ఇప్పటి వరకు ఎన్‌హెచ్‌లో భాగంగా కొనసాగుతున్న రహదారిని ఆర్అండ్‌బీ రాష్ట్ర హైవేలకు బదిలీ చేస్తారు. బదిలీకి ముందే ఆ పరిధిలోని రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసివ్వాలి. మరమ్మతులకు గురైన విద్యుత్తు దీపాలను పునరుద్ధరించాలి. పంచాయతీ, నగరపాలిక సమన్వయంతో డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేయాలి. ఇవన్నీ చేసిన తర్వాతే బదిలీ చేయాలి.

★ ఎన్‌హెచ్ నుంచి రాష్ట్ర హైవేకు బదిలీ అవుతున్నందున ఈ పరిధిలోని టోల్ ప్లాజాలు తొలగిస్తారు. ప్రస్తుతం ఎన్‌హెచ్-16లో పొట్టిపాడు టోల్‌గేటు తొలగించి. పశ్చిమ బైపాస్‌లో వెంకటపాలెం, వెదురుపావులూరులో రెండు కొత్త టోల్‌గేట్లు ఏర్పాటు చేస్తారు.

విద్యుత్తు టవర్ల కేసు వాయిదా...

పశ్చిమ బైపాస్ మీదుగా వెళ్లిన నున్న హైటెన్షన్ విద్యుత్తు టవర్ల వివాదం మళ్లీ వాయిదా పడింది. సోమవారం కోర్టులో విచారణకు రాగా రైతులు కొంత సమయం కావాలని కోరడంతో నాలుగు వారాలు వాయిదా వేస్తూ న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది.

ఆస్తి.. భూ వివాదాల ఫిర్యాదులే అధికం



మహిళ సమస్య వింటున్న డీసీపీ ఉదయరాణి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : నగరంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 69 ఫిర్యాదులు వచ్చాయి. ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు డీసీపీ ఉదయరాణి బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. వీటిల్లో అత్యధికంగా 31 భూ, ఆస్తి, నగదు లావాదేవీలవే ఉన్నాయి. కుటుంబ కలహాలు 6, మహిళా సంబంధ నేరాలు 5, వివిధ మోసాలు 4, దొంగతనాలు 4, కొట్లాటలు 3, ఇతర ఫిర్యాదులు 16 చొప్పున వచ్చాయి. వీటిని సంబంధిత పోలీస్‌స్టేషన్లకు పంపించి సత్వరమే పరిష్కరించాలని ఆమె ఆదేశించారు.



1912లో బ్రిటీషు వారు ఏర్పాటు చేసిన దస్త్రాల గది

నేటికీ చెక్కు చెదరలేదు!

బ్రిటిషు కాలంలో 1912లో ఏర్పాటుచేసిన దస్త్రాల గది, దానిలోని రేక్‌లు నేటికీ చెక్కుచెదరకుండా మన్నికగా ఉన్నాయి. 1912లో బ్రిటీషు వారు అవనిగడ్డలో తహసీల్దార్ కార్యాలయం నిర్మించి, పై అంతస్తులో ప్రత్యేకంగా దస్త్రాల గది ఏర్పాటు చేశారు. నాటి రాక్‌లు 12 అడుగుల ఎత్తు ఉండి, అవి పడిపోకుండా కింది భాగంలో చక్రాల వంటి దిమ్మలను ఏర్పాటు చేశారు. నాడు వేసిన రంగులు ఇప్పటికీ చెరిగిపోలేదు. భద్రపరచిన దస్త్రాల నుంచి కావలసిన దస్త్రం తీసుకోవడానికి కూడా నాడు ప్రత్యేకంగా ఒక విధానం ఉండేది. బి.5 గుమస్తాకు తప్ప ఎవరికీ ఈ గదిలోకి వెళ్లడానికి అనుమతి లేదని రాసిన బోర్డు ఇప్పటికీ ఉంది. అంటే.. రికార్డులకు అంత పటిష్ఠ భద్రత ఉండేది. ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే మంటలను ఆర్పడానికి కూడా ఫైరెక్స్ ఫోమ్ మిషన్ ఇప్పటికీ గుర్తుగా ఉంది. ప్రధాన ద్వారం తెరిచిన తర్వాత ఐరన్ గ్రిల్స్‌తో ఉన్న మరో తలుపు తీస్తే గాని లోపలకు వెళ్లడానికి అవకాశం లేదు. పై అంతస్తుకు ఏర్పాటుచేసిన రంగూన్ టేకుతో తయారు చేసిన మెట్లు 113 సంవత్సరాలైనా ఇప్పటికీ చెక్కుచెదరకుండా, రంగు కూడా పోకుండా ఉండటం చిత్రమే. - అవనిగడ్డ, న్యూస్‌టుడే

కొత్తపేట.. గురువుల కోట

ఒకే గ్రామం నుంచి 200 మంది ఉపాధ్యాయులు

అవనిగడ్డ, న్యూస్‌టుడే



కొత్తపేటలోని ప్రధాన వీధి...

అవనిగడ్డ శివారులోని కొత్తపేట చిన్న గ్రామం. 600 మంది జనాభా. మోటారు ఫీల్డే. ఇక్కడ ఎక్కువ మందికి జీవనాధారంగా ఉండేది. ఫ్యాక్షన్ గ్రామంగా కూడా ముద్ర ఉంది. ఇది గతం.

గ్రామంలో కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని మంచిగా, క్రమశిక్షణతో పెంచి ఉపాధ్యాయులను చేయాలనుకున్నారు. దాంతో వారు కష్టపడి పిల్లల్ని చదివించారు. 1964 నుంచీ ఈ మార్పు ప్రారంభమైంది. ఉపాధ్యాయులుగా స్థిరపడిన కొందరి నుంచి యువత స్ఫూర్తి పొందారు. దానికి అవనిగడ్డలో 1974లో వచ్చిన ఇంటర్మీడియట్ టీచర్ ట్రైనింగ్ తోడైంది. దానిలో చేరిన వారు పలువురు సెకండరీ గ్రేడ్ టీచర్లుగా నియమితులయ్యారు. ఆతర్వాత క్రమంగా ప్రతి డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికవుతూ వచ్చారు. వీరిలో మరికొంత మంది ఇంజినీర్లుగా, డాక్టర్లుగా కూడా స్థిరపడ్డారు. ఒకప్పుడు లారీ డ్రైవర్లు/క్లీనర్లుగా పనిచేసిన తల్లిదండ్రుల ఆశలు నెరవేరి గ్రామం రూపురేఖలు మారిపోయాయి.



☛ కొత్తపేటలో సుమారు 200 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వారి పేర్లతో సహా రికార్డు చేశాం. మరికొంత మంది ఇంజినీర్లుగా, డాక్టర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. చిన్న గ్రామంలో ఇంత మంది ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించడం గ్రామానికే గర్వకారణంగా ఉంది.

– కూనపరెడ్డి జీవేంద్రరావు, ఉపాధ్యాయుడు



☛ కొత్తపేట గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు కొంత మంది రిటైరు కాగా, ఎక్కువ మంది జిల్లాలో వివిధ గ్రామాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్క ఉపాధ్యాయుడిని స్ఫూర్తిగా తీసుకొని మిగిలిన వారు ఉపాధ్యాయులుగా జీవితంలో స్థిరపడాలని చదువుపై శ్రద్ధ పెట్టి, కష్టపడి చదివారు.

– అన్నపరెడ్డి నాగవెంచయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు

కష్టమేమీ కాదంత..!

ఆకట్టుకుంటున్న కృత్రిమ దంతాల తయారీ యంత్రం



ప్రత్యేక కంప్యూటర్‌లో పన్ను తయారీ



గంట వ్యవధిలో తయారైన కృత్రిమ పళ్లు ఇవే..

వైద్య రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకుంటే రోగులకు మెరుగైన చికిత్సలు అందించవచ్చని అంటున్నారు.. చిన్నఅవుటపల్లిలోని డా.సుధా, నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల వైద్యులు. సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా కొనసాగుతున్న ఉచిత దంత వైద్య శిబిరంలో అత్యాధునిక సాంకేతికతో రూపొందించిన కృత్రిమ దంతాల తయారీ యంత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆధునిక దంత వైద్య విధానాలను బలోపేతం చేసేందుకు ఎయిడెడ్ తయారీ విధానంతో రూపొందిన రూ.80 లక్షల విలువైన డెంట్స్ పై సిరోనా క్యాడ్‌కామ్ యంత్రంతో గంటన్నర వ్యవధిలోనే కృత్రిమ దంతాలు తయారు చేయవచ్చని కళాశాల ప్రిన్సిపల్ డా.రామోజీరావు, హెచ్‌వోడీ డా.సునీల్‌చంద్ర తెలిపారు. ఎటువంటి లోహం లేని జిర్కోనియాతో తయారయ్యే ఈ కృత్రిమ దంతాలతో ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. వైద్య విద్యార్థులకు ఈ అత్యాధునిక సాంకేతిక చికిత్సపై ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నట్లు వెల్లడించారు. సాధారణంగా లోహంతో దంతం తయారీకి సుమారు నెల రోజుల సమయం పడుతుంది. కానీ కచ్చితత్వం ఉండదు. క్యాడ్‌కామ్ మీద గంటల వ్యవధిలో తయారయ్యే కృత్రిమ దంతాల్లో నూరు శాతం కచ్చితత్వం ఉంటుందని తెలిపారు..

–ఈనాడు, కృష్ణా, గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే


2 వరకు రైతన్నా... మీకోసం

పాయకాపురం: అన్నదాతల సాధికారిత లక్ష్యంగా 24 నుంచి డిసెంబరు 2 వరకు జిల్లాలో రైతన్నా... మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రచార పత్రాలు ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక సాధనానికి మూలస్తంభమైన వ్యవసాయ రంగం పరిపుష్టికి, స్వర్ణాంధ్ర-2047 సాధనకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. రైతును రాజును చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కార్యక్రమం ప్రవేశపెట్టారని తెలిపారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది, వ్యవసాయ అనుబంధ శాఖలు, శాస్త్రవేత్తలు. . రైతులతో ముఖాముఖిగా చర్చిస్తామన్నారు.

ఇస్రో.. ప్రయోగం ఇదిగో...!

ఇస్రో.. అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రత్యేకంగా రూపొందించిన బస్సును ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రదర్శనకు ఉంచారు. ఇందులో వివిధ రాకెట్‌లు, క్రయోజనిక్ ఇంజిన్లు, మంగళయాన్, చంద్రయాన్, శాటిలైట్‌ల నమూనాలు ఏర్పాటు చేశారు. వీటిని వీక్షకుల కోసం అందుబాటులో ఉంచారు. రాకెట్‌లను విజయవంతంగా ఎలా ప్రయోగిస్తున్నారు.. మానవాళికి కలిగే లాభాలను వివరించేలా 10 నిమిషాల వీడియోను ప్రదర్శిస్తున్నారు. పరిశోధనలు సులువుగా అర్థమయ్యేలా ఇవి ఉన్నాయి. ఈ బస్సును అన్ని ప్రాంతాలకు తీసుకెళ్లి ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నామని ఇస్రో సిబ్బంది తెలియజేశారు. కలెక్టర్ లక్ష్మీశ చొరవతో కలెక్టరేట్‌లో ఈ నెల 23, 24వ తేదీల్లో ప్రదర్శించగా.. పెద్దఎత్తున ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు తరలివచ్చారు. - ఈనాడు, అమరావతి, - న్యూస్‌టుడే, పాయకాపురం


విద్యార్థులకు వివరిస్తున్న షార్ టెక్నికల్ అధికారి కిరణ్


అంతరిక్ష ప్రయోగాల నమూనాలు

మధ్యాహ్న భోజనం.. మరింత రుచిగా..

వంట ఛార్జీలు పెంచిన కూటమి ప్రభుత్వం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. వీటిలో మధ్యాహ్న భోజన పథకంలో వడ్డించే భోజనం నాణ్యంగా లేదని ఎక్కువ మంది తినడానికి ఇష్టపడేవారు కాదు. దీంతో పాలన ప్రారంభించిన ఏడాది లోపే సన్న బియ్యాన్ని అందించింది. దీంతో భోజనం తినేవారి సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో పెరిగిన నిత్యావసరాల ధరలను దృష్టిలో పెట్టుకొని వంట ఛార్జీలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీని వల్ల మరింత రుచిగా.. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకుంది.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో సుబ్బారావు

సంఖ్య పెరిగింది

మధ్యాహ్న భోజనం పథకాన్ని తరచూ పరిశీలిస్తూ ఉంటాను. గతంతో పోల్చుకుంటే సన్న బియ్యం వచ్చిన తర్వాత నుంచి నాణ్యంగా, రుచికరంగా ఉండటంతో భోజనం చేసే విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఈ పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేసేలా ప్రభుత్వం ఏజెన్సీలకు వంట ఛార్జీలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడం శుభపరిణామం.

-యు.వి.సుబ్బారావు, డీఈవో

ప్రతి విద్యార్థికి వంట ఛార్జీలు రోజుకు (రూ)

తరగతి	పాత ధర	కొత్త
1-5	5.45	6.19
6-8	8.17	9.29
9 నుంచి ఇంటర్	8.17	9.29

- జిల్లాలో 95.46 శాతం మంది భోజనం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే 84,822 మంది విద్యార్థులకు శనివారం 65,834 మంది హాజరయ్యారు. వీరిలో 62,851 మంది భోజనం చేశారు. 95.46 శాతం మంది సద్వినియోగం చేసుకున్నారు.
- పాఠశాలల వారీగా వివరాలు పరిశీలిస్తే ప్రాథమిక పాఠశాలల్లో (ఒకటి నుంచి ఐదో తరగతి) 29,822 మంది విద్యార్థులకు 24,908 మంది హాజరయ్యారు. 24,700 మంది (99.16) శాతం మంది తిన్నారు.
- ప్రాథమికోన్నత పాఠశాలలు (ఆరు నుంచి ఎనిమిదో తరగతి) 1611 మందికి 1337 మంది హాజరయ్యారు. 1309 మంది (97.91) శాతం మంది భోజనం చేశారు.
- ఉన్నత పాఠశాలలు (తొమ్మిది నుంచి పదో తరగతి) 50,108 మందికి 37,546 మంది హాజరయ్యారు. 34,975 మంది (93.15) శాతం తినగా.. ఇంటర్మీడియట్ (11-12 తరగతులు) 3281 మందికి 2043 మంది హాజరయ్యారు. 1867 మంది (95.46) శాతం మంది భోజనం చేసినట్లు జిల్లా విద్యాశాఖ తెలియజేసింది.

ఈట్ స్ట్రీట్‌లో ఆకస్మిక తనిఖీలు

ఈనాడు కథనానికి స్పందన

నూర్యారావుపేట: ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద నిర్వహించే 'ఈట్ స్ట్రీట్'లో సోమవారం రాత్రి ఆహార తనిఖీ అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రవీంద్రరెడ్డి నేతృత్వంలో సిబ్బంది అల్పాహార దుకాణాలు, బిర్యానీ విక్రయ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ నెల 23న 'నడిచేలా తిండి.. నాని కరండి.' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. దాదాపు గంట సేపు దుకాణాలను తనిఖీ చేసి వినియోగిస్తున్న పదార్థాలు పరిశీలించారు.


బిర్యానీ పరిశీలిస్తున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్

రంగులు వాడితే కఠిన చర్యలు: బిర్యానీలు, చికెన్, మటన్ ఆహారంలో, ఐస్‌క్రీమ్, కుల్ఫీలలో నాసిరకం ఉత్పత్తులు వాడుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. నూనెను సైతం రీసైకిల్ చేసి వినియోగిస్తుండడంతో రోగాల బారిన పడుతున్నారు. 'ఈనాడు' కథనంతో కదిలిన అధికారులు.. పలు దుకాణాల్లో నమూనాలు సేకరించారు. నిషేధిత రంగులు వాడినా, పరిమితికి మించి వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాంసాహార ఉత్పత్తులు, ఐస్‌క్రీమ్, కుల్ఫీలు ఆకర్షణీయంగా కనిపించేందుకు రంగులను ఎక్కువ వినియోగిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. దీని వల్ల జీర్ణకోశ వ్యాధులు, కాలేయ సంబంధ వ్యాధులు ఇతర సమస్యలపై వస్తున్న వరుస ఫిర్యాదులతో ఈ దాడులు చేశారు.

ఉద్యోగం ఇప్పిస్తానని స్నేహితురాలికే టోకరా

రూ.48 లక్షలు నొక్కేసి.. ఆపై బెదిరింపులు

విజయవాడ నేరవార్తలు: 'నాకు పెద్ద పెద్ద అధికారులు తెలుసు. మీ అమ్మాయికి మత్స్యశాఖలో ఉద్యోగం ఇప్పిస్తా. కొంత సొమ్ము చేబదులుగా ఇస్తే ఎక్కువ మొత్తంలో డబ్బులు తిరిగిస్తా..' అంటూ స్నేహితురాలిని నమ్మించింది. రూ.48లక్షల మేర మోసం చేసి, ఆపై చంపుతానని బెదిరించిన గుంటూరు కలెక్టరేట్‌లోని మత్స్యశాఖ సూపరింటెండెంట్‌పై విజయవాడ సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు చెప్పిన ఈ ఘటన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి... అజిత్‌సింగ్‌నగర్, నందమూరినగర్‌కు చెందిన షేక్ షామీమ్ (50) టైలరింగ్ షాపు నిర్వహిస్తుంటారు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గుంటూరు కలెక్టరేట్‌లోని మత్స్యశాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేసే నిమ్మగడ్డ లలితకుమారి, ఆమె భర్త కాచిపూడి జాన్సన్‌లు ఇద్దరూ షామీమ్‌కు చిన్ననాటి స్నేహితులు. లలితకుమారి అల్లుడు సుధీర్, కుటుంబ మిత్రుడు దాసరి నాగరాజు తదితరులు షామీమ్ ఇంటికి రాకపోకలు సాగిస్తుండేవారు. ఈ క్రమంలో పెద్ద పెద్ద అధికారులతో తనకు పరిచయం ఉందని.. మీ కుమార్తెకు మత్స్యశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని షామీమ్‌కు లలితకుమారి హామీ ఇచ్చింది. దీని కోసం రూ.20 లక్షలు చెల్లించాలనడంతో.. 2023, సెప్టెంబరులో ఇచ్చారు. వారికి విశాఖ నుంచి పెద్ద మొత్తంలో నిధులు వస్తాయని.. వారి అత్యవసరాలకు డబ్బులు కావాల్సి ఉందని, చేబదులు ఇస్తే రూ.కోటి తిరిగి ఇస్తానని నమ్మించింది. ఏడాది మే నెలలో మరో రూ.28 లక్షలు చెల్లించారు. తర్వాత నుంచి కుమార్తె ఉద్యోగం, చేబదులుగా ఇచ్చిన డబ్బులు గురించి అడుగుతుంటే.. సరైన సమాధానం ఇవ్వకపోవడంతో నిలదీశారు. తమ వద్ద డబ్బులు లేవని.. మరోసారి డబ్బులు అడిగితే చంపుతామని లలితకుమారి బెదిరించడంతో.. మోసపోయినట్లు గుర్తించారు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఈ నెల 21న ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేశారు.

'రైతుల ఆత్మహత్యలపై స్పందించకపోవడం బాధాకరం'

గవర్నర్‌పేట: దేశంలో ఏటా లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా.. ప్రభుత్వాల్లో స్పందన లేకపోవడం బాధాకరమని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి.చంద్రకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. అసమానతలను పెంచే విధానాలు, ఉగ్రవాద చర్యలపై అతిగా స్పందిస్తున్నారని దుయ్యబట్టారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందని, అన్నం పెట్టే రైతు కోసం అందరూ పోట్లాడాలని పిలుపునిచ్చారు. 5 సంవత్సరాల రైతు ఉద్యమం సందర్భంగా సోమవారం గవర్నర్‌పేటలోని ఐ.ఎం.ఎ. హాలులో ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు రచించిన 'ఎన్నాళ్లీ అన్యాయం సహించాలి?' అనే పుస్తకాన్ని జస్టిస్ చంద్రకుమార్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. స్వేచ్ఛా వాణిజ్యం ఒప్పందాల కారణంగా దేశంలో వ్యవసాయ రంగం అధోగతి పాలైందన్నారు. విదేశాల ఎగుమతులపై ఉన్న ఆంక్షలు, షరతులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. స్వదేశంలో పండే పంటలకు కనీస మద్దతు ధర పంటలకు మాత్రమే దిగుమతులకు అవకాశం ఇవ్వాలని సూచించారు. కేంద్రం ఎన్నికల కమిషన్‌ను తన అధీనంలో తీసుకుందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం, మావోయిస్టులు ఇద్దరూ కాల్పులు విరమించుకుని.. శాంతియుత వాతావరణం నెలకొల్పాలని పిలుపునిచ్చారు. 83 ఏళ్ల వయసులో వడ్డే శోభనాద్రీశ్వరరావు రైతుల పక్షాన అలుపెరగని పోరాటం చేస్తున్నారని కొనియాడారు. సీనియర్ పాత్రికేయులు, రైతు సంఘాల నాయకులు వై.కేశవరావు, పి.జమలయ్య, బి.దశరథరామిరెడ్డి, సింహాద్రి ఝాన్సీ, రమణమూర్తి, మహదేవ్, సి.హెచ్.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణలో జస్టిస్ చంద్రకుమార్, శోభనాద్రీశ్వరరావు, దశరథరామిరెడ్డి తదితరులు

న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను

ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో పటిష్ఠమైన వార్తా వ్యవస్థను కలిగి, తాజా వార్తలను సేకరించి, వాటిని **ఈనాడు**తోపాటు ఈనాడు.నెట్, ఈటీవీ, ఈటీవీ భారత్ వంటి సంస్థలకు అందిస్తున్న న్యూస్ ఏజెన్సీ 'న్యూస్‌టుడే'కు న్యూస్ కంట్రిబ్యూటర్లుగా వార్తలు అందించేందుకు ఔత్సాహికులైన యువకులు కావలెను.
అర్హత: డిగ్రీ, **వయసు:** 30 సంవత్సరాల లోపు
అభిరుచి: వార్తల రూపంలో ప్రజా సమస్యలను వెలుగులోకి తేవాలన్న తపన, స్థానికులై, పరిసర ప్రాంతాలపై అవగాహన, కనీస సామాజిక-రాజకీయ పరిజ్ఞానం, కలివిడిగా ఉండే తత్వం కలిగి ఉండాలి.
న్యూస్ కంట్రిబ్యూటర్లు అవసరమైన ప్రాంతాలు:
ఎ.కొండూరు, జగ్గయ్యపేట టౌన్, గుణదల, సత్యనారాయణపురం, విజయవాడ లీగల్, ధర్నాచౌక్, బీఆర్‌టీఎస్ రోడ్డు, సబ్ కలెక్టరేట్
సరళమైన తెలుగులో రాయగల నేర్పు, లోకజ్ఞానం, వర్తమాన రాజకీయ-సామాజిక తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలి.
ఆసక్తి గలవారు నవంబరు 25, మంగళవారం ఉదయం 10.30 గంటలకు జరిగే అర్హత పరీక్షకు ఈ క్రింది చిరునామాలో హాజరుకాగలరు.
గతంలో హాజరైన వారు తిరిగి ఈ పరీక్షకు రానవసరం లేదు.
న్యూస్‌టుడే ప్రైవేట్ లిమిటెడ్
C/o. ఈనాడు కార్యాలయం
గూడవల్లి గ్రామం, విజయవాడ రూరల్ మండలం, ఎన్టీఆర్ జిల్లా–521 104

బ్రాయిలర్ ధరలు (కిలో /కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -103 రిటైల్ ధర 190 చికెన్ విత్ స్కిన్ - 189, చికెన్ స్కిన్‌లెస్ - 215.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర


ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

సమస్యల పరిష్కారంలో ఉదాసీనత వద్దు

పాయకాపురం, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ఉదాసీనతగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ జి.లక్ష్మీశ హెచ్చరించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఒక గంటపాటు దృష్టిసారిస్తే ఆయా సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ సూచించారు. మొత్తం 182 వినతులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖ 53, మున్సిపల్ 31, పోలీసు 18, విద్య 8, పంచాయతీ 8, విభిన్న ప్రతిభావంతులు, సర్వే రవాణా శాఖలకు ఆరేసి చొప్పున అర్జీలు వచ్చాయి. డీఆర్డీయే 5, వైద్య ఆరోగ్యశాఖ మూడు, ఆర్‌అండ్‌బీ 3, కోఆపరేటివ్, సాంకేతిక విద్య, దేవాదాయశాఖ 2, సాంఘిక సంక్షేమశాఖలకు రెండేసి, మత్స్య, కార్మిక, డ్వామా, ఇరిగేషన్, రిజిస్ట్రేషన్, బీసీ వెల్ఫేర్, పొల్యూషన్ తదితర శాఖలకు ఒక్కో వినతి పత్రం అందాయి. జేసీ ఎస్.ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, కేఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు, ఏసీపీ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త..!

విజయవాడ నేరవార్తలు : పోలీసులు ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త ఎత్తులు వేస్తున్నారని, సమాజానికి పెనుసవాలుగా మారారని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. సైబర్ సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం సీపీ కార్యాలయంలో సీనియర్ సిటిజన్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేరాల బారినపడే వారిలో అధికంగా వృద్ధులు ఉన్నారని చెప్పారు. డిజిటల్ అరెస్టు అనేది లేనే లేదని స్పష్టం చేశారు. పోలీసులమంటూ ఎవరైనా వీడియో కాల్ చేసి.. అరెస్టు చేస్తున్నట్లు బెదిరిస్తే భయపడవద్దని సూచించారు. సీబీఐ, పోలీస్, కస్టమ్స్, ఈడీ, న్యాయమూర్తులు వీడియో కాల్ చేయరని వివరించారు. ఎవరికైనా బెదిరింపులు వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అప్పుడే మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చని పేర్కొన్నారు. ఒకవేళ నగదు బదిలీ చేస్తే.. 24 గంటల్లోపు సమీప పోలీస్‌స్టేషన్ లేదా సైబర్ పోర్టల్ 1930కి సమాచారం అందించాలని కోరారు. ఆన్‌లైన్‌లో వచ్చే పెట్టుబడుల మోసాలపై జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఫేస్‌బుక్, టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టా తదితర సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలను చూసి మోసపోవద్దని సూచించారు. సరైన డి మ్యాట్ ఖాతా లేకుండా పెట్టుబడులు పెట్టకూడదని తెలియజేశారు. సైబర్ క్రైం డీసీపీ కృష్ణప్రసన్న పాల్గొన్నారు.


వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న సీపీ రాజశేఖరబాబు

అప్పుల భారంతో బలవన్మరణం

జి.కొండూరు, న్యూస్‌టుడే : అప్పుల భారంతో ఓ యువకుడు ఉరేసుకుని మృతి చెందిన సంఘటన ఇది. పోలీసుల సమాచారం మేరకు.. జి.కొండూరు మండలం చెవుటూరుకు చెందిన గుడూరు బలరామిరెడ్డి(35) మంగళగిరి సమీపంలోని ఓ ఆసుపత్రిలో ఏసీ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. గతంలో అప్పులు చేయడంతో వాటిని తీర్చే వీలులేక మానసిక ఒత్తిడికి గురై ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో సోమవారం తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కొంత సమయానికి కుటుంబ సభ్యులు గమనించి మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అతని తండ్రి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు జి.కొండూరు ఎస్సై కె.సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


బలరామిరెడ్డి (పాత చిత్రం)

సంజయ్ రిమాండ్ పొడిగింపు

ఈనాడు - అమరావతి: అగ్నిమాపక, సీఐడీ డీజీగా పనిచేసిన కాలంలో ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కేసులో ఐపీఎస్ అధికారి సంజయ్ రిమాండ్‌ను కోర్టు పొడిగించింది. సోమవారంతో రిమాండ్ ముగియనుండడంతో.. ఏసీబీ అధికారులు విజయవాడలోని ఏసీబీ కోర్టులో నిందితుడిని హాజరుపర్చారు. వచ్చే నెల 3 వరకు పొడిగిస్తూ ఏసీబీ కోర్టు న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు. ఈ కేసులో కోర్టులో లొంగిపోయిన సంజయ్.. ఆగస్టు, 26 నుంచి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే.

కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి

పాయకాపురం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో కీలకమైన ఎన్టీఆర్ జిల్లాకు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి, సమస్యల పరిష్కారంతో పాటు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడంలో తనదైన పనితీరుతో గుర్తింపు పొందారు కలెక్టర్ జి.లక్ష్మీశ. జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు వినూత్న కార్యాచరణతో ముందుకెళ్తున్నానని ఆయన చెప్పారు. టూరిజం, ప్యాకేజీల వివరాలతో త్వరలో ఆంధ్రా ట్యాక్సీ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్టు సోమవారం తెలిపారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఏడాది కాలం పూర్తయిన నేపథ్యంలో వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. అందరూ సహకారం అందిస్తున్నారని కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.


కలెక్టర్ లక్ష్మీశకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

కందకంలోకి జారిన పాఠశాల బస్సు

చందర్లపాడు, న్యూస్‌టుడే : కోనాయపాలెం సమీపంలో పాఠశాల బస్సు ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన కందకంలోకి జారగా విద్యార్థులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. నందిగామ నారాయణ ఆంగ్లో వేదిక్ పాఠశాల బస్సు సోమవారం సాయంత్రం విద్యార్థులను ఎక్కించుకుని గుడిమెట్ల బయలుదేరింది. మార్గమధ్యలో కోనాయపాలెంలో పిల్లలను దింపి వెనుకకు తిప్పుటానికి ప్రయత్నించగా అదుపు తప్పి వెనుక భాగం కందకంలోకి జారిపోగా ముందు భాగం పైకి లేచింది. దీంతో బస్సులోని విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గ్రామస్థులు గమనించి వారిని కిందకు దించారు. ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై ధర్మరాజు సంఘటనా స్థలానికి వెళ్లి వాహన చోదకుడిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పైకి లేచిన బస్సు ముందుభాగం



రంగయ్య ముందస్తు బెయిల్ పిటిషన్ డిస్మిస్

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితుడైన తలారి రంగయ్య (ఏ14) ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. లేబుళ్లను డిజైన్ చేసి, సరఫరా చేసిన రంగయ్య.. గత కొన్ని రోజులుగా అజ్ఞాతంలో ఉన్నాడు. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని దాఖలు చేసుకున్న పిటిషన్ సోమవారం 7వ ఏడీజే కోర్టు తోసిపుచ్చింది. నిందితుడి నుంచి లేబుళ్లకు సంబంధించి కీలక సమాచారం రాబట్టాల్సి ఉందన్న ప్రాసిక్యూషన్ వాదనలతో న్యాయాధికారి ఏకీభవిస్తూ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ కోర్టు ఉత్తర్వులిచ్చింది.

మద్యం కేసులో పిటిషన్ల విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: మద్యం కుంభకోణంలో వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేష్ నాయుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై విచారణ 25వ తేదీకి వాయిదా పడింది. జైలులో తనకు అదనపు సౌకర్యాలు కల్పించాలని చెవిరెడ్డి వేసిన పిటిషన్‌పై విచారణ మంగళవారానికి కోర్టు వాయిదా వేసింది. గుంటూరు కారాగారంలో రిమాండ్‌లో ఉన్న నిందితులు బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణలు తమను విజయవాడ జైలుకు మార్చాలని సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. పార్లమెంటు సమావేశాల్లో పాల్గొనేందుకు బెయిల్ షరతులు సడలించాలని వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి పిటిషన్‌పై విచారణను 25వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు.

రైలు ప్రయాణికుల రూ.11 లక్షల సొత్తు అప్పగింత

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: విజయవాడ డివిజన్ ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు సంయుక్తంగా ప్రయాణికుల సొత్తు చోరీకి గురి కాకుండా సకాలంలో స్పందించి వారికి అప్పగించారు. ఈ నెల 23న రైలు నంబరు 17481లో అనపర్తికి చెందిన విశ్వనాథరెడ్డి దంపతులు అన్నవరం నుంచి విజయవాడ వస్తున్న క్రమంలో బీ5 బోగీలో రెండు లగేజీ బ్యాగులు మర్చిపోయారు. వారు వెంటనే రైల్వే పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా.. అన్నవరం జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ త్రినాథరావు స్పందించి బ్యాగులు తిరిగి ప్రయాణికులకు అప్పగించారు. అందులో రూ.8 లక్షల విలువ చేసే బంగారం వస్తువులు ఉన్నాయి.

- తిరుపతికి చెందిన గోపాలకృష్ణ రైలు నంబరు 20677 వందే భారత్‌లో తెనాలి నుంచి రేణిగుంటకు ప్రయాణిస్తుండగా బ్రాస్‌లెట్ రేణిగుంట రైల్వేస్టేషన్‌లో పడిపోయింది. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు స్పందించి వెతికి బ్రాస్‌లెట్ తిరిగి ప్రయాణికుడికి అప్పగించారు. దాని విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని.. రెండు కేసుల్లో బంగారాన్ని ప్రయాణికులకు అప్పగించినట్లు రైల్వే పోలీసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వాసుపత్రికి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: మద్యం కుంభకోణం కేసులో ఏ38గా ఉన్న వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని జైలు అధికారులు సోమవారం విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. గతంలో వచ్చిన సమయంలో తాను ఆర్థరైటిస్ రుమటాలజీతో ఇబ్బంది పడుతున్నానని వైద్యులకు చెప్పారు. దీంతో రుమటాలజిస్టుకు చూపించి ఆయనకు బాగానే ఉందని నిర్ధారించారు. రెండు రోజులుగా తన కాళ్లు వాపు వస్తున్నాయని, తనకు వెరికోస్ వీయిన్స్ ఉందని జైలు అధికారులతో చెవిరెడ్డి చెప్పారు. వాస్కులర్ సర్జన్‌కు చూపించాలని కోరడంతో సాధారణ పరీక్షల నిమిత్తం ఆయన్ను కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎయిమ్స్‌కు రిఫర్ చేస్తూ సూపరింటెండెంట్ ఎయిమ్స్‌కు లేఖ రాశారు. అనంతరం ఆయన్ను జైలు అధికారులు జైలుకు తరలించారు. ఆయన విజ్ఞప్తి మేరకు ఎయిమ్స్‌కు రిఫర్ చేశామని, ఎయిమ్స్ నుంచి అధికారిక ఆమోదం రాగానే ఆయన్ను జైలు అధికారులు ఎయిమ్స్‌కు తరలిస్తారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

ప్రజలకు లిఫ్ట్ సౌకర్యం

పాయకాపురం: నగరంలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు, దివ్యాంగులు, వృద్ధుల సౌకర్యార్థం లిఫ్టును ఏర్పాటు చేశారు. సోమవారం దీనిని కలెక్టర్ జి.లక్ష్మీశ.. ఓ వృద్ధురాలి చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. మౌలిక వసతులు, సౌకర్యాల కల్పనపై ఆయన ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. జేసీ ఎస్.ఇలక్కియా పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

కార్మికులకు కనీస వేతనం ఇవ్వండి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే : పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు మంజూరు చేయాలని సీఐటీయూ ఇబ్రహీంపట్నం మండల శాఖ కార్యదర్శి మహేష్ కోరారు. గుంటుపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పీఎఫ్, ఈఎస్ఐ, తదితర చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకుకు మరమ్మతులు

మైలవరం, న్యూస్‌టుడే : మండలంలోని గణపవరంలో శిథిలావస్థకు చేరిన సురక్షిత మంచినీటి పథకం ట్యాంకుకు మరమ్మతులను సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు జిల్లా పరిషత్ నుంచి రూ.5 లక్షలు మంజూరు కాగా, మరమ్మతులను చేపట్టినట్లు తెదేపా నాయకులు బుజ్జిరెడ్డి, శ్యాం ప్రసాద్ తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల పరిధిలోని గ్రామాల శివాలయాల్లో అర్చకులు సోమవారం విశేష పూజలు నిర్వహించారు. శివలింగాలకు అభిషేకాలు, అర్చనలు, పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


తిరువూరులో చంద్రమౌళీశ్వర స్వామి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

★ కొండపల్లి పోస్టాఫీస్ రోడ్డులోని కాలువలో వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పారిశుద్ధ్య అధికారులు స్పందించి తమ సిబ్బందితో సోమవారం కాలువలను శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, కొండపల్లి



★ తిరువూరు 9వ వార్డులోని డ్రెయినేజీలో వ్యర్థాలు పేరుకుని మురుగు పారుదలకు ఆటంకంగా మారిందని స్థానికుడు సోమేశ్వరావు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య కార్మికులను పంపించి డ్రెయిన్‌ను శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్ ★ తాతకుంట్ల గ్రామంలో ప్రధాన రహదారి వెంట చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని నివాసితులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పంచాయతీ అధికారులకు తెలిపారు. గ్రామ కార్యదర్శి గోపాలకృష్ణ స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి శుభ్రం చేయించి సమస్య పరిష్కరించారు. - న్యూస్‌టుడే, విస్సన్నపేట

జోరుగా విక్రయాలు..
మోసపోతున్న కొనుగోలుదారులు

జి.కొండూరు, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం వచ్చాక స్థిరాస్తి వ్యాపారం ఊపందుకొని జి.కొండూరు మండలం చుట్టుపక్కల పొలాలన్నీ వెంచర్లుగా దర్శనమిస్తున్నాయి. మండలంలో సీఆర్‌డీఏ పరిధిలోని భూములు ఎటువంటి అనుమతులు లేకుండానే వెంచర్ల రూపంలో వెలుస్తున్నాయి. కొనుగోలుదారులకు స్థలాలు విక్రయించేందుకు మధ్యవర్తులు పక్కనే ఔటర్ రింగ్ రోడ్డు, గ్రీన్ ఫీల్డ్ హైవేలు వస్తున్నాయని చెప్పి దోచుకుంటున్నారు. అసలు విషయం బయటపడే సరికి స్థలాలు కొనుకున్న వారు మోసపోయామని గ్రహించి ఏమి చేయాలో తెలియక ఆవేదన చెందుతున్నారు. ఇంత జరుగుతున్న సీఆర్‌డీఏ అధికారులు దీనిపై చర్యలు చేపట్టకపోవడం విస్మయానికి గురి చేస్తోంది. ఆశతో కొనుగోలు చేసిన వారు మోసాన్ని గ్రహించి కొందరు న్యాయస్థానం మెట్లు ఎక్కుతున్నారు. మరికొందరు పోలీస్ స్టేషను చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నామని వాపోతున్నారు.


జి.కొండూరు శివారులో రూపుదిద్దుకుంటున్న వెంచరు

అనుమతులు లేకుండా..

రైతుల నుంచి వ్యవసాయ భూములను తక్కువ ధరకు కొనుక్కుని ప్రైవేటు సర్వేయర్లతో కొలిపించి రాళ్లు పాతి స్థిరాస్తి వ్యాపారులు అందినకాడికి విక్రయిస్తున్నారు. సీఆర్‌డీఏ అనుమతులు లేకుండానే ఉందని చెప్పడం, మౌలిక సదుపాయాలైన డ్రెయిన్లు, విద్యుత్తు వంటి సౌకర్యాలు కల్పించకుండానే వ్యాపారం చేస్తున్నారు. దీంతో కొనుకున్న వారు ఇంటి నిర్మాణం చేపట్టాలంటే సీఆర్‌డీఏ అనుమతులు పొందేందుకు వ్యయప్రయాసలు పడాల్సి వస్తోంది.

స్థలం కేటాయించకుండానే...

వెంచర్లు నిర్మించేటప్పుడు ఎకరం పొలానికి 10 సెంట్ల స్థలాన్ని సామాజిక అవసరాలకు కేటాయించాలి. అలాంటిది ఏమి లేకుండానే వెంచర్లు వేసి స్థలాలు అమ్ముకుంటున్నా స్థానిక అధికారులు చర్యలు చేపట్టడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్లు, తాగునీటి ట్యాంకులు నిర్మించాల్సి ఉన్నా ఎటువంటి ఏర్పాట్లు లేకపోవడంతో గృహ నిర్మాణాలకు అవస్థలు పడుతున్నామని కొనుగోలుదారులు వాపోతున్నారు. ఇదంతా ఒక ఎత్తు అయితే అన్ని ప్లాట్లు అమ్ముకున్న కొన్నేళ్లకు, అక్కడ ఎటువంటి అభివృద్ధి చోటు చేసుకోకపోవడంతో దాన్ని మరలా ప్లానింగ్ మార్చి అక్కడే ప్లాట్లు వేయడం, అమ్మడం జరుగుతోంది. ఇప్పటికైనా సీఆర్‌డీఏ అధికారులు అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని కొనుగోలుదారులు కోరుతున్నారు.

ఫిర్యాదు అందలేదు

అక్రమ వెంచర్ల విషయమై తనకు ఎటువంటి ఫిర్యాదు రాలేదు. తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. వీటిని నిర్మూలించేందుకు సీఆర్‌డీఏ అధికారులకు నివేదికలు అందించి వాటిని తొలగించేందుకు చర్యలు చేపడతాం. - వెంకటేశ్వర్లు, తహసీల్దార్, జి.కొండూరు మండలం

ఉపన్యసించి.. బహుమతులు సాధించి..

మైలవరం, న్యూస్‌టుడే : ఆసక్తకంగా ఉపన్యసించారు. అద్భుత ప్రసంగాలతో బహుమతులు సాధించారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా సోమవారం మండలంలోని చిలుకూరివారి గూడెం(పుల్లూరు) జడ్పీ ఉన్నత పాఠశాలలో 'విద్యార్థుల జీవితాలపై చరవాణి ప్రభావం' అనే అంశంపై పోటీలు జరిగాయి. ఇందులో 9వ తరగతి విద్యార్థినులు బి.సాహిత్య, సీహెచ్.చైత్ర, బి.పూజిత వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. ఈ మేరకు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు బి.ఉషారాణి, ఉపాధ్యాయులు రత్నకుమారి, రమేష్, ఎండీ.షఫీ విజేతలకు బహుమతులు అందించి అభినందనలు తెలిపారు.


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు


బహుమతులు సాధించిన వారితో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు

రఘునందన్‌కు సత్కారం

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, మల్లెతీగా సాంస్కృతిక సాహిత్య మాసపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన జాతీయ సాహితీ సభలో తిరువూరు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి రేపాక రఘునందన్‌ను సత్కరించి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందించారు. సభలో రఘునందన్ పఠించిన కవిత సాహిత్యాభిమానులను ఆకట్టుకుంది.

అభివృద్ధి.. సంక్షేమంతో దూసుకెళ్తున్న కూటమి ప్రభుత్వం

శ్రీరాంపురం(రెడ్డిగూడెం), న్యూస్‌టుడే : రాష్ట్రంలో అభివృద్ధి.. సంక్షేమంతో డబుల్ ఇంజిన్ సర్కార్ ముందుకు దూసుకెళ్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం శ్రీరాంపురం గ్రామంలో రూ. 32 లక్షలతో పంచాయతీ భవనం, రూ.40 లక్షలతో పీఏసీఎస్ సొసైటీ భవనం నిర్మాణానికి కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాంతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం 26 మంది రైతులకు రూ.2.16 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. స్థల దాతలు నాదెళ్ల చెన్నకేశవరావు, సర్పంచి అట్లూరి శ్రీనివాసరావు, బి.వెంకట కృష్ణారావు, బి. చంద్రశేఖర్‌లను సత్కరించారు. జనసేన మైలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామ్మోహన్‌రావు, తెదేపా మండల అధ్యక్షుడు జె.వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, నెట్టెం రఘురాం, అధికారులు

ప్రజలకు శుద్ధ జలాలు అందించేందుకు చర్యలు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండల ప్రజలకు కృష్ణా జలాలు అందించేందుకు నీటి సరఫరా పథకం పనులను సత్వరమే పూర్తి చేయాలని తిరువూరు ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం శుద్ధ జలాల సరఫరాకు సంబంధించి జరుగుతున్న నిర్మాణాలు, పనులపై ఆ శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. గిరిజన తండాలకు నాలుగు రోజుల నుంచి కుదప సంప్ నుంచి ట్యాంకర్ల ద్వారా కృష్ణా జలాల సరఫరా నిలిచిందన్నారు. వారికి తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా మంగళవారం నుంచి ట్యాంకర్లతో నీరు సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. తిరువూరు, మైలవరం డీఈఈలు కె.రాఘవేంద్ర, కె.రవికుమార్, ఏఈలు సీహెచ్.సాయివెంకట లక్ష్మి, దయానంద్ పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

జాతీయ రహదారిపై ఆందోళన

జి.కొండూరు, న్యూస్‌టుడే : ఇబ్రహీంపట్నం వీటీపీఎస్ బూడిద ప్రభావిత గ్రామాల్లోని లారీలకు లోడింగ్ చేసే ధరకే తమకు లోడింగ్ చేపట్టాలని జి.కొండూరు, మైలవరం మండలాల్లోని లారీ యజమానులు నిరసన తెలిపారు. మండలంలోని చెవుటూరు గ్రామ శివారు బైపాస్ సమీపంలో జాతీయ రహదారి- 30పై సోమవారం లారీ యజమానులు బైఠాయించారు. ఇబ్రహీంపట్నంలో వీటీపీఎస్ బూడిద ప్రభావిత గ్రామాల లారీ యజమానులు ధర్నా చేసినప్పుడు తాము కూడా మద్దతు తెలిపి నిరసనలో పాల్గొన్నామని, వారితో పాటు తమకు న్యాయం చేయాలని కోరారు. వీరికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలుపడంతో చెవుటూరు శివారు బైపాస్‌లో బూడిద లారీలను అడ్డుకుని నిలిపేశారు. ఈ విషయం జి.కొండూరు పోలీసులకు తెలిసి లారీ యజమానులను అదుపులోకి తీసుకుని నిరసన విరమింపజేశారు.


బూడిద లారీ ముందు కూర్చొని నిరసన తెలుపుతున్న లారీ యజమానులు

క్రీడల్లో రాణించి ప్రతిష్ఠ పెంచాలి

మైలవరం, న్యూస్‌టుడే : క్రీడల్లో రాణించడం ద్వారా వ్యక్తిగతంగా ఎదగడమే గాక, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్‌తో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాం, సర్పంచి మంజుభార్గవి, స్టేడియం నిర్మాణ దాత హనిమిరెడ్డి, జయప్రకాశరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ జట్ల మధ్య నాలుగు పోటీలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.


పోటీలో తలపడుతున్న ఆటగాళ్లు

జగన్మాత సేవలో శాసన సభ స్పీకర్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఏఈవో వెంకటరెడ్డి వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

'అన్నదాతలను పట్టించుకోని జగన్'

గొల్లపూడి, న్యూస్‌టుడే : వైకాపా పాలనలో రైతుల సమస్యలను జగన్ పట్టించుకోలేదని, వారిని రోడ్డున పడేశారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం గొల్లపూడిలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయాన్ని వైకాపా నాయకులు అస్తవ్యస్తం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం పంచసూత్రాల ద్వారా వ్యవసాయాన్ని పునర్నిర్మాణం చేసే దిశగా ముందుకెళ్తుందన్నారు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి అన్నదాతకు స్థిరమైన ఆదాయం వచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.


గొల్లపూడిలో మాట్లాడుతున్న దేవినేని

బడి తోట.. ఆరోగ్యానికి బాట

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

★ ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం కాచవరంలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో బడి తోటలో పెంచిన అరటి చెట్ల ఫలాలను విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పంపిణీ చేశారు.

★ మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల తోటలో పండిన సొర, బీర కాయాలను కూడా మధ్యాహ్న భోజనంలో వినియోగిస్తున్నారు.

పాఠశాల అంటే కేవలం చదువు ఒక్కటే కాదు. విద్యార్థి దశలోనే అన్ని అంశాలపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో వారికి ఏదో విధంగా మేలు జరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పోషకాహారం అందించడానికి ప్రభుత్వం బడి తోట కార్యక్రమం అమలు చేస్తోంది. ఎటువంటి ఎరువులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు పండించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అందించాలనేది దీని లక్ష్యం. కిచెన్ గార్డెన్ పేరుతో విద్యార్థులకు ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పిస్తున్నారు. రోజూ కొంత సమయం అందరూ తోట పని చేసే విధంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు సేంద్రియ పద్ధతుల్లో ఆరోగ్యకరమైన కూరగాయలు, ఆకుకూరలను పండిస్తున్నారు.


కాచవరం ప్రాథమిక పాఠశాలలో ఆకుకూరల నారు నాటుతున్న విద్యార్థులు

మైలవరం నియోజకవర్గంలో ఇలా..

మైలవరం నియోజకవర్గంలో 45 ప్రాథమిక, తొమ్మిది ఉన్నత పాఠశాలలో బడి తోటలను పెంచుతున్నారు. వీటిల్లో వంగ, బీర, బెండ, చిక్కుడు, గోంగూర, తోటకూర తదితరాలను పండించి మధ్యాహ్న భోజనానికి ఉపయోగిస్తున్నారు. సీజన్‌కు అనుగుణంగా వీటిని పండించడం, ఖాళీ సమయాల్లో విద్యార్థులతో నీరు పోయించడం, మొక్కలు నాటించడం, కలుపు మొక్కలు తీయడం తదితర సులభమైన వ్యవసాయ పనులతో పాటు ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించడం వంటివి చేయిస్తున్నారు. తద్వారా విద్యార్థులకు వ్యాయామంతో పాటు వ్యవసాయంపై అవగాహన కలిగిస్తున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం

బడి తోట కార్యక్రమం ద్వారా సేంద్రియ విధానంలో ఆకుకూరలు, కాయకూరల మొక్కలు పెంచుతున్నాం. ప్రస్తుతం నీటి సౌకర్యం, వసతి ఉన్న పాఠశాలల్లో దీని అమలు చేస్తున్నాం. స్థలం లేని బడుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడానికి చూస్తున్నాం. - పీవీ.మాలిని, ఎంఈవో- 2, ఇబ్రహీంపట్నం

రైతుల అభివృద్ధే లక్ష్యంగా పంచసూత్రాలు అమలు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : రైతులను రాజును చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం 'రైతన్నా.. మీకోసం' ద్వారా పంచసూత్రాలు పథకం అమలు చేస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. తిరువూరు మండలం కోకిలంపాడు, మల్లేల గ్రామాల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు మంగళవారం ఉదయం గృహ నిర్మాణ సంస్థ, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులతో తిరువూరులోని తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపారు. సాయంత్రం ఉమ్మడి దేవరపల్లి, దుందిరాలపాడులో నిర్వహించే రైతన్నా.. మీకోసం కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు.

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే : గుంటుపల్లిలో జరిగిన కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టరు డాక్టరు హనుమంతరావు పాల్గొని మాట్లాడారు. వైద్యురాలు స్వాతి అయ్యప్ప, సిబ్బంది పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించి పంచసూత్రలపై అవగాహన కల్పించారు.


గుంటుపల్లి: స్థానికులకు పథకాలు వివరిస్తున్న హనుమంతరావు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల పరిధి గోసవీడులో తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి కొత్తా రజనీకాంత్ ఆధ్వర్యంలో సోమవారం 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమం కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు కిశోర్, కిరణ్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని పోలిశెట్టిపాడులో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి బి.చిట్టిబాబు, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వి.మునియ్య, సొసైటీ మాజీ అధ్యక్షుడు ఎ.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేటలో నిర్వహించిన కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి షేక్ టిప్పుసుల్తాన్ ప్రారంభించారు. రైతుల సమక్షంలో కరపత్రాలు విడుదల చేశారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : చెవుటూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు వేములకొండ వెంకటేశ్వరరావు, చెవుటూరు ఎన్నెస్పీ కాలువ డీసీ ఛైర్మన్ ఉమ్మడి వెంకటస్వామి, తెదేపా గ్రామ అధ్యక్షుడు పామర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో సత్తా


బరువెత్తుతున్న ఉపాధ్యాయురాలు

మైలవరం, న్యూస్‌టుడే : ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో మండలంలోని పుల్లూరు(వీసీ) ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని మర్రి శ్రీలక్ష్మి, వెల్వడం(టీఆర్) ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని కంపా వరలక్ష్మి సత్తా చాటి బహుమతులు సాధించారు. వీరిని, శిక్షకుడు వెంకట్రావును ఎంఈవోలు బండి రాజు, ఎల్.బాలు సోమవారం అభినందించారు.

విజేతలకు బహుమతుల అందజేత

గొల్లపూడి, న్యూస్‌టుడే : నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో గొల్లపూడి వన్‌సెంటర్ రోడ్డులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో ఎ.శృతి, వి.మేఘన, ఈ.సాయిగీతం మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు నీతోడు మానసిక వికాస కేంద్రం కోఆర్డినేటర్ సాయిబాబు, ప్రధానోపాధ్యాయుడు శేషగిరిరావు బహుమతులు అందజేశారు.


గెలుపొందిన వారితో నిర్వాహకులు

జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో..

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో మండలంలోని నాగులూరు హైస్కూల్ విద్యార్థులు తృతీయ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.వరలక్ష్మి సోమవారం తెలిపారు. పి.ముఖేష్ కుమార్, ఎం.రసజ్ఞ, జె.రోహన్‌శనిలు ప్రతిభ చాటినట్లు చెప్పారు. వీరిని ఆమెతో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

'కోటి సంతకాలతో కుట్రలు తిప్పికొడదాం'

ఇబ్రహీంపట్నం: కోటి సంతకాలతో కూటమి కుట్రలను తిప్పి కొడదామని వైకాపా నేతలు అన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నంలో సోమవారం నిర్వహించారు. ఇందులో వారు మాట్లాడుతూ ప్రైవేటుకు అవకాశం కల్పిస్తే పేదలు, మధ్య తరగతి వారు మెడిసిన్ చదివే రోజులు దూరమవుతాయని చెప్పారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలు కదలిరావాలని పిలుపునిచ్చారు. కె.జయరాజు, వైకాపా బీసీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

పొరుగు సేవల ఉద్యోగులకు భద్రత కల్పించాలి

గొల్లపూడి, న్యూస్‌టుడే : ఆర్టీసీ, ప్రభుత్వ శాఖల్లో పని చేసే పొరుగు సేవల ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. గొల్లపూడిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం ఆర్టీసీలో పని చేసే పొరుగు సేవల ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీలో ఎనిమిది వేల మంది పొరుగు సేవల ఉద్యోగులు పని చేస్తున్నారని, వారికి పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, నాయకులు దామోదరరావు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి, పక్కన నాయకులు

తిరువూరులో ముందుకు సాగని అభివృద్ధి పనులు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు మున్సిపల్ కౌన్సిల్లో కొనసాగుతున్న అవ్యవస్థపై ఆగ్రహం వ్యక్తం చేసిన కౌన్సిలర్లు సోమవారం ఆర్డీవో కార్యాలయాన్ని ఆశ్రయించారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు నెలల తరబడి నిలిచి పోతున్నాయని ఆర్డీవో కె.మాధురికి ఫిర్యాదు చేశారు. కౌన్సిల్ సమావేశాలు సక్రమంగా నిర్వహించక పోవడం, నిధుల విడుదలలో అలసత్వం తదితర సమస్యలు తీవ్రమవుతున్నాయని కౌన్సిలర్లు వాపోయారు. దీనిపై విచారణ నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు.


ఆర్డీవో మాధురికి వినతిపత్రం అందిస్తున్న కౌన్సిలర్లు

గొలుసు దుకాణాల్లో తనిఖీలు

తిరువూరు టౌన్ న్యూస్‌టుడే : తిరువూరు మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న గొలుసు దుకాణాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఎరుకోపాడులో గొలుసు దుకాణాలు నిర్వహిస్తున్న పరిశే. మల్లికార్జునరావు, పార్శపు. రవిలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, వారిపై కేసులు నమోదు చేసినట్లు ఆ శాఖ సీఐ డా.నిక్సన్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అక్రమంగా గొలుసు దుకాణాలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మానసిక వికాసంపై అవగాహన


కుంటముక్కల గురుకులంలోని విద్యార్థులతో కేశవ్, ఝాన్సీ

జి.కొండూరు, న్యూస్‌టుడే : విద్యార్థులు పరీక్షల సమయంలో సమయపాలన పాటిస్తే ఒత్తిడిని జయించవచ్చని వాసవ్య మహిళా మండలి సమన్వయకర్త కేశవ్, కౌన్సిలర్ ఝాన్సీ పేర్కొన్నారు. కుంటముక్కలలోని డా.బీఆర్.అంబేడ్కర్ గురుకులంలో ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థినులకు సోమవారం వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించే లీవ్ లవ్ లాఫ్ ఫౌండేషన్, బిర్లా న్యూ కంపెనీ సంయుక్తంగా చేపట్టిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. ప్రిన్సిపల్ బ్యూలా, కమ్యూనిటీ యానిమేటర్ స్వాతి, సునీత పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన అవకాశాలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : భవిష్యత్తులో ఫార్మసీ రంగంలోని విద్యార్థులకు మెరుగైన ఉద్యోగాలు సాధించే అవకాశం ఉందని నిమ్రా విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టరు డాక్టరు తమ్మినేని నారాయణమూర్తి చెప్పారు. సోమవారం జూపూడి నోవా ఫార్మసీ కళాశాలలో నూతన విద్యార్థులకు ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. నోవా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఈవి నాగబాబు, ఫార్మసీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న నారాయణమూర్తి

దస్తావేజులు పోయినవి

N.T.R. జిల్లా, విజయవాడ రూరల్ మం., నిడమానూరు, డోర్ నెం. 3-143 కాపురస్తులు చనుమోలు పద్మావతి W/o. సూర్యప్రకాశరావు, వయస్సు: 53 సం॥లు అను నాకు N.T.R. జిల్లా మైలవరం గ్రామ R.S.No. 137/1లో చ.గ. 138లు స్థలం, అందలి యావత్తు కట్టడములతో సహా ఆస్తి రిజిష్టర్డు విక్రయ దస్తావేజు నెం: 15929/2022 ద్వారా సంక్రమించినది. దీనికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజు బ్యాగులో ఉంచుకుని నా కుమార్తె వద్దకు వెళ్ళు నిమిత్తం మైలవరంలో బస్సు ఎక్కుచుండగా నా బ్యాగు ఎక్కడో జారిపోయినది. ఆ చుట్టుప్రక్కల ఎంత వెదికిననూ దొరకలేదు. కావున దస్తావేజు నెం. 15929/2022 ఎవరికైననూ దొరికినయెడల ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.

సెల్: 96404 48589

నేడే రామాలయంపై ధ్వజారోహణం

- ఆవిష్కరించనున్న ప్రధాని మోదీ
- 100 టన్నుల పూలతో కోవెల ముస్తాబు
- కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు

అయోధ్య: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రఖ్యాత పుణ్య క్షేత్రం అయోధ్యలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఎంతోకాలంగా వేచి చూస్తున్న రామాలయ ధ్వజారోహణం మంగళవారం జరగనుంది. ఇందుకోసం మందిరం సర్వాంగసుందరంగా ముస్తాబైంది. మంగళవారం జరగనున్న ధర్మ ధ్వజ ప్రతిష్ఠాపన వేడుక కోసం 100 టన్నుల పూలతో రామయ్య సన్నిధిని అలంకరించారు. గర్భగుడిపై కాషాయ వర్ణంలోని ధర్మ ధ్వజాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎగురవేయనున్నారు. ఈ జెండాపై రాముడి తేజస్సును, శౌర్యాన్ని సూచించేలా సూర్యుడు, కోవిదర చెట్టు (మందార, పారిజాత మొక్కలను కశ్యపముని కలపడంతో ఆవిర్భవించిన చెట్టు), ఓం చిహ్నాలు ఉండనున్నాయని ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది.

మొదటి అంతస్తులో రామదర్బార్: రాముడితో పాటు హనుమాన్, సీత సహా రామదర్బార్‌ను మొదటి అంతస్తులో ప్రతిష్ఠించనున్నట్లు శ్రీ రామ జన్మ భూమి ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు నృపేంద్ర మిశ్ర తెలిపారు. దాదాపు 7 వేల మంది ప్రత్యేక అతిథులు ఈ అపూర్వ ఘట్టానికి హాజరవుతారని రామాలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్ తెలిపారు. ఈ వేడుకకు అధికార యంత్రాంగం పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేసింది.



ఏం మాయో మరి!

- బెంగాల్‌లో 44 నియోజకవర్గాల్లో ఓటరుగా నమోదైన ఓ మహిళ


మాయారాణి

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా సవరణపై గగ్గోలు రేకెత్తుతున్న వేళ.. మాయారాణి గోస్వామి అనే మహిళా ఓటరు పేరు 44 నియోజకవర్గాల్లో నమోదైనట్లు బయటపడింది. ఆమెతోపాటు భర్త వివరాలు వేర్వేరు ఇంటి పేర్లతో ఉన్నాయి. పశ్చిమ వర్ధమాన్ జిల్లాలోని పాండవేశ్వర్ అసెంబ్లీ స్థానంలోని 47 పోలింగ్ బూత్‌లో ఇది బయటపడింది. వితంతువైన మాయారాణి గోస్వామి పనిమనిషిగా జీవనం సాగిస్తోంది. మిగతావారిలాగే ఎస్ఐఆర్ కింద తనకు ఇచ్చిన దరఖాస్తులో వివరాలు నింపి, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగా దక్షిణ 24 పరగణాల జిల్లాలోని ఉత్తర దింజాపుర్, గోసభ సహా పలు నియోజకవర్గాల్లో ఓటు ఉన్నట్లు తేలింది. మండల్, రాయ్, నైయా ఇలా వివిధ ఇంటిపేర్లతో ఓట్లు ఉన్నాయి. తనకు ఇన్ని ఓట్లున్నట్టు తెలియదని మాయారాణి అంటున్నారు.

ఆపదలో ఉన్న మహిళలకు హెల్ప్‌లైన్ 14490

ప్రారంభించిన ఎన్‌సీడబ్ల్యూ

దిల్లీ: హింస, వేధింపులు లేదా ఏ రూపంలోనైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళల కోసం జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యూ) 24 గంటలూ అందుబాటులో ఉండే కొత్త హెల్ప్‌లైన్ నంబర్-14490ను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా మహిళలు ఈ నంబర్‌ను సంప్రదించి తాము ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పుకోవచ్చు. వీరికి హెల్ప్‌లైన్ సిబ్బంది సహాయం చేస్తారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించటానికి సాయపడతారు.

దిల్లీలో సగం మందికి ఇంటి నుంచే పని

కాలుష్యం అధికమవడంతో పర్యావరణ శాఖ నిర్ణయం

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 382 స్థాయికి పడిపోయిన నేపథ్యంలో పర్యావరణ శాఖ సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. దిల్లీ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో విధులకు హాజరయ్యే సిబ్బందిలో 50శాతం మంది ఇంటి నుంచే పనిచేయాలని, మిగిలిన సగం మంది మాత్రమే కార్యాలయాలకు రావాలని ఆదేశించింది. పర్యావరణ పరిరక్షణ చట్టం-1986లోని సెక్షన్ 5 నిబంధన ప్రకారం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని తెలిపింది. నగరంలో వాహనాల రాకపోకలను తగ్గించే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. 50శాతం మందికి 'వర్క్ ఫ్రం హోం' నిబంధనను అన్ని సంస్థలూ పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. అత్యవసర విభాగాలైన ఆస్పత్రులు, ప్రజారవాణా, నీటి సరఫరా, పారిశుద్ధ్యం, అగ్నిమాపక కేంద్రాలకు మినహాయింపునిచ్చారు.



లాంతర్ల వెలుగులో చదువుకున్నా

- సీజేఐ అవుతాననుకోలేదు
- జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యలు



ఈనాడు, దిల్లీ: 'బాల్యంలో కిరోసిన్ లాంతర్ల కింద చదువుకునే రోజుల్లో సీజేఐ అవుతానని ఎన్నడూ అనుకోలేదు. న్యాయ వ్యవస్థ అంటే ఏంటి.. అందులో న్యాయమూర్తి భూమిక ఎలా ఉంటుందన్నది ఆ రోజుల్లో తెలిసేది కాదు' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. 'నేను అత్యంత పిన్న వయసులోనే అడ్వకేట్ జనరల్ అయ్యాను. 40 ఏళ్లకే నా పేరును హైకోర్టు న్యాయమూర్తి పదవికి సిఫార్సు చేశారు. అయితే 41 ఏళ్లు నిండాకే ఆ పదవికి ఎంపికయ్యాను. నేను మా కుటుంబాల్లో తొలి తరం న్యాయవాదిని. న్యాయమూర్తుల పిల్లలే న్యాయమూర్తులవుతారన్న విమర్శను నేనూ విన్నాను' అని చెప్పారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సోమవారం బాధ్యతలు చేపట్టిన జస్టిస్ సూర్యకాంత్.. స్వగ్రామంలో తాను చదువుకున్న పాఠశాల, సేద్యం చేసిన పొలాలను ఆంగ్ల టీవీ ఛానల్ 'ఎన్‌డీటీవీ'కి చూపుతూ ఇంటర్వ్యూ ఇచ్చారు. 'న్యాయశాస్త్రం చదివిన తర్వాత సాధన ప్రారంభించినప్పుడు హిస్సార్ జిల్లా కోర్టులో ఓ కేసు వాదించే అవకాశాన్ని సీనియర్ న్యాయవాది ఎంతో నమ్మకంతో నాకు ఇచ్చారు. ఆ కేసు వాదించిన తర్వాత అప్పటి జిల్లా జడ్జి.. సీనియర్ న్యాయవాదులందరినీ పిలిచారు. ఈ యువకుడిని హైకోర్టుకు వెళ్లేలా ప్రేరణ ఇవ్వాలని సూచించారు. దీంతో ఓ సీనియర్ న్యాయవాది నన్ను చండీగఢ్ తీసుకెళ్లి అక్కడ ఓ సీనియర్ న్యాయవాది వద్ద చేర్పించారు. త్వరగా అక్కడ నిలదొక్కుకున్నాను. ఐదారేళ్లలోనే రాష్ట్రం మొత్తం నన్ను ఓ విజయవంతమైన న్యాయవాదిగా గుర్తించింది' అని వివరించారు. ఆంగ్లంలో మాట్లాడే పెద్దలకే సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందన్న దుష్ప్రచారం తగదన్నారు. 'ఏ కేసులో తీర్పు ఇచ్చినా అది ఒకరికి అనుకూలంగా, మరొకరికి వ్యతిరేకంగా ఉంటుంది. వ్యతిరేక తీర్పు పొందినవారు న్యాయమూర్తులపట్ల ఆగ్రహంగా ఉండటం సహజం. అందువల్ల అలాంటి ప్రజలు తమపట్ల ఆగ్రహంగా ఉన్నారని న్యాయమూర్తి భావించాల్సిన అవసరం లేదు' అని స్పష్టం చేశారు.

దిల్లీ విమానాశ్రయంలో తప్పిన పెను ప్రమాదం

టేకాఫ్‌లకు పరిమితమైన రన్‌వేపై ల్యాండైన అఫ్గాన్ విమానం

దిల్లీ: దిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం పెను ప్రమాదం తప్పింది. కాబుల్ నుంచి వస్తున్న అఫ్గానిస్థాన్‌కు చెందిన అరియానా ఎయిర్‌లైన్స్ విమానం పొరపాటున టేకాఫ్‌లకు పరిమితమైన రన్‌వేపై దిగింది. ఆ సమయంలో టేకాఫ్ అవ్వాల్సిన విమానాలేవీ లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) దర్యాప్తు ప్రారంభించింది.

డీజీసీఏ అధికారుల వివరాల ప్రకారం.. అఫ్గాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన అరియానా విమానం 29ఎల్ రన్‌వేపై దిగాల్సి ఉండగా, 29ఆర్ రన్‌వేపై దిగింది. అది కేవలం టేకాఫ్‌లకు ఉద్దేశించింది. విమానాశ్రయానికి నాలుగు నాటికల్ మైళ్ల దూరంలోనే రన్‌వేకు దారి చూపే ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్(ఐఎల్ఎస్) రేడియో సిగ్నల్ పనిచేయకపోవడంతో, తనకు కనిపించిన 29ఆర్ రన్‌వేపై విమానాన్ని ల్యాండ్ చేయాల్సి వచ్చిందని అఫ్గాన్ విమాన పైలట్ తెలిపారు.

నౌకాదళంలోకి ఐఎన్ఎస్ మాహె




ఐఎన్ఎస్ మాహె ప్రారంభోత్సవంలో పాల్గొన్న జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఇతర ఉన్నతాధికారులు

ముంబయి: తీరాన్ని కాపాడటంలో వెన్నుదన్నుగా నిలిచే యుద్ధనౌక ఐఎన్ఎస్ మాహె సోమవారం భారత నౌకాదళంలో ప్రవేశించింది. ఈ శ్రేణిలో ఇది మొట్టమొదటిది. శత్రుదేశ జలాంతర్గాములపై పాశుపతాస్త్రంలా పనిచేస్తుంది. త్రివిధ దళాల సేవల్ని సమన్వయం చేస్తుంది. ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది దీన్ని లాంఛనంగా నౌకాదళానికి అప్పగించారు. ఇలాంటి కార్యక్రమానికి ఆర్మీ చీఫ్ రావడం ఇదే తొలిసారి. నౌక ప్రారంభోత్సవంలో కీలకపాత్ర పోషించిన నౌకాదళ సిబ్బందికి 'సైన్యాధిపతి ప్రశంసాపత్రాల' (సీఓఏఎస్)ను ఆయన అందించారు. ఇది కూడా చాలా అరుదు. సమన్వయంతో పనిచేయడం సైనిక దళాల బలమని, ఆపరేషన్ సిందూర్ దానికి తార్కాణమని ద్వివేది చెప్పారు. కొచ్చిన్ షిప్‌యార్డులో నిర్మించిన ఈ నౌకలో 80 శాతం స్వదేశీ సాంకేతికతనే వినియోగించారు. ఈ నౌక మన దేశ పశ్చిమ తీరంలో కార్యకలాపాలు కొనసాగించనుంది. మలబార్ తీరంలోని చారిత్రక పట్టణం మాహె పేరును ఈ నౌకకు పెట్టారు.

రాజకీయ పార్టీల అజ్ఞాత విరాళాలపై పిటిషన్

- కేంద్రం, ఈసీ, రాజకీయ పక్షాలకు సుప్రీంకోర్టు నోటీసు




దిల్లీ: దేశంలో రాజకీయ పార్టీలకు రూ.2వేల లోపు విరాళాలను అందజేసే వ్యక్తుల పేర్లు, వివరాలు వెల్లడించాల్సిన అవసరం లేకుండా వెసులుబాటు కల్పించిన ఆదాయపు పన్ను చట్టంలోని నిబంధనను సవాల్ చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. దీనిపై స్పందించాలని కోరుతూ కేంద్రం, ఎన్నికల సంఘం(ఈసీ)తో పాటు భాజపా, కాంగ్రెస్ తదితర రాజకీయ పార్టీలకు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం సోమవారం నోటీసులు జారీ చేసింది. కేసు విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. నగదు రూపంలో విరాళాలను స్వీకరించరాదనే షరతును రాజకీయ పార్టీల పేరు నమోదు, ఎన్నికల గుర్తు కేటాయింపు సమయంలోనే విధించేలా ఈసీని ఆదేశించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు.

ఉక్రెయిన్ శాంతికి ఈయూ ప్రత్యామ్నాయ ప్రణాళిక

బ్రసెల్స్: ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 28 పాయింట్ల ప్రణాళికలోని కొన్ని అంశాలను వ్యతిరేకిస్తున్న ఐరోపా యూనియన్ (ఈయూ)... 28 పాయింట్లతో ఓ ప్రత్యామ్నాయ ప్రణాళికను రూపొందించింది. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ కలిసి తయారు చేసిన ఈ జాబితాలోని చాలా అంశాలు ఉక్రెయిన్‌కు అనుకూలంగా ఉన్నాయి. నాటోలో ఉక్రెయిన్ చేరకూడదని ట్రంప్ తన శాంతి ప్రణాళికలో ప్రతిపాదించారు. ఈయూ మాత్రం దీన్ని వ్యతిరేకించింది. సభ్య దేశాల ఇష్టంపైనే ఉక్రెయిన్ చేరిక ఆధారపడి ఉంటుందని తెలిపింది. సైన్యం సంఖ్యను ఆరు లక్షలకే పరిమితం చేయాలన్న ట్రంప్ ప్రతిపాదననూ ఈయూ తిరస్కరించింది. ఈ సంఖ్యను 8 లక్షలకు పెంచాలని తన ప్రణాళికలో డిమాండ్ చేసింది. ఇలా చాలా విషయాల్లో ట్రంప్‌తో ఈయూ విభేదించడం గమనార్హం.

డోజ్ కథ కంచికి

- విభాగాన్ని మూసివేసినట్లు ప్రకటించిన అమెరికా



వాషింగ్టన్: ఎంతో అట్టహాసంగా ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటు చేసిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్) కథ కంచికి చేరింది. ఈ విభాగాన్ని మూసివేసినట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ పనితీరు మెరుగుపరచడం, వృథా ఖర్చులను తగ్గించడం లక్ష్యంగా ఈ ఏడాది జనవరిలో ఏర్పాటైన ఈ విభాగం వివాదాలకూ కేంద్రబిందువుగా నిలిచింది. భారీగా ప్రభుత్వ ఖర్చులు తగ్గించామని డోజ్ చేసిన ప్రకటనలపై విమర్శలు వెల్లువెత్తాయి. ఆ విభాగం తప్పుడు లెక్కలను చూపిస్తోందని ఆరోపణలు వచ్చాయి. డోజ్ పనితీరులో పారదర్శకత లేకపోవడం కూడా చర్చకు వచ్చింది. దీనికి తోడు ట్రంప్, మస్క్ మధ్య రాజకీయంగా తలెత్తిన విభేదాలూ డోజ్ పనితీరుపై తీవ్ర ప్రభావం చూపాయి. తన పదవీకాలం ముగియగానే 'డోజ్' బాధ్యతల నుంచి మస్క్ వైదొలిగారు. తర్వాత ఆ విభాగానికి సారథిగా ఎవరినీ నియమించలేదు. వాస్తవానికి ట్రంప్ ఉత్తర్వుల ప్రకారం, డోజ్ వచ్చే ఏడాది జులై 4 వరకు కొనసాగాలి. కానీ ముందే మూసివేశారు. ఈ విషయాన్ని ఇటీవల సిబ్బంది కార్యాలయం డైరెక్టర్ స్కాట్ కూపర్ తెలిపారు. డోజ్ ఉనికిలో లేదని ఆయన పేర్కొన్నారు.



కీళ్ల ఆరోగ్యానికి అవకాడోలు

అవకాడోల్లో ఓలిక్ ఆమ్లం పుష్కలంగా ఉంటుంది. ఈ ఆరోగ్యకర కొవ్వు కీళ్లను బిగువుగా మార్చే ప్రోస్టాగ్లాండిన్స్ హార్మోన్ల ఉత్పత్తిని తగ్గిస్తుంది. కీళ్ల ఆరోగ్యానికి మేలు చేసే ఈ పండ్లను తరచుగా తీసుకోవడం అలవాటు చేసుకోండి.

– కసెనెన్, మెడికల్ ఎక్స్‌పర్ట్

భారత పాస్‌పోర్టు చెల్లదంటూ

18 గంటల నిర్బంధం

- చైనా విమానాశ్రయంలో అరుణాచల్ ప్రదేశ్ మహిళకు వేధింపులు



దిల్లీ: చైనాలోని షాంఘై విమానాశ్రయంలో ఓ భారత మహిళకు అధికారుల నుంచి వేధింపులు ఎదురయ్యాయి. అరుణాచల్ ప్రదేశ్ చైనాలో భూభాగమంటూ ఆ మహిళ భారత పాస్‌పోర్టును అక్కడి ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించడానికి నిరాకరించారు. ఈ నెల 21న అరుణాచల్ ప్రదేశ్ మహిళ పెమా వాంగ్‌జోమ్ థాంగ్‌డోక్ లండన్ నుంచి జపాన్‌కు వెళ్లే విమానం ఎక్కారు. ట్రాన్సిట్ హాల్ట్‌లో భాగంగా ఆ విమానం చైనాలోని షాంఘైలో దిగింది. ఆ సందర్భంగా చైనా ఇమ్మిగ్రేషన్ అధికారులు తనను తీవ్రంగా వేధించారని పేర్కొంటూ ఆమె 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. 'దాదాపు 18 గంటలు నన్ను షాంఘై విమానాశ్రయంలో అధికారులు నిర్బంధించారు. నా జన్మ స్థలం అరుణాచల్ ప్రదేశ్ కాబట్టి భారత పాస్‌పోర్టు చెల్లదని, ఆ ప్రాంతం చైనాలో భాగమని పేర్కొన్నారు. చైనీస్ పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకోమని హేళన చేశారు. చెల్లుబాటయ్యే వీసా ఉన్నా నా పాస్‌పోర్టును స్వాధీనం చేసుకున్నారు. జపాన్ వెళ్లే విమానం ఎక్కనివ్వలేదు, నన్ను ట్రాన్సిట్ ఏరియాకే పరిమితం చేశారు. మళ్లీ టికెట్లు బుక్ చేసుకోనివ్వలేదు. చివరకు ఆహారం కొనేందుకూ అంగీకరించలేదు. యూకేలోని ఫ్రెండ్ ద్వారా షాంఘైలోని భారత దౌత్య కార్యాలయాన్ని సంప్రదించిన తర్వాతే నాకు సాయమందింది. భారత అధికారుల సహాయంతో బయటపడ్డా. దీనిపై ప్రధాని మోదీకి, ఇతర సీనియర్ అధికారులకు లేఖ రాశా. భారత సార్వభౌమత్వాన్ని, అరుణాచల్ ప్రదేశ్ ప్రజలను చైనా అవమానించింది' అని పెమా వాంగ్‌జోమ్ పేర్కొన్నారు. ఈ ఘటనపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చైనాకు తన గట్టి నిరసనను తెలియజేసింది. షాంఘైలోని భారత కాన్సులేట్ ఆమెకు అండగా నిలిచిందని విదేశాంగశాఖ సోమవారం వెల్లడించింది.

కొత్త పెన్షన్ ధ్రువీకరణ నిబంధన చట్ట వ్యతిరేకం

- సుప్రీంలో మాజీ ఐపీఎస్‌ల పిటిషన్
- సమాధానం ఇవ్వాలని ఆయా శాఖలకు ఆదేశం

దిల్లీ: ఆర్థిక చట్టం-2025లో పేర్కొన్న కొత్త పెన్షన్ ధ్రువీకరణ నిబంధనను సవాలు చేస్తూ పదవీ విరమణ చేసిన ఐపీఎస్ అధికారుల ఫోరం.. సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ నిబంధన చట్టబద్ధం కాదని స్పష్టం చేసింది. దీనిపై స్పందించిన సుప్రీం కోర్టు.. సోమవారం ఆర్థిక, హోం, న్యాయశాఖలతో సహా వివిధ కేంద్ర ప్రభుత్వశాఖల నుంచి స్పందన కోరింది. ఒకే తరగతికి చెందిన పెన్షనర్లను కేవలం వారు పదవీ విరమణ తేదీ ప్రాతిపదికన వేరుగా పరిగణించడం సరికాదని ఈ ఫోరం కోర్టుకు విన్నవించింది. ఫోరం సమర్పించిన పిటిషన్‌ను జస్టిస్ కె.వి. విశ్వనాథన్, జస్టిస్ ప్రసన్న బి వరాలేలతో కూడిన ధర్మాసనం విచారణకు చేపట్టింది. ఆర్థిక చట్టంలో చేసిన మార్పుల కారణంగా ఒకే తరగతికి చెందిన అధికారులకు భిన్న నిబంధనలు వర్తిస్తున్నాయని ఫోరం పేర్కొంది. కోర్టు వెలువరించిన అనేక తీర్పులకు ఇది విరుద్ధమని స్పష్టం చేసింది.

ఆగ్నేయాసియాలో వరదలు

- వియత్నాం, థాయ్‌లాండ్‌లలో విరిగిన కొండచరియలు

హనోయ్: ఆగ్నేయాసియా దేశాలైన వియత్నాం, థాయ్‌లాండ్‌లను వరదలు ముంచెత్తాయి. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. సోమవారం వియత్నాంలో ఒకరు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. దీంతో వరదల కారణంగా ఇప్పటివరకు అక్కడ మృతి చెందిన వారి సంఖ్య 91కి చేరింది. మరో 11 మంది ఆచూకీ తెలియరాలేదు. థాయ్‌లాండ్‌లో అయిదుగురు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. దాదాపు 20 లక్షల మంది నిర్వాసితులయ్యారని తెలిపారు.


వియత్నాంలోని డక్ లక్ ప్రాంతంలో వరద ఉద్ధృతికి ఓ ఛార్జింగ్ స్టేషన్‌లో ధ్వంసమైన వాహనాలు

బ్రిటన్‌లో పర్యటనకు వీసా అవసరంలేని దేశాలకు కొత్త నిబంధన

లండన్: బ్రిటన్‌లో పర్యటించేందుకు వీసా అవసరంలేని దేశాలకు చెందిన వారికి బ్రిటిష్ ప్రభుత్వం కొత్త నిబంధనను తీసుకొచ్చింది. ఇకపై బ్రిటన్ సందర్శించడానికి వారు ఎలక్ట్రానిక్ ట్రావెల్ ఆథరైజేషన్ (ఈటీఏ) పేరుతో ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుంది. వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 25 నుంచి అమల్లోకి వచ్చే ఈ నిబంధన ప్రకారం బ్రిటన్‌లో పర్యటించడానికి వీసా అవసరం లేని 85 దేశాలకు చెందినవారు ఆన్‌లైన్ ద్వారా ఈటీఏ పొందాల్సి ఉంటుంది. అమెరికా, కెనడా, ఫ్రాన్స్ తదితర 85 దేశాలకు చెందిన పౌరులకు ఈ నియమం వర్తిస్తుంది. బ్రిటన్‌లో పర్యటించడానికి భారతీయులు వీసా పొందాల్సి ఉన్నందున ఈ నిబంధన వారికి వర్తించదు.

కెనడాలో భారత సంతతి మోస్ట్ వాంటెడ్ అరెస్టు

ఒట్టావా: కెనడాలో 25 మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్న భారత సంతతికి చెందిన వ్యక్తిని అరెస్టు చేసినట్లుగా టొరంటో పోలీసులు తెలిపారు. అతని వద్ద తుపాకీలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిని నికోల్ సింగ్(24)గా గుర్తించారు. పెరోల్ ఉల్లంఘనపై కెనడా వ్యాప్తంగా వారెంట్ ఉండటంతో నికోల్ సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సింగ్ గతంలో తుపాకీతో కాల్పులు జరపడం, ఆయుధాలతో దోపిడీలు చేయడం వంటి నేరాలకు పాల్పడటంతో ఐదేళ్లకు పైగా జైలు శిక్ష పడింది. పెరోల్‌పై బయటకొచ్చి అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దీంతో సింగ్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హిడ్మాకు మద్దతుపై ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం అభ్యంతరం

రాయ్‌పుర్: ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయిన మావోయిస్టు మడ్వీ హిడ్మాకు మద్దతుగా ఆదివారం దిల్లీలో పర్యావరణ ఆందోళనకారులు నినాదాలు చేయడాన్ని ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ తప్పుబట్టారు. నక్సలిజం వల్ల అభివృద్ధికి నోచుకోని బస్తర్ విషయంలో ప్రజలను తప్పుదారి పట్టించలేరన్నారు. హిడ్మాకు అనుకూలంగా నినాదాలు చేస్తూ పోలీసులపై పెప్పర్ స్ప్రే ప్రయోగించిన ఆందోళనకారులను అరెస్టు చేయడాన్ని దిల్లీ మంత్రి కపిల్ మిశ్ర సమర్థించారు.



సన్నిహిత బంధం చెడినప్పుడు అత్యాచార నేరారోపణ తగదు

- నిందితుడిపై ఎఫ్ఐఆర్ కొట్టివేస్తూ సుప్రీంకోర్టు తీర్పు

దిల్లీ: అప్పటి వరకూ అత్యంత సన్నిహితంగా మెలిగిన వ్యక్తితో విభేదాలు తలెత్తగానే అత్యాచార ఆరోపణలు చేయడం, నిందితుడిగా పేర్కొంటూ శిక్షించాలనే ధోరణి అధికమవుతోందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఇటువంటి కేసులతో నేర న్యాయ వ్యవస్థ యంత్రాంగాన్ని దుర్వినియోగపరుస్తున్నారని, ఇది ఖండనార్హమని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం పేర్కొంది. వ్యక్తుల మధ్య సంబంధాలు దెబ్బతిన్నప్పుడు ఈ తరహా ఆరోపణలను ఆపాదించడం అత్యాచార నేరాల తీవ్రతను పలుచన చేస్తోందని తెలిపింది. నిందితుడికి చెరిగిపోని కళంకంతో పాటు అతనికి తీవ్ర అన్యాయం జరుగుతుందని అభిప్రాయపడింది. 'అత్యాచార నేరం చాలా తీవ్రమైనది. బలవంతపెట్టడం, బెదిరించి, దాడిచేసి లైంగిక హింసకు పాల్పడినప్పుడు ఈ నేరాన్ని మోపాలి' అని ధర్మాసనం తెలిపింది. కొన్నాళ్లు కలిసిమెలిసి తిరిగి, ఆ క్రమంలో శారీరకంగా సన్నిహితమై, ఆ తర్వాత విభేదాలు రాగానే...గతంలో ఎప్పుడో పరస్పర సమ్మతితో జరిగిన లైంగిక చర్యను అత్యాచారంగా పరిగణించాలనడం సరికాదని స్పష్టం చేసింది. అత్యాచార నేరారోపణతో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను, అభియోగాలను రద్దు చేయాలన్న పిటిషన్‌ను బాంబే హైకోర్టు తోసిపుచ్చడంతో మహారాష్ట్రకు చెందిన వ్యక్తి సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఫిర్యాదుదారు, నిందితుడి మధ్య చాలా కాలం సన్నిహితంగా కొనసాగిన సంబంధాలను హైకోర్టు పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆక్షేపించింది. నిందితుడిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను, అభియోగాలను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

మెదడు ఆరోగ్య పరిరక్షణకు తగినంత సమయాన్ని కేటాయించుకోవాలి

- లేకపోతే డిమెన్షియా ముప్పు

జ్ఞాన నేత్రం

దిల్లీ: మానసిక ఆరోగ్య పరిరక్షణకు తగినంత సమయం కేటాయించలేకపోవడమనేది మెదడు సామర్థ్యాన్ని దెబ్బతీసే డిమెన్షియాకు ఆస్కారం కలిగిస్తుందని అధ్యయనంలో తేలింది. రోజూ నిద్రకు కనీసం ఏడు గంటలు, భౌతిక, సామాజిక కార్యకలాపాలకు చెరో గంట, ప్రతి పూటా భోజనం కోసం అరగంట చొప్పున(మొత్తం 10 గంటలు)కేటాయించడం మానవులకు కనీస అవసరమని, కానీ మెదడు ఆరోగ్య పరిరక్షణకు ఈ షెడ్యూల్ సరిపోదని అధ్యయనకర్తలు పేర్కొన్నారు. మెదడు ఆరోగ్యాన్ని పెంపొందించే కార్యకలాపాల కోసం మరింత ఎక్కువ సమయం అవసరమన్నారు. అంత సమయం కేటాయించలేకపోవడం వల్ల వయసు పెరిగే కొద్దీ చిత్త వైకల్యాలకు దారి తీస్తుందని ఆస్ట్రేలియాకు చెందిన సిడ్నీ న్యూ సౌత్‌వేల్స్ విశ్వవిద్యాలయం, ఐర్లాండ్‌లోని ట్రినిటీ కాలేజ్‌లకు చెందిన పరిశోధకుల బృందం 'ద లాన్సెట్ హెల్దీ లాంజివిటీ' జర్నల్ వ్యాసంలో వివరించింది. క్రమం లేని పనిగంటలు, అదుపులేకుండా మొబైల్, కంప్యూటర్ వంటి డిజిటల్ పరికరాల వాడకం, సామాజికార్థిక అనుకూలతలు లేకపోవడం వంటి పరిస్థితులు సమయాభావాన్ని సృష్టించి కొన్ని వర్గాల్లో డిమెన్షియా వంటి మనో వైకల్యాలకు దారితీస్తాయని అధ్యయనకర్తలు పేర్కొన్నారు. అవగాహనా రాహిత్యం, రక్తపోటు, మధుమేహం వంటి 12 కారణాలు ప్రజల్లో డిమెన్షియాకు దారితీస్తున్నాయని 2024లో లాన్సెట్ కమిషన్ నివేదిక పేర్కొంది.

దిల్లీ పోలీసులపై పెప్పర్ స్ప్రే

- 22 మంది నిరసనకారుల అరెస్టు

దిల్లీ: కాలుష్యం పెరిగిపోతోందంటూ ఇండియా గేట్ వద్ద నిరసనలకు దిగడంతో పాటు రహదారిని దిగ్బంధించిన 22 మంది ఆందోళనకారులను దిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. విధులకు ఆటంకం కలిగించడంతో పాటు తమపై పెప్పర్ స్ప్రేతో దాడి దిగారంటూ పోలీసులు రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లను నిందితులపై నమోదు చేశారు. సంసద్ మార్గ్ పోలీస్‌స్టేషన్, కర్తవ్యపథ్ పోలీస్ స్టేషన్లలో ఈ కేసులను పెట్టారు. నిరసనలను ముందస్తు అనుమతితో జంతర్‌మంతర్‌లోనే చేయాల్సి ఉన్నా ఆదివారం నిరసనకారులు ఇండియా గేట్ వద్ద ఆకస్మికంగా ధర్నా చేపట్టి అడ్డుకున్న పోలీసులతో ఘర్షణకు దిగారని అధికారి ఒకరు తెలిపారు. మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. ఘర్షణ సమయంలో గాయపడిన పోలీసులకు ఆస్పత్రిలో చికిత్సనందిస్తున్నట్లు తెలిపారు.

దిల్లీలో 'ఆపరేషన్ క్రిస్టల్ ఫోర్ట్రెస్'

రూ.262 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

దిల్లీ: నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) అధికారులు, దిల్లీ పోలీసులు చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో దిల్లీలో భారీ మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. 'ఆపరేషన్ క్రిస్టల్ ఫోర్ట్రెస్' పేరుతో చేపట్టిన తనిఖీల్లో దిల్లీలోని ఛత్రపుర్‌లో ఉన్న ఓ ఇంట్లో రూ.262 కోట్ల విలువైన 329 కిలోల మెథాంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌సీబీ అధికారులు వెల్లడించారు. డ్రగ్స్ అక్రమ రవాణాకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. దిల్లీ సరిహద్దుల్లో విస్తరిస్తున్న అధునాతన మాదకద్రవ్యాల సిండికేట్‌ను నిర్మూలించడానికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఆపరేషన్ క్రిస్టల్ ఫోర్ట్రెస్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. నెలల తరబడి నిఘా పెట్టి డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టు చేశామన్నారు. ఈ అక్రమ రవాణా ముఠాకు విదేశీ ఆధారిత కింగ్‌పిన్‌తో సంబంధాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. విదేశీ హ్యాండ్లర్ల సూచనలతో నిందితులు డ్రగ్స్‌ను అక్రమ రవాణా చేస్తున్నారని.. వారితో సంప్రదింపుల కోసం ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ యాప్‌లను ఉపయోగిస్తున్నారన్నారు. నాగాలాండ్‌కు చెందిన ఓ మహిళ డ్రగ్స్ రవాణాలో వీరికి సహకరిస్తున్నట్లు తేలిందన్నారు. డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టు చేసినందుకు ఎన్‌సీబీ అధికారులను, దిల్లీ పోలీసులను కేంద్ర హోం మంత్రి అమిత్ షా అభినందించారు.



దిల్లీలో నిషేధిత ట్రెమడాల్ మాత్రల పట్టివేత

వాటి విలువ రూ.32 లక్షలు ఉంటుందని అంచనా

దిల్లీ: అక్రమంగా సరఫరా చేస్తోన్న 54వేల నిషేధిత ట్రెమడాల్ మాత్రలను సోమవారం దిల్లీలో సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. వీటి విలువ రూ.32లక్షల పైనే ఉంటుందని వివరించారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న మహమ్మద్ అబిద్(50) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. జావేద్ ఖాన్(45) అనే వ్యక్తితో కలిసి పని చేస్తున్నట్లు విచారణలో అబిద్ వెల్లడించినట్లు చెప్పారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ముగ్గురిని అరెస్టు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అరెస్టయిన ఈ అయిదుగురికి అంతర్జాతీయ ముఠాలతో సంబంధం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

వసుంధర

vasundhara@eenadu.in

ఆమె పాట వైరల్!

ఆమె అక్షరాలు నేర్వలేదు. అయితేనేం జనాల్ని చదివారు. జానపదాల్ని ఒంటబట్టించుకున్నారు. వాటితోనే తన కంటూ గుర్తింపు తెచ్చుకున్నారు చుంచు నాగవ్వ. తాజాగా గాయని మంగ్లీతో కలిసి ఆమె పాడిన పాట లక్షలమందిని ఆకర్షించడమే కాదు... వైరల్ అవుతోంది కూడా!


నాగవ్వ

జగిత్యాల జిల్లాలోని గుల్లకోట నాగవ్వది. తండ్రి ఆరెల్లి నర్సయ్య యక్షగాన కళాకారుడు. దాంతో నాగవ్వకీ జానపదాల పట్ల ఆసక్తి ఏర్పడింది. పల్లె పదాలతో సందర్భానుసారంగా పాటలను కట్టి, అలవోకగా పాడటం ఆమె ప్రత్యేకత. అది గమనించిన ఆమె చిన్నకొడుకు 'సీఎంఎస్ ఛానల్' అనే యూట్యూబ్ ఛానల్‌లో ఆమెతో పాటలు పాడించారు. అలా ఆమె పాడిన 'మోహనలాలీ', 'తిరుపతిరెడ్డి' వంటి పాటలు ఆదరణ పొందడమే కాదు, ఆమెకి గుర్తింపునీ తెచ్చిపెట్టాయి. దీంతో సినీ గేయ రచయిత కాసర్ల శ్యామ్ నుంచి పిలుపు రావడమే కాదు, పలు టీవీ ఛానళ్లలోని ప్రత్యేక కార్యక్రమాల్లోనూ నాగవ్వకి అవకాశమొచ్చింది. ప్రముఖ గాయని మంగ్లీ బతుకమ్మ పాట 'కొప్పులోని పువ్వమ్మా.. బాయి కాడి బతుకమ్మ'కి సాయపడ్డారు నాగవ్వ. వెంకటేశ్, సల్మాన్‌ఖాన్ నటించిన 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్' అనే చిత్రంలో బతుకమ్మ పాట పాడారు. ఇప్పటివరకూ 30కిపైగా ప్రైవేటు ఆల్బమ్‌ల్లో పాటలు పాడారామె. తాజాగా మంగ్లీతో కలిసి ఆమె పాడిన 'బాయిలోన బల్లి పలికె' గీతం వైరలైంది. ఇది విడుదలైన రెండు రోజుల్లోనే యూట్యూబ్‌లో 42 లక్షల వీక్షణలు అందుకుంది. 'గ్రామీణ ప్రాంతానికి చెందిన నేను... ఇలా అందరి గుర్తింపూ పొందడం గర్వంగా ఉంది' అంటారు నాగవ్వ.

– వైద్య వెంకటేశ్వర్లు, వెల్గటూరు



చూపులేని ఆ అమ్మాయిలంటే సమాజానికీ చిన్న చూపే! చిన్నప్పట్నుంచీ వెక్కిరింతల్నీ, హేళనల్నీ ఎదుర్కొన్నారు. కానీ, లోపం కళ్లకే తప్ప, తమ సామర్థ్యాలకు కాదని నిరూపించారీ అమ్మాయిలు. సంకల్ప బలంతో వైకల్యాన్నే కాదు, ప్రపంచాన్నీ జయించారు. క్రికెట్‌లో ఏడు మ్యాచ్‌లకు ఏడింటినీ గెలిచి కప్పు పట్టేశారు. కెప్టెన్ దీపికతోపాటు వీళ్లలో ప్రతి ఒక్కరి జీవితం గెలుపు బాటలో ఒక కరదీపిక.

వీళ్ల గెలుపు... ఓ దిక్సూచి!

అసలే పేదరికం, ఆపైన అంధత్వమూ తోడైన అమ్మాయిలు. వాళ్ల జీవితాల్లో చీకట్లు కమ్ముకున్నాయన్న భావనే అందరిలోనూ. గ్రామీణ, వ్యవసాయ నేపథ్యాలు కావడంతో ఆటలకే కాదు, చదువుకూ అవకాశాలు అంతంతమాత్రమే. అయినా వాళ్ల ప్రయాణం అక్కడితో ఆగిపోకుండా చూసుకున్నారు. నేపథ్యాలూ, భాషలూ భిన్నమైనా 'టీమ్ ఇండియా'గా జట్టు కట్టారు. తొలి అంధ మహిళల టీ20 ప్రపంచకప్‌ని గెల్చుకున్నారు.

దీపికకు చిన్నప్పుడే ఒక కంటికి చూపు పోయింది. 'అసలు పాప భవిష్యత్తు ఏమవుతుందో' అనుకునేవారు వ్యవసాయ కూలీలైన ఆమె తల్లిదండ్రులు. మైసూరులోని అంధుల పాఠశాలలో చేరాక ఆమెకు క్రికెట్ గురించి తెలిసింది. మొదట్లో అంతగా ఆసక్తి చూపకపోయినా, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఆటలో అడుగుపెట్టి ఆపై క్రికెట్టే జీవితంగా సాగింది. వైస్ కెప్టెన్ గంగది మహారాష్ట్ర. ఈమెదీ వ్యవసాయ కుటుంబమే. తొమ్మిది మంది తోబుట్టువులు. సరదాగా మొదలైన ఆమె క్రికెట్ ప్రస్థానం... కోచ్‌ల ప్రోత్సాహంతో ఇక్కడ వరకూ వచ్చింది. జమ్మూకశ్మీర్‌కు చెందిన అనేఖా దేవి... పాక్షిక అంధత్వంతో జన్మించింది. ఈమె మావయ్యకి కూడా కంటిచూపు సమస్య ఉంది. ఆయన ప్రోత్సాహంతో దిల్లీ వచ్చి శిక్షణ తీసుకుంది. క్రికెట్ మొదలుపెట్టిన రెండేళ్లకే జాతీయ జట్టులో స్థానం సంపాదించింది.

ఉద్యోగం వదిలివచ్చి...

ఫైనల్లో 44 పరుగులు చేసిన ఫులా శరేన్ కథ కూడా ఇలాంటిదే. ఈమెది ఒడిశా... గిరిజన కుటుంబం. అయిదేళ్ల వయసులో ఎడమ కంటి చూపునీ, కొన్నాళ్లకు తల్లినీ కోల్పోయింది. రెసిడెన్షియల్ స్కూల్లో ఉన్నప్పుడు క్రికెట్‌ను మొదలుపెట్టింది. 'నేను దేశానికే కాదు, బాలేశ్వర్ జిల్లాలోని మా గ్రామానికీ ప్రాతినిధ్యం వహిస్తున్నా. ఇదెంతో గర్వంగా అనిపిస్తుంది' అంటుంది ఫులా. సునీతా సరాతే కథ దీనికి పూర్తి భిన్నం. ఈమె కాలేజీ చదువు పూర్తిచేసి, వివిధ రకాల ఉద్యోగాలు చేశాక, ఓ స్నేహితురాలి సూచనతో అంధుల క్రికెట్‌లోకి అడుగుపెట్టింది. జట్టులో ఈమే కీలకమైన ఫీల్డర్. భారత జట్టులో అంతా 16-28 ఏళ్ల మధ్య వయసు వాళ్లే. అందరిలోకీ చిన్నమ్మాయి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కరుణ కుమారి. పదో తరగతి చదువుతోంది. మిగిలినవాళ్ల కథలూ, నేపథ్యాలూ ఇలాంటివే. అయితేనేం మొదటి ప్రయత్నంలోనే ప్రపంచకప్ సాధించారు. ఈ విజయంతో వీళ్లు పంపే సందేశం దిల్లీ నుంచి గల్లీ వరకూ చేరుతుంది. వైకల్యం ఉన్న పిల్లలపై పెట్టుబడి వృథా అనే భావన తల్లిదండ్రుల్లో తొలగిపోతుంది.

మాకు భయం లేదు!



మాపైన ఎలాంటి ఒత్తిడి లేదు. మా జట్టులో ఉన్నది బ్యాటర్లు, బౌలర్లు, ఫీల్డర్లు కాదు. అందరూ ఆల్‌రౌండర్లే. మాది ఎంతో బలమైన జట్టు. మాతో ఆడటానికి ప్రత్యర్థులూ భయపడతారు. ఈ ప్రపంచకప్ భారత ప్రజలకు అంకితం. ఇది మా జీవితాల్లో అతిపెద్ద విజయం. ఈ నెలలోనే భారత మహిళలు ఒక ప్రపంచకప్ తెచ్చారు. ఇది రెండోది. దీంతో ప్రజల ఆనందం రెట్టింపవుతుందని భావిస్తున్నా.

- దీపిక, కెప్టెన్

మార్పు మొదలైంది



భారత్‌లో అంధుల క్రికెట్ అసోసియేషన్ 2011లో మొదలైనా, మహిళలు భాగమైంది 2019 నుంచి. అమ్మాయిల్ని ఆటలో కొనసాగించడానికి... కుటుంబాలు, టీచర్లని ఒప్పించడం కష్టమయ్యేది. ఆటలోని నిబంధనల్ని తెలుసుకోవడానికి ఎంతో సమయం పట్టింది. బంతి వేయడం, కొట్టడంతోపాటు మైదానంలో వాళ్ల కదలికలకు సంబంధించి ఎంతో శిక్షణ ఇస్తాం. శారీరకంగా, మానసికంగా సిద్ధం కావాలి. సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన వీళ్లు ఆటలో కొనసాగడం ఒక ఎత్తైతే... విజయం సాధించడం మరో ఎత్తు. ఇది ఆ కుటుంబాలకు ఎంతో ఉపశమనం, ఆనందం. క్రీడల పట్ల అమ్మాయిల కుటుంబాల్లో ఇప్పుడిప్పుడే మార్పు వస్తోంది.

– శిఖా శెట్టి, టీమ్ మేనేజర్

నోటీసులు తీసుకోవడం లేదు ఎలా?

నేను ఉద్యోగినిని. మా పెళ్లై 16ఏళ్లు. ఇద్దరు పిల్లలు. మా వారికున్న అనుమానంతో మొదట్నుంచీ మా ఇద్దరి మధ్య సఖ్యత లేదు. ఆ బాధలు భరించలేక రెండేళ్లుగా పిల్లల్ని తీసుకుని విడిగా ఉంటున్నా. అయినా అతనిలో ఎలాంటి మార్పూ లేదు. అదే అనుమానంతో వాకబు చేయిస్తున్నాడు. విసిగిపోయి, విడాకుల నోటీసులు పంపించా. అయితే అతనికి సొంతిల్లు లేదు. ఉద్యోగం చేసే ఆఫీసు అడ్రస్‌కి పంపించా. నోటీసులు వెళుతున్నాయి కానీ, తను తీసుకోవడం లేదు. దాంతో అవి వాపసు వచ్చేస్తున్నాయి. నేనేం చేయాలి? – ఓ సోదరి

మీరు పంపినవి లీగల్ నోటీసులా? కోర్టు నోటీసులా తెలియలేదు. లీగల్ నోటీసులు అయితే... ఏ కారణంతో తిప్పి పంపించారో తెలుసుకోండి. దాన్ని బట్టి కావాలనే తీసుకోవడం లేదంటూ కోర్టులో కేసు వేయొచ్చు. వీటితో పాటు వెనక్కి తిరిగి వచ్చిన కవర్లనూ జత చేయండి. ఒకవేళ మీ భర్త ఆ చిరునామాలో లేడు అని ఎండార్స్‌మెంట్ వస్తే నోటీసుని ఈమెయిల్ ద్వారా పంపించొచ్చు. కొరియర్‌నీ వాడుకోవచ్చు. అప్పుడు నిరాకరించినా కూడా తీసుకున్నట్లుగానే పరిగణిస్తారు. ఒకవేళ మీ భర్త కోర్టు నోటీసుల్ని కూడా తీసుకోకపోతే పర్సనల్‌గా పంపించడానికి న్యాయస్థానం అనుమతి తీసుకుని నోటీసు కాపీని బెయిలిఫ్(నోటీసులు అందించడానికి కోర్టు నియమించిన వ్యక్తి)ద్వారా పంపించవచ్చు. అయినా సరే తిరస్కరిస్తే ఆ విషయమే దాని మీద రాసి కోర్టు ఫైల్‌లో పెడతారు. దీంతో న్యాయస్థానం అతడికి ఆ నోటీసులు అందినట్లుగా పరిగణించి ప్రతివాది లేనట్లు భావిస్తుంది. ఈ కేసులో అతడిని పక్కనపెట్టి మీరు అడిగిన ఉపశమనం ఇస్తుంది. ఓ మంచి లాయర్‌ని సంప్రదించండి. మీరు కోరుకున్న న్యాయం దక్కుతుంది.

డియర్ వసుంధర


జి. వరలక్ష్మి, న్యాయవాది

వెచ్చవెచ్చగా... అందంగా!

శీతకాలంలో చలికి నీళ్లలో చెయ్యి పెట్టడానికే బద్ధకిస్తాం. అలాంటిది స్క్రబింగ్, చల్లచల్లగా ముఖానికి మాస్కులు వేయడం లాంటివేం చేస్తాం? అలాగని ఊరుకుంటే చర్మం నిర్జీవమైపోదూ? అందుకే వెచ్చగా వీటిని ప్రయత్నించండి.



- ఒకటిన్నర టేబుల్ స్పూన్ల ఓట్‌మీల్‌కి మూడు స్పూన్ల వేడి పాలు, స్పూను తేనె కలిపి మెత్తని పేస్టులా చేయండి. ఆపై ముఖానికి పూతలా వేయండి. పావుగంట అయ్యాక గోరువెచ్చని నీటితో చేతిని తడి చేసుకుంటూ ముఖాన్ని మృదువుగా రుద్దండి. రెండు నిమిషాలు అలా చేశాక కడిగేస్తే సరి. ఈ మాస్కు మృతకణాలను తొలగించడమే కాదు, చర్మానికి తేమనీ అందిస్తుంది.
- రెండు స్పూన్ల గోరువెచ్చని పాలలో పావు స్పూను పసుపు, టేబుల్ స్పూను తేనె కలిపి ముఖానికి పట్టించండి. పావుగంటయ్యాక గోరువెచ్చని నీటితో కడిగేస్తే సరి. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఎరుపుదనానికి మందు. ముఖం ఛాయ పెరగడంలోనూ సాయపడుతుంది, పాలు, తేనె తేమనీ అందిస్తాయి.
- మూడు చిన్న క్యారెట్ ముక్కలను తీసుకొని ఉడికించండి. వాటిల్లో స్పూను తేనె వేసి, మెత్తగా మెదపాలి. ఈ మిశ్రమాన్ని 20 నిమిషాలపాటు ముఖానికి పట్టించి, ఆపై కడిగేయాలి. చలికాలం ముఖం నిర్జీవంగా మారుతుంది. తిరిగి మెరుపులీనేలా ఈ మాస్కు పనిచేస్తుంది.

ఈ వెచ్చని మాస్కులు వేసేటప్పుడు వేడిని సరిచూసుకోండి. అసలే ముఖ చర్మం పలుచగా ఉంటుంది. కాబట్టి, గోరువెచ్చగా ఉన్న దాన్నే వేయాలి. అలాగే ముఖం కడిగాక మాయిశ్చరైజర్ రాయడమూ తప్పనిసరి.

శభాష్... నర్సమ్మా!

పేద కుటుంబం. భర్త చనిపోయాడు, చేతిలో చంటిబిడ్డ. అయినా బిడ్డని ఉన్నతంగా తీర్చిదిద్దారు... నర్సమ్మ! ఆమె కష్టం తన కుటుంబాన్నే బాగు చేయలేదు... పల్లెల్లోని వారి జీవితాల్నీ మెరుగుపరుస్తోంది. కాబట్టే, ప్రభుత్వ గుర్తింపూ పొందారామె. అంతలా ఏం చేశారంటే...





తెల్లవారడం ఆలస్యం... భుజానికి బ్యాగును తగిలించుకుని బయల్దేరతారు నర్సమ్మ. దట్టమైన అడవుల్లో, పారే నీటిని దాటుతూ చీరలోనే మైళ్ల దూరం నడుస్తారు. ఈమె ఆశా కార్యకర్త. తన సామగ్రితో పల్లెలకు వెళతారు. అక్కడి భార్యాభర్తలను కూర్చోబెట్టి అవగాహన కల్పిస్తారు. ఇంతకీ దేనిమీదో తెలుసా... కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోమని. అది కూడా మగవాళ్లని! బాగా చదువుకున్నవాళ్లే వెసక్టమీకి ఒప్పుకోరు. వంధత్వం వస్తుందని భావిస్తుంటారు. మారుమూల పల్లెల వాళ్లు ఊరుకుంటారా? అయినా ఆమె మాత్రం ప్రశాంతంగా, ఓపిగ్గా దాని గురించి వివరిస్తారు. 'ఇక్కడ కుటుంబ నియంత్రణే తెలియదు. పేద కుటుంబాలు, పెరిగే పిల్లల సంఖ్యతో మరింత పేదరికంలోకి కూరుకుపోతుంటారు. పోనీ అవగాహన ఉన్నా ఆడవాళ్లకే చేయిస్తుంటారు. తరవాత సరిగా విశ్రాంతి దొరక్క, వాళ్లేమో బలహీనమవుతుంటారు. అదే మగవాళ్లది సులువైన ప్రక్రియ, సురక్షితం కూడా. ఇదే భార్యాభర్తలిద్దరికీ అర్థమయ్యేలా చెబుతుంటా' అంటారు నర్సమ్మ.


నర్సమ్మ

ఒడిశా, కొరాపుట్ జిల్లాలోని ఘాటీ మటీ అనే మారుమూల ప్రాంతం ఆమెది. బిడ్డకి నెలల వయసు ఉన్నప్పుడే భర్తని కోల్పోయారు. ఆదాయం లేదు, తనదీ అటవీ గ్రామమే... ఉపాధికీ అవకాశం లేదు. దీంతో ఆశా కార్యకర్తగా చేరారు నర్సమ్మ. ఇలాగైతే తనలాంటి వారికి ఆరోగ్య రక్షను కల్పించడంతోపాటు ప్రభుత్వ పథకాల గురించీ అవగాహన కల్పించొచ్చు అనుకున్నారు. తన విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ... కొడుకుని చదివించారు. ప్రస్తుతం అతను అమెరికాలో ఉన్నత చదువులు చదువుతున్నాడు. 'ఎవరో వచ్చి సాయపడరు, నాకోసం, నా బిడ్డకోసం నేనే పోరాటం చేయాలి అనుకున్నా. అయితే నా పని ఇతరులకీ సాయపడటం ఆనందంగా ఉంది' అనే నర్సమ్మ కొరాపుట్ గిరిజన గ్రామాల్లో వైద్య సేవలు అందించడమే కాదు, 25 మంది వెసక్టమీ చేయించుకునేలా ప్రోత్సహించారు. 'ప్రభుత్వం మగవాళ్లనే ఆపరేషన్ చేయించుకునేలా ప్రోత్సహిస్తోంది. దానికి వాళ్లకి రూ.2వేలు కూడా ఇస్తోంది. వాళ్లని ఒప్పించినందుకు నాకూ రూ.450 వస్తాయి. అయితే ఇక్కడ నేను డబ్బుల కోసం చేయను. దీన్నో బాధ్యతగా నిర్వరిస్తా'నసే నర్సమ్మ తాజాగా ప్రభుత్వం నుంచి పురస్కారాన్ని పొందారు. 'మామూలు వాళ్ల కంటే గిరిజనులతో మాట్లాడటం, వాళ్లని ఒప్పించడమే కష్టం. అయినా ఓపికగా, తనపై నమ్మకం కలిగేలా చేసుకుని మరీ నర్సమ్మ వాళ్లని వెసక్టమీ దిశగా ప్రోత్సహిస్తున్నార'న్న కితాబులూ అందుకున్నారామె. ఆమె ప్రయాణం స్ఫూర్తిదాయకమేగా మరి!

ఈటీవీ భారత్ - యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

అసంపూర్ణంగా అనిపిస్తోందా..!



మనల్ని మనం కోల్పోతుండటమో, చేస్తున్న పనుల్లో ఇంకా ఏదో చేయాలి అన్న తపనో, అన్నింటిలో పరిపూర్ణత కోరుకోవడమో తెలియదు కానీ... మహిళలూ, అమ్మాయిల్లో అసంపూర్ణ భావాలు నానాటికీ చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. నిజానికి పనిలో పరిపూర్ణత కోరుకోవడం, అన్నీ పక్కాగా చేయాలి అనుకోవడం, అన్నింట్లో మన మార్కు కనిపించాలి అనుకోవడం మంచి విషయాలే కానీ... వాటివల్ల మనం ఎదుర్కొనే అసంపూర్ణత అనే భావనే మంచిది కాదు అంటున్నారు నిపుణులు. ఆత్మన్యూనత పెరగడానికి ప్రధాన కారణంగా దీన్ని చెబుతున్నారు. ఇంకా ఏదో కావాలి, ఏదో చేయాలి అన్న ఆతృతతో ఉన్నదాంట్లో తృప్తి పడటాన్ని మర్చిపోతున్నామట. ఇదే మానసిక సమస్యల్ని పెంచుతుందనీ చెబుతున్నారు. ఈ దశ నుంచి బయటపడటం ఎలా అంటే... మనసులో ఉండే అంపూర్ణ భావనలన్నీ ఓ చోట రాయమంటున్నారు. దీనివల్ల మన పరిస్థితి మీదా, చేయాల్సిన పనుల మీదా ఓ స్పష్టత వస్తుంది. తర్వాత వాటిని పూర్తిచేయడానికి అవసరమైన మేర సమయాన్ని కేటాయించమంటున్నారు. అనుకున్న సమయంలో పని పూర్తికాకపోయినా కంగారు పడకుండా... అప్పటివరకూ పూర్తైన దాన్ని తలచుకుని సంతోషపడమంటున్నారు. ఈరోజు ఇన్ని గంటలు దీనిపై పని చేస్తే... ఈ ఫలితం వచ్చింది. తొందర్లోనే లేదా రేపే దీన్ని పూర్తిచేస్తా. నా తర్వాత అడుగు ఇదే అంటూ మిమ్మల్ని మీరే మోటివేట్ చేసుకునే విధంగా ఓ హ్యాపీ నోట్ రాసుకోమంటున్నారు. అలానే వ్యక్తిగత విషయాల్లోనూ... మీకు అసంపూర్ణంగా అనిపిస్తున్న విషయాలన్నీ ఓ చోట రాసుకుని వాటికి కావాల్సిన పరిష్కారాల్ని ఆలోచించమంటున్నారు. అంతేకానీ, ఏదో మిస్ అవుతున్నా అన్న భావనలో ఉండి దాన్ని పట్టించుకోకుండా... రోజువారీ పనుల్ని చేసుకుంటూ పోతే అది మీ మనసు, మెదడు రెండింటి సమన్వయాన్నీ దెబ్బతీస్తుంది. ఫలితం మానసిక సమస్యలు. మీకూ ఇలాంటివి పరిచయమేనా? అయితే ఈ హ్యాపీనోట్ విధానాన్ని ప్రయత్నించి చూడండి మరి!

పిల్లలు నిద్రపోవట్లేదా!

మూడు నుంచి ఆరేళ్ల పిల్లల్ని నిద్రపుచ్చడం ఎంత పెద్ద టాస్కో అమ్మలకే తెలుసు. గడుగ్గాయిలు ఓ పట్టాన నిద్రపోతేనా... అప్పుడే ఆటలు గుర్తొస్తాయి. కథలు చెప్పమంటారు. రెండు మూడు కథలు పూర్తైనా... 'అమ్మా ఇంకా చెప్పు' అంటూ విసిగిస్తారే కానీ నిద్రపోరు. వీటన్నింటి వల్లా ఆరోగ్యకరమైన నిద్రవేళలకు దూరమవుతారు. అలా కాకూడదంటే... పిల్లలకు బెడ్ టైమ్ స్నాక్‌గా కొన్ని పండ్లని పెట్టమంటున్నారు నిపుణులు. అవేంటంటే...



- **అరటి పండ్లు...** వీటిలో గాఢ నిద్రకు సహకరించే మెలటోనిన్‌తో పాటు ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం అధికంగా ఉంటుంది. అందుకే నిద్రపోయేముందు ఒక అరటిపండు పెడితే... మెలటోనిన్, సెరటోనిన్ స్థాయులు పెరిగి పిల్లలు తొందరగా నిద్రపోతారట.
- **కివీ...** బెడ్ టైమ్‌కి గంట ముందు కివీని పిల్లలకు ఇవ్వండి. దీనిలో ఉండే పొటాషియం, విటమిన్-సి కండరాల సడలింపునకు కారణమవుతాయి. దాంతో శరీరం విశ్రాంతి మోడ్‌లోకి జారుకుంటుంది. తద్వారా నిద్ర బాగా పడుతుందట.
- **చెర్రీస్...** వీటిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు మెలటోనిన్ స్థాయుల్ని పెంచుతాయట. డోపమైన్ల విడుదలకూ కారణమై మంచి నిద్రకు దోహదపడతాయట.

ఇవి అందుబాటులో లేనప్పుడు పాలు, పాల సంబంధిత పదార్థాలు, ఓట్‌మీల్ వంటివి కూడా ఇవ్వొచ్చు. ఇవన్నీ గాఢనిద్రకు సహకరించేవే.

ఈ తరం పిల్లల్లో సహనం ఉండట్లేదు. కారణం అమ్మానాన్నలే. సైకిల్ అడిగితే కారు కొనిస్తారు. చిన్న కారు కోరితే బెంజ్ కారు తాళం చేతిలో పెడతారు. దీంతో వాళ్లూ తక్షణ ఆనందాలకి అలవాటు పడుతున్నారు. అలా చేయకపోయినా వాళ్లు అడగ్గానే ఏదైనా వెంటనే తెచ్చి ఇవ్వొద్దు. పిల్లల్లో అంచనాలు పెంచినవారు అవుతారు. బదులుగా 'నువ్వు అడిగింది కొనిస్తా. కాకపోతే సమయం పడుతుంది' ఇలా చెప్పి చూడండి. సహనంగా ఎదురుచూడటం పిల్లలకు అలవాటు అవుతుంది.



- సుధామూర్తి, ఎంపీ, రచయిత్రి

బంగారం - వెండి



24న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,27,560	1,15,100	1,58,184
విజయవాడ	1,22,995	1,14,450	1,58,000
ప్రొద్దుటూరు	1,24,400	1,14,450	1,57,700
రాజమహేంద్రవరం	1,25,130	1,14,700	1,71,000
విశాఖపట్నం	1,24,680	1,14,700	1,60,000
తమిళనాడు	-----	1,15,200	1,71,000

వెండి నగల వెలుగులివి...



పసిడి నగలంటే ఇష్టపడని అమ్మాయిలుంటారా? కానీ, బంగారమేమో రోజు రోజుకీ కొండెక్కి కూర్చుంటోంది. సామాన్యులకు అందకుండా పరుగెడుతోంది. దీంతో అమ్మాయిల మనసు దోచుకునేందుకు ఇదే మంచి సమయం అనుకుంటూ... వెండి నగలు ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. వీటికి విలువా పెరిగింది. హాల్‌మార్క్ ముద్రా పడుతోంది. ప్యూర్, స్టెర్లింగ్, కోటెడ్, ప్లేటెడ్... అంటూ వెండిలోనూ ఎన్నోరకాలు. కొన్ని పసిడి పూత వేసుకునీ మెప్పిస్తున్నాయి. ఈ నగల్లో జెన్‌జీలు మెచ్చే మినిమలిస్ట్ డిజైన్లతో పాటు నవవధువుల్నీ, వారి బంధుగణాన్నీ ఆకట్టుకునేలా వజ్రాలు, కెంపులు, పచ్చలు... వంటి నవరత్నాలను చేర్చి ఆకట్టుకుంటున్నారు. ఇవి సంప్రదాయ వస్త్రధారణ మీదకే కాదు, ఆధునిక శైలి దుస్తులకూ నప్పేస్తున్నాయి. చూస్తే మీకూ నచ్చేస్తాయి.





నగానట్రా

ఛాంపియన్



"ఇది కోల్‌కతా పిచ్‌లా కాదు.. రోడ్డులా ఉంది"

247/6తో రెండో రోజు బ్యాటింగ్ కొనసాగించిన దక్షిణాఫ్రికాతో 489 చేసిన అనంతరం గువాహటి వికెట్ గురించి భారత స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ చేసిన వ్యాఖ్య ఇది. ప్రత్యర్థి జట్టు టెయిలెండర్లు చెలరేగిపోవడంలో తమ తప్పేమీ లేదని, లోపమంతా పిచ్‌దే అని తేల్చేశాడు కుల్‌దీప్!


కానీ ఆ 'రోడ్డు' మీద టీమ్‌ఇండియా బొక్క బోర్లా పడింది. కేవలం 201 పరుగులకే కుప్పకూలింది. తన 'రోడ్డు' వ్యాఖ్యకు బలం చేకూర్చడానికా అన్నట్లు సుందర్‌తో కలిసి కుల్‌దీప్ 35 ఓవర్ల పాటు పోరాడబట్టి సరిపోయింది కానీ.. లేదంటే భారత్ ఆమాత్రం స్కోరు కూడా చేసేది కాదు.

ఇప్పటికే 0-1తో వెనుకబడ్డ భారత్.. సిరీస్‌ను కోల్పోవడం లాంఛనమే. రెండో ఇన్నింగ్స్‌లో అసాధారణంగా ఆడితే తప్ప వైట్‌వాష్ తప్పకపోవచ్చు.

'రోడ్డు' మీద బోల్తా

వైట్‌వాష్ దిశగా భారత్

- తొలి ఇన్నింగ్స్‌లో 201కే ఆలౌట్
- రెండో టెస్టుపై పట్టు బిగించిన దక్షిణాఫ్రికా



గువాహటి

రెండో టెస్టులో ప్రత్యర్థి భారీ స్కోరు చేసినప్పటికీ.. బ్యాటింగ్ వికెట్‌పై టీమ్‌ఇండియా దీటుగా బదులిస్తుందని.. విజయావకాశాలు సృష్టించుకుని సిరీస్‌ను సమం చేస్తుందని ఆశించారు అభిమానులు. కానీ మన బ్యాటర్లు గువాహటిలో చతికిలపడ్డారు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (58; 97 బంతుల్లో 7×4 1×6), కేఎల్ రాహుల్ (22) శుభారంభం అందించినప్పటికీ.. తర్వాతి బ్యాటర్లలో కనీస పోరాట పటిమ కొరవడడంతో భారత్ 201 పరుగులకే కుప్పకూలింది. బౌలర్లు వాషింగ్టన్ సుందర్ (48; 92 బంతుల్లో 2×4, 1×6), కుల్‌దీప్ (19; 134 బంతుల్లో 3×4) పోరాడకుంటే భారత్ 150 కూడా దాటేది కాదు. యాన్సెన్ (6/48).. భారత్ పతనాన్ని శాసించాడు. హార్మర్ (3/64) కూడా రాణించాడు. 288 పరుగుల భారీ ఆధిక్యం సాధించిన దక్షిణాఫ్రికా.. భారత్‌కు ఫాలోఆన్ ఇవ్వకుండా రెండో ఇన్నింగ్స్ మొదలు పెట్టింది. మూడో రోజు ఆట చివరికి 26/0తో నిలిచింది. ఆ జట్టు ప్రస్తుత ఆధిక్యం.. 314. దక్షిణాఫ్రికా నాలుగో రోజు సగం వరకు బ్యాటింగ్ చేసి, భారత్‌కు 450కి పైగా లక్ష్యాన్ని నిర్దేశించే అవకాశముంది. ఓటమి తప్పించుకోవాలంటే రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు అసాధారణంగా పోరాడాల్సిందే.

ఆశలు రేపి..: ఓవర్‌నైట్ స్కోరు 9/0తో సోమవారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్.. ఉదయం ఆడిన తీరు చూసి ఎంతో ఊహించుకుని ఉంటారు అభిమానులు. ఓపెనర్లు యశస్వి, రాహుల్.. ఏమాత్రం తడబడకుండా, సాధికారికంగా బ్యాటింగ్ చేస్తూ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. తొలి గంటలో వికెట్ కోల్పోకుండా 56 పరుగులు రాబట్టింది జోడీ. యశస్వి ధాటిగా ఆడుతుంటే.. రాహుల్ ఆచితూచి బ్యాటింగ్ చేశాడు. ఓపెనర్ల నిలకడ చూస్తే భారత్.. ప్రత్యర్థికి దీటైన స్కోరే చేస్తుందనిపించింది. కానీ ఓపెనర్లు ఔటయ్యాక అంతా మారిపోయింది. రాహుల్‌ను స్లిప్ క్యాచ్‌తో ఔట్ చేసి దక్షిణాఫ్రికాకు కేశవ్ మహరాజ్ తొలి వికెట్ అందించాక.. సాయి సుదర్శన్ (15)తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించిన యశస్వి అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. 95/1తో భారత్ మెరుగ్గానే కనిపించింది. కానీ యశస్వి.. బౌన్స్ అయిన హార్మర్ బంతికి షాట్ ఆడబోయి పాయింట్‌లో యాన్సెన్‌కు క్యాచ్ ఇచ్చాక ఇన్నింగ్స్ మలుపు తిరిగింది. కేవలం 27 పరుగుల వ్యవధిలో భారత్ 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. సుదర్శన్, జురెల్ (0), పంత్ (7) అవసరం లేకపోయినా షాట్లు ఆడి వికెట్లు సమర్పించుకోగా.. జడేజా (6), నితీశ్ (10) ఆడ సాధ్యం కాని బంతులకు ఔటయ్యారు. వీరిలో సుదర్శన్.. హార్మర్‌కు వికెట్ ఇవ్వగా, మిగతా నలుగురినీ యాన్సెన్ బలిగొన్నాడు. 150 లోపే కుప్పకూలేలా కనిపించిన భారత్‌ను సుందర్, కుల్‌దీప్ గొప్ప పట్టుదలతో ఆదుకున్నారు. దాదాపు ఒక సెషన్ సమయం ఈ జంట వికెట్ ఇవ్వకుండా బ్యాటింగ్ చేసింది. కుల్‌దీప్ చక్కటి డిఫెన్స్‌తో మెప్పించగా.. సుందర్ సంయమనం ప్రదర్శిస్తూనే వీలు చిక్కినపుడల్లా షాట్లు ఆడాడు. చివరికి సుందర్‌ను స్లిప్ క్యాచ్‌తో ఔట్ చేసిన హార్మర్ 72 పరుగుల వద్ద ఎనిమిదో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. ఈ వికెట్ పడ్డాక మరో 7 పరుగులకే ఇన్నింగ్స్ ముగిసిపోయింది. చివరి రెండు వికెట్లు (కుల్‌దీప్, బుమ్రా) యాన్సెనే తీశాడు.



కుల్‌దీప్‌ను చూసైనా..

భారత తొలి ఇన్నింగ్స్‌లో అత్యధిక బంతులు ఎదుర్కొన్నది ఎవరో తెలుసా? తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్ చేసిన కుల్‌దీప్ యాదవ్. అతను ఏకంగా 134 బంతులెదుర్కొని 19 పరుగులు సాధించాడు. 92 బంతులాడి 48 పరుగులు చేసిన వాషింగ్టన్ సుందర్‌తో కలిసి కుల్‌దీప్ ఏకంగా 34.4 ఓవర్ల పాటు వికెట్ల పతనాన్ని అడ్డుకోవడం విశేషం. ఇలాంటి పోరాటం ప్రధాన బ్యాటర్లు చేసి ఉంటే.. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాకు భారత్ దీటైన బదులే ఇచ్చేది. మధ్యాహ్నం వరకు పిచ్‌లో ఉన్న తేమ బౌలర్లకు ఉపయోగపడ్డ మాట వాస్తవం. తర్వాత పిచ్ పొడిబారి బ్యాటింగ్‌కు అనుకూలంగా మారిందన్నది విశ్లేషకుల మాట. కానీ భారత్ కోల్పోయిన చాలా వికెట్లు అవసరం లేని షాట్లు, షార్ట్ పిచ్ బంతులను ఎదుర్కొనే టెక్నిక్ లేకపోవడం వల్ల అన్నది నిజం. బౌలర్ అయిన కుల్‌దీప్ చూపిన పట్టుదల, సంయమనాన్ని స్పెషలిస్టు బ్యాటర్లు చూపించకపోవడమే భారత్ పతనానికి ప్రధాన కారణం. మరి రెండో ఇన్నింగ్స్‌లో అయినా మన బ్యాటర్లు ఇలాంటి పోరాటంతో జట్టుకు ఓటమి తప్పిస్తారేమో చూడాలి.

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 489

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (సి) యాన్సెన్ (బి) హార్మర్ 58; రాహుల్ (సి) మార్‌క్రమ్ (బి) కేశవ్ 22; సుదర్శన్ (సి) రికిల్‌టన్ (బి) హార్మర్ 15; జురెల్ (సి) కేశవ్ (బి) యాన్సెన్ 0; పంత్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 7; జడేజా (సి) మార్‌క్రమ్ (బి) యాన్సెన్ 6; నితీశ్ (సి) మార్‌క్రమ్ (బి) యాన్సెన్ 10; సుందర్ (సి) మార్‌క్రమ్ (బి) హార్మర్ 48; కుల్‌దీప్ (సి) మార్‌క్రమ్ (బి) యాన్సెన్ 19; బుమ్రా (సి) వెరీన్ (బి) యాన్సెన్ 5; సిరాజ్ నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 9 **మొత్తం:** (83.5 ఓవర్లలో ఆలౌట్) **201; వికెట్ల పతనం:** 1-65, 2-95, 3-96, 4-102, 5-105, 6-119, 7-122, 8-194, 9-194; **బౌలింగ్:** యాన్సెన్ 19.5-5-48-6; ముల్డర్ 10-5-14-0; కేశవ్ మహరాజ్ 15-1-39-1; హార్మర్ 27-6-64-3; మార్‌క్రమ్ 10-1-26-0; సెనురాన్ ముత్తుసామి 2-0-2-0

విలన్ అతడే..

ఈనాడు క్రీడావిభాగం

కోల్‌కతాలో దక్షిణాఫ్రికా చేతిలో ఎదురైన అనూహ్య ఓటమికి గువాహటిలో టీమ్ ఇండియా బదులు తీర్చుకుంటుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు భారత అభిమానులు. తొలి రోజు ఆట ఆ ఆశలను మరింత పెంచింది. కానీ తర్వాతి రెండు రోజుల్లో టీమ్‌ఇండియా తుస్సుమనిపించేసింది. ఈ మ్యాచ్‌లో భారత్‌ను పోటీలో లేకుండా చేయడంలో అత్యంత కీలక పాత్ర మార్కో యాన్సెన్‌దే. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ అన్నింట్లోనూ అతను టీమ్‌ఇండియాను గట్టి దెబ్బే తీశాడు. ఓ మోస్తరు స్కోరుకు పరిమితమయ్యేలా కనిపించిన దక్షిణాఫ్రికాకు మెరుపు ఇన్నింగ్స్ (91 బంతుల్లో 93)తో భారీ స్కోరు సాధించి పెట్టింది అతనే. తన ఇన్నింగ్స్‌తోనే భారత్‌కు గెలుపు అవకాశాలు తగ్గిపోయాయి. ఇక మూడో రోజు సంచలన బౌలింగ్‌తో అతను భారత్‌కు ఓటమి ఉచ్చు బిగించాడు. పిచ్ పేస్‌కు అంతగా సహకారం అందించకపోయినా.. అతను తన నైపుణ్యంతో వికెట్లు పడగొట్టాడు. తన పొడవును ఉపయోగించుకుంటూ ప్రమాదకర రీతిలో షార్ట్ పిచ్ బంతులు సంధించిన అతను.. బ్యాటర్లను బెంబేలెత్తించాడు. జురెల్, జడేజా, నితీశ్ తమ ఒంటి మీదికి దూసుకొచ్చిన బంతులకు వికెట్లు ఇచ్చేశారు. వీరితో పాటు బుమ్రా సైతం షార్ట్ బంతికే ఔటయ్యాడు. ఇక అత్యంత కీలకమైన యశస్వి జైస్వాల్ క్యాచ్‌ను పాయింట్‌లో అద్భుతంగా అందుకోవడం ద్వారా తన ఫీల్డింగ్‌తోనూ దెబ్బ కొట్టి భారత్ పాలిట పెద్ద విలన్‌గా మారాడు యాన్సెన్.

కొన్నిసార్లు అంతే: సుందర్

ప్రణాళికలు బాగున్నా.. కొన్నిసార్లు వాటిని అనుకున్నట్లుగా అమలు చేయలేమని వాషింగ్టన్ సుందర్ అన్నాడు. యాన్సెన్ షార్ట్ బంతిని ధాటిగా ఆడబోయిన పంత్.. క్యాచ్ ఔటైన నేపథ్యంలో అతడిలా స్పందించాడు. "మరో రోజైతే అదే షాట్‌కు బంతి వెళ్లి స్టాండ్స్‌లో పడేది. మనమంతా చప్పట్లు కొట్టేవాళ్లం. క్రికెట్ అలాగే ఉంటుంది. ప్రణాళికలు, నైపుణ్యాన్ని నమ్ముతాం. కానీ ఈసారి ప్రణాళికలను అనుకున్నట్లుగా అమలు చేయలేకపోయాం. పిచ్ బాగానే ఉంది. భారత్‌లో ఇలాంటి పిచ్‌పై బ్యాటింగ్ చేసే అవకాశాలు తక్కువగా వస్తాయి. కుదురుకుంటే పరుగులవే వస్తాయి" అని సుందర్ అన్నాడు.

"భారత జట్టు బ్యాటింగ్ పేలవం. బ్యాటర్లు టెస్టు క్రికెట్‌కు తగ్గట్లు తమను తాము అన్వయించుకోలేపోయారు. బౌలర్లు కొన్ని మంచి బంతులు వేసిన మాట నిజమే. కానీ బ్యాటర్లు కఠినమైన స్పెల్స్ తట్టుకోవడానికి లేదా సెషన్ల వారిగా ఆడడానికి సన్నద్ధమైనట్లు కనిపించలేదు"
– అనిల్ కుంబ్లే, మాజీ కెప్టెన్

భారత్‌దే మహిళల కబడ్డీ ప్రపంచకప్


భారత మహిళల కబడ్డీ జట్టు

ఢాకా: ప్రపంచ వేదికపై భారత మహిళల కబడ్డీ జట్టు సత్తా చాటింది. స్ఫూర్తిదాయక ప్రదర్శనతో ప్రపంచకప్‌ను గెలుచుకుంది. సోమవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ 35-28తో చైనీస్ తైపీని ఓడించింది. ఈ పోరు ఉత్కంఠభరితంగా సాగినా.. బలమైన డిఫెన్స్, దూకుడైన ఆటతో భారత్ పైచేయి సాధించింది. ముఖ్యంగా ఆఖర్లో ట్యాక్లింగ్‌లో అదరగొట్టి విజయాన్ని సొంతం చేసుకుంది. సంజు దేవి, పుష్పా రాణా, చాంపా ఠాకూర్, భావ్నా ఠాకూర్, సాక్షి శర్మ జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించారు. రీతూ నేగి సారథ్యంలోని భారత్.. ఈ టోర్నీలో ఒక్క మ్యాచ్ ఓడిపోకుండా టైటిల్ నిలబెట్టుకోవడం విశేషం. 11 దేశాలు పోటీపడిన ఈ టోర్నీలో గ్రూప్ దశలో థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, జర్మనీ, ఉగాండాపై ఘన విజయాలు అందుకున్న భారత్.. సెమీస్‌లో 33-21తో ఇరాన్‌ను ఓడించింది. ఈ ఏడాది భారత్ సాధించిన రెండో పెద్ద విజయమిది. ఈ మార్చిలో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. ప్రపంచకప్ గెలిచిన కబడ్డీ జట్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. "ప్రపంచకప్ గెలిచి దేశం గర్వించేలా చేసిన భారత కబడ్డీ జట్టుకు అభినందనలు. ఈ విజయం యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుంది" అని 'ఎక్స్'లో పేర్కొన్నారు. అంధుల టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల జట్టునూ మోదీ ప్రశంసించారు. "సమష్టి కృషి.. దృఢ సంకల్పానికి ఈ విజయం మంచి ఉదాహరణ. జట్టులో ప్రతి ఒక్క క్రీడాకారిణి ఓ ఛాంపియనే" అని ప్రధాని అన్నారు.

అంధుల ప్రపంచకప్‌ను గెలుచుకుని స్వదేశానికి చేరుకున్న భారత జట్టు. తెలుగమ్మాయి దీపిక సారథ్యంలోని జట్టు.. కొలంబోలో జరిగిన ఫైనల్లో నేపాల్‌ను ఓడించింది.



పావని గురి అదిరె

ప్రపంచ ఎబిలిటీ క్రీడల్లో కాంస్యం సొంతం


కోచ్ విజయ్ సింహంతో పావని

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: తెలంగాణ అమ్మాయి బానోత్ పావని సత్తా చాటింది. దివ్యాంగుల కోసం థాయ్‌లాండ్‌లో నిర్వహించిన ప్రపంచ ఎబిలిటీ క్రీడల్లో ఆమె కాంస్యంతో మెరిసింది. ఆర్4-10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ మిక్స్‌డ్ విభాగం ఫైనల్లో పావని 225.1 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. క్వాలిఫికేషన్లో 623 పాయింట్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్న ఆమె.. ఫైనల్లోనూ రాణించి పోడియంపై నిలిచింది. ఈ విభాగంలో కున్‌తాంగ్ (థాయ్‌లాండ్, 251.7) స్వర్ణం, ఫైచామ్‌నన్ (థాయ్‌లాండ్, 249.6) రజతం గెలుచుకున్నారు. 17 ఏళ్ల పావని హైదరాబాద్ రహ్మత్‌పురలోని ఆదిత్య మెహతా ఫౌండేషన్‌లో శిక్షణ తీసుకుంది. పారాలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడమే ఆమె లక్ష్యమని కోచ్ విజయ్ సింహం వెల్లడించారు.


ధర్మేంద్ర ఆశ్చర్యపరిచారు


ధర్మేంద్రతో అమిత్

దిల్లీ: బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్ర ఒక సందర్భంలో తనను ఆశ్చర్యపరిచారని.. తన కలను నిజం చేశారని స్టార్ బాక్సర్ అమిత్ పంగాల్ చెప్పాడు. ధర్మేంద్ర మరణించిన నేపథ్యంలో ఆయనతో తనకున్న జ్ఞాపకాన్ని అతడు పంచుకున్నాడు. తనకు, తన తండ్రికి ధర్మేంద్ర అంటే చాలా ఇష్టమని.. జీవితంలో ఒకసారైనా ఆయనతో మాట్లాడాలన్న తమ కోరికను తెలుసుకుని ధర్మేంద్ర ఆతిథ్యం ఇచ్చారని అమిత్ గుర్తు చేసుకున్నాడు. "2018 జకార్తా ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించిన తర్వాత విలేకరులతో మాట్లాడా. మీరిప్పుడు ఏం చేయాలని అనుకుంటున్నారని ఎవరో అడిగారు. మా నాన్న ధర్మేంద్రకు వీరాభిమాని. ఆయనంటే నాకూ చాలా ఇష్టం. మా నాన్నతో కలిసి ఆయనను ఒక్కసారైనా కలవాలని ఉందని చెప్పా. తర్వాత 'ఎక్స్' వేదికగానూ ఈ విషయాన్ని ప్రస్తావించా. ఈ విషయం ధర్మేంద్ర వరకు వెళ్తుందని అనుకోలేదు. కానీ ఆయన ఆశ్చర్యపరిచారు. నా కోరికను తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించారు. మా కుటుంబాన్ని లంచ్‌కు ఆహ్వానించారు. చాలా ప్రేమగా మాట్లాడారు. ఆయనో పెద్ద సెలబ్రెటీ అన్న భావనే కలగలేదు. కుటుంబ సభ్యుడితో మాట్లాడినట్లే అనిపించింది" అని అమిత్ అన్నాడు.

ప్రాంజలికి స్వర్ణం

డెఫ్‌లింపిక్స్


ప్రాంజలి

టోక్యో: డెఫ్‌లింపిక్స్‌లో భారత షూటర్ ప్రాంజలి ధూమల్ మహిళల 25మీ పిస్టల్ స్వర్ణం గెలుచుకుంది. ఈ క్రీడల్లో ఆమెకు ఇది మూడో పతకం. ఇంతకుముందు ఆమె మిక్స్‌డ్ పిస్టల్ ఈవెంట్లో అభినవ్‌తో కలిసి పసిడి, వ్యక్తిగత పిస్టల్ ఈవెంట్లో రజతం గెలుచుకుంది. సోమవారం జరిగిన ఈవెంట్లో ప్రాంజలి.. క్వాలిఫికేషన్ ప్రపంచ రికార్డు (573)తో ఫైనల్ చేరింది. ఫైనల్లో ఆమె 34 స్కోరుతో విజేతగా నిలిచింది. ఉక్రెయిన్‌కు చెందిన మోసినా హలినా (32) రజతం నెగ్గగా.. కొరియా షూటర్ జియా జివాన్ (30) కాంస్యం గెలుచుకుంది. మరో భారత షూటర్ అనుయ ప్రసాద్ నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ డెఫ్‌లింపిక్స్‌లో భారత షూటర్లు ఇప్పటివరకు ఏడు స్వర్ణాలు సహా 16 పతకాలు గెలుచుకున్నారు.

భారత్, బెల్జియం మ్యాచ్ నేటికి వాయిదా

ఇపో (మలేసియా): అజ్లాన్ షా హాకీ కప్‌లో సోమవారం భారత్, బెల్జియం మధ్య జరగాల్సిన మ్యాచ్ ప్రతికూల వాతావరణం కారణంగా మంగళవారానికి వాయిదా పడింది. సోమవారం మ్యాచ్ నిర్ణీత సమయానికే మొదలైంది. కానీ మూడు నిమిషాల్లోనే భారీ వర్షం రావడంతో ఆట ఆగిపోయింది. ఆ తర్వాత తిరిగి సాధ్యం కాలేదు. ఆరేళ్ల తర్వాత ఈ టోర్నీలో ఆడుతోన్న భారత్.. తన తొలి మ్యాచ్‌లో 1-0తో కొరియాపై విజయం సాధించింది.

డేవిస్‌కప్‌లో ఇటలీ హ్యాట్రిక్

బొలోగ్నా (ఇటలీ): డేవిస్‌కప్ టెన్నిస్ ట్రోఫీలో ఇటలీ హ్యాట్రిక్ కొట్టింది. ఆ దేశం వరుసగా మూడోసారి ఈ కప్‌ను కైవసం చేసుకుంది. ఫైనల్లో 2-0తో ఆరుసార్లు ఛాంపియన్ స్పెయిన్‌ను ఓడించింది. తొలి సింగిల్స్‌లో మాటో బెరిటిని 6-3, 6-4తో పాబ్లో బస్టాను ఓడించి ఇటలీకి ఆధిక్యాన్ని అందించాడు. రెండో సింగిల్స్‌లో ఫ్లావియో కొబాలి 1-6, 7-6 (7-5), 7-5తో జేమ్ మునార్‌పై నెగ్గడంతో ఇటలీ విజేతగా నిలిచింది. మొత్తంగా ఆ జట్టుకు ఇది నాలుగో డేవిస్‌కప్. 1976లో తొలిసారి ఈ టోర్నీలో విజేతగా నిలిచిన ఇటలీ.. తర్వాత 2023, 2024లోనూ గెలిచింది. అమెరికా (1968-72) తర్వాత డేవిస్‌కప్‌లో వరుసగా మూడు టైటిళ్లు గెలిచిన ఘనత ఇటలీదే.

ఫిట్‌నెస్ మెరుగవ్వాలి

దిల్లీ: అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో పోటీని తట్టుకోవాలంటే భారత క్రీడాకారులు ఫిట్‌నెస్ మెరుగవ్వాలని భారత దిగ్గజ షట్లర్ సైనా నెహ్వాల్ అభిప్రాయపడింది. "భారత షట్లర్లు మునుపటిలా నిలకడగా సత్తాచాటాలి. సాత్విక్- చిరాగ్, లక్ష్యసేన్ లేదా సింధు నుంచి క్రమం తప్పకుండా ఫలితాలు అవసరం. అందుకోసం మంచి ట్రెయినర్లు, ఫిజియోలను వెతకాలి. దేహం 100 శాతం ఫిట్‌నెస్‌తో ఉంటే శిక్షణ కష్టం కాదు. కాబట్టి వరుసగా టైటిళ్లు గెలవాలంటే నాణ్యమైన ట్రెయినర్లు, ఫిజియోలపై దృష్టి సారించడం ముఖ్యం. మానసికంగా ప్రతి ఒక్కరు బలంగా ఉంటారు. శారీరకంగా మరింత మెరుగవ్వాలి. సింగిల్స్‌లో భారత్ తరఫున లక్ష్యసేన్ అత్యుత్తమ ఆటగాడు. అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటుతూ ఫలితాలు సాధిస్తున్నాడు. బహుశా ఈతరం క్రీడాకారులు కాస్త మృదువుగా ఉన్నట్లున్నారు. నేను, సింధు దూకుడుగా.. శక్తిమంతంగా ఉండేవాళ్లం. 18 ఏళ్లు వచ్చేసరికే అత్యున్నత స్థాయిలో మంచి ఫలితాలు రాబట్టాం" అని సైనా వివరించింది.


సైనా

శ్రీకాంత్, ప్రణయ్ గాడినపడేనా

లఖ్‌నవూ: సయ్యద్ మోదీ అంతర్జాతీయ ప్రపంచ టూర్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీపై భారత సీనియర్ ఆటగాళ్లు కిడాంబి శ్రీకాంత్, హెచ్.ఎస్.ప్రణయ్ గురిపెట్టారు. గత కొంతకాలంగా ఫామ్‌తో తంటాలు పడుతున్న శ్రీకాంత్, ప్రణయ్ సొంతగడ్డపై గాడినపడతారా అన్నది చూడాలి. మంగళవారం ప్రారంభమయ్యే ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో కవిన్ తంగమ్‌తో శ్రీకాంత్, శష్వంత్ దలాల్‌తో ప్రణయ్, రాహుల్ భరద్వాజ్‌తో కాటం తరుణ్‌రెడ్డి, సతీశ్ కుమార్‌తో తరుణ్ మన్నెపల్లి తలపడనున్నారు. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడాతో ఆకర్షి కశ్యప్, అదితి భట్‌తో తస్నీమ్ మీర్, రక్షితశ్రీతో శ్రియ, నెస్లిహన్ అరిన్ (తుర్కియే)తో శ్రియాంషి వలిశెట్టి, అష్మిత చాలిహాతో తన్విశర్మ తమ పోరాటాన్ని ప్రారంభించనున్నారు.

కివీస్ టెస్టు జట్టులో విలియమ్సన్

వెల్లింగ్టన్: వచ్చే నెలలో వెస్టిండీస్‌తో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో తలపడే న్యూజిలాండ్ జట్టులో కేన్ విలియమ్సన్‌కు చోటు దక్కింది. అతడు కివీస్ గత టెస్టు సిరీస్ (జింబాబ్వేతో) పాటు ఈ సీజన్‌లో ఆ జట్టు చాలా వన్డేలు, టీ20లకు దూరమయ్యాడు. కివీస్ బోర్డుతో విలియమ్సన్‌కు పరిమిత కాంట్రాక్ట్ ఉంది. దాని వల్ల అతడు విదేశీ లీగుల్లో ఆడుతూ వీలైనప్పుడు కివీస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. విండీస్, కివీస్ తొలి టెస్టు డిసెంబరు 2న మొదలవుతుంది.

ఫైనల్లో పాక్

రావల్పిండి: ఉస్మాన్ తారిక్ (4/18) హ్యాట్రిక్‌తో విజృంభించడంతో ముక్కోణపు టీ20 సిరీస్‌లో పాకిస్థాన్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. పాక్ 69 పరుగుల తేడాతో జింబాబ్వేను ఓడించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 195 పరుగులు సాధించింది. ఫర్హాన్ (63; 41 బంతుల్లో 4×4, 3×6), బాబర్ (74; 52 బంతుల్లో 7×4, 2×6), జమాన్ (27 నాటౌట్; 10 బంతుల్లో 1×4, 3×6) సత్తాచాటి పాక్‌కు భారీస్కోరు అందించారు. అనంతరం తారిక్ దెబ్బకు ఛేదనలో జింబాబ్వే 126 పరుగులకే ఆలౌటైంది. బర్ల్ (67 నాటౌట్; 49 బంతుల్లో 8×4, 2×6) పోరాడినా ఫలితం లేకపోయింది. ఇన్నింగ్స్ పదో ఓవర్లో 2, 3, 4 బంతుల్లో వరుసగా మూడు వికెట్లు తీసిన తారిక్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

ప్రపంచ టెన్నిస్ లీగ్‌లో సహజ, శ్రీవల్లి

బెంగళూరు: ప్రపంచ టెన్నిస్ లీగ్‌లో తెలుగమ్మాయిలు సహజ యమలాపల్లి, రష్మిక శ్రీవల్లి బరిలో దిగుతున్నారు. డిసెంబర్ 17న ఆరంభమయ్యే ఈ లీగ్‌లో గేమ్ ఛేంజర్స్ ఫాల్కన్స్ తరఫున సహజ ఆడనుంది. ఇదే జట్టులో రోహన్ బోపన్న, రష్యా స్టార్ డానియల్ మెద్వెదెవ్, మాగ్డా లినెట్ ఉన్నారు. ఏఓఎస్ ఈగల్స్‌కు శ్రీవల్లి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ టీమ్‌లో సుమిత్ నగాల్, పౌలా బదోసా, మోన్‌ఫిల్స్ మిగిలిన సభ్యులు. వీబీ రియాల్టీ హాక్స్‌లో యుకి బాంబ్రి, షపొవలోవ్, స్విటోలినా, అంకిత రైనా, మాయ రేవతి.. మార్విక్స్ కైట్స్‌లో కిర్గియోస్, దక్షిణేశ్వర్ సురేశ్, మార్టా కొస్ట్యూక్, అంకిత రైనా ఆడుతున్నారు.

చిట్టిబుర్రలు.. గట్టి ఆవిష్కరణలు

- 'ఈనాడు' వైజ్ఞానిక ప్రదర్శనకు విశేష స్పందన
- 85 ప్రాజెక్టులను రూపొందించిన 170 మంది విద్యార్థులు



వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న విద్యా శాఖ డైరెక్టర్ విజయరామరాజు. చిత్రంలో కృష్ణా జిల్లా డీఈవో రామారావు, పీబీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శివాజీబాబు, చైతన్య విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ జీఎం ఎం.మురళీకృష్ణ, 'ఈనాడు' ఏపీ బ్యూరో చీఫ్ కసవర్ల శ్రీనివాస్, 'ఈనాడు' విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జ్ సి.హెచ్.కె.కిశోర్‌కుమార్

ఈనాడు, అమరావతి: శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు 'ఈనాడు', శ్రీ చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనకు విశేష స్పందన వచ్చింది. ఇంటా బయటా నిత్య జీవితంలో ఎదురయ్యే ఎన్నో సమస్యలకు విభిన్నమైన ప్రాజెక్టులతో విద్యార్థులు తమదైన పరిష్కారాలు సూచించారు. సోమవారం విజయవాడలోని పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని 85 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 170 మంది విద్యార్థులు 85 ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమాన్ని పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు ప్రారంభించారు. ఆయనతో పాటు కృష్ణా జిల్లా విద్యాశాఖాధికారి రామారావు, పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ శివాజీ, ఈనాడు ఏపీ బ్యూరో ఇన్‌చార్జ్ కసవర్ల శ్రీనివాస్, ఈనాడు విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సి.హెచ్.కె.కిశోర్‌కుమార్ పాల్గొన్నారు. వక్తలు ప్రసంగిస్తూ పాఠశాల విద్యార్థులు రూపొందించే ప్రాజెక్టులు పేటెంట్ తీసుకునే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సాయంత్రం ముగింపు వేడుకకు విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు విజేతల ప్రదర్శనలు పరిశీలించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల చొప్పున నగదు ప్రోత్సాహకం అందించారు. మరో నాలుగు ప్రాజెక్టులకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు.



మొదటి బహుమతి గెలుచుకున్న కానూరు ఎ.ఎస్.ఆర్.ఎ. జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు కె.భరత్‌కుమార్, వి.తేజస్విలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు. చిత్రంలో సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పి.లక్ష్మణరావు ★ రెండో బహుమతి గెలుచుకున్న గన్నవరంలోని శ్రీమల్లికార్జున హైస్కూల్ విద్యార్థులు జి.రోహిత్, కె.లిఖిత్, ఆర్.దుర్గ ★ మూడో బహుమతి కైవసం చేసుకున్న విజయవాడ క్రీస్తురాజపురంలోని క్రీస్తు ది కింగ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు వి.వెంకటసందీప్, కె.కార్తిక్, వి.కార్తికేయ

సెన్సర్లతో వీధి దీపాల వెలుగు

సెన్సర్లను వినియోగించి వీధి దీపాలు వెలిగించడంతో పాటు లేజర్ అలారం, సోలార్ ట్రాకర్ వంటి మూడు విభిన్న అంశాలతో రూపొందించిన ఎనర్జీ ఎఫిషియెంట్ స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుకు తొలి బహుమతి లభించింది. కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు కె.భరత్‌కుమార్, తేజస్వి ఈ ప్రాజెక్టును తయారుచేశారు.



'ఈనాడు' వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రాజెక్టులను తిలకిస్తున్న విద్యార్థులు

వరదొచ్చినా బ్రిడ్జి పదిలం

వరదలకు వంతెనలు కొట్టుకుపోకుండా గన్నవరానికి చెందిన శ్రీమల్లికార్జున పాఠశాల విద్యార్థులు కె.లిఖిత్, జి.రోహిత్, ఆర్.దుర్గ పరిష్కారాన్ని చూపారు. వాటర్ సెన్సర్ ఆధారంగా స్మార్ట్ బ్రిడ్జి ప్రాజెక్టు పనిచేస్తుంది. జలవనరుల్లో నీటిమట్టం పెరిగినప్పుడు వెంటనే ఈ సెన్సర్లు గుర్తించి బ్రిడ్జి ఎత్తు పెంచుతాయి. దీంతో వరద కారణంగా దానికి ఎలాంటి హాని జరగదు. ఈ ప్రాజెక్టు ద్వితీయ బహుమతికి ఎంపికైంది.

వసతి గృహాల్లో ఆత్మహత్యలకు చెక్ పెట్టేలా

వసతి గృహాల్లో విద్యార్థుల ఆత్మహత్యలకు చెక్ పెట్టేలా విజయవాడకు చెందిన క్రీస్తు ది కింగ్ పాఠశాల 9వ తరగతి విద్యార్థులు వి.వెంకట సందీప్, కె.కార్తిక్, వి.కార్తికేయ యాంటీ సూసైడ్ ఫ్యాన్ అనే వినూత్న ప్రాజెక్టు రూపొందించారు. ఫ్యాన్‌కు డీసీ మోటార్ (గేర్ బాక్స్)ను అమర్చి ఎవరైనా ఉరివేసుకునేందుకు ప్రయత్నించినప్పుడు వెంటనే దాని బరువుకు ఫ్యాన్ కిందకు దిగుతుంది. ఆ వెంటనే ఆ వసతి గృహ నిర్వాహకుడి సెల్‌ఫోన్‌కు అలర్ట్ వెళ్తుంది. తద్వారా ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకోవచ్చు. ఈ ప్రాజెక్టుకు తృతీయ బహుమతి వచ్చింది.

విద్యార్థులతో కిక్కిరిసిన ప్రాంగణం

వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించేందుకు 11 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 2,500 మంది విద్యార్థులు తరలివచ్చారు. సందర్శకులకు తమ ఉద్దేశం, లక్ష్యం, పర్యావరణహిత, మానవ సమాజానికి కలిగే ప్రయోజనాలను ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులు కూలంకషంగా వివరించారు. సిద్ధార్థ అకాడమీ ఆధ్వర్యం సిబ్బంది ప్రొఫెసర్ డా.కేవీ.శేఖర్ పంతులు, డా.ఎం.శిల్ప, జి.శ్రీదేవి, మొగిలాల, బోడవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పి.ఉమామహేశ్వరరావు, వై.చంద్రశేఖర్‌రావులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

ఎవరి సిమ్ దుర్వినియోగమైతే వారిదే బాధ్యత

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ● టెలికాం విభాగం హెచ్చరిక



దిల్లీ: సైబర్ మోసాలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో ఏ సిమ్ కార్డు (మొబైల్ నంబరు) అయినా దుర్వినియోగం అయితే.. ఆ సిమ్ ఎవరి పేరిట ఉంటే వారే బాధ్యులవుతారని టెలికాం విభాగం (డాట్) సోమవారం స్పష్టం చేసింది. అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ట్యాంపర్ చేసిన ఐఎమ్‌ఈఐ నంబర్లు ఉండే మొబైళ్లను వినియోగించొద్దని సూచించింది. మరికొన్ని అంశాల విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరించింది. అవేంటంటే..

■ కాన్ఫిగరబుల్/ట్యాంపర్డ్ ఐఎమ్‌ఈఐ నంబర్లు ఉండే మోడెమ్‌లు, మాడ్యూళ్లు, సిమ్ బాక్సుల వంటి అసెంబుల్ పరికరాలను వినియోగించడం, కొనుగోలు చేయరాదు.

■ నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి /ఇతరుల పేరిట సిమ్ కార్డులు తీసుకోరాదు.

■ మీ పేరిట తీసుకున్న సిమ్ కార్డులను ఇతరులకు ఇవ్వరాదు. వారు దుర్వినియోగం చేసే అవకాశం ఉంది.

■ కాలింగ్ లైన్ ఐడెంటిటీ (సీఎల్‌ఐ) లేదా ఇతర టెలికమ్యూనికేషన్స్ ఐడింటిఫయర్స్‌లు మార్చగలిగే వెబ్‌సైట్లు, మొబైల్ అప్లికేషన్లను వినియోగదార్లు వినియోగించొద్దు.

ఒకవేళ మీ సిమ్‌కార్డులను ఎవరైనా సైబర్ మోసాల్లో దుర్వినియోగం చేసినట్లయితే, సిమ్‌కార్డు ఒరిజినల్ వినియోగదారే చట్టపరంగా బాధ్యులు అవుతారని టెలికాం విభాగం తెలిపింది.

మూడేళ్ల జైలు, రూ.50 లక్షల దాకా జరిమానా

టెలికమ్యూనికేషన్స్ చట్టం, 2023 నిబంధనల ప్రకారం ఐఎమ్‌ఈఐ (ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ) నంబరు వంటి టెలికాం ఐడెంటిఫయర్స్‌ను ట్యాంపర్ చేసిన పక్షంలో తీవ్ర చర్యలు ఉంటాయి. వీటి ఉల్లంఘన జరిగితే మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.50 లక్షల వరకు పెనాల్టీ లేదా రెండూ అమలవుతాయి. టెలికమ్యూనికేషన్స్ (టెలికాం సైబర్ సెక్యూరిటీ) రూల్స్, 2024 కింద ఐఎమ్‌ఈఐని మార్చడం కానీ, ఐఎమ్‌ఈఐని మార్చగలిగే సామగ్రి వినియోగం, ఉత్పత్తి చేయడం కానీ నిషేధం.

ఇలా తనిఖీ చేసుకోండి..

■ ప్రజలు తమ మొబైల్ ఐఎమ్‌ఈఐ వివరాలను సంచార్ సాథీ పోర్టల్ లేదా మొబైల్ యాప్ ద్వారా తనిఖీ చేసుకోవాలని డాట్ సూచించింది. అందులో డివైజ్ బ్రాండ్ పేరు, మోడల్, తయారీదారు సమాచారం కనిపిస్తుంది.

మొబైల్ నంబరు బ్లాక్ చేస్తే స్పామ్ కాల్స్ ఆగవు

మన మొబైల్‌కు వచ్చే నంబరును బ్లాక్ చేసినంత మాత్రాన స్పామ్ కాల్స్ ఆగవని, వాటిని నిరోధించాలంటే డీఎన్‌డీ యాప్‌లో ఫిర్యాదు చేయాలని టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ సూచించింది. డీఎన్‌డీ యాప్‌పై అందిన ఫిర్యాదుల ఆధారంగా 21 లక్షల మొబైల్ నంబర్లను బ్లాక్ చేశామని, లక్ష సంస్థలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టామని తెలిపింది.

ధర్మవరం సీనియర్ సివిల్ జడ్జి బి.కృష్ణవేణిపై వేటు

సర్వీసు నుంచి తొలగింపునకు సిఫార్సు చేసిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: సత్యసాయి జిల్లా ధర్మవరం సీనియర్ సివిల్ జడ్జి బి.కృష్ణవేణిని (ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు) సర్వీసు నుంచి తొలగిస్తూ న్యాయశాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆమెపై వచ్చిన ఆరోపణల విషయంలో శాఖాపరమైన విచారణ జరిపించిన హైకోర్టు.. అవి నిజమని తేలడంతో సర్వీసు నుంచి తొలగింపునకు సిఫార్సు చేసింది. తీర్పులు రాయకపోవడం, ఉత్తర్వులపై సంతకాలు చేయడంలో విఫలమవడం, సిబ్బందికి జ్యుడిషియల్ పనులు అప్పగించడం తదితర ఆరోపణలు కృష్ణవేణిపై ఉన్నాయి. అంతేకాక ధర్మవరం బార్ అసోసియేషన్ ఆమెపై ఫిర్యాదు చేసింది. కృష్ణవేణిపై మొత్తం 12 అభియోగాలు నమోదయ్యాయి. విచారణలో కొన్ని రుజువుకాగా, మరికొన్ని నిరూపణ కాలేదు. రుజువైన అభియోగాలు తీవ్రమైనవి కావడంతో విచారణ నివేదికను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు (ఫుల్ కోర్టు) ఆమెను సర్వీసు నుంచి తొలగించాలని సిఫార్సు చేసింది. దీంతో ఆమెను తక్షణమే సర్వీసు నుంచి తొలగిస్తున్నట్లు న్యాయశాఖ కార్యదర్శి జి. ప్రతిభాదేవి సోమవారం ఉత్తర్వులిచ్చారు.

ఇతరులను ఇరికించడానికే..

వివేకా హత్య కేసులో సునీత పిటిషన్‌పై వాదనలు

ఈనాడు, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఇతరులను ఇరికించేందుకు ఆయన కుమార్తె సునీతారెడ్డి ప్రయత్నిస్తున్నారని అవినాష్‌రెడ్డి తదితరుల తరఫు న్యాయవాది సోమవారం సీబీఐ కోర్టుకు నివేదించారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగించేలా సీబీఐకి ఆదేశాలివ్వాలంటూ సునీతారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైదరాబాద్ సీబీఐ ప్రధాన కోర్టు న్యాయాధికారి డాక్టర్ టి.రఘురాం సోమవారం విచారణ చేపట్టారు. నిందితులైన వైఎస్ భాస్కర్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డిల తరఫున న్యాయవాది ఇ.ఉమామహేశ్వరరావు వాదనలు వినిపించారు. హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్నానని చెప్పిన దస్తగిరి బయట తిరుగుతున్నా, అతని బెయిలు రద్దు చేయాలని సునీత కోరకపోగా.. అవినాష్‌రెడ్డి తదితరుల బెయిళ్లను రద్దు చేయాలని కోరడం ఆశ్చర్యంగా ఉందన్నారు. నాలుగేళ్లపాటు దర్యాప్తు జరిగినప్పుడు ఈ విషయాలను సీబీఐ దృష్టికి తీసుకెళ్లలేదని తెలిపారు. కేసు దర్యాప్తు ముగిసిందని సీబీఐ ప్రకటించాక.. కొత్తగా చేపట్టాలనడం సరికాదన్నారు. ఈ వాదనలు మంగళవారమూ కొనసాగనున్నాయి.

కేసు రాజీ జరుగుతుంటే.. మీరేం చేశారు?

(మొదటి పేజీ తరువాయి)

దర్యాప్తు బృందంతో కలిసి విచారించారు. హైకోర్టు ఆదేశాల మేరకు పరకామణిలో కేసు దర్యాప్తు చేపట్టిన సీఐడీ బృందం డిసెంబరు 2వ తేదీలోగా నివేదిక ఇచ్చేందుకు విచారణ చేపట్టింది. అదే సమయంలో విచారణ నిమిత్తం వస్తున్న ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ మృతి చెందారు. దీంతో దర్యాప్తులో జాప్యం చోటుచేసుకుంది. సోమవారం తిరుపతికి చేరుకున్న సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ స్వయంగా విచారణ చేపట్టారు. అప్పటి తితిదే వీజీవో గిరిధర్‌ను విచారించారు. పరకామణి అధికారులు మొదట మీకు సమాచారమిచ్చారా అని ఆరా తీశారు. చోరీపై తితిదే విజిలెన్స్ విభాగం ఎలాంటి విచారణ చేపట్టింది, సంబంధిత దస్త్రాలు, ఇతర వివరాలు ఎవరికి సమర్పించారని అడిగినట్లు సమాచారం. తాము సేకరించిన విషయాలు అప్పటి సీవీఎస్‌వో నరసింహ కిశోర్‌కు తెలియజేసినట్లు గిరిధర్ చెప్పినట్లు తెలిసింది. అలాగే కేసు రాజీలో సతీష్‌కుమార్‌కు ఏమైనా సలహాలు ఇచ్చారా? ఆయనపై ఎవరిదైనా ఒత్తిడి ఉన్నట్లు గుర్తించారా? అని ప్రశ్నించినట్లు సమాచారం. దానికి.. సరిగ్గా గుర్తించలేదని గిరిధర్ చెప్పినట్లు తెలిసింది. ఆ తర్వాత అప్పటి ఏవీఎస్‌వో పద్మనాభంను ప్రశ్నించారు. కేసు గురించి ఏమి తెలుసని ఆరా తీశారు.

చెన్నై నుంచి రవికుమార్ బంధువులు: నిందితుడు రవికుమార్ సమీప బంధువులనూ దర్యాప్తు అధికారులు విచారించారు. చెన్నైకి చెందిన దంపతులు సోమవారం సిట్ కార్యాలయానికి వచ్చారు. నిందితుడికి చెన్నైలో ఉన్న ఆస్తులు, గిఫ్ట్‌డీడ్‌గా ఇచ్చిన ఆస్తుల రిజిస్ట్రేషన్ గురించి ఆరా తీసినట్లు సమాచారం. రవికుమార్ ఆస్తులు కూడబెట్టే సమయంలో ఏం చెప్పేవారని అడిగినట్లు తెలిసింది.

12 మంది డ్రైవర్ల విచారణ: అప్పటి తితిదే అధికారులు, పరకామణి డిప్యూటీ ఈవో, పోలీసు అధికారుల డ్రైవర్లను విచారణకు పిలిచి వేర్వేరుగా విచారించారు. పరకామణిలో చోరీ కేసు గురించి ఏం తెలుసని వారిని అడిగినట్లు తెలిసింది. నిందితుడు రవికుమార్ ఆస్తులు గుర్తించడం కోసం వెళ్లిన అధికారులు ఎవరు? వారు ఎక్కడెక్కడ తిరిగారని ఆరా తీసినట్లు సమాచారం. కేసు రాజీ సమయంలో మీ అధికారుల పాత్రేమిటని ప్రశ్నించినట్లు తెలిసింది.

● **ఆర్థిక లావాదేవీలపై బ్యాంకులకు నోటీసులు:** నిందితుడు రవికుమార్‌తోపాటు పరకామణిలో చోరీ కేసులో కీలక వ్యక్తుల బ్యాంకు లావాదేవీలపై సీఐడీ అధికారులు నిఘా పెట్టారు. సోమవారం తిరుపతిలోని కొన్ని బ్యాంకులకు నోటీసులు అందజేశారు. సంబంధిత పేర్లతో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరిగాయో తెలియజేయాలని బ్యాంకులను కోరారు.

డిమాండ్ ఆధారిత పంటలు వేయండి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని కృష్ణా జిల్లా ఘంటసాల మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం మంత్రి అచ్చెన్న ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 'ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. కొందరు మిల్లర్లు రైతులను ఇబ్బందులు పెడుతున్నారని ఫిర్యాదులు అందుతున్నాయి. అలాంటి మిల్లర్లను బ్లాక్‌లిస్టులో పెడతాం. కొన్నిచోట్ల గింజ రంగు మారడం.. ముద్ద అవ్వడం వంటి సమస్యలు ఉన్నాయి. ఈసారి నిబంధనల్లో సడలింపు ఇవ్వాలని పౌరసరఫరాల శాఖ మంత్రితో మాట్లాడతాం. అన్నదాతలు తప్పనిసరిగా 'రైతు కోసం యాప్'ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం రైతుల కోసం రూ.8,800 కోట్లు కేటాయించి.. రూ.900 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. కూటమి ప్రభుత్వం 16 నెలల్లోనే రూ.వెయ్యి కోట్లు వెచ్చించింది' అని అచ్చెన్నాయుడు వివరించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మొంథా తుపానుతో నష్టపోయిన రైతులను త్వరగా ఆదుకోవాలని కోరారు. ఘంటసాల వ్యవసాయ పాలిటెక్నిక్‌ను మత్స్యకళాశాలగా మార్చాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మీ ఆరోగ్యాన్ని ఇలా కాపాడుకోండి

✦ మెదడు ఆరోగ్యం కోసం- రోజూ కనీసం ఓ గుడ్డు తినండి. ✦ గుండె భద్రంగా ఉండాలంటే - నడక, వ్యాయామాలు చేయండి.
✦ చర్మ సమస్యలు తగ్గాలంటే - ఉదయం ఎండలో గడపండి.
✦ కిడ్నీలు బాగుండాలంటే- తగినంత నీరు తాగండి.
✦ వెన్నెముక పటిష్ఠంగా ఉండాలంటే- కూర్చున్నప్పుడు, నిల్చున్నప్పుడు నిటారుగా ఉండండి.

– టైలర్ వాన్, ఫిజియోథెరపిస్ట్

ఒక్కో ఆర్‌ఎస్‌కే బృందం 540 రైతు కుటుంబాలను చేరుకోవాలి

- 'రైతన్నా మీ కోసం' మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 'రైతన్నా.. మీ కోసం' వారోత్సవాల నిర్వహణపై ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. రైతు సేవా కేంద్రం యూనిట్‌గా వ్యవసాయ/ఉద్యాన/పట్టు సహాయకుడు, పశుసంవర్ధక/మత్స్య సహాయకుడు, గ్రామ రెవెన్యూ అధికారి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్, అభ్యుదయ రైతు, సహకార పరపతి సంఘాలు, నీటి వినియోగదారుల సంఘాలు, మార్కెట్ కమిటీల సభ్యులు బృందంగా ఏర్పడి కార్యక్రమాన్ని నిర్వహించాలని పేర్కొంది. 'సీఎం చంద్రబాబు రాసిన లేఖ అందించడంతోపాటు రైతు సంక్షేమంపై కరపత్రాలు, పంచసూత్రాలతోపాటు ఏపీఏఐఎంఎస్ యాప్ వివరాలు రైతులకు తెలియజేయాలి. ప్రతి ఆర్‌ఎస్‌కే బృందం ఆరు రోజుల్లో 540 కుటుంబాల్ని చేరుకోవాలి. 24 నుంచి 29వ తేదీ వరకు ఇంటింటి ప్రచారం చేయాలి. నవంబరు 30 నుంచి డిసెంబరు 2 వరకు రైతు కుటుంబాల వారీగా సమాచారం సేకరించాలి. డిసెంబరు 3న సదస్సు నిర్వహించి 2026-27 వార్షిక ప్రణాళిక తయారుచేయాలి' అని సూచించింది.

తొలిరోజు 4.07 లక్షల కుటుంబాల చెంతకు..: రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 71.58 లక్షల రైతు కుటుంబాలు ఉన్నాయి. రైతన్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం 8,451 రైతు సేవా కేంద్రాల పరిధిలోని 11.93 లక్షల కుటుంబాల వద్దకు వెళ్లాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా నిర్ణయించింది. 4.07 లక్షల కుటుంబాల వద్దకు బృందాలు వెళ్లాయి. అన్నమయ్య, వైఎస్సార్ కడప, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో లక్ష్యంలో 50% పైగా సాధించారు. అనంతపురం, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, బాపట్ల, అల్లూరి సీతారామరాజు, పల్నాడు, కర్నూలు, శ్రీసత్యసాయి, శ్రీకాకుళం జిల్లాల్లో లక్ష్యంలో 30% లోపే ఉంది.

రూ.6 వేల కోట్లతో మచిలీపట్నంలో షిప్‌యార్డ్: మంత్రి కొల్లు



మచిలీపట్నం రూరల్ (ఘంటలమ్మపాలెం), న్యూస్‌టుడే: గోవా షిప్‌యార్డు రూ.6 వేల కోట్ల పెట్టుబడితో మచిలీపట్నంలో షిప్‌యార్డ్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చినట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నం మండలం ఘంటలమ్మపాలెంలో రూ.75 లక్షల నాబార్డు నిధులతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. '2026లో మచిలీపట్నం పోర్టు నిర్మాణం పూర్తవుతుంది. పరిసర ప్రాంతాల్లో రూ.40 కోట్లతో చేనేత పరిశ్రమ క్లస్టర్, కెమికల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్నాం. మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిని ఆరు వరుసలతో విస్తరించి అభివృద్ధి చేస్తాం' అని పేర్కొన్నారు.

బెట్టింగ్ వేయడానికి నేపాల్‌కు!

8 మంది ప్రకాశం జిల్లా యువకుల అరెస్టు

పామూరు, న్యూస్‌టుడే: క్రికెట్ బెట్టింగ్‌ల కోసం నేపాల్ వెళ్లిన 8 మంది ప్రకాశం జిల్లా యువకులు అక్కడి పోలీసులకు పట్టుబడిన వైనమిది. ఈ నెల 17 నుంచి ప్రారంభమైన నేపాల్ ప్రీమియర్ లీగ్ (ఎన్‌పీఎల్) క్రికెట్ టోర్నమెంట్ కాఠ్‌మాండూలోని త్రిభువన్ యూనివర్సిటీ మైదానంలో జరుగుతోంది. ఈ మ్యాచ్‌లపై బెట్టింగులు వేయడానికి ప్రకాశం జిల్లాకు చెందిన 8 మంది కాఠ్‌మాండూ బయలుదేరి వెళ్లారు. అద్దెకు తీసుకున్న ఓ ఇంట్లో వీరు బెట్టింగ్ నిర్వహిస్తుండగా అరెస్టు చేసినట్లు కాఠ్‌మాండూ వ్యాలీ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ కార్యాలయ ఎస్పీ కాజికుమార్ ఆచార్య పేర్కొన్నారు. నిందితుల్లో 8 మంది పామూరుకు చెందిన వారు కాగా, మరొకరిది సీఎస్‌పురం మండలం కోవిలంపాడు. వీరంతా కూలీలూ, చిరుద్యోగాలు చేసుకునే వారేనని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై పామూరు పోలీసులను సంప్రదించగా.. తమకు సమాచారం అందలేదని తెలిపారు.

నెల్లూరు మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసు

జేసీని కలిసి అందజేసిన 40 మంది కార్పొరేటర్లు

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతిని పదవి నుంచి తొలగించి, కొత్త మేయర్‌ను ఎన్నుకోవాలని 40 మంది కార్పొరేటర్లు జేసీ మొగిలి వెంకటేశ్వర్లును కలిసి అవిశ్వాస తీర్మానం నోటీసులిచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం జేసీని కలిసిన వారిలో తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్లు రూప్‌కుమార్ యాదవ్, తహసీన్‌తో పాటు ఇతర కార్పొరేటర్లున్నారు. నెల్లూరులోని 54 డివిజన్లలో వైకాపా కార్పొరేటర్లు గెలిచారు. వీరిలో 40 మంది ఇప్పటికే తెదేపాలో చేరారు. స్రవంతి మేయర్‌గా బాధ్యతలు చేపట్టి ఈ నెల 24తో నాలుగేళ్లు పూర్తవడంతో వారంతా అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారు.

అడ్డాకూలీలుగా 'లేపాక్షి హబ్' రైతులు

(మొదటి పేజీ తరువాయి)

హబ్‌లో పరిశ్రమలు రాకపోవడం, అందిన పరిహారం అప్పట్లోనే ఖర్చయిపోవడంతో కొందరు అడ్డాకూలీలుగా మారి పనుల కోసం పొరుగు రాష్ట్రం కర్ణాటకకు వెళుతున్నారు. ఈనాడు-ఈటీవీ క్షేత్రస్థాయిలో పరిశీలించగా హబ్ బాధితులు అత్యంత దుర్భర స్థితిలో కన్పించారు.

అసలేం జరిగింది?

రూ.వేల కోట్లతో పరిశ్రమలు పెట్టిస్తామని, 1.5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు లేపాక్షి హబ్ కోసం ప్రస్తుత సత్యసాయి జిల్లాలోని చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో 6,313 ఎకరాల ఎసైన్డ్ భూములను అప్పటి ప్రభుత్వం సేకరించింది. ఇందులో 5811.16 ఎకరాలను హబ్‌కు ఇచ్చింది. ఇవికాక మరో 3,032.8 ఎకరాల ప్రభుత్వ భూములనూ ఇచ్చింది. మొత్తం 8,844 ఎకరాల భూసంతర్పణ ప్రక్రియ 2006 నుంచి మూడేళ్లు సాగింది. ఒక ఎకరం ఎసైన్డ్ భూమికి పరిహారంగా మెట్ట అయితే రూ.1.75 లక్షలు, నీటి వసతి ఉంటే రూ.2 లక్షలుగా నిర్ణయించారు. ప్రభుత్వ భూమి సాగుదార్లకు పరిహారం ఇవ్వలేదు. అప్పటికే ఆ ప్రాంతంలో అధికారిక అంచనా ప్రకారమే ఎకరా మార్కెట్ విలువ రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ ఉంది. చిలమత్తూరు మండలంలో సేకరించిన ఎసైన్డ్ భూముల్లో మొత్తం 5,102 ఎకరాలకుగాను 925 ఎకరాలకు సంబంధించిన పరిహారం నేటికీ రైతులకు అందలేదు. ఆ మొత్తం దాదాపు 16.4 కోట్లు. గోరంట్ల మండలంలోనూ కొందరు రైతులకు పరిహారం అందలేదు. దీనిపై సమాచార హక్కు ద్వారా వివరాలు అడిగితే.. రికార్డులు కనిపించడంలేదని మండల, డివిజన్ అధికారులు చేతులెత్తేస్తున్నారు. వైఎస్సార్ హయాంలో ఆయన కుమారుడు జగన్ పాల్పడ్డ అక్రమాలపై కేసు నమోదైన 2011 నుంచి అధికారులు రైతులకు పరిహారం చెల్లింపును ఆపేశారు. నిజానికి కేసుతో పరిహారం చెల్లింపునకు సంబంధమే లేదు. ప్రస్తుతం హబ్ భూములను ఆనుకుని కర్ణాటకలో ఉన్న భూములను అక్కడి ప్రభుత్వం పరిశ్రమల కోసం సేకరిస్తోంది. అక్కడి రైతు సంఘాల క్రియాశీల పాత్రతో మార్కెట్ ధరల మేరకు ఎకరాకు రూ.70 లక్షల నుంచి రూ.కోటికి పైగా చెల్లిస్తోంది. ఈ పరిణామాలు లేపాక్షి రైతులను మరింత క్షోభకు గురిచేస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టి సారించి రైతులకు న్యాయం చేయాల్సిన అవసరముంది.

జగన్ దోపిడీ ప్రాజెక్టుల్లో ఇదొకటి

లేపాక్షి నాలెడ్జి హబ్ పేరుతో జరిగింది దోపిడీనే. కారుచౌకగా వైఎస్ సర్కారు నుంచి రూ.119.25 కోట్లకే 8,844 ఎకరాలను లేపాక్షి పేరుతో కొట్టేసిన ఇందూ సంస్థ.. ప్రాజెక్టు పనులు ప్రారంభించలేదు. పైగా ఈ భూములను తాకట్టు పెట్టి రూ.700 కోట్లకుపైగా రుణాన్ని బ్యాంకుల నుంచి పొందింది. ఆ మొత్తాన్ని ఇతర అవసరాలకు వాడుకుని దివాలా తీసింది. ఈ కుంభకోణంలో నాడు జగన్ కీలకపాత్ర పోషించారని, ఇందూ గ్రూపు నుంచి ప్రతిఫలంగా ఆయన కంపెనీల్లోకి రూ.70 కోట్లు వెళ్లాయని సీబీఐ తేల్చింది. దీనిపై సీబీఐ పెట్టిన కేసులో ఆయన ఏ1గా ఉన్నారు.

బాగేపల్లి అడ్డాలో ఇలా..

బెంగళూరు- హైదరాబాద్ రహదారిలో కర్ణాటక-ఆంధ్ర సరిహద్దును ఆనుకుని ఏపీ వైపు లేపాక్షి హబ్ గ్రామాలు ఉంటాయి. కర్ణాటక వైపు సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో బాగేపల్లి ఉంటుంది. ఆ ప్రాంతంలో అదే పెద్ద పట్టణం. బాగేపల్లిలోని గూలూరు సర్కిల్ కూలీలకు అడ్డా. నిత్యం ఉదయం 5.30-7 గంటల వరకూ అక్కడ ఐదారు వందల మంది కూలి పనుల కోసం వస్తారు. వారిలో లేపాక్షి హబ్ వల్ల భూములు కోల్పోయిన చిలమత్తూరు మండల రైతులే ఎక్కువగా ఉంటున్నారు.

ఏపని దొరికితే ఆపని..



కనిశెటిపల్లి గ్రామానికి చెందిన **ఎస్.రఘు**కు ఉన్న 5 ఎకరాల పొలం హబ్‌కు పోయింది. అప్పట్లో వచ్చిన పరిహారంతో ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేశారు. మిగిలిన డబ్బుతో కుమారుడి చదువుకు ఖర్చుచేశారు. "మా అబ్బాయి డిగ్రీ చదివాడు. హబ్‌లో పరిశ్రమలు ఏవీ రాక అతనికి ఉద్యోగమూ దొరకలేదు. ఏవో చిన్నచిన్న పనులు చేస్తుంటాడు. నేను రోజూ ఇలా బాగేపల్లి అడ్డాకు కూలి పనికోసం వస్తా. ఏ పని దొరికితే అది చేస్తా. ఎక్కువగా బేల్దారు పనులే ఉంటున్నాయి" అని ఆయన వాపోయారు.

కుటుంబం గడవాలిగా..



కోట్లోపల్లికి చెందిన **నాగేంద్రమ్మ** కుటుంబానికి ఉన్న మొత్తం ఐదెకరాల భూమి హబ్‌కు పోయింది. "అప్పట్లో రూ.8 లక్షల పరిహారం వచ్చింది. నాకు, నా భర్తకు ఆరోగ్యం బాగాలేక వచ్చిన డబ్బులు ఖర్చుపెట్టాం. నా భర్త జబ్బుతోనే చనిపోయారు. మిగిలిన డబ్బు అప్పట్లోనే పాత అప్పులకు, ఇతర ఖర్చులకు అయిపోయింది. మాకు పొలం ఉన్నప్పుడు శనగ, కందులు వేసేవాళ్లం. ఇప్పుడు మా అబ్బాయి ఆటో నడుపుతున్నాడు. నేను బాగేపల్లికి వచ్చి దొరికిన పని చేసుకుంటున్నా. మా కోడలు కూడా కూలికి వెళ్తోంది. కుటుంబం గడవాలిగా. ఇప్పుడు మా ఊళ్లో పొలాలు రూ.లక్షలు పలుకుతున్నాయి" అని ఆమె వాపోయారు.

పిల్లల్ని పెంచాలిగా..



కోడూరు ఎస్సీ కాలనీకి చెందిన కుంటూరు **పెద్ద బావయ్య**ది 2.5 ఎకరాల భూమి హబ్‌కు పోయింది. నిత్యం బాగేపల్లి అడ్డాకు వచ్చి పనులు వెతుక్కుంటున్నారు. 'సిమెంటు పనులకు ఎక్కువ వెళతా. అది దొరక్కపోతే ఇతర పనులకూ వెళతా. ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. వారిని బాగా పెంచాలిగా' అని ఆయన అన్నారు.

మా సమస్య వినే దిక్కులేదు.



మా బాధ గురించి చెప్పుకోవడానికి వెళ్లితే మండల, డివిజన్ అధికారులు కనీసం వినడానికి కూడా ఇష్టపడడం లేదని చిలమత్తూరు మండలం చిన్నపురెడ్డిపల్లి వాసి **జి.చౌడప్ప** వాపోయారు. ఆయనకు, ఆయన సోదరులకు సంబంధించి మొత్తం 16.56 ఎకరాలు ఎసైన్డ్ భూమి కింద సేకరించారు. తమది పట్టా భూమి అని, అలా గుర్తించి మార్కెట్ ప్రకారం పరిహారం ఇవ్వాలని వారి కుటుంబమూ 11.5 ఎకరాల విషయమై కోర్టుకు వెళ్లింది. దానిపై యథాతథ స్థితిని విధిస్తూ కోర్టు 2008లో ఆదేశాలు ఇచ్చింది. ఆ ఆదేశాలు పట్టించుకోకుండా రెవెన్యూ అధికారులు మొత్తం 16.56 ఎకరాలను తీసేసుకుని 2009లో కంపెనీ పేరున రిజిస్టర్ చేశారు. మొత్తం భూమికి సంబంధించి పరిహారం విషయం ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. దీంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక కర్ణాటక వెళ్లి చిన్నాచితక పనులు చేసుకుంటున్నానని చౌడప్ప తెలిపారు.

రహస్య స్నేహితుడు... అంత హితుడేం కాదు!



- అమెరికాలో స్టెయిన్ ఎరిక్ సోల్బర్గ్(56) అనే వ్యక్తి చాట్‌జీపీటీని విశ్వసించి, అదే వాస్తవమనే స్థితికి చేరారు. అది చెప్పిందని కన్నతల్లినే మట్టుబెట్టారు.
- జపాన్‌కు చెందిన కానో(32) అనే యువతి చాట్‌జీపీటీలో తాను సృష్టించిన ఏఐ భాగస్వామిని ఇటీవల వివాహం చేసుకుంది.
- అమెరికాకు చెందిన ఆడమ్ రైన్(16) అనే యువకుడు ఆత్మహత్య చేసుకోవడం ఎలా అని ఏఐని సలహా అడిగి మరీ ప్రాణాలు తీసుకున్నాడు.

తీరిక లేని జీవితాల్లో ఎవరి పరుగు వారిదే. అనుభూతుల్ని, అభిప్రాయాల్ని పంచుకుందామన్నా వినేవారు కరవయ్యారు. ఈ పరిస్థితుల్లో ఒంటరితనంతో కుంగిపోతున్న వారికి భావోద్వేగపరమైన మద్దతు అందిస్తున్నాయి ఏఐ చాట్‌బాట్‌లు. అయితే ఈ కృత్రిమ నేస్తాలకు అలవాటు పడ్డవారు సమాజానికి పూర్తిగా దూరమైపోతున్నారు. పరాధీనుల్లా మిగులుతున్నారు.

- కొన్ని ఏఐ చాట్‌బాట్‌లు, మానసిక ఆరోగ్య యాప్‌లు ఒంటరి వినియోగదారులతో 24 గంటలూ మాట్లాడుతున్నాయి. ఓ నివేదిక ప్రకారం సెకనుకు 20 వేల అభ్యర్థనలకు ఏఐ ప్రతిస్పందిస్తోంది.
- ఇతరులతో పంచుకోవడానికి సంశయించే విషయాలను కూడా సులభంగా చెప్పే సౌలభ్యం ఉండడం... తిరిగి ప్రశ్నిస్తారనే భయం లేకపోవడంతో సున్నిత విషయాలనూ వీటితో పంచుకుంటున్నారు.
- ఏఐతో సహచర్యం బలపడే కొద్దీ ప్రమాదాలూ పెరుగుతాయి. దాన్ని అధికంగా వినియోగిస్తే.. ఆందోళనలు ఎక్కువవుతాయి. చిత్త భ్రమలతో ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్న చాట్‌బాట్‌లున్నాయి.
- ఏఐపై ఎక్కువగా ఆధారపడితే.. వాస్తవిక సామాజిక బంధాలు బలహీనమవుతాయి. మానవ భావోద్వేగ సంకేతాలకు ప్రతిస్పందించే సామర్థ్యం, వ్యక్తుల మధ్య సన్నిహిత్యాన్ని తగ్గిస్తుంది.
- సులభంగా పనులు చేసేందుకు కొందరు ఏఐ సహాయం తీసుకుంటున్నారు. వారిలో సృజనాత్మకత, భావోద్వేగ వ్యక్తీకరణ, సామాజిక నైపుణ్యాలు తగ్గిపోతున్నాయి. ఆ చాట్‌బాట్‌లు పని చేయకపోతే నిస్సహాయత, కుంగుబాటుకు గురవుతున్నారు.
- కొన్ని అంకుర సంస్థలు వినియోగదారుల సమాచారాన్ని భద్రపరుచుకుంటున్నాయి. ఏఐ చెప్పిందని ఎంటర్ బటన్ నొక్కితే చాలు వినియోగదారుడి పేరు, చిరునామా, మొబైల్ నంబరు అన్నీ పరాయివారి చేతిలోకి వెళ్లిపోతున్నాయి.. దీంతో గోప్యత, భద్రత, సమాచార దుర్వినియోగంపై ఆందోళనలు రేకెత్తుతున్నాయి.

ఆధారపడితే అనర్థమే..

- చాట్ జీపీటీలో ఎక్కువగా వినియోగిస్తున్న వాటిలో లైంగిక సంభాషణలు రెండో స్థానంలో ఉన్నాయి. కొన్ని కంపెనీలు వయోజనుల కోసం లైంగిక కంటెంట్ చేసేలా యాప్‌లను తీసుకొస్తున్నాయి. యువత వీటికి అలవాటు పడితే తీవ్ర మానసిక సమస్యలు ఎదుర్కొంటారని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
- కొన్ని యాప్‌లు డబ్బును ఆర్జించేందుకు సబ్‌స్క్రిప్షన్ పేరుతో రుసుము వసూలు చేయడం నైతిక ఆందోళనలు లేవనెత్తుతోంది.
- కృత్రిమ కౌన్సెలింగ్‌పై కొన్ని దేశాలు ఇప్పటికే కొరడా ఝళిపించాయి. మార్కెట్‌లోని ఏఐ ఆధారిత మెంటల్ హెల్త్ యాప్‌ల విశ్వసనీయత విషయంలో భారతీయ సైకాలజిస్టులూ అనేక సందేహాలను వ్యక్తం చేస్తున్నారు.

బయటపడాలంటే..

- కుటుంబసభ్యులు, సన్నిహితులతో అభిప్రాయాలను పంచుకుంటే ఒంటరిగా ఉన్నామన్న భావన తగ్గుతుంది.
- ఆత్మీయ విశ్వసనీయ స్నేహితులతో ఎక్కువగా మాట్లాడటానికి, సమస్యలను తెలిపేందుకు ప్రయత్నించాలి.
- వ్యాయామం చేయడం, నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరుచుకుని నిరంతరం శ్రమించడంతో దృష్టిని మరల్చుకోవచ్చు.
- ఏఐ చాట్‌బాట్‌లు చెప్పే ప్రతి విషయం కచ్చితమైనది కాదని గుర్తుంచుకోవాలి.
- పిల్లలతో మాట్లాడి, ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని తల్లిదండ్రులు ధైర్యమివ్వాలి. వారు ఒంటరి భావన కలగనీయకూడదు.
- గతంలో చేసిన తప్పులు వారిని ప్రతిబింబించవని పిల్లలకు చెబుతూ ప్రేమ, ప్రోత్సాహాన్ని అందించండి. అన్ని విధాలా మార్గదర్శకం చేస్తూ తోడుగా ఉంటామనే నమ్మకాన్ని కలిగించండి.

- ఈనాడు ప్రత్యేక విభాగం

పర్యావరణ సంరక్షకుడు



రాళ్లపల్లి లక్ష్మణస్వామి ఇంటికి వచ్చి మొక్కలు తీసుకెళ్తున్న ప్రజలు



ప్రకృతి విపత్తులు, నగరీకరణ నేపథ్యంలో ఎక్కడికక్కడ చెట్లు నేలకొరుగుతున్నాయి. దీనితోడు కొన్నేళ్లుగా చోటుచేసుకుంటున్న వాతావరణ మార్పులు ఆయన్ని తీవ్రంగా ఆలోచింపజేశాయి. స్వతహాగా వైద్యుడు కావడంతో జబ్బు చేసిన మనిషికి వైద్యం చేసినట్లే.. పర్యావరణానికీ చికిత్స చేయాలని సంకల్పించారు. అలా మూడేళ్లుగా ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తున్నారు. ఇందుకోసం రూ.35 లక్షలు ఖర్చు చేశారు. ఆయనే కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన చిన్నాపురం డాక్టర్‌గా పేరొందిన రాళ్లపల్లి లక్ష్మణస్వామి. 2023లో 22 వేలు, 2024లో 40 వేలు, 2025లో ఇప్పటివరకు 62 వేల చొప్పున మొక్కలు అందజేశారు. స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ముందుగానే టోకెన్లు ఇచ్చి, అవి తెచ్చినవారికి తన ఇంటివద్ద మొక్కలు ఇస్తున్నారు. నీడనిచ్చే వాటితో పాటు మామిడి, జామ, వాటర్ యాపిల్, నిమ్మ, నారింజ, బత్తాయి, దానిమ్మ, ఇలా అనేక పండ్ల మొక్కలు, పలు రకాల పూలమొక్కలు కడియం నుంచి తెచ్చి మరీ పంచుతున్నారు.

– న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

240 కోట్ల ఏళ్ల నాటి గ్రానైట్‌తో పునాది



మంగళవారం నిర్వహించనున్న ధ్వజారోహణ కార్యక్రమం సందర్భంగా సోమవారం రాత్రి విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా కాంతులీనుతున్న అయోధ్య రామాలయ ప్రాంగణం

అయోధ్య రామమందిర పునాదిలో ఉపయోగించిన గ్రానైట్ దాదాపు 240 కోట్ల సంవత్సరాల పాతది, చాలా బలమైంది అని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్‌కు చెందిన సీనియర్ శాస్త్రవేత్త యోగేంద్రసింగ్ తెలిపారు. దిల్లీ వేదికగా ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ (ఐఐటీఎఫ్)లో అయోధ్య రామ మందిర నమూనాను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ కేంద్ర గనుల మంత్రిత్వశాఖ నిపుణుల సంయుక్త టీమ్ ప్రదర్శించింది. ఆలయం నిర్మాణ రహస్యాలను, నిర్మాణంలో వినియోగించిన బలమైన బండరాళ్ల సమాచారాన్ని సందర్శకులకు వారు వివరిస్తున్నారు. 'ఈ మందిరం వేల ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా నిలిచేలా నిర్మాణ పనులు జరిగాయి. ప్రతి దిమ్మెను నిర్మాణ పనుల్లో ఉపయోగించే ముందు, దాని బలం, మన్నికను టెస్ట్ చేశారు' అని యోగేంద్రసింగ్ వివరించారు. 'ప్రతి బండరాయికి ప్రొఫైలర్ టెస్టింగ్ చేశారు. జియో-మెకానికల్ పారామితుల ఆధారంగా దాని లోపల ఏమైనా పగుళ్లు ఉన్నాయా అనేది తెలుసుకునే ప్రయత్నం చేశారు. బండరాళ్లకు కోర్ నమూనా పరీక్షలు చేశారు. ఇందులో ఆ రాళ్ల శాంపిల్స్‌ను సేకరించి, అన్ కన్‌ఫైన్డ్ కంప్రెసివ్ స్ట్రెంత్ పరీక్ష చేశారు. దీనివల్ల బండరాయి ఎంతటి ఒత్తిడిని తట్టుకొని నిలువగలదనే తేలుతుంది. అంతర్గత పగుళ్లను గుర్తించేందుకు వాటికి అల్ట్రాసోనిక్ స్పీడ్ పరీక్షలు చేశారు" అని నిర్మాణ ప్రత్యేకతలను కళ్లకు కట్టారు.



శ్వేత సాలీడు.. కట్టింది గూడు

ఇంటి ఆవరణలో చిన్నచిన్న కీటకాలను పట్టుకునేందుకు గూళ్లు కట్టుకొనే సాలె పురుగులను చూస్తుంటాం. ప్రపంచవ్యాప్తంగా మొత్తం 40 వేల రకాల సాలె పురుగులున్నట్లు ఇప్పటివరకు గుర్తించారు. వీటిల్లో కొన్ని చెట్లపైనే తిరుగుతూ వాటి రంగుల్లో కలిసిపోతుంటాయి. ఇలాంటివి అరుదుగా తారసపడతాయి. గోల్డెన్ రాడ్‌క్రాబ్ అనే శ్వేత వర్ణ సాలీడు ఈ రకానికి చెందినదే. నంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణంలోని సాయిబాబానగర్‌లో తెల్ల గన్నేరు చెట్టు పువ్వుపై కనిపించిందీ సాలీడు. కాలి చివరి భాగాల్లో బంగారు వర్ణాన్ని కలిగి ఉండే ఈ సాలె పురుగు.. కీటకాలను పట్టుకునేందుకు అల్లే గూడు కోసం పట్టులాంటి జెల్లీని వదులుతూ ఆకట్టుకుంది.

– న్యూస్‌టుడే, ఆత్మకూరు



'కొంగ'త్త అందం.. కంకణాయి!

ఈ చిత్రంలో అచ్చం కొంగల్లా కనిపిస్తున్న పక్షులను బ్లాక్‌హెడెడ్ ఐబిస్‌గా పిలుస్తారు. స్థానికంగా వీటిని తెల్ల కంకణాయి అంటారు. దక్షిణాసియా దేశాల్లోని చిత్తడి నేలల్లో ఇవి కనిపిస్తుంటాయి. శరీరం అంతా తెల్లటి ఈకలతో, తల, ముక్కు, కాళ్లు నల్లగా ఉండడం వీటి ప్రత్యేకత.. వంగిన నల్లని ముక్కుతో బురదలో ఆహారాన్ని వెతికి పట్టుకుంటాయి. సంతానోత్పత్తి కోసం వేల కిలోమీటర్లు ప్రయాణించి దక్షిణ భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు వలస వస్తాయి. ప్రస్తుతం కాకినాడ సముద్ర తీర సమీపంలోని వాకలపూడిలో సందడి చేస్తున్నాయి.

– ఈనాడు, కాకినాడ

బంకే.. కానీ పెట్రోల్ కొట్టరు!



పెట్రోల్ బంక్ ఏంటీ వెరైటీగా ఉంది అని చూస్తున్నారా...! ఇదీ బంకే.. కానీ ఇందులో కొట్టేది మాత్రం పెట్రోలు, డీజిల్ కాదు. యాడ్‌బ్లూగా చెప్పుకొనే డీఈఎఫ్ (డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్) అనే ద్రవం ఉంటుంది. బీఎస్4, బీఎస్ 6 ఆధునిక డీజిల్ ఇంజిన్ వాహనాలకే దీన్ని వినియోగిస్తారు. డీజిల్ వాహనాల నుంచి వచ్చే కాలుష్య కారకాలను నివారించేందుకు ఈ ద్రవం పని చేస్తుంది. ముఖ్యంగా నైట్రస్ ఆక్సైడ్‌ను నైట్రోజన్‌గా విడుదలయ్యేలా మారుస్తుంది. దీనికోసమే బీఎస్4, బీఎస్6 వాహనాలకు డీజిల్ ట్యాంకు పక్కనే మరో చిన్న ట్యాంకు ఉంటుంది. యాడ్‌బ్లూ లేకుండా డీజిల్ వాహనం నడవదు. సాధారణంగా ఒక లీటర్ యాడ్‌బ్లూతో కారు 600 నుంచి 1000 కి.మీ., లారీలు, ట్రక్కుల వంటి భారీ వాహనాలకు 300 నుంచి 400 కి.మీ. ప్రయాణిస్తాయి. జాతీయ రహదారిపై దూరాలు వెళ్లే వాహనాల కోసం ఓ మొబైల్ బంకును రోడ్డు పక్కనే ఏర్పాటు చేశారు. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఇబ్రహీంపట్నం సమీపంలో కనిపించిందీ బంకు.

– ఈనాడు, అమరావతి

జీవితాన్ని ఆటోపైలట్‌లో పెట్టొద్దు



జీవితాన్ని ఆటోపైలట్ మోడ్‌లో నడిపిస్తూ గాలివాటంగా బతికేయకండి. ప్రణాళికబద్ధంగా జీవితాన్ని కొనసాగించడంపై దృష్టి పెట్టండి. ప్రతి రోజూ, వారం, నెల, సంవత్సరానికి సంబంధించి స్పష్టమైన లక్ష్యాలను విధించుకోండి. వాటిని అందుకోవడానికి శాయశక్తులా కృషి చేయండి. అప్పుడే గొప్ప జీవితం సొంతమవుతుంది.

– బి.ఎస్.గుప్తా, యోగా ట్రయినర్

పాఠశాలకు రూ.2 కోట్ల విలువైన స్థలం వితరణ



స్థలం పత్రాలను కలెక్టర్‌కు ఇస్తున్న దాత, గ్రామ పెద్దలు

మచిలీపట్నం (కలెక్టరేట్), న్యూస్‌టుడే: హైస్కూల్ విద్య కోసం తన ఊరి విద్యార్థులు నాలుగైదు కి.మీ. దూరం వెళ్లాల్సిన దుస్థితిని తప్పించేందుకు రూ.2 కోట్ల విలువ చేసే స్థలాన్ని ఓ వ్యక్తి ఉదారంగా ఇచ్చేశారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ఉప్పులూరులో జిల్లా పరిషత్ హైస్కూల్ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన రైతు అన్నే పద్మనాభరావు ముందుకొచ్చారు. 50 సెంట్ల స్థలానికి సంబంధించిన పత్రాలను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ బాలాజీకి అందించారు. అక్కడ నిర్మించబోయే పాఠశాల భవనానికి దాత తల్లిదండ్రులు రామలింగయ్య, రాజ్యలక్ష్మి పేరు పెట్టనున్నారు. విద్యాభివృద్ధి కోసం విలువైన స్థలాన్ని దానంగా ఇవ్వడం ప్రశంసనీయమని కలెక్టర్ అభినందించారు.

జనవరి 18న లోక్‌నాయక్ పురస్కారాల ప్రదానం

విశాఖపట్నం (ఏయూ ప్రాంగణం), న్యూస్‌టుడే: లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారాలను జనవరి 18న ప్రదానం చేయనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ వెల్లడించారు. ఒక సాహిత్య, నాలుగు జీవన సాఫల్య పురస్కారాలకు ఐదుగురిని ఎంపిక చేసినట్లు తెలిపారు. సోమవారం ఏయూ హిందీ భవన్‌లో ఆయన మాట్లాడారు. 'సాహిత్య పురస్కారాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం పూర్వ ఆచార్యులు వెలమల సిమ్మన్నకు ఇవ్వనున్నాం. ఆయనకు అవార్డుతో పాటు రూ.2 లక్షల నగదు బహుమతి అందిస్తాం. ప్రఖ్యాత క్యాన్సర్ చికిత్స నిపుణుడు డా.నోరి దత్తాత్రేయుడు, డల్లాస్‌లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డా.తోటకూర ప్రసాద్, డెట్రాయిట్‌కు చెందిన వైద్యుడు డా.వేములపల్లి రాఘవేంద్ర చౌదరి, సెంట్రల్ లండన్ డిప్యూటీ మేయర్ ఆర్యన్ ఉదయ్ ఆరేటిలను జీవన సాఫల్య పురస్కారాలకు ఎంపిక చేశాం. వీరికి అవార్డుతో పాటు రూ.లక్ష చొప్పున నగదు బహుమతి అందిస్తాం' అని తెలిపారు. ఎన్టీఆర్, డా.హరివంశ్‌రాయ్ బచ్చన్ (ప్రముఖ హిందీ నటుడు అమితాబ్ బచ్చన్ తండ్రి)ల గౌరవ సూచకంగా వారిరువురి వర్ధంతి రోజైన జనవరి 18న ఈ అవార్డులు అందించనున్నట్లు లక్ష్మీప్రసాద్ వివరించారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్, ప్రముఖ నటుడు, రచయిత తనికెళ్ల భరణి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా ఈ పురస్కారాల ప్రదానం జరుగుతుందన్నారు.

కృష్ణమ్మకు మహావస్త్రం సమర్పణ





కృష్ణవేణికి హారతి సమర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, విజయలక్ష్మి దంపతులు ◆ నదీమ తల్లికి సమర్పించిన మహావస్త్రం

నాగాయలంక, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా నాగాయలంక శ్రీరామపాద పుష్కర్ ఘాట్‌లో సోమవారం కృష్ణా నదికి మహావస్త్రం సమర్పించారు. ముందుగా నాగాయలంక కూడలి నుంచి మేళతాళాలతో.. 504 చీరలను ముడులు వేసిన మహావస్త్రాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఘాట్‌లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, విజయలక్ష్మి దంపతులతో పాటు పలువురు ముత్తైదువులు కృష్ణమ్మకు పసుపు కుంకుమలు, హారతి సమర్పించారు. తరువాత మహావస్త్రాన్ని పడవలపై తీసుకెళ్లి నదీమ తల్లికి సమర్పించారు.

'ములకలచెరువు' కేసులో నిందితులుగా జోగి సోదరులు!

- నకిలీ మద్యం వ్యవహారంలో వీరి ప్రమేయంపై ఆధారాలు
- త్వరలో కేసు నమోదు చేయనున్న ఎక్సైజ్ పోలీసులు

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో వెలుగుచూసిన నకిలీ మద్యం కేసులో అరెస్టయిన మాజీ మంత్రి జోగి రమేష్, అతని సోదరుడు జోగి రాముపై మరో కేసు నమోదు కానుంది. నకిలీ మద్యం వ్యవహారం తొలుత వెలుగుచూసిన అన్నమయ్య జిల్లా ములకలచెరువులోనూ వీరిపై కేసు నమోదు చేయనున్నట్లు తెలిసింది. విజయవాడ భవానీపురం ఎక్సైజ్ స్టేషన్‌లో నమోదు చేసిన కేసుకు సంబంధించి ఇప్పటికే జోగి సోదరులు నెల్లూరు కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్నారు. ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ వ్యవహారంలో జోగి సోదరుల ప్రమేయం, కుట్ర గురించి సిట్, ఎక్సైజ్ అధికారులు ఆధారాలు సేకరించారు. జోగి రాముకు నగదు రూపంలో ముడుపులు ఇచ్చినట్లు.. ప్రధాన నిందితులు అద్దేపల్లి జనార్దనరావు, ఆయన సోదరుడు జగన్మోహనరావులు విచారణలో తెలిపారు.

జోగి రాము, జనార్దనరావుల మధ్య యూపీఐ లావాదేవీలు?


జనార్దనరావు, జోగి రాము మధ్య యూపీఐ లావాదేవీలు జరిగినట్లు సిట్, ఎక్సైజ్ అధికారుల పరిశీలనలో తాజాగా వెలుగులోకి వచ్చింది. గత వారం పోలీసు కస్టడీలో జనార్దనరావు ఈ విషయాన్ని అంగీకరించినట్లు సమాచారం. కొన్ని రోజులుగా పోలీసులు జోగి రమేష్, రాము, జనార్దనరావు, జగన్మోహనరావుల బ్యాంకు ఖాతాల వివరాలను తీసుకుని పరిశీలిస్తున్నారు. వారి మధ్య యూపీఐ లావాదేవీల విషయం బయటపడినట్లు తెలిసింది.

◆ సెప్టెంబరు 23న ఉదయం 8.30 గంటలకు ఆఫ్రికా వెళ్లే ముందు ఇబ్రహీంపట్నంలోని జోగి రమేష్ ఇంటికి వెళ్లి ఆయనను కలిసినట్లు విచారణలో జనార్దనరావు చెప్పాడు. ఆఫ్రికాలో సొంత డిస్టిలరీ పెట్టుకునేందుకు రూ.3 కోట్లు ఆర్థిక సాయం చేస్తానని జోగి రమేష్ హామీ ఇచ్చినట్లు వెల్లడించాడు. సీఎం చంద్రబాబును, కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నకిలీ మద్యం తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని రమేష్ తనను పిలిచి గతంలో చెప్పాడని పేర్కొన్నాడు. ఆయన ప్రలోభాలకు లొంగి ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ ప్రారంభించామని జనార్దనరావు వివరించాడు. సెప్టెంబరు 23న వీరు ఒకే టవర్ లొకేషన్ పరిధిలో ఉన్నట్లు ఆధారాలు సైతం లభించాయి. దీంతో జోగి సోదరులపై ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదు చేయనున్నారు. ఇప్పటికే రిమాండ్‌లో ఉన్న వీరిపై పీటీ వారెంట్ వేసి ములకలచెరువు కోర్టులో హాజరుపరిచే అవకాశాలు ఉన్నాయి.

కర్ణాటకలో రాజకీయ సందిగ్ధానికి నేడో, రేపో తెర!

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ సమక్షంలో చర్చకు రంగం సిద్ధం

ఈనాడు, బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్‌లో అధికార పంపిణీ కోసం రాజుకున్న రాజకీయ అనిశ్చితికి ఒకట్రెండు రోజుల్లో తెరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటన ముగించుకుని మంగళవారం దిల్లీకి చేరనున్నారు. ఆయన సమక్షంలోనే రాష్ట్ర రాజకీయ పరిణామాలపై చర్చించేందుకు రంగం సిద్ధమైంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గత నాలుగు రోజులుగా బెంగళూరులోనే ఉండి, రాష్ట్ర రాజకీయాలపై సమీక్షించారు. మంగళవారం దిల్లీకి చేరుకుని- పార్టీ అగ్రనేతలతో ఆయన భేటీ కానున్నట్లు తెలిసింది. మరోవైపు పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ వయనాడ్‌కు వెళ్తూ మధ్యలో బెంగళూరులో పార్టీ నేతలతో సమావేశం కానున్నారు. వీరి నుంచి సమాచారాన్ని సేకరించిన తర్వాత రాహుల్ గాంధీ ఓ నిర్ణయానికి రావొచ్చని చెబుతున్నారు. అంతకుముందు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులను దిల్లీకి రప్పించి వారితో చర్చిస్తారని తెలుస్తోంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నాయకత్వాన్ని అప్పగించేందుకు ససేమిరా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. సోమవారం ఓ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని ప్రకటించారు. తమకు అధిష్ఠానం ఉందని.. వారు ఏం చెబితే అది వినాల్సిందేనని స్పష్టంచేశారు.



సోమవారం ఓ ప్రభుత్వ కార్యక్రమ వేదికపై సీఎం సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

సీఎం చెప్పిందే వేదవాక్యం: డీకే

సిద్ధరామయ్య వ్యాఖ్యలపై ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందిస్తూ ముఖ్యమంత్రి చెప్పిందే వేదవాక్యమని పేర్కొన్నారు. పార్టీలో ఎలాంటి సందిగ్ధతా లేదన్నారు. బెంగళూరుకు వచ్చిన ఖర్గేతో భేటీ కాకపోవడానికి ప్రత్యేక కారణాలేవీ లేవని, పదేపదే ఆయన్ను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. దిల్లీకి వెళ్లి ఆయనతో నేరుగా మాట్లాడతానని డీకే స్పష్టం చేశారు.

దిల్లీకి బృందం: గతవారం డీకేకు మద్దతుగా కొందరు ఎమ్మెల్యేలు దిల్లీకి వెళ్లగా సోమవారం మరికొందరు ఎమ్మెల్యేలు ఇదే బాటపట్టారు. మరోవైపు అధిష్ఠానం తరఫున సీనియర్ మంత్రి కె.జె.జార్జ్ ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో డీకే, సిద్ధరామయ్యల డిమాండ్లపై చర్చించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

కోకాపేట.. కోట్లే కోట్లు

- నియోపొలిస్‌లో ఎకరా రూ.137 కోట్లు
- హెచ్ఎండీఏ వేలంలో రికార్డు ధర

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం కోకాపేటలో.. కో అంటే కోట్లు వాలుతున్నాయి. సోమవారం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలో కోకాపేటలోని నియోపొలిస్ లేఅవుట్‌లో నిర్వహించిన ఈ-వేలంలో ఎకరం రూ.137.25 కోట్ల రికార్డు ధర పలికింది. 239, 240 సర్వే నంబర్లలోని 17, 18 ప్లాట్లలోని బహుళ వినియోగ జోన్‌లో మొత్తం 9.90 ఎకరాలను అధికారులు ఈ-వేలం ద్వారా విక్రయించారు. ఎకరాకు సర్కారు ధర రూ.99 కోట్లుగా నిర్ణయించారు. 18వ ప్లాట్‌లో 5.31 ఎకరాలుండగా.. ఎకరాకు గరిష్ఠంగా రూ.137.25 కోట్లు, ప్లాట్ నంబరు 17లో 4.59 ఎకరాలుండగా.. ఎకరాకు రూ.136.5 కోట్ల ధర పలికింది. మొత్తం 9.90 ఎకరాల వేలంతో రూ.1,356 కోట్ల ఆదాయం వచ్చినట్లు హెచ్ఎండీఏ వెల్లడించింది. రెండేళ్ల క్రితం ఇదే లేఅవుట్‌లో హెచ్ఎండీఏ నిర్వహించిన వేలంలో ఎకరం రూ.100.75 కోట్లకు అమ్ముడుపోయి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆనాడు మొత్తం 3.6 ఎకరాలకు రూ.362.70 కోట్లు వచ్చాయి. క్రమంగా ఈ ప్రాంతంలోని భూముల ధరలు ఆకాశమే హద్దుగా పెరుగుతున్నాయి. ప్రస్తుత ఈ-వేలంలో భూ విలువలో 87% వృద్ధి కనిపించింది.

మహానందీశునికి ఎన్నారై మహిళ రూ.1.25 కోట్ల విరాళం



దాత నుంచి అంగీకార పత్రాలను అందుకుంటున్న ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి

మహానంది, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లాలోని మహానంది పుణ్యక్షేత్రానికి ప్రవాస భారతీయురాలు భారీ విరాళాన్ని ప్రకటించారు. దేవస్థానం ఆధ్వర్యంలో నూతనంగా రూ.10.50 కోట్లతో నందీశ్వర సదనం నిర్మిస్తున్నారు. ఇందులో రూ.1.25 కోట్లతో మొదటి అంతస్తును నిర్మించేందుకు హైదరాబాద్‌కు చెందిన ఎన్నారై సరోజ ముందుకొచ్చారు. ఈ మేరకు అంగీకార పత్రాలను దేవస్థానం అధికారులకు సోమవారం అందజేశారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈవో ఎర్రమల మధు, వేద పండితులు రవిశంకర అవధాని, హనుమంతరాయ శర్మ పాల్గొన్నారు. దాత, ఆమె బంధువులను దేవస్థాన పండితులు, అధికారులు శేషవస్త్రాలతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు.

మీరు ఫిర్యాదుదారూ కాదు.. బాధితుడూ కాదు

- అందుకే మీ పిటిషన్ రిటర్న్ చేస్తున్నాం
- పాత్రికేయుడు బాలగంగాధర్ తిలక్‌కు ఏసీబీ కోర్టులో ఎదురుదెబ్బ

ఈనాడు, అమరావతి: 'రాజధాని అమరావతిలో ఎసైన్డ్ భూముల కొనుగోలులో అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదులపై 2020లో ఏపీ సీఐడీ నమోదు చేసిన కేసుల్లో మీరు ఫిర్యాదుదారు కాదు. బాధితుడూ కాదు. అందుకే మీ పిటిషన్‌ను రిటర్న్ చేస్తున్నాం' అంటూ పాత్రికేయుడు కె.బాలగంగాధర్ తిలక్‌కు విజయవాడ ఏసీబీ కోర్టు స్పష్టం చేసింది. 2014-19 మధ్య తెదేపా పాలనా కాలంలో రాజధాని అమరావతిలో ఎసైన్డ్ భూముల కొనుగోలులో అక్రమాలు జరిగాయంటూ వైకాపా హయాంలో అప్పటి ప్రతిపక్ష నేత, తెదేపా అధినేత చంద్రబాబు సహా మరికొందరిని నిందితులుగా పేర్కొంటూ సీఐడీలో రెండు వేర్వేరు కేసులు నమోదయ్యాయి. యల్లమాటి ప్రసాద్‌కుమార్, నల్లూరు రవికిరణ్ అనే వ్యక్తులిచ్చిన వేర్వేరు ఫిర్యాదుల ఆధారంగా ఈ కేసులు పెట్టారు. ఈ రెండు కేసులను మూసేస్తూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసేందుకు సీఐడీ అధికారులు సిద్ధమవుతున్నట్లు తనకు సమాచారం అందిందని విజయవాడకు చెందిన పాత్రికేయుడు తిలక్ ఏసీబీ కోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. 'చంద్రబాబు, ఇతర నిందితులపై గత ప్రభుత్వ హయాంలో సీఐడీ నమోదు చేసిన కేసుల దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ 2024లో నేను హైకోర్టులో పిల్ దాఖలు చేశా. ప్రస్తుతం ఆ పిల్‌పై విచారణ పెండింగ్‌లో ఉంది. అందుకే ఈ కేసుల్లో సీఐడీ క్లోజర్ పిటిషన్‌లు దాఖలు చేస్తే వాటికి సంబంధించి ఎలాంటి ఉత్తర్వులూ జారీ చేయొద్దు' అంటూ తిలక్ తన పిటిషన్‌లో ఏసీబీ కోర్టు కోరారు. అయితే ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం.. దానిని వెనక్కి ఇచ్చేసింది.

ఏడుగురు మావోయిస్టుల కస్టడీకి పిటిషన్లు

ఈనాడు, అమరావతి: విజయవాడ పరిసర ప్రాంతాల్లో ఇటీవల అరెస్టయిన మావోయిస్టుల్లో ముఖ్యులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించేందుకు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పోలీసులు విజయవాడలోని వేర్వేరు కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేశారు. నగర పరిధిలో పట్టుబడిన రంగు అలియాస్ బీమా, లక్మ అలియాస్ మదన్, చిన్మయ్ అలియాస్ మనీలా, మంగి ప్రస్తుతం నెల్లూరు కారాగారంలో ఉన్నారు. వీరిని ప్రశ్నించేందుకు కస్టడీ పిటిషన్‌ను పటమట పోలీసులు దాఖలు చేశారు. నోటీసుల నిమిత్తం మంగళవారానికి వాయిదా పడింది. ◆ కానూరు కొత్త ఆటోనగర్‌లో పట్టుబడిన 28 మంది మావోయిస్టుల్లో ముగ్గురి కస్టడీ కోసం పెనమలూరు పోలీసులు కస్టడీ పిటిషన్ వేశారు. స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు ఉద్దే రఘు (ఏ1), గంగలూరు ఏరియా కమిటీ సభ్యురాలు ఓయం జ్యోతి (ఏ2), ఏరియా కమిటీ సభ్యుడైన మదకం దివాకర్ అలియాస్ మిట్టులను వారం రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరారు.

EENADU Vol: 52, Issue: 105 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao



చర్మానికి చలి వేతలు

చలికాలమంటేనే శీతగాలి కోత. అదీ పొడిగాలి తాకిడి. దీంతో చర్మం తేమను కోల్పోతుంది. మరోవైపు చర్మంలో సహజ నూనె ఉత్పత్తీ తగ్గుతుంది. దీంతో చర్మం పొడిబారుతుంది. చివరికి చర్మం మీది రక్షణ పొర సైతం దెబ్బతింటుంది. ఫలితంగా చర్మం కళ కోల్పోవటమే కాదు.. కొన్ని సమస్యలూ ముంచుకొస్తాయి. అప్పటికే ఉన్న సోరియాసిస్, ఎగ్జిమా వంటివీ ఉద్ధృతమవుతుంటాయి. మరి చలికాలంలో వీటిని అదుపులో ఉంచుకునేదెలా? చర్మం మరింత దెబ్బతినకుండా చూసుకునేదెలా? తెలుసుకుందాం పదండి.

సోరియాసిస్ పొలుసుల బెడద

చర్మాన్ని పొలుసులు పొలుసులుగా.. పొట్టుపొట్టుగా రాలగొట్టే సోరియాసిస్ దీర్ఘకాల సమస్య. రాలిపోయే వాటి కన్నా కొత్త చర్మకణాలు ఎక్కువగా పుట్టుకురావటమే దీనికి మూలం. చలికాలంలో చర్మం పొడిబారటం వల్ల ఇది ఉద్ధృతమవుతుంటుంది కూడా. నూటికి 80 మందిలో ఇలాంటి పరిస్థితిని గమనిస్తుంటాం.

జాగ్రత్తలు ఇవీ..

● వేడినీటితో స్నానం చేస్తున్నప్పుడు హాయిగానే ఉంటుంది. కానీ ఇది చర్మంలోని నూనెను తొలగిస్తుంది. దీంతో చర్మం పొడిబారటం ఎక్కువవుతుంది. ఇది రోజంతా చర్మాన్ని చికాకు పరుస్తూనే వస్తుంది. కాబట్టి గోరువెచ్చటి నీటితో స్నానం చేయాలి. వట్టి నీరైతే ఇంకా మంచిది.

● మరీ ఎక్కువసేపు స్నానం చేయొద్దు. టబ్ స్నానము పనికిరాదు. శరీరానికి సబ్బు రుద్దుకొని, దాన్ని కడిగేసుకోవటం వరకే బాత్రూమ్‌లో ఉండాలి.

● స్నానానికి నూనె తక్కువగా వచ్చే సబ్బు వాడుకోవాలి. పొలుసులు పోతాయని బలంగా రుద్దటం తగదు. రుద్దుకోవటంతో పొలుసులు వస్తూనే ఉంటాయి. స్నానం చేశాక తువ్వాలును సున్నితంగా అద్దుతూ తుడుచుకోవాలి.

● తడిగా ఉన్నప్పుడే ఒంటికి మాయిశ్చరైజర్ రాసుకోవాలి. అప్పుడు చర్మానికి, మాయిశ్చరైజర్‌కు మధ్య నీటి పొర ఏర్పడుతుంది. అది చర్మంలోకి చేరుకొని, పొడిబారకుండా కాపాడుతుంది. అవసరాన్ని బట్టి డాక్టర్ సిఫారసు చేసిన స్టిరాయిడ్ క్రీముల వంటివి రాసుకుంటే మరింత ఫలితం కనిపిస్తుంది.

● చలికాలంలో ఎండ తగినంత బాగానే ఉంటుంది. కానీ సోరియాసిస్ గలవారు మరీ ఎక్కువసేపు.. ముఖ్యంగా ఉదయం 10 గంటల తర్వాత ఎండలో ఉండొద్దు. అదేపనిగా చర్మానికి ఎండ తగిలితే అతినీలలోహిత కిరణాల ప్రభావంతో ఎక్కువగా చికాకు గురవుతుంది. ఉదయం 10 గంటలలోపు కాస్త ఎక్కువసేపు కూర్చున్నా ఇబ్బందేమీ ఉండదు. ఏదేమైనా ఎండలోకి వెళ్లేటప్పుడు ఒంటికి మాయిశ్చరైజర్ రాసుకోవటం మంచిది.



డా॥ జీసన్ సందీప్, డెర్మటాలజిస్ట్, సాస్కిన్ లేజర్ స్కిన్ అండ్ హెయిర్ క్లినిక్, బంజారాహిల్స్, హైదరాబాద్

● చలికాలంలో లభించే చిలగడ దుంపలు తినటం మేలు. వీటిలోని విటమిన్ ఏ సమస్య ఉద్ధృతం కాకుండా కాపాడుతుంది.

● చలిగాలి చర్మాన్ని చికాకు పరచి, సోరియాసిస్ ఉద్ధృతమయ్యేలా చేస్తుంది. కాబట్టి ఒంటికి చలిగాలి తగలకుండా చూసుకోవాలి. అయితే నూలు దుస్తులు ధరిస్తే మంచిది. చర్మాన్ని చికాకు పరిచే పట్టు, నైలాన్ దుస్తులు వద్దు. అలాగే స్వెట్టర్, ఉన్ని దుస్తులను నేరుగా చర్మానికి తగలనీయొద్దు. నూలు దుస్తుల మీద స్వెట్టర్ ధరించాలి.

● చలి పెరుగుతోందని వ్యాయామాన్ని పక్కన పెట్టొద్దు. వ్యాయామం చేస్తే సోరియాసిస్ తగ్గుముఖం పడుతుందని గుర్తించాలి. అయితే వ్యాయామం చేయటంతో వెలువడే చెమటతో శరీరానికి మాయిశ్చరైజర్ రాసుకోవాలి. లేదంటే చలిగాలికి చర్మం మరింత పొడిబారే ప్రమాదముంది.

● చలికాలంలో మానసిక సమస్యల ముప్పు ఎక్కువే. ఇవీ సోరియాసిస్ మరింత ఉద్ధృతమయ్యేలా చేస్తాయి. కాబట్టి యోగా, ప్రాణాయామం, ధ్యానం వంటి వాటితో ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలి.

● తగినంత నీరు తాగటం చాలా ముఖ్యం.

చుండ్రు పొడి పొడిగా

తలలో చుండ్రుతో బాధపడేవారిలో మాడు అప్పటికే పొడిగా ఉంటుంది. చలికాలంలో ఎక్కువ షాంపూలు వాడటం వల్ల మరింత ఎక్కువవుతుంటుంది. తలంతా పొట్టు రాలుతున్నట్టుగా కనిపిస్తుంది. కొందరు దీన్ని సోరియాసిస్ అని భయపడుతుంటారు. సోరియాసిస్ గలవారిలో తలలో అక్కడక్కడ పొలుసులు వస్తుంటాయి. కానీ చుండ్రు సమస్య తల నిండా కనిపిస్తుంటుంది.

● ముందు తలకు నూనె రాసుకొని.. నురుగ తక్కువగా వచ్చే బేబీ షాంపూతో తలస్నానం చేయాలి. గోరువెచ్చటి నీటితో స్నానం చేయాలి. వీలైతే స్నానానికి తాగునీరు వాడుకోవాలి. కఠిన జలంతో చుండ్రు మరింత ఎక్కువయ్యే అవకాశముంది మరి. ● జుట్టుకు రంగు వేసుకునేవారు రసాయనాలు లేని రంగులు వాడుకోవాలి. ● చుండ్రు తగ్గటానికి పోషకాహారం తోడ్పడుతుంది. ముఖ్యంగా ప్రొటీన్ తగినంత తీసుకోవాలి. గుడ్డు తెల్లసొన, మొలకలతో మంచి ఫలితం కనిపిస్తుంది.

అటోపిక్ ఎగ్జిమా జన్యుపరంగా

జన్యుపరంగా కొందరు ఏసుగు గజ్జి (అటోపిక్ ఎగ్జిమా)తో ఇబ్బంది పడుతుంటారు. దుమ్ము, ఆహార అలర్జీల వంటివి గల కుటుంబాల్లో దీన్ని చూస్తుంటాం. తల్లిదండ్రుల్లిద్దరికీ ఇది ఉంటే పిల్లలకు వచ్చే అవకాశాలు ఎక్కువ. దీనికి కారణమయ్యే జన్యువు గలవారిలో సాధారణంగా మూడు నెలల వయసు నుంచి మూడేళ్ల వరకు ఎప్పుడైనా మొదలవ్వచ్చు. వీరిలో మోకాళ్లు, మోచేతులు, కీళ్లు, మెడ, బుగ్గల మీద విపరీతమైన దురద, మంట తలెత్తుతాయి. కొందరికి గజ్జల్లోనూ రావొచ్చు. చర్మంలోని మూడో పొరలో నూనె ఉత్పత్తి అవుతుంది. జన్యుపరంగా వీరిలో ఈ ప్రక్రియ కొరవడుతుంది. దీంతో చర్మం పొడి బారుతూ వస్తుంది. చలికాలంలో అటోపిక్ ఎగ్జిమా బాధలు మరింత పెరుగుతాయి.

● సాధారణంగా అటోపిక్ ఎగ్జిమా (డెర్మటైటిస్) జీవితంలో మూడు సార్లు.. 3 నెలల నుంచి 3 ఏళ్లు.. 25-30 ఏళ్లు.. 56-60 ఏళ్ల మధ్యలో ఉన్నప్పుడు ప్రేరేపితమవుతుంటుంది. కాబట్టి ముందు జాగ్రత్తగా చలికాలం ప్రారంభం కావటానికి నెల ముందు నుంచే శరీరమంతా మాయిశ్చరైజర్ రాసుకోవటం మొదలెట్టాలి. ఒకవేళ అవసరమనుకుంటే అప్పుడైనా రాసుకోవాలి. చలికాలం ముగిసిన నెల వరకూ దీన్ని కొనసాగించాలి. ● సెరామైడ్ లేదా యూరియా గల మాయిశ్చరైజర్లను తడి చర్మం మీద రాసుకోవాలి. అప్పుడది చర్మంలోకి త్వరగా చేరుతుంది. వీలైతే రోజుకు మూడు సార్లు మాయిశ్చరైజర్ వాడుకోవాలి. ● పట్టు, నైలాన్ దుస్తులు అసలే వేసుకోవద్దు. ● ఇంట్లో పెంపుడు జంతువులు లేకుండా చూసుకోవాలి. ● పడకగదిలో కర్టెన్లు, తివాచీలు, పరుపుల దుమ్ము ఎప్పటికప్పుడు వదిలించాలి. ఇంటిని వాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేసుకోవాలి. చీపురుతో దుమ్ము దులపటం తగదు. ● మరీ వెచ్చటి నీటితో, ఎక్కువ నురగ వచ్చే సబ్బులతో స్నానం చేయొద్దు. ● అవసరమైతే స్టిరాయిడ్ క్రీములు, టాక్రోలిమస్ పూత మందులు, సైక్లోస్పోరిన్ మందులు వాడుకోవాలి. ఇవి టీ కణాలను తగ్గించటం ద్వారా దురద, మంట నుంచి ఉపశమనం కలిగిస్తాయి.

ఎగ్జిమా క్రాకెలే దురద, పగులు

ఇది ఒకరకం ఎగ్జిమానే. మోకాళ్ల కింది నుంచి పాదం మధ్య భాగంలో దురద పెట్టటం దీని ప్రత్యేకత. వృద్ధులు, థైరాయిడ్ సమస్య గలవారు, మధుమేహంతో చర్మం పొడిబారేవారిలో ఇది ఎక్కువ. చలికాలంలో ఇది మరింత ఎక్కువగా వేధిస్తుంది. ఇందులో చర్మం పొడిబారి, పగులుతుంది. చూడటానికి ఎండిపోయిన చెరువు అడుగు భాగం మాదిరిగా కనిపిస్తుంది. వీళ్లు చర్మం రకాలను బట్టి గ్లిజరిన్, యూరియా, ఎమోలియెంట్, హ్యూమక్టెంట్ మాయిశ్చరైజర్లు వాడుకుంటే మంచి ఉపశమనం కలుగుతుంది. రంగు, వాసన, ప్రిజర్వేటివ్ లేని మాయిశ్చరైజర్లే వాడుకోవాలి. డాక్టర్లను సంప్రదించి, స్టిరాయిడ్ క్రీములు వాడొచ్చు. ● థైరాయిడ్, మధుమేహం గలవారు వాటిని అదుపులో ఉంచుకోవాలి. ● నురుగ తక్కువగా వచ్చే సబ్బులు గానీ బాడీవాష్‌లు గానీ వాడుకుంటే చర్మం మీదుండే రక్షణ పొర దెబ్బతినకుండా, సహజ నూనెలు కోల్పోకుండా చూసుకోవచ్చు. పొడి చర్మం, దురదను నివారించుకోవచ్చు. ● మెత్తటి నూలు దుస్తులు ధరించాలి.

జుట్టు రాలటం కాలం మార్పు

కాలాలు మారినప్పుడు కొందరికి జుట్టు ఎక్కువగా రాలుతుంటుంది. దీనికి కారణం శరీరంలో జీవక్రియ తీరు మారటం.

● చలికాలంలో జుట్టు రాలుతున్నట్టు గమనిస్తే ఉడికించిన గుడ్లు తినటం మంచిది. శాకాహారులైతే అన్నిరకాల పండ్లు, కూరగాయలు తినాలి. ఖర్జూరం వంటి ఎండు ఫలాలు మేలు. ● రాగి జావ తాగాలి. ● కేఫీన్ కూడిన షాంపూ, ప్రొటీన్ సీరమ్స్ వాడుకోవాలి. ● చలికాలం పోయాక రాలిన జుట్టు తిరిగి వస్తుంది. కాకపోతే నిబ్బరంగా ఉండాలి. అప్పటికీ తగ్గకపోతే బయోటిన్, విటమిన్ డి మాత్రలు వేసుకోవాలి. పోషకాహారం మీద శ్రద్ధ పెట్టాలి. ● చలికాలం పోయినా వెంట్రుకలు రాలుతున్నట్టయితే విటమిన్ మాత్రలు అవసరమవుతాయి. జుట్టుకు కేఫీన్ షాంపూలు, రెడిన్సెల్ సీరమ్స్ మేలు చేస్తాయి. ఇవి జుట్టు రాలటాన్ని నివారిస్తాయి.

పెదాలు పగలటం నీరు తగ్గటంతో

చలికాలం ఆరంభానికి అందరికీ గుర్తుకొచ్చేది పెదాలు పగలటం. నీరు తక్కువగా తాగేవారిలో ఇది ఎక్కువ. చలికాలంలో నీరు తక్కువగా తాగుతుంటారు కాబట్టి మరింత ఎక్కువవుతుంటుంది కూడా. ● రోజుకు కనీసం 9-10 గ్లాసుల నీరు తాగాలి. ● నీరు తాగిన ప్రతిసారీ పెదాలకు ఎస్‌పీఎఫ్ 15% ఉన్న బామ్ రాసుకోవాలి. దీంతో నీరు పెదాల్లోకి ఇంకి, పగలటం తగ్గుతుంది.

పాదాల పగుళ్లు ఒకింత జాగ్రత్త



అధిక బరువు, పొడిచర్మం, ఎక్కువగా తిరగటం, గట్టి చెప్పులు వేసుకోవటం వంటివి మడమలు, పాదాలు పగలటానికి దారితీస్తుంటాయి. ఇది చలికాలంలో మరింత ఎక్కువవుతుండటం గమనార్హం. ● బకెట్‌లో గోరువెచ్చటి నీటిలో కాస్త ఉప్పు కలిపి.. రెండు మూడు నిమిషాలు పాదాలను అందులో ఉంచాలి. తర్వాత శుభ్రంగా తుడుచుకొని, 20% యూరియాతో కూడిన క్రీమ్ రాసుకోవాలి. దీంతో పొడిబారటం తగ్గుతుంది. ● మెత్తటి చెప్పులు ధరించాలి.

నోట్లో పుండ్లు తగ్గవేం?

సమస్య సలహా

సమస్య: మా అబ్బాయికి 19 ఏళ్లు. చిన్నప్పటి నుంచీ తరచూ నోట్లో పుండ్లతో ఇబ్బంది పడుతున్నాడు. ఏం చేసినా తగ్గి, మళ్లీ వస్తున్నాయి. బడికి, కాలేజీకి వెళ్లేటప్పుడు చదువుల ఒత్తిడితో వస్తున్నాయని అన్నారు. అయినా ఇప్పటికీ తగ్గటం లేదు. విటమిన్ మాత్రలు, ప్రొటీన్ ఆహారం తీసుకుంటున్నా ఫలితం లేదు. దీంతో తిండి తినటం కష్టమవుతోంది. మనిషి చాలా సన్నగా ఉంటాడు. డాక్టర్లకు చూపిస్తే అదే తగ్గిపోతుందని అల్సర్ లోషన్లు, విటమిన్లు ఇస్తున్నారు. కానీ పూర్తిగా తగ్గటం లేదు. దీనికి శాశ్వత పరిష్కారం ఏదైనా ఉందా? – ఎం.రవికుమార్, గజపతి నగరం

సలహా: మీ అబ్బాయి ఆఫ్తస్ అల్సర్స్ సమస్యతో బాధపడుతున్నాడని అనిపిస్తోంది. నోట్లో పుండ్లు ఎవరికైనా రావొచ్చు గానీ 20ల్లో ఉన్నవారిలో ఎక్కువ. సాధారణంగా ఇవి ఒకట్రెండు వారాల్లో వాటంతటవే తగ్గుతాయి. అక్కడ మచ్చ కూడా పడదు. కానీ ఉన్నంతసేపూ నొప్పి, మంటతో తీవ్రంగా వేధిస్తాయి. ఈ పుండ్లకు కారణమేంటన్నది కచ్చితంగా తెలియదు. కానీ చాలామందిలో మానసిక ఒత్తిడితో వస్తుంటాయి. మీ అబ్బాయి ఇంటర్ పూర్తయ్యి, డిగ్రీలో చేరి ఉండొచ్చు. పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనవుతుండొచ్చు. ఒకవేళ ఇలాంటిది గమనిస్తే మానసిక ఒత్తిడిని తగ్గించుకోవటం చాలా ముఖ్యమని వివరించండి. మనదగ్గర నోట్లో పుండ్లు అనగానే రైబోఫ్లేవిన్ లోపమే కారణమని భావిస్తుంటారు. నిజానికి దీని లోపం అరుదు. ఒక్కోసారి విటమిన్ బి12 లోపం పుండ్లకు దారితీయొచ్చు. ఇది ముఖ్యంగా శాకాహారుల్లో ఎక్కువ. ఫోలిక్ యాసిడ్, ఐరన్ లోపమూ కారణం కావొచ్చు. హార్మోన్ల మోతాదులు అస్తవ్యస్తం కావటంతోనూ పుండ్లు తలెత్తొచ్చు. ఇవే కాదు.. దంతాల అమరిక సరిగా లేకపోయినా, దంతాలు చాలా వాడిగా ఉన్నా, గట్టి బ్రష్‌తో తోముకున్నా, పుల్లటి, మసాలా, కారం పదార్థాలు తిన్నా పుండ్లు పడొచ్చు. నాసిరకం టూత్‌పేస్టులు, బొగ్గు వంటివాటితో పళ్లు తోముకున్నా ఇబ్బందే. నోట్లో పుండ్లు పడే స్వభావం గలవారికి లోపల కాస్త గీసుకున్నా పుండుగా మారే ప్రమాదముంటుంది. అందువల్ల ఇలాంటి అంశాలేవైనా కారణమవుతున్నాయేమో గమనించండి. వాటికి దూరంగా ఉంటే పుండ్లనూ నివారించుకోవచ్చు. ఏదేమైనా నోట్లో పుండ్లు పడటం తీవ్ర సమస్యేమీ కాదు. ప్రమాదకరమైందీ కాదు. దీనికి సాధారణంగా లోపల రాసుకునే స్టిరాయిడ్ పూత మందులు, నొప్పి తగ్గించే జెల్స్ ఇస్తుంటారు. గమనించాల్సిన విషయం ఏంటంటే- ఇవి ఉపశమన మార్గాలే గానీ పూర్తిగా నయం చేసేవి కావు. పుండ్లను ప్రేరేపించే అంశాలు ఎదురైనప్పుడు తిరిగి తలెత్తుతాయి. విటమిన్ల లోపం గలవారికే ఈ మాత్రలతో ఫలితం కనిపిస్తుంది. మీ అబ్బాయి లోషన్లు, విటమిన్ మాత్రలు వాడుతున్నా మళ్లీ మళ్లీ వస్తున్నాయంటే స్వీయరోగనిరోధక జబ్బులు, పేగుపూత వంటి ఇతరత్రా సమస్యలేవైనా కారణమవుతున్నాయేమో తెలుసుకోవాల్సి ఉంటుంది.



- డా॥ ఎం.వి.రావు,
జనరల్ ఫిజీషియన్

మీ ఆరోగ్య సమస్యలను sukhi@eenadu.in కు పంపొచ్చు.

గుండెకూ మెట్‌ఫార్మిన్ మేలు

మధుమేహానికి వాడే మెట్‌ఫార్మిన్ మందు గుండె వేగంగా కొట్టుకునే (ఏట్రియల్ ఫిబ్రిలేషన్) సమస్య తిరగబెట్టకుండా చూడటానికీ తోడ్పడుతున్నట్టు తాజాగా బయటపడింది. సాధారణంగా విద్యుత్ ప్రచోదనాలు అస్తవ్యస్తం కావటం వల్ల గుండె లయ తప్పి, వేగంగా కొట్టుకుంటుంది. వీరికి గుండె కణజాలంలో కొంత భాగాన్ని కాల్చితే (అబ్లేషన్) అసాధారణ సంకేతాలు పుట్టటం ఆగుతుంది. ఈ చికిత్స చేయించుకున్నవారికి మెట్‌ఫార్మిన్ సాయం చేస్తున్నట్టు ఇటీవల అమెరికన్ హార్ట్ అసోసియేషన్ సదస్సులో సమర్పించిన అధ్యయనం చెబుతోంది.




ఇందులో భాగంగా ఏట్రియల్ ఫిబ్రిలేషన్‌కు అబ్లేషన్ చికిత్స చేయించుకున్న అధిక బరువు, ఊబకాయులను నిశితంగా పరిశీలించారు. వీరెవరికీ మధుమేహం లేదు గానీ 40% మంది ముందస్తు మధుమేహ దశలో ఉన్నారు. వీరిలో మెట్‌ఫార్మిన్ తీసుకున్నవారికి గుండె వేగంగా కొట్టుకునే సమస్య తిరగబెట్టటం తక్కువగా ఉంటున్నట్టు తేలటం గమనార్హం. తమ శరీర బరువులో 10% తగ్గినా ఏట్రియల్ ఫిబ్రిలేషన్ తిరగబెట్టే ముప్పు 6 రెట్లు తక్కువగా ఉంటున్నట్టు గత అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే మెట్‌ఫార్మిన్ తీసుకున్నవారు పెద్దగా బరువేమీ తగ్గలేదు. అయినా మంచి ఫలితం కనిపించటం విశేషం. జీవక్రియను ఉత్తేజితం చేయటం.. వాపుప్రక్రియను, గుండెచుట్టూ ఉండే కొవ్వును తగ్గించటం ద్వారా మెట్‌ఫార్మిన్ మేలు చేస్తుండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు.

దంతాలకు తీపి శాపం

దంతాల ఆరోగ్యం, మనం తినే ఆహారం ఒకదాని మీద మరోటి ఆధారపడతాయి. ఆహారం జీర్ణం కావటానికి పళ్లు సాయం చేస్తే.. తిన్న ఆహారం పళ్ల ఆరోగ్యానికి తోడ్పడుతుంది. పిప్పి పళ్లకూ చక్కెరకూ దగ్గరి సంబంధం ఉంటోందని ప్రపంచ ఆరోగ్యసంస్థ పరిశోధన చెబుతోంది. తీపి పదార్థాలతో అదనంగా రోజుకు 25 గ్రాముల చక్కెర తీసుకునేవారితో పోలిస్తే 50 గ్రాములు తినేవారికి పళ్లు పుచ్చిపోయే ప్రమాదం 65% ఎక్కువగా ఉంటున్నట్టు తేలింది. అయితే తీపి పదార్థాలను చిరుతిండిగా కన్నా భోజనంలో భాగంగా తింటే పిప్పి పళ్ల ముప్పు తగ్గుతుండటం గమనార్హం. దీనికి కారణమేంటో తెలుసా? తీపి పదార్థాలతో ఉత్పత్తయ్యే ఆమ్లం పళ్ల మీద దాడి చేయటానికి తగినంత సమయం లభించకపోవటమే. అంటే భోజనంతో పాటు కలిపి తీసుకోవటం వల్ల తీపి పదార్థాలు పళ్లకు అతుక్కోవటం, వాటిని బ్యాక్టీరియా విచ్ఛిన్నం చేయటం తగ్గుతుందన్నమాట.

సీవోపీడీ, ఆస్థమా వేరే

కొందరు సీవోపీడీని ఆస్థమాగా పొరపడుతుంటారు. ఇవి రెండూ వేర్వేరు సమస్యలు. ఆస్థమా ఎవరికైనా రావొచ్చు. ఇది చిన్నప్పుడే మొదలవుతుంది. కాలాల వారీగా ఉద్ధృతమవుతుంది. దగ్గు, ఆయాసం, పిల్లికూతలతో పాటు ముక్కు బిగుసుకోవటం, కళ్లలోంచి నీరు, దురద, చర్మం మీద దద్దు వంటి అలర్జీ లక్షణాలూ ఉంటాయి. అదే సీవోపీడీ చాలావరకూ పొగ తాగేవారికి, పెద్దవారికి వస్తుంది. మగవారిలో ఎక్కువ. దీనికి కాలాలతో నిమిత్తం లేదు. ఒకసారి మొదలైతే నిరంతరం కొనసాగుతుంది. లక్షణాల తీవ్రత పెరగటమే గానీ తగ్గటమనేది ఉండదు. పిల్లికూతలు, అలర్జీ లక్షణాలేవీ ఉండవు.




మోకాలి మార్పిడికి సన్నద్ధతా ముఖ్యమే

మోకాళ్ల నొప్పి భరించలేని స్థితిలో, ఇతరత్రా చికిత్సలేవీ పనిచేయని సందర్భాల్లో మోకాలి మార్పిడి ఎంతగానో ఉపయోగ పడుతుంది. అయితే దీన్ని కంగారు పడి చేయించుకోవద్దు. ఆపరేషన్‌కు ముందు ఒంట్లో ఎక్కడా ఇన్‌ఫెక్షన్ లేకుండా చూసుకోవాలి. వారం ముందే డాక్టర్‌ను కలిసి, అవసరమైతే ముందు జాగ్రత్తగా యాంటీ బయాటిక్ మాత్రలు వేసుకోవాలి. అలాగే వారం ముందు నుంచే మోకాళ్లను బలోపేతం చేసే వ్యాయామాలు చేయటం మంచిది. దీంతో త్వరగా కోలుకోవటానికి వీలుంటుంది. ఫిజియోథెరపీ కూడా సులభమవుతుంది. స్పైరోమెట్రీతో వ్యాయామం చేస్తే ఊపిరితిత్తులు బాగా వ్యాకోచిస్తాయి. దీంతో శస్త్రచికిత్స తర్వాత శ్వాస తీసుకోవటం తేలికవుతుంది.



ఇవీ క్లోమ క్యాన్సర్ సంకేతాలే!



తరచూ చూసేవే కావొచ్చు. అవి తీవ్ర సమస్యలేమీ కాకపోవచ్చు. అయినా కూడా కొన్నిసార్లు ప్రమాదకర జబ్బులకు సూచికలు కావొచ్చు. నడుం నొప్పి, అజీర్ణం అలాంటివే. వీటికి చాలావరకూ కండరాలు పట్టేయటం, జీవనశైలి మార్పులు, జీర్ణాశయంలోని ఆమ్లం గొంతులోకి ఎగదన్నుకు రావటం వంటివే కారణమవుతుంటాయి. అలాగని నిర్లక్ష్యం పనికిరాదు. కొన్నిసార్లు ఇవి క్లోమ (పాంక్రియాస్) క్యాన్సర్ లక్షణాలు కావొచ్చు. ముఖ్యంగా నడుం నొప్పి, అజీర్ణం అదేపనిగా, నెలలకొద్దీ విడవకుండా వేధిస్తుంటే అనుమానించటం మంచిది. కడుపు లోపల, జీర్ణాశయం వెనకాల క్లోమగ్రంథి దాగుంటుంది. ఇందులో కణితులు తలెత్తినా తొలిదశలో పెద్దగా లక్షణాలేవీ ఉండవు. కొన్నిసార్లు ఇది నడుంనొప్పి, అజీర్ణం వంటి అస్పష్ట లక్షణాలతోనూ బురిడీ కొట్టిస్తుంటుంది. దీంతో ఇతరత్రా సమస్యలుగా పొరపడుతుంటారు. ఇంతకీ క్లోమ క్యాన్సర్‌లో నడుంనొప్పి, అజీర్ణం ఎందుకు వస్తాయి? కణితి వృద్ధి చెందుతున్నకొద్దీ చుట్టుపక్కల నాడులను, కణజాలాలను నొక్కటం మొదలెడుతుంది. దీంతో కడుపు పైభాగంలో నిరంతరం నొప్పి కలుగుతుంటుంది. ఇది కొందరికి వీపునకూ విస్తరించొచ్చు. ఈ నొప్పి పడుకున్నప్పుడు తీవ్రమవుతుంటుంది. ముందుకు వంగి కూర్చున్నప్పుడు హాయిగా అనిపిస్తుంటుంది. ఇక అజీర్ణం దగ్గరికి వస్తే- కణితి ఏర్పడినప్పుడు పాంక్రియాస్‌లో జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తి పడిపోతుంది. దీంతో తిన్నది సరిగా జీర్ణం కాకపోవటం, కడుపుబ్బరం, మల విసర్జనలో మార్పుల వంటివి మొదలవుతాయి. కొందరికి కారణమేదీ లేకుండా వికారంగా అనిపించటం, కొంచెం తినగానే కడుపు నిండటం, ఆకలి తగ్గటం కూడా ఉండొచ్చు. చాలామందిలో బాగా ముదిరిన తర్వాతే క్లోమ క్యాన్సర్ బయటపడుతున్న నేపథ్యంలో ఇలాంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయటం తగదు. దీర్ఘకాలంగా నడుంనొప్పి, అజీర్ణంతో బాధపడుతుంటే ఒకసారి డాక్టర్‌ను సంప్రదించి, వాటికి కారణమేంటన్నది తెలుసుకోవటం చాలా ముఖ్యం.


రాగులు క్యాల్షియం గనులు!

రాగులు చూడటానికి చిన్నగానే ఉంటాయి గానీ అవి క్యాల్షియం గనులు! ప్రతి 100 గ్రాములతో సుమారు 340 గ్రాముల క్యాల్షియం లభిస్తుంది. ఇదొక్కటే కాదు.. ఐరన్, అమైనో ఆమ్లాలు, పొటాషియం, జింక్, మెగ్నీషియం, పీచు వంటి పోషకాలూ దండిగానే ఉంటాయి. అందుకే ఎముకలను బలోపేతం చేయటంతో పాటు ఊబకాయం, అధిక రక్తపోటు, రక్తంలో గ్లూకోజు, కొలెస్ట్రాల్ తగ్గటానికీ ఉపయోగపడతాయి. ఇలా గుండెజబ్బుల ముప్పునూ తగ్గిస్తాయి. అయితే రాగుల్లోని ఫైటేట్స్, ఆక్జలేట్స్ శరీరాన్ని క్యాల్షియం సంగ్రహించుకోకుండా అడ్డుతగులుతాయనీ గుర్తించాలి. అంటే రాగుల్లో దండిగా క్యాల్షియం ఉన్నా మన శరీరం పూర్తిగా శోషించుకోలేదన్నమాట. మరోవైపు రాగులు త్వరగా జీర్ణం కావు కూడా. జీర్ణకోశ సమస్యలతో బాధపడేవారికివి అంతగా నప్పవు. కాబట్టి కొందరికి క్యాల్షియం మాత్రలు అవసరమవుతాయి. నెలసరి నిలిచే దశలో ఉన్నవారికి, నెలసరి నిలిచినవారికి క్యాల్షియం మరింత ఎక్కువగా అవసరమవుతుంది. ఎముకలు గుల్లబారకుండా చూసుకోవటానికిది తప్పనిసరి. అయితే పెద్ద మొత్తంలో ఆహారం ద్వారా క్యాల్షియం లభించేలా చూసుకోవటం కష్టం. కాబట్టి డాక్టర్లు క్యాల్షియం మాత్రలను సూచిస్తే తప్పకుండా వేసుకోవాలి. దీన్ని శరీరం చాలావరకూ సంగ్రహించుకుంటుంది. అదనంగా రాగులూ తీసుకుంటే ఇంకా ఎక్కువ ఫలితం కనిపిస్తుంది.



ఇదేం అలసట బాబోయ్

రోజంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండాలంటే? దీని కోసం డాక్టర్ల దగ్గరి నుంచి పెద్దవాళ్ల వరకూ అంతా ఇచ్చే సలహా ఒకటే. రాత్రిపూట తగినంత సేపు నిద్రపోవాలనే. నిజమే. ఎప్పుడైనా ఆలస్యంగా పడుకున్నా, త్వరగా లేచినా మర్నాడు నిరుత్సాహం, నీరసం ముంచుకొచ్చేస్తాయి. కానీ తగినంత నిద్రపోయినా అలసట వేధిస్తుంటే? తప్పకుండా ఆలోచించాల్సిందే.



ఉదయం లేస్తూనే చిరాకు. మూడ్ ఏదోలా ఉంటుంది. ఏ పనిచేయాలన్నా బద్ధకం. దేని మీదా ఆసక్తి ఉండదు. అలాగని రాత్రంతా మెలకువగా ఉన్నామా అంటే అదీ లేదు. బాగానే నిద్రపోయాం. మరెందుకీ కునికిపాట్లు? మళ్లీ పడుకోవాలని ఎందుకనిపిస్తోంది? మగతగా ఎందుకుంటోంది? ప్రస్తుతం చాలామంది ఎదుర్కొంటున్న సమస్యే ఇది. రాత్రిపూట 7-8 గంటల సేపు నిద్రపోయినా మర్నాడు ఏదో తెలియని అలసట. దీనికి ప్రధాన కారణం గాఢ నిద్ర కొరవడటమే. అవును... ఎన్ని గంటలనేదే కాదు, ఎంత హాయిగా నిద్రపోయామన్నదీ ముఖ్యమే. 10-12 గంటల సేపు పడుకున్నా కూడా కంటి నిండా నిద్ర పట్టకపోతే హుషారు గల్లంతవుతుంది. మనకు తెలియకుండానే ఎన్నెన్నో అంశాలు ఈ గాఢ నిద్రను దెబ్బతీస్తుంటాయి.

కారణాలు రకరకాలు

డిజిటల్ తెరలు: మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, టీవీ తెరల నుంచి వెలువడే నీలికాంతి మెదడును తికమకపరుస్తుంది. రాత్రినీ పగలుగా భావించేలా చేస్తుంది. దీంతో నిద్రను ప్రేరేపించే మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి తగ్గుతుంది. ఫలితంగా మెదడు చురుకుగా ఆలోచిస్తుంటుంది. మొత్తానికి గాఢ నిద్ర కరవవుతుంది.

కెఫీన్, మిఠాయిలు: రాత్రిపూట టీ, కాఫీ తాగటం.. చాక్లెట్లు, మిఠాయిలు తినటం వల్ల నాడీ వ్యవస్థ ఉత్తేజితమవుతుంది. దీంతో శరీరం విశ్రాంతి స్థితికి చేరుకోక నిద్ర దెబ్బతింటుంది.

వేళాపాళా లేని పడక: రోజుకోరకంగా ఎప్పుడు పడితే అప్పుడు పడుకోవటం, లేవటం వల్ల ఒంట్లో జీవగడియారం అస్తవ్యస్తమవుతుంది. దీంతో నిద్ర, మెలకువల తీరు గతి తప్పి నీరసం, నిస్సత్తువ ఆవహించేస్తాయి.

నిద్ర సమస్యలు: కొందరికి నిద్రిస్తున్నప్పుడు గొంతు వెనకాల భాగం వదులై, కిందికి జారుతుంది. ఇది శ్వాసమార్గానికి అడ్డుపడటం వల్ల కాసేపు శ్వాస ఆగుతుంది (స్లీప్ అప్నియా). అప్పుడు వెంటనే మేల్కొని, గట్టిగా గురక పెడుతూ తిరిగి శ్వాస తీసుకుంటుంటారు. నిద్రలో ఉండటం వల్ల మెలకువ వచ్చిన సంగతి తెలియదు. ఇలా రాత్రంతా చాలాసార్లు జరుగుతుంది. దీంతో గాఢ నిద్ర కరవవుతుంది.

రక్తంలో ఆక్సిజన్ తగ్గటం వల్ల పగటిపూట మగతగా, నిస్సత్తువగా ఉంటుంది. కాళ్లలో చిరచిర (రెస్ట్‌లెస్ లెగ్స్ సిండ్రోమ్) వంటి నిద్ర సమస్యలూ గాఢ నిద్రను దెబ్బతీస్తాయి.

థైరాయిడ్ సమస్యలు: థైరాయిడ్ గ్రంథి సరిగా పనిచేయకపోవటం కూడా కారణమే. తగినన్ని థైరాయిడ్ హార్మోన్లు విడుదల కాకపోతే జీవక్రియ మందగిస్తుంది. నిద్ర ప్రక్రియా అస్తవ్యస్తమవుతుంది. నిద్రలేమితో థైరాయిడ్ పనితీరూ తగ్గుతుంది. ఇలా ఇదొక విషవలయంగా తయారవుతుంది. ఫలితం- అదేపనిగా నీరసం.

రక్తహీనత: ఐరన్ లోపంతో తలెత్తే రక్తహీనత (ఎనీమియా)లో ఎర్ర రక్తకణాల సంఖ్య తగ్గుతుంది. దీంతో శరీరానికి తగినంత ఆక్సిజన్ అందదు. ముఖ్యంగా మెదడుకు తగినంత ఆక్సిజన్ అందకపోతే నీరసానికి దారితీస్తుంది. రక్తహీనతతో కాళ్లలో చిరచిర, ఆయాసం వంటి సమస్యలూ తలెత్తొచ్చు. ఇవీ నిద్రకు భంగం కలిగించేవే. విటమిన్ బి12 లోపమూ రక్తహీనతకు కారణమవుతుంది.

పరిసరాలు: పడకగది మరీ వేడిగా లేదా మరీ చల్లగా ఉన్నా.. గాలి సరిగా ఆడకపోయినా, పరిసరాల్లో వాహనాల హారన్ మోతల వంటి చప్పుళ్లు వినిపిస్తున్నా నిద్రకు విఘాతం కలుగుతుంది. మధ్యమధ్యలో మెలకువ వచ్చేస్తుంది.

సరిచేసుకోవాల్సిందే

నిద్ర శరీరాన్నే కాదు, మనసునూ పునరుత్తేజితం చేస్తుంది. దీన్ని నిర్లక్ష్యం చేస్తే గుండెజబ్బులు, అధిక రక్తపోటు, మధుమేహం వంటి రకరకాల సమస్యలు దాడి చేయటం ఖాయం. కాబట్టి గాఢ నిద్రను దెబ్బతీస్తున్న అంశాలను గుర్తించి, సరిచేసుకోవటం చాలా ముఖ్యం.

● పడకగదిలో మొబైల్ ఫోన్ల వంటివి వాడకపోవటం ● రాత్రిపూట మరీ ఎక్కువగా తినకపోవటం ● పడుకోవటానికి రెండు గంటల ముందే భోజనం చేయటం ● పడకగది చల్లగా, ప్రశాంతంగా ఉండేలా చూసుకోవటం ● రాత్రివేళ కాఫీ, టీ, కూల్‌డ్రింకులు తాగకపోవటం ● క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం ● నిద్ర సమస్యలకు తగు చికిత్స తీసుకోవటం ● ఆఫీసు నుంచి వచ్చాక గోరువెచ్చటి నీటితో స్నానం చేయటం, పడుకునే ముందు గ్లాసు పాలు తాగటం.

- ఇలాంటి జాగ్రత్తలు గాఢ నిద్రకు తోడ్పడతాయి. అప్పుడు ఉత్సాహం ఎల్లప్పుడూ వెంటే ఉంటుంది.

భారతీయ సినిమా

హీ-మ్యాన్ ధర్మేంద్ర






భారత స్వాతంత్ర్య పోరాట నేపథ్యంతో 1948లో వచ్చిన 'షహీద్' చిత్రాన్ని చూసిన ఆ పదమూడేళ్ల కుర్రాడు ఆశ్చర్యపోయాడు. తెరపై దిలీప్‌కుమార్, కామినీ కౌశల్‌ల నటన, ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టిన తీరు చూసి "దేవతల్లా ఉన్నారే" అనుకున్నాడు. బహుశా ఆ పసిమనసుపై నాడు పడిన చెరగని ముద్ర ఓ సంకల్పంలా మారింది కాబోలు. పదేళ్ల తర్వాత అదే కుర్రాడు సినిమా అవకాశాలను వెదుక్కొంటూ పంజాబ్ నుంచి బొంబాయికి చేరాడు. 'దిల్ భీ తేరా హమ్ భీ తేరే' (1960) చిత్రంతో కథానాయకుడిగా హిందీ చిత్రరంగ ప్రవేశం చేసిన ఆ నటుడు ఆ తర్వాత కాలంలో దాదాపు 300 చిత్రాల్లో నటించి సూపర్ స్టార్ ధర్మేంద్రగా ఎదుగుతానని నాడు కలలో కూడా అనుకోలేదు.

తండ్రి కేవల్ క్రిషన్ ఓ స్కూల్ మాస్టారు కావడంతో చాలా క్రమశిక్షణతో పెరిగారు ధర్మేంద్ర. పంజాబ్‌లోని ఫగ్వాడాలో మెట్రిక్యులేషన్ చదివిన ధర్మేంద్రకు 19 ఏళ్ల వయసులో ప్రకాశ్‌కౌర్‌తో వివాహమైంది. ఆ తర్వాత బొంబాయికి చేరుకున్న ధర్మేంద్ర 'షోలా ఔర్ షబ్నమ్', 'అన్‌పఢ్', 'బందినీ' లాంటి చిత్రాలతో అచిరకాలంలోనే విజయాల బాట పట్టారు. ప్రఖ్యాత దర్శకుడు బిమల్ రాయ్ రూపొందించిన 'బందినీ' ఉత్తమచిత్రంగా జాతీయ అవార్డు అందుకొంది. 'ఆయీ మిలన్ కీ బేలా' (1964), 'ఫూల్ ఔర్ పత్థర్' (1966) ఘన విజయాలతో మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. దాదాపు ఆరు దశాబ్దాలపాటు కొనసాగిన తన కెరీర్‌లో 'యాదోన్ కీ బారాత్', 'సీతా ఔర్ గీతా', 'జీవన్‌మృత్యు', 'మేరా గావ్ మేరా దేశ్' లాంటి ఎన్నో బ్లాక్‌బస్టర్లు ఉన్నాయి. 'జుగ్ను', 'ధరమ్‌వీర్', 'షోలే' లాంటి చిత్రాలు సోవియట్ యూనియన్‌లోనూ అత్యధిక వసూళ్లు సాధించాయి. ఎన్ని చిత్రాల్లో నటించినా ధర్మేంద్ర ఆది నుంచీ తన ఆత్మాభిమానం ఎక్కడా వదులుకోలేదు. సినిమాల్లో కాస్త పేరు వచ్చాక రూ.18 వేలు పెట్టి ఫియట్ కారు కొన్నారు. 'అన్నయ్యా! హీరో అన్నాక ఇంత కంటే మంచిగా ఓపెన్ కారు కొంటే బాగుండేది కదా!' అన్నాడు తమ్ముడు అజీత్. 'ఇది స్థిరత్వం లేని రంగం. రేపటిరోజు ఒకవేళ నాకు అవకాశాలు రాకపోతే ఇదే కారును ట్యాక్సీగా నడుపుకొంటా' అని ధర్మేంద్ర బదులిచ్చారు. 1969లో వచ్చిన 'ఆరాధన' చిత్రంతో మొదలైన రాజేశ్‌ఖన్నా ప్రభంజనాన్ని తట్టుకొని నిలబడిన ఒకరిద్దరు హీరోల్లో ధర్మేంద్ర ఒకరు.

తెలుగు దర్శకులతో..

ధర్మేంద్ర కథానాయకుడిగా పలువురు తెలుగు దర్శకులు సైతం చిత్రాలు రూపొందించారు. తాతినేని ప్రకాశరావు దర్శకత్వంలో వచ్చిన 'ఇజ్జత్' (1968)లో ఆయన ద్విపాత్రాభినయం చేశారు. ఇది ప్రముఖ దక్షిణాది తార జయలలిత నటించిన ఏకైక పూర్తిస్థాయి హిందీ చిత్రం. ఆదుర్తి సుబ్బారావు తాను తెలుగులో ఎన్టీఆర్‌తో తీసిన 'దాగుడుమూతలు' చిత్రాన్ని హిందీలో ధర్మేంద్ర కథానాయకుడిగా 'జ్వార్ భాటా' (1973) పేరుతో తీశారు. పలు హిందీ సినిమాలకు దర్శకత్వం వహించిన తాతినేని రామారావు 'వతన్ కే రఖ్‌వాలే' (1987) పేరుతో ధర్మేంద్ర, మిథున్ చక్రవర్తిలతో ఓ చిత్రాన్ని రూపొందించారు. దర్శక మేధావి హృషికేశ్ ముఖర్జీ రూపొందించిన 'సత్యకామ్', 'గుడ్డీ', 'చుప్కే చుప్కే' చిత్రాలు ధర్మేంద్రకు నటుడిగా చిరకీర్తిని తెచ్చిపెట్టాయి. ఇండో - చైనా యుద్ధం ఆధారంగా ధర్మేంద్రతో దర్శక నిర్మాత చేతన్ ఆనంద్ తీసిన 'హకీకత్' (1964) చిత్రం కోసం మహమ్మద్ రఫీ పాడిన 'కర్ చలే హమ్ ఫిదా జానో తన్ సాథియో' అనే దేశభక్తి పాట ఇప్పటికీ మార్మోగుతూనే ఉంటుంది. ఒక బెంగాలీ, కొన్ని పంజాబీ చిత్రాల్లోనూ ఆయన నటించారు. 1980లో నటి హేమామాలినిని పెళ్లాడిన ధర్మేంద్ర తన మొదటి భార్య కుమారులైన సన్నీ డేఒల్, బాబీ డేఒల్‌లను హీరోలుగా స్థిరపరిచేందుకు 'విజేతా ఫిలిమ్స్' పేరిట సొంత బ్యానర్ ప్రారంభించి 'బేతాబ్' (1983), 'ఘాయల్', 'బర్సాత్' (2005) చిత్రాలతో నిర్మాతగానూ విజయం సాధించారు. దాదాపు 70 మంది హీరోయిన్లతో ఆయన నటించగా, ఇందులో హిట్ పెయిర్‌గా హేమామాలినితో చేసిన చిత్రాలే ఎక్కువ. నటి మీనాకుమారితో తన సాన్నిహిత్యంపై చాలా కథలు ప్రచారంలో ఉండేవి. అమితాబ్ కెరీర్‌ను మలుపు తిప్పి సూపర్‌స్టార్‌గా ఎదగడంలో తోడ్పడిన 'జంజీర్', 'అమర్ అక్బర్ ఆంథోనీ' చిత్రాలు మొదట ధర్మేంద్ర ఇంటి తలుపునే తట్టాయి.

– జి.ఎస్.జమీర్ హుసేన్



దేవుడా! నేను ధర్మేంద్రలా అందంగా ఎందుకు లేను?

బాలీవుడ్‌లో 'హీ-మ్యాన్'గా పేరున్న ధర్మేంద్రకు 1997లో ఫిల్మ్‌ఫేర్ జీవనసాఫల్య పురస్కారం లభించింది. అంతకుముందు ఉత్తమనటుడిగా ఆయన నాలుగైదు సార్లు ఫిల్మ్‌ఫేర్ నామినేషన్లు పొందినా, అన్ని అవకాశాలు వచ్చినట్టే వచ్చి చేజారాయి. ఏటా అవార్డుల ఫంక్షనుకు ముందు సూట్లు సిద్ధం చేసుకోవడం, అవార్డులు రాకపోవడం పరిపాటిగా మారింది. అందుకే తన అభిమాన నటుడు దిలీప్‌కుమార్ చేతుల మీదుగా జీవన సాఫల్య పురస్కారం అందుకొంటూ ధర్మేంద్ర కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ వేదికపై దిలీప్‌కుమార్ మాట్లాడుతూ.. "నేను దేవుడి దగ్గరకు వెళ్లినపుడు ఆయన ముందు ఒకటే ఫిర్యాదు చేస్తా. ధర్మేంద్రలా నన్ను అందగాడిగా ఎందుకు పుట్టించలేదని అడుగుతా" అన్నారు. నటి జయ బాధురి సైతం ధర్మేంద్రను 'గ్రీక్ గాడ్' అన్నారు. తాను కసరత్తులు పెద్దగా చేయలేదని.. వ్యవసాయ పనులు, కిలోమీటర్ల కొద్దీ సైకిల్ తొక్కడం, నిత్యం బావినీరు తోడటం లాంటి గ్రామీణ వాతావరణమే దేహాన్ని తీర్చిదిద్దిందని ఆయన వినమ్రంగా చెప్పేవారు. చక్కటి శరీర సౌష్టవం కలిగి ఉండటం యాక్షన్ హీరోగా పేరు తెచ్చుకోవడంలో ధర్మేంద్రకు ఎంతో ఉపయోగపడింది. తెరపై చొక్కా విప్పిన తొలి హీరో కూడా ఆయనే. జీవిత చరమాంకం దాకా నటిస్తూనే వచ్చిన ధర్మేంద్ర కొంతకాలం బుల్లితెరపై కూడా మెరిశారు. రణ్‌వీర్‌సింగ్ చిత్రం 'రాకీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహానీ' (2023)లో సీనియర్ నటి షబానా ఆజ్మీతో ఈ వయసులో అధర చుంబన దృశ్యంలో నటించి ధర్మేంద్ర అందరినీ ఆశ్చర్యపరిచారు. మీడియా ప్రశ్నలకు 'రొమాన్స్‌కు వయసుతో పనేముంది' అని బదులిచ్చిన చతురుడాయన. ధర్మేంద్ర నటించిన చివరి చిత్రం 'ఇక్కీస్' డిసెంబరులో విడుదల కానుంది. ఆఖరి రోజుల్లో కవితలు కూడా రాసిన ఈ హీ-మ్యాన్ సోషల్ మీడియాలో చాలా చురుగ్గా ఉంటూ దాదాపుగా పరిపూర్ణ జీవితం గడిపారు.



ధర్మేంద్ర, హేమామాలిని



కుమారులు బాబీ డేఒల్, సన్నీ డేఒల్‌లతో...




షారుక్‌ఖాన్, హృతిక్ రోషన్, ఆమిర్‌ఖాన్‌లతో కలిసి ధర్మేంద్ర స్టెప్పులు



'ఇక్కీస్'లో జైదీప్, అగస్త్య నంద, ధర్మేంద్ర

ఈనాడు సినిమా

చరిత్రలో చెప్పని గొప్ప వీరుడి కథే 'స్వయంభూ'



నిఖిల్

"మన భారతదేశ చరిత్రకి ఎన్నో ప్రత్యేకతలున్నాయి. అవి పట్టి రాజుల కథలో యుద్ధ గాథలో మాత్రమే కాదు. మన సంస్కృతికి పునాదులు. ఆ చరిత్రలో చెప్పని ఒక గొప్ప వీరుడి కథే ఈ 'స్వయంభూ'" అన్నారు నిఖిల్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని భరత్ కృష్ణమాచారి తెరకెక్కిస్తున్నారు. ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. నభా నటేశ్, సంయుక్తా మేనన్ కథానాయికలు. సునీల్, సుబ్బరాజు, సత్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాని మహాశివరాత్రి సందర్భంగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 13న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. ఈ మేరకు ఓ ప్రత్యేక వీడియోను అభిమానులతో పంచుకున్నారు. "ఒక్క సినిమా.. రెండు సంవత్సరాల కష్టం.. పదుల సంఖ్యలో సెట్‌లు.. అదొక సామ్రాజ్యం.. వేల కొద్దీ సవాళ్లు.. అదొక యుద్ధం.. కోట్ల పెట్టుబడి" అంటూ ఆ వీడియో ద్వారా ఈ చిత్ర కథను.. దాని స్థాయిని.. దాని కోసం పడిన కష్టాన్ని నిఖిల్ వివరించారు. 170రోజుల చిత్రీకరణ తర్వాత ఈ సినిమా పూర్తయినట్లు తెలియజేశారు. దీన్ని భారతీయ భాషలతో పాటు చైనీస్, స్పానిష్, అరబిక్ భాషల్లోనూ విడుదల చేయనున్నట్లు స్పష్టత ఇచ్చారు.

"కొత్త దర్శకులతో పనిచేస్తూ 90 శాతం విజయాల్ని సాధించింది ఈటీవీ విన్. చిత్ర పరిశ్రమలో ఇది సాధారణ విషయం కానే కాదు. ఆ సంస్థ 'రాజు వెడ్స్ రాంబాయి' కథని బలంగా నమ్మి ధైర్యంగా అడుగు వేయడంతోనే ఈ సినిమా విజయం ఖాయమైంది" అన్నారు బన్నీ వాస్, వంశీ నందిపాటి. ఈ ఇద్దరు నిర్మాతలు కలిసి విడుదల చేసిన చిత్రమే 'రాజు వెడ్స్ రాంబాయి'. ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్ సంస్థ వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవితో కలిసి నిర్మించింది. సాయిలు కంపాటి దర్శకత్వం వహించారు. అఖిల్ రాజ్, తేజస్విని జంటగా నటించారు. శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం మూడు రోజుల్లోనే రూ. 7.28 కోట్ల గ్రాస్ వసూళ్లని సాధించి, విశేష ప్రేక్షకాదరణని సొంతం చేసుకుంది. ముఖ్యంగా చాలా రోజుల తర్వాత ప్రేక్షకుల తాకిడితో సింగిల్ థియేటర్లు కళకళలాడుతున్నాయి. ఈ సందర్భంగా నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...

ఈటీవీ విన్ నమ్మకమే 'రాజు వెడ్స్ రాంబాయి' విజయం



బన్నీ వాస్, వంశీ

"మేం ఊహించిన దానికంటే గొప్పగా ఆదరణ పొందుతోంది 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రం. కథ రీత్యా మొదట్నుంచీ తెలంగాణలో ఈ సినిమాకి మంచి ఆదరణ దక్కుతుందనుకున్నాం. మా నమ్మకానికి తగ్గట్టే నైజాం మార్కెట్ నుంచే సినిమాకి రూ.5.2కోట్లు వసూళ్లు దక్కాయి. మూడో రోజైన ఆదివారం మాత్రమే రూ.2.17 కోట్లు వసూళ్లు దక్కాయి. తెలంగాణలో మల్టీప్లెక్స్‌ల కంటే సింగిల్ స్క్రీన్స్ నుంచే ఎక్కువ వసూళ్లు రావడం మరో విశేషం. ఏపీలో తొలి రెండు రోజులు వసూళ్లు తక్కువగానే ఉన్నా 'సినిమా బాగుంది' అనే నోటి మాటతో మూడో రోజు మంచి మంచి వసూళ్లు దక్కుతున్నాయి. థియేటర్లలో ప్రేక్షకుల ఉధృతి చూస్తుంటే రూ.50 కోట్లు వసూళ్లు సాధించినా ఆశ్చర్యం లేదు".

● "భావోద్వేగాలే సినిమాకి బలం. అవి అందరికీ కనెక్ట్ అవుతాయి. 'రాజు వెడ్స్ రాంబాయి' కథలో బలమైన భావోద్వేగాలు ఉన్నాయి. ముఖ్యంగా పతాక సన్నివేశాలు చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. తండ్రులతో ఎక్కువగా అనుబంధం ఉండే మహిళా ప్రేక్షకులు భావోద్వేగానికి గురవుతున్నారు. ఐ బొమ్మ పైరసీ సైట్ మూసివేయడంతోపాటు, టికెట్ ధరను రూ.99కు తగ్గించడం ఈ సినిమాకి మరింతగా కలిసొచ్చింది. 70 శాతం మంది పంపిణీదారులు, ప్రదర్శనకారుల్ని ఈ ధరలకు ఒప్పించాం కానీ, మిగతా వాళ్లు తిరస్కరించారు. వాళ్లంతా కూడా ఈ సినిమా ఫలితాల్ని చూసి పునరాలోచించుకోవాలి. చిన్న సినిమాలకి ఇలా ధరల తగ్గింపు ఎంతో మేలు చేస్తోంది. తమకు వచ్చే పర్సంటేజీ తగ్గిపోతుందని ఎగ్జిబిటర్లు అనడంలోనూ న్యాయం ఉంది కానీ, సినిమా చూడటానికి వచ్చే ప్రేక్షకుల సంఖ్య పెరుగుతుందనే విషయాన్ని గ్రహించాలి. టికెట్ ధరల విషయంలో ఈ సినిమాని ఒక ఉదాహరణగా చూపిస్తాం".

● "తెలంగాణ మూలాల నుంచి ఈమధ్య ఎక్కువగా కథలు వస్తున్నాయి. పాటలకూ విశేష ఆదరణ లభిస్తోంది. ఆంధ్ర ప్రాంతానికి వెళ్లినప్పుడు కూడా అక్కడ 'మేం ఇదిగో ఇలాంటి వీడియోలు చేశాం' అని చూపిస్తుంటారు. కానీ అందులో సాంకేతికత తక్కువగా కనిపిస్తుంటుంది. తెలంగాణ యువతకు హైదరాబాద్ దగ్గరగా ఉండటం, సాంకేతిక వనరులు అందుబాటులో ఉండటంతో మరింతగా సద్వినియోగం చేసుకుంటున్నారు. చెప్పాల్సిన కథలు మన చుట్టూ ఇంకా చాలానే ఉన్నాయని ఇలాంటి చిత్రాలే నిరూపిస్తుంటాయి. కథాబలమున్న ఇలాంటి సినిమాల్ని ప్రేక్షకుల దగ్గరకు చేర్చడం కోసం మేం శక్తిమేర కష్టపడుతుంటాం. మరో రెండు రోజుల్లో మా బృందంతో కలిసి మరిన్ని థియేటర్లకు వెళ్లి ప్రేక్షకుల్ని పలకరిస్తాం. భవిష్యత్తులోనూ ఈటీవీ విన్‌తో మా అనుబంధం కొనసాగుతుంది".

ఈ బిరుదును నేను సీరియస్‌గా తీసుకోను!



మనోజ్ బాజ్‌పేయీ

'ది ఫ్యామిలీ మ్యాన్ 3' వెబ్ సిరీస్‌తో మరోసారి శ్రీకాంత్ తివారీగా ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించారు నటుడు మనోజ్ బాజ్‌పేయీ. కథల ఎంపికలో ఆచితూచి అడుగులేసే ఈయన.. స్టార్ అనే బిరుదును పట్టించుకోనని అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మనోజ్‌కు తనను తాను ఒక నటుడిగా లేదా స్టార్‌గా అనుకుంటారా? అనే ప్రశ్న ఎదురైంది. "స్టార్ లాంటి పదాల్ని నేను పెద్దగా సీరియస్‌గా తీసుకోను. 65ఏళ్ల వ్యక్తిగా నటించగలను.. ప్రధాన హీరో పాత్రను పోషించగలను. ఇలా అన్ని రకాల పాత్రల్ని ఎలాంటి సంకోచం లేకుండా చేయగలను. ఇది పరిశ్రమలో సంప్రదాయమని భావిస్తున్నాను. సినిమాలో లీడ్ రోల్ అంటే కేవలం యువకులది మాత్రమే కాదు.. బలమైన కథలో ఏ వయసు వారైనా నటించవచ్చు" అని బదులిచ్చారు. దీంతో పాటు 'ది ఫ్యామిలీ మ్యాన్ సీజన్ 4' రాబోతుందని, అందులో మీకు అన్ని సమాధానాలు దొరుకుతాయని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు మనోజ్.

'ఆంధ్ర కింగ్ తాలూకా'కి స్ఫూర్తి అదే!



మహేశ్‌బాబు.పి

"మన దక్షిణ భారతదేశంలో తారల్ని ప్రతి అభిమానీ తన జీవితంలో ఒక అంతర్భాగంగా భావిస్తాడు. అందులో నాకు చాలా భావోద్వేగాలు కనిపించాయి. కథానాయకుడు, అభిమాని మధ్య ఉన్న ఆ బంధం నేపథ్యంలో ఒక మంచి కథ చెప్పొచ్చు అనిపించింది. అభిమానుల నేపథ్యంలో ఇదివరకు సినిమాలు వచ్చాయి కానీ, ఇలాంటి కథ మాత్రం ఇప్పటివరకూ రాలేదు" అంటున్నారు మహేష్‌బాబు.పి. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'తో తన ప్రతిభని చాటి చెప్పిన ఈ యువ దర్శకుడు ఇటీవల తెరకెక్కించిన ఆ చిత్రమే 'ఆంధ్ర కింగ్ తాలూకా'. రామ్ పోతినేని కథానాయకుడు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా మహేశ్‌బాబు.పి సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

● "జీవితంలో ప్రతి ఒక్కరం ఎవరికో ఒకరికి అభిమానిగా ఉంటాం. మనం అభిమానించే ఆ వ్యక్తి స్ఫూర్తితో మనం ఏం ప్రయత్నిస్తున్నాం అనేది కీలకం. ఆ అంశమే ఈ సినిమా చేయడానికి స్ఫూర్తి. చాలా రోజుల కిందట ఒక సినిమాకి వెళ్లాను. ఆ సినిమా కూడా నాకు అంతగా గుర్తు రాలేదు. తెరపై కథానాయకుడు ఏదో సందేశం ఇస్తున్నాడు. నాకు అంతగా కనెక్ట్ కావడం లేదు కానీ, నా పక్కన ఉన్న ప్రేక్షకుడు మాత్రం ప్రతి సంభాషణకీ స్పందిస్తున్నాడు. ఆ ప్రేక్షకుడిని గమనిస్తున్నప్పుడు వచ్చిన ఆలోచనే ఈ కథ. మొదట మైత్రీ మూవీ మేకర్స్ సంస్థలో ఈ కథ చెప్పా. ఆ తర్వాత రామ్ పోతినేనికి చెప్పా. మొదట ఆయన 20 నిమిషాల్లో కథ చెప్పగలవా అన్నారు. పది నిమిషాలు కథ విని, ఆ తర్వాత పూర్తి కథ చెప్పమన్నారు. అలా మూడున్నర గంటలు ఈ కథని విన్నారు. ఆ తర్వాత నిర్మాత వై.రవిశంకర్ ఫోన్ చేసి మైత్రీ మూవీ మేకర్స్ సంస్థలో సింగిల్ సిట్టింగ్‌లోనే ఓకే అయిన కథ ఇదే' అని చెప్పారు. అలా మొదలైందే ఈ చిత్రం. మనం ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు జరిగే కథ కావడంతోనే 'ఆంధ్రకింగ్ తాలూకా' అనే పేరుని ఖరారు చేశాం".

● "తన కథానాయకుడు ఏమేం చేయగలడో అవన్నీ చేసేస్తూ ఎంతో హుషారుగా కనిపిస్తుంటారు అభిమానులు. అలాంటి ఓ అభిమాని పాత్ర చేయాలంటే ఎంతో ఉత్సాహం కావాలి, అభిమానిలాగే మాస్‌గా కనిపించాలి. అలాంటి పాత్రలో నాకు రామ్ తప్ప మరొకరు కనిపించలేదు. ఆయనకు అభిమానులు ఎక్కువ. వాళ్లనే స్ఫూర్తిగా తీసుకుని ఈ సినిమాలో నటించారు. ఇప్పటివరకూ రామ్ చేసిన సినిమాలు వేరు, ఈ సినిమా వేరు. ఆయన తన పరిధి నుంచి బయటికొచ్చి ఈ సినిమా చేశారు. భాగ్యశ్రీ పాత్ర ఈ కథలో చాలా కీలకం. ఆమె పాత్ర ఒక జీవితాన్ని చూసినట్టుగా ఉంటుంది. ఇక కథలో కీలకమైన అభిమాన తార సూర్య పాత్రలో కూడా ఉపేంద్రని తప్ప మరొకరిని ఊహించలేం. సూర్య పాత్రలో ఆయన నటన గుర్తుండిపోతుంది. మైత్రీ మూవీ మేకర్స్‌తో కలిసి చేసిన ఈ ప్రయాణం నాకెంతో ప్రత్యేకం".

● "రెండేళ్లలో ఇంత పెద్ద ప్రాజెక్ట్‌ని పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తుండడం ఆనందంగా ఉంది. నా ప్రయాణం వేగంగా సాగుతున్నట్టే. తదుపరి సినిమాల కోసం కొన్ని కథలు సిద్ధంగా ఉన్నాయి, అందుకు సంబంధించి చర్చలు కూడా సాగుతున్నాయి. తొలి చిత్రంగా నేను 'రారా కృష్ణయ్య' చేయాలనుకోలేదు. నేను వేరే కథని చెప్పాను కానీ, అప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా ఆ సినిమా చేశా. అది హిట్ అయ్యుంటే నా దారి ఏమిటో నేను తెలుసుకునే వాణ్ని కాదేమో. ఆ ఫలితం తర్వాత నాకేం కావాలో నేను తెలుసుకున్నా. అందుకు తగ్గట్టే నా కథలతో నేను ప్రయాణం చేస్తున్నా".

పూరి-సేతుపతి.. ముగించారు



విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్

విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా చిత్రం రూపొందుతోంది. పూరి, ఛార్మి కౌర్, జేబీ నారాయణరావు కొండ్రోళ్ల నిర్మిస్తున్నారు. సంయుక్తా మేనన్ కథానాయిక. టబు, విజయ్ కుమార్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్టు సోమవారం ప్రకటించారు. ఈ మేరకు సెట్లో చివరి రోజు విజయ్ సేతుపతి అనుభవాన్ని వీడియో ద్వారా పంచుకుంది ఛార్మి. ఈ చిత్ర ప్రయాణం తనకు మరిచిపోలేని ఆనందకరమైన అనుభవాన్నిచ్చిందని.. ఈ యూనిట్‌తో కలిసి పని చేయడాన్ని మిస్ అవుతున్నానని ఆ వీడియోలో సేతుపతి చెప్పారు. వినూత్నమైన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబైన ఈ సినిమాకి 'స్లమ్‌డాగ్' అనే పేరు పరిశీలనలో ఉంది. త్వరలోనే టైటిల్, ఫస్ట్‌లుక్‌తో పాటు విడుదల తేదీపై స్పష్టత ఇవ్వనున్నారు. ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతమందిస్తున్నారు.

"గన్ అంటేనే ఎంతో శక్తిమంతమైనది. దానికి త్రిశూలం, దైవత్వం తోడైతే అది ఇంకెంత బలంగా మారుతుందో. అందుకు తగ్గట్టుగానే 'అఖండ 2'లో పోరాట ఘట్టాలు ఉంటాయి" అన్నారు రామ్‌లక్ష్మణ్. అభిమానుల్ని అలరించడం కోసం ఈ సినిమాలో 99 శాతం యాక్షన్ సన్నివేశాల్ని బాలకృష్ణ స్వయంగా చేశారనీ, ఆయన్ను తప్ప మరొకరిని ఊహించుకోలేని విధంగా ఇందులో నటించారని చెప్పారు యాక్షన్ కొరియోగ్రాఫర్లు రామ్ లక్ష్మణ్. అగ్ర తారల సినిమాలంటే మరింతగా విజృంభిస్తుంటారు. వీళ్లు డిజైన్ చేసే యాక్షన్ ఘట్టాల్లో హీరోయిజాన్ని ఆవిష్కరించే తీరు మరింత ప్రత్యేకంగా ఉంటుంది. బాలకృష్ణ కథానాయకుడిగా, బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన 'అఖండ 2: తాండవం'కు యాక్షన్ ఘట్టాల్ని సమకూర్చారు. ఈ చిత్రం డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా సోమవారం విలేకర్లతో ముచ్చటించారు రామ్‌లక్ష్మణ్.

బాలకృష్ణకు మాపై నమ్మకం ఎక్కువ!



రామ్, లక్ష్మణ్

"కథానాయకుడు బాలకృష్ణ సినిమాలకి మేం ఎప్పట్నుంచో పనిచేస్తున్నాం. మా పనిలో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందనేది ఆయన నమ్మకం. 'సింహా', 'లెజెండ్', 'అఖండ'... ఇలా చాలా సినిమాలకి మేం ఫైట్స్ డిజైన్ చేశాం. అయితే ఈ సినిమాకి పనిచేయడం మాత్రం ఎంతో ప్రత్యేకం. సెట్‌లో బాలకృష్ణని చూస్తున్నప్పుడు ఒక దైవికశక్తిని చూస్తున్నట్టే ఉండేది. మాకూ ఆధ్యాత్మిక చింతన ఎక్కువే. మేమంతా కథలో లీనమై చేసిన సినిమా ఇది. దర్శకుడు బోయపాటి శ్రీను 'అఖండ' సినిమాలో బాలకృష్ణ పోషించిన అఘోరా పాత్రని పరిచయం చేశారంతే. కానీ ఇందులో ఆ పాత్ర విశ్వరూపాన్ని చూస్తారు. అందుకు తగ్గట్టే 'అఖండ'కు మించిన యాక్షన్‌ని ఇందులో డిజైన్ చేయాల్సి వచ్చింది".

● "మూడు కోణాల్లో కనిపించనున్నారు కథానాయకుడు బాలకృష్ణ. ఆ పాత్రకు తగ్గట్టుగా ఒక్కొక్క కోణానికి తగ్గట్టుగా యాక్షన్‌ని డిజైన్ చేశాం. బాలకృష్ణ తన అభిమానులకు ఎప్పుడూ రియల్‌గా కనిపించాలనే తపనతో పనిచేస్తుంటారు. ఇందులోనూ ఆయన చాలా సాహసోపేతమైన సన్నివేశాల్ని చేశారు. హిమాలయాల్లో మేం చలికి తట్టుకోలేక కోట్లు వేసుకుని సెట్‌కి వెళితే, బాలకృష్ణ మాత్రం తన పాత్రకు తగ్గట్టుగానే భుజాలు కనిపించే దుస్తులతోనే గంటల తరబడి నిలబడి పోరాట ఘట్టాల్ని చేశారు. ఒక పాత్రలో అంతగా లీనమయ్యే నటుడు మనకు ఉండటం గర్వకారణం. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న చిత్రం కావడంతో ప్రతి ఘట్టాన్నీ భారీగా తెరపైకి తీసుకొచ్చాం. కుంభమేళా నేపథ్యంలో సన్నివేశాలు ఇందులో గొప్పగా ఉంటాయి. ప్రపంచ దేశాలు కూడా శివశక్తిలోని అద్భుతాన్ని చూసి గర్వపడేలా ఈ సినిమాని తెరకెక్కించారు దర్శకుడు బోయపాటి శ్రీను. నిర్మాతలు ఏ విషయంలోనూ రాజీపడకుండా భారీ హంగులతో ఈ చిత్రాన్ని నిర్మించారు".

● "యాక్షన్ విషయంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూనే ఉంటాం. ప్రేక్షకులకు ఎలాంటి సినిమాలు నచ్చుతున్నాయో గమనిస్తూ, ఇంకా కొత్తగా ఏం చేయాలో ఆలోచిస్తూ పనిచేస్తుంటాం. మాకు అప్‌డేటెడ్ వెర్షన్‌గా మా అబ్బాయి రాహుల్ ఈ రంగంలోకి వచ్చాడు. కొన్ని పోరాట ఘట్టాల్ని డిజైన్ చేస్తున్నప్పుడు ఇప్పుడు ట్రెండ్ ఇలా ఉంది, ఇలా చేద్దాం అంటూ సలహాలు ఇస్తుంటాడు. త్వరలోనే తనని యాక్షన్ డైరెక్టర్‌గా పరిచయం చేస్తాం. ఏ రంగంలోనైనా పోటీ ఉన్నప్పుడే కొత్తదనం వస్తుంది. అలా యాక్షన్‌లోనూ కొత్త స్టైల్స్ రావల్సిన అవసరం ఉంది".

అమెరికా సుంకాలను ఎదురొడ్డిన మన రొయ్య

ఎగుమతుల్లో స్థిర వృద్ధి



ఇతర దేశాల కంటే మనదేశ రొయ్యలపై అమెరికా అధికంగా సుంకాలు విధించినా.. వీటి ఎగుమతుల్లో వృద్ధి స్థిరంగా కొనసాగుతోంది. అమెరికా యేతర ప్రాంతాలకు ఎగుమతులు పెరగడం, కొత్త మార్కెట్లకు ఎగుమతులు ప్రారంభించడం ఇందుకు కారణం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 5 నెలల్లో 2.43 బిలియన్ డాలర్ల (రూ.21,600 కోట్లకు పైగా) విలువైన 3.48 లక్షల టన్నుల రొయ్యలు మనదేశం నుంచి వివిధ దేశాలకు ఎగుమతి అయ్యాయి. ఏడాది క్రితం ఇదే సమయంలో జరిగిన ఎగుమతులు 2.06 బిలియన్ డాలర్ల (సుమారు రూ.18,300 కోట్ల) కంటే, విలువ పరంగా 18%, పరిమాణం పరంగా 11% ఇవి అధికమని కేర్ఎడ్జ్ రేటింగ్స్ తెలిపింది. సుంకాల భారం ఉన్నా కూడా అమెరికాకు ఎగుమతులు 5% పెరగడం ఆసక్తికరం అంశం.

రూ.12,000 కోట్లకు చేరిక

గతేడాది ఏప్రిల్-ఆగస్టు మధ్య అమెరికా యేతర మార్కెట్లకు తరలివెళ్లిన రొయ్యల విలువ 1.06 బిలియన్ డాలర్లు (సుమారు రూ.9300 కోట్లు) కాగా, ఈ ఏడాది ఇదే సమయంలో 30% పెరిగి 1.38 బిలియన్ డాలర్ల (సుమారు రూ.12,000 కోట్ల)కు చేరింది. మన రొయ్యల ఎగుమతుల్లో అమెరికా యేతర ప్రాంతాల వాటా ఏడాది క్రితం 51% కాగా, ఈ ఏడాది ఇదే సమయంలో ఇది 57 శాతానికి చేరింది.

- అదనంగా పెరిగిన ఎగుమతుల్లో 86% వాటా వియత్నాం, బెల్జియం, చైనా, రష్యాలదే. చైనాకు మన రొయ్యల ఎగుమతులు 16% పెరిగాయి. వియత్నాం, బెల్జియంకు రెట్టింపయ్యాయి.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-ఆగస్టు మధ్య రొయ్యలపై అమెరికా సుంకాలు సగటున 18 శాతంగా ఉన్నాయి. ఇదే సమయంలో మన పోటీదేశాలైన ఈక్వెడార్, ఇండోనేషియా రొయ్యలపై సుంకం 13-14 శాతమే.
- తదుపరి మన రొయ్యలపై అమెరికా సుంకం అమాంతం 58 శాతానికి చేరగా, ఇతర ప్రాంతాల రొయ్యలపై సుంకం 18-49 శాతంగా ఉంది. ఇందువల్ల అమెరికా రిటెయిల్ విపణి, అధికంగా కొనుగోలు చేసే ఆహార తయారీ పరిశ్రమలో కూడా మన రొయ్యలు ధరల పరంగా పోటీపడలేక పోతున్నాయి. అయినా కూడా ఎగుమతులు పెరుగుతున్నాయని.. ఆర్థిక సంవత్సరం మొత్తంమీద 10-12% వృద్ధి నమోదవుతుందని కేర్ఎడ్జ్ అంచనా వేస్తోంది.



ఏప్రిల్-అక్టోబరులో రూ.43,300 కోట్ల మత్స్య ఎగుమతులు

మనదేశం నుంచి మత్స్య ఉత్పత్తుల ఎగుమతులు ఏప్రిల్-అక్టోబరులో 4.87 బిలియన్ డాలర్లు (సుమారు రూ.43,300 కోట్లు) అని వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. 2024 ఇదే కాల ఎగుమతుల కంటే ఇవి 16.18% అధికమని పేర్కొంది. రొయ్యల ఎగుమతులు చైనాకు 24.54%, వియత్నాంకు 123.62%, బెల్జియంకు 94.18%, జపాన్‌కు 10.84%, రష్యాకు 49%, కెనడాకు 13.54%, యునైటెడ్ కింగ్‌డమ్‌కు 28.81% పెరిగాయి.

రూపాయి బలహీనపడినా ఎగుమతుల్లో ఏదీ వృద్ధి?



ఈనాడు, హైదరాబాద్: డాలర్‌తో రూపాయి మారకపు విలువ రికార్డు కనిష్ఠానికి దిగజారుతోంది. ప్రస్తుతం రూ.89.16 వద్ద ఉన్న డాలర్ విలువ, ఈ సంవత్సరాంతానికి రూ.90 ను మించుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా రూపాయి బలహీన పడితే, డాలర్ ధర పరంగా ఇతర దేశాల కంటే తక్కువకు లభించడం వల్ల మన ఎగుమతులు పెరుగుతాయని వాదించే వారు లేకపోలేదు. కానీ దేశ ఉత్పత్తులపై అంతటి సానుకూలత లభించడం లేదని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. గత పదేళ్లలో రూపాయి విలువ తగ్గిన స్థాయిలో మనదేశం నుంచి ఎగుమతులు పెరగ లేదని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ పేర్కొంటున్నారు. ఆయన విశ్లేషణ ప్రకారం...

- 2013లో డాలర్ విలువ రూ.60 కాగా, మనదేశం నుంచి 313 బిలియన్ డాలర్ల వస్తు ఎగుమతులు నమోదయ్యాయి. ప్రస్తుతం డాలర్ విలువ రూ.90 కి చేరింది. అంటే 12 ఏళ్లలో రూపాయి మారకపు విలువ 50% క్షీణించింది. కానీ వస్తు ఎగుమతులు 440 బిలియన్ డాలర్ల దగ్గరే ఉన్నాయి.
- ముడిపదార్థాల వ్యయం అధికంగా ఉండటం, కఠిన ప్రమాణాలు, క్యూసీఓ (క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్స్) రూపంలో ఎదురయ్యే అడ్డంకులు, లాజిస్టిక్స్ ఖర్చులు ఎక్కువగా ఉండటం, ఇంటర్మీడియేట్స్‌ను దిగుమతి చేసుకోవటం దీనికి ప్రధాన కారణాలుగా చెబుతున్నారు.

అవకాశం ఉంది

మన ఎగుమతులు అధికంగా పెరగకపోవడానికి అధిక నియంత్రణ, అధిక తయారీ ఖర్చులు కారణమని స్పష్టమవుతోంది. ఇటీవల కొన్ని మార్పులు వచ్చినందున ఈ పరిస్థితి మారుతుందనే ఆశాభావాన్ని అజయ్ శ్రీవాస్తవ వ్యక్తం చేశారు. కొన్ని పారిశ్రామిక పదార్థాలపై క్యూసీఓ లను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. జీఎస్టీ రేట్లను సవరించారు. కార్మిక సంస్కరణలకు సంబంధించి 'లేబర్ కోడ్'లు జారీ అయ్యాయి. ఇదేరీతిలో సంస్కరణలను పట్టుదలగా అమలు చేస్తే, రూపాయి బలహీనత ఆధారంగా ఎగుమతులు గణనీయంగా పెరిగే అవకాశం ఏర్పడుతుందని ఆయన వివరించారు.

ఈనాడు బిజినెస్

వచ్చే ఏడాది 26 కొత్త విమానాలు

ఎయిరిండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్

గురుగ్రామ్: వచ్చే సంవత్సరం (2026) చివరి కల్లా 26 కొత్త విమానాలు తమకు చేరనున్నట్లు ఎయిరిండియా ముఖ్య కార్యనిర్వహణాధికారి క్యాంప్‌బెల్ విల్సన్ తెలిపారు. ఇందులో అధిక దూరాలు ప్రయాణించేందుకు అనువుగా ఉండే, పెద్దవైన బోయింగ్ 787-9ఎస్, ఏ350-1000ఎస్ విమానాలు 6, 20 చిన్న విమానాలు ఉంటాయని వెల్లడించారు. గతంలో ఆర్డర్ పెట్టిన 570 విమానాల నుంచి తొలి బోయింగ్ 787-9 డ్రీమ్‌లైనర్‌ను వచ్చే నెలలో క్రిస్మస్ ముందు అందుకుంటామని, వచ్చే జనవరిలో ఈ విమాన కార్యకలాపాలు ప్రారంభిస్తామని వివరించారు. ప్రస్తుతం 187 విమానాలను ఎయిరిండియా..110 విమానాలను ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఇందులో 22 బోయింగ్ 777ఎస్, 32 బోయింగ్ 787ఎస్ విమానాలు ఎయిరిండియా చేతిలో ఉన్నాయని చెప్పారు.

✦ అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారిలో 95% కుటుంబాలకు మధ్యంతర పరిహారం అందించినట్లు తెలిపారు.

ఒక షేరు ఉంటే.. 30 షేర్లుగా మారతాయ్

ఏ-1 లిమిటెడ్ షేరు విభజన, బోనస్ షేర్ల జారీ

అహ్మదాబాద్ కేంద్రంగా లాజిస్టిక్స్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఏ-1 లిమిటెడ్ సంస్థ, తన వాటాదార్లకు 3:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు జారీ చేయాలని ప్రతిపాదించింది. దీని ప్రకారం.. వాటాదార్ల వద్ద ఉన్న ప్రతి ఒక్క షేరు, 3 షేర్లు అవుతాయి. అలాగే రూ.10 ముఖ విలువ గల ఒక్కో షేరును రూ.1 ముఖ విలువ గల 10 షేర్లుగా విభజించాలని కూడా నిర్ణయించింది. షేర్ల విభజన, బోనస్ షేర్ల జారీతో ఒక షేరు కలిగిన వారికి, 30 షేర్లు అవుతాయన్నమాట. వీటితో పాటు కంపెనీ అధీకృత మూలధన వాటాను ప్రస్తుత రూ.20 కోట్ల నుంచి రూ.46 కోట్లకు పెంచేందుకూ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదనలపై వాటాదార్ల అనుమతిని ఏ-1 లిమిటెడ్ కోరింది. సోమవారం బీఎస్ఈలో ఈ షేరు 5% లాభపడి, రూ.2317.25 వద్ద స్థిరపడింది. ఇదే జీవనకాల గరిష్ఠస్థాయి.

డాక్టర్ రెడ్డీస్ 'ఆస్టియోపొరాసిస్' ఔషధానికి ఐరోపా కమిషన్ అనుమతి



ఈనాడు, హైదరాబాద్: డాక్టర్ రెడ్డీస్‌కు చెందిన డెనోసుమ్యాబ్ బయోసిమిలర్ ఔషధమైన ఏవీటీ03 కి ఐరోపా కమిషన్ నుంచి మార్కెటింగ్ అనుమతి లభించింది. డెనోసుమ్యాబ్ ఔషధం ప్రొలియా, ఎక్స్‌జెవా అనే బ్రాండ్ల పేరుతో ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉంది. ఈ రెండు బ్రాండ్లు 2024లో అమెరికాలో 5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.44,500 కోట్ల) అమ్మకాలు నమోదు చేశాయి. దీన్ని ఆస్టియోపొరాసిస్, ఎముకల క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్ వ్యాధుల వల్ల ఎముకలు విరిగిపోవడం - గుల్లబారటం వంటి ఆరోగ్య సమస్యలకు చికిత్సలో వినియోగిస్తున్నారు. డాక్టర్ రెడ్డీస్‌కు చెందిన ఏవీటీ03 ఔషధంపై ఈ ఏడాది సెప్టెంబరులో 'కమిటీ ఫర్ మెడిసినల్ ప్రోడక్ట్స్ ఫర్ హ్యూమన్ యూజ్' సానుకూల అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. దీన్ని అనుసరించి ఈ ఔషధానికి తాజాగా ఐరోపా కమిషన్ మార్కెటింగ్ అనుమతి ఇచ్చింది. ఈ అనుమతి ఐరోపా యూనియన్ సభ్య దేశాలతో పాటు, యూరోపియన్ ఎకనమిక్ ఏరియా (ఈఈఏ) దేశాలైన ఐస్‌ల్యాండ్, లీచెన్‌స్టెయిన్, నార్వే దేశాల్లోనూ చెల్లుబాటు అవుతుంది. ఏవీటీ03 ఔషధంపై గతేడాది మేలో డాక్టర్ రెడ్డీస్, అల్వోటెక్ అనే బహుళజాతి ఫార్మా కంపెనీ లైసెన్స్- సప్లై ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీని ప్రకారం ఈ మందును అల్వోటెక్ ఉత్పత్తి చేస్తుంది. ఈ బయోసిమిలర్ మందును అస్విబ్రా (60 ఎంజీ/ ఎంఎల్ ప్రీ-ఫిల్డ్ సిరంజి), ఎక్స్‌బాంజీ (70 ఎంజీ/ ఎంఎల్ ఇంజెక్షన్ సీసా) అనే బ్రాండ్లతో పంపిణీ చేయాలని డాక్టర్ రెడ్డీస్ నిర్ణయించింది.

విమానయాన శిక్షణ వ్యాపారంలోకి అదానీ!



అదానీ గ్రూప్ విమానయాన శిక్షణ (ఏవియేషన్ ట్రైనింగ్) వ్యాపారంలోకి అడుగు పెట్టేందుకు సన్నాహాలు చేసుకుంటోంది. ఇప్పటికే దేశీయంగా పలు విమానాశ్రయాలను సంస్థ నిర్వహిస్తున్న సంగతి విదితమే. ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో మరింత దూకుడుగా విస్తరించాలని అనుకుంటోంది. ఇందులో భాగంగానే ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్ (ఎఫ్ఎస్‌టీసీ)ను కొనుగోలు చేయడానికి అదానీ గ్రూప్ డిఫెన్స్ సంస్థ ముందస్తు చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. శిక్షణ పొందిన కాక్‌పిట్ సిబ్బందికి గిరాకీ పెరుగుతున్నందున.. ఇందుకోసం సంయుక్త సంస్థను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉంది. ఇప్పటికే విమానాల నిర్వహణ - మరమ్మతు - ఓవర్‌హాలింగ్ సేవల కోసం ఎయిర్ వర్క్స్ సంస్థను అదానీ గ్రూప్ కొనుగోలు చేసింది.

✦ రాబోయే దశాబ్దకాలంలో దేశీయంగా 20,000 మంది, ఆసియా పసిఫిక్‌లో 98,000 మంది కొత్త పైలట్లు కావాల్సి ఉంటారనే అంచనాలున్నాయి. సిమ్యులేటర్ ఆధారిత శిక్షణ గంటలు పైలట్లకు తప్పనిసరి కావడంతో, ఈ శిక్షణ రంగంపై అదానీ గ్రూప్ దృష్టి సారించిందని సమాచారం.

ఎలక్ట్రానిక్స్‌లోకి చైనా ఎఫ్‌డీఐ సులువుగా!

ముసాయిదా కేబినెట్ నోట్ సిద్ధం

మనదేశ ఎలక్ట్రానిక్స్, మన్నికైన వినియోగదారు వస్తువుల రంగంలోకి చైనా నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) రావడం సులభతరం కానుంది. ఇందుకోసం కేంద్రప్రభుత్వం తన ప్రెస్‌నోట్ 3 (2020)కి సవరణలు చేయడానికి సిద్ధమైనట్లు ఒక ఆంగ్ల వార్తా సంస్థ తెలిపింది. ఇప్పటికే ఒక ముసాయిదా కేబినెట్ నోట్ సిద్ధమైందని, దీనిపై సంబంధిత అన్ని మంత్రిత్వ శాఖల నుంచి స్పందనలను కోరారని తెలుస్తోంది. కేబినెట్ నోట్‌లో మూడు కీలక మార్పులు ఉన్నట్లు సమాచారం.

1) ఏదైనా భారతీయ కంపెనీ 49% వరకు ఎఫ్‌డీఐని అందుకున్న పక్షంలో, విస్తృత తనిఖీలు ఉండవు. అంటే ప్రస్తుత కఠిన అనుమతి ప్రక్రియ నుంచి పూర్తిగా బయటకు వచ్చినట్లే.

2) ఎలక్ట్రానిక్స్, యంత్రపరికరాల రంగాల వంటి ఎంపిక చేసిన రంగాలకే ప్రతిపాదిత మినహాయింపులు వర్తిస్తాయి. ఈ రంగాల్లోకి, చైనా వంటి సరిహద్దు దేశాల నుంచి పెట్టుబడులు వచ్చినా తీవ్ర తనిఖీలుండవు.

3) 'బెనిఫిషియల్ ఓనర్‌షిప్' నిర్వచన మార్పునకు సంబంధించినది. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎమ్ఎల్ఏ) నిబంధనల ప్రకారం.. ఈ నిర్వచనాన్ని మార్చనున్నట్లు సమాచారం.

మంత్రిత్వ శాఖల నుంచి స్పందనలు వచ్చాక, సమీక్షించి ఈ ప్రతిపాదనను తుది ఆమోదం కోసం మంత్రిమండలికి పంపనున్నారు.

రెపోరేటు కోతకు పరిస్థితులు అనుకూలమే

ఆర్‌బీఐ గవర్నర్

రెపోరేటు తగ్గించేందుకు అనువైన పరిస్థితులు దేశంలో ఉన్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా చెప్పారు. అక్టోబరు సమీక్షలోనూ ఇదే విషయాన్ని ఆయన తెలిపారు. అప్పటి నుంచి వెల్లడైన స్థూల ఆర్థిక గణాంకాలన్నీ, రేట్ల తగ్గింపునకు అనుకూలంగానే ఉన్నాయని ఒక వార్తాసంస్థకు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో గుర్తు చేశారు. దేశంలో ధరల స్థిరత్వంతో పాటు వృద్ధికి సహకరించడమే ఆర్‌బీఐ లక్ష్యమని పేర్కొన్నారు. అయితే డిసెంబరు సమీక్షలో రేట్ల తగ్గింపు ఉంటుందా, ఉండదా అనే విషయాన్ని ఆర్‌బీఐ గవర్నర్ స్పష్టం చేయలేదు.

కోడి గుడ్లు



25న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	650
వరంగల్	652
విజయవాడ	660
తూ/ప గోదావరి	645
విశాఖపట్నం	635
చిత్తూరు	673

జెడ్‌సీజెడ్‌పీ బాండ్లను పరిగణనలోకి తీసుకోకూడదు

బేసిక్ సర్వీసెస్ డీమ్యాట్ ఖాతాపై సెబీ ప్రతిపాదన




బేసిక్ సర్వీసెస్ డీమ్యాట్ ఖాతా (బీఎస్‌డీఏ) సదుపాయాన్ని మరింత మందికి చేరువ చేసే ఉద్దేశంతో, ఈ సదుపాయ అర్హతలపై సమీక్ష జరిపాలని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ప్రతిపాదించింది. ఇందులో భాగంగా బీఎస్‌డీఏ సదుపాయాన్ని పొందడం కోసం అర్హతను నిర్ణయించేందుకు పోర్ట్‌ఫోలియో విలువ లెక్కింపులో జెడ్‌సీజెడ్‌పీ (జీరో కూపన్, జీరో ప్రిన్సిపల్) బాండ్లను మినహాయించాలని సూచించింది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే.. పెట్టుబడులు, వ్యాపార నిర్వహణకు సులభతర పరిస్థితులు ఏర్పడుతాయని తాజా చర్చాపత్రంలో పేర్కొంది. సాధారణ డీమ్యాట్ ఖాతాతో పోలిస్తే మరింత బేసిక్ వెర్షన్ అయిన బీఎస్‌డీఏ సదుపాయాన్ని 2012లో సెబీ తీసుకొచ్చింది. చిన్న పోర్ట్‌ఫోలియోలు ఉండే మదుపర్లపై డీమ్యాట్ ఛార్జీల భారాన్ని తగ్గించడమే బీఎస్‌డీఏ ఉద్దేశం. 'సంప్రదాయ బాండ్లతో పోలిస్తే జెడ్‌సీజెడ్‌పీ బాండ్లు భిన్నమైనవి. వీటిని బదిలీ, ట్రేడ్ చేసే వీలుండదు. మదుపర్లకు ప్రతిఫలాన్ని అందించవు. ఈ బాండ్లను పెట్టుబడి ఆస్తిగా కాకుండా, విరాళంగానే చూడాల్సి ఉంటుంది. అందువల్ల బీఎస్‌డీఏ అర్హత నిర్దేశానికి పోర్ట్‌ఫోలియో లెక్కింపునకు జెస్‌సీజెడ్‌పీ బాండ్లను పరిగణనలోకి తీసుకోకూడదని ప్రతిపాదిస్తున్నట్లు' సెబీ వివరించింది.

వృద్ధిరేటు 6.5 శాతమే: ఎస్అండ్‌పీ అంచనా



ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) భారత వృద్ధి రేటు 6.5% ఉండొచ్చని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 6.7 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. జీఎస్టీ - ఆదాయపు పన్ను కోతలు, కీలక వడ్డీ రేట్ల తగ్గింపు లాంటివి వినియోగ ఆధారిత వృద్ధికి దోహదం చేయనుండటమే ఇందుకు కారణంగా తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- జూన్‌లో భారత జీడీపీ వృద్ధి 7.8 శాతంగా తేలింది. గత 5 త్రైమాసికాల్లోనే ఇది అధిక వృద్ధి. జులై- సెప్టెంబరు త్రైమాసికానికి జీడీపీ వృద్ధి అధికారిక గణాంకాలు ఈనెల 28న వెల్లడి కానున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి దేశ వృద్ధి రేటును 6.8 శాతంగా ఆర్‌బీఐ అంచనా వేసిన సంగతి తెలిసిందే. గత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 6.5 శాతమే.

ఏసీ విద్యుత్తు వినియోగం తగ్గించేలా.. కొత్త సాంకేతికతలపై కేంద్రం దృష్టి



దిల్లీ: ఎయిర్ కండీషనర్ల (ఏసీ) విద్యుత్తు వినియోగాన్ని తగ్గించే చర్యలపై కేంద్రం దృష్టి సారిస్తోంది. రాబోయే ఏళ్లలో ఈ రంగంలో విద్యుత్ వినియోగం భారీగా పెరగనుందన్న అంచనాల మధ్య ఈ నిర్ణయం తీసుకుంది. కొత్త సాంకేతికతలను ఆవిష్కరించడంతో పాటు, దేశీయ తయారీని ప్రోత్సహించేందుకు సాంకేతికతల బదిలీపైనా చర్చలు చేపడుతున్నట్లు పరిశ్రమ, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) కార్యదర్శి అమర్‌దీప్ సింగ్ భాటియా తెలిపారు. 'ఈ విషయంలో ప్రపంచ బ్యాంకుతోనూ కలిసి పనిచేస్తున్నామ'ని ఆయన అన్నారు.

రష్యాకు ఐఫోన్లు అక్రమంగా పంపొద్దు

● భారీ జరిమానాలు విధిస్తాం ● రిటెయిలర్లకు పంపిణీదార్ల హెచ్చరిక



మన దేశం నుంచి ఎగుమతి అవుతున్న మొత్తం ఐఫోన్‌లలో 3-5% అనధికారిక మార్గాల ద్వారా విదేశాలకు తరలి వెళుతున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. వీటిలో దాదాపు సగం రష్యాకే చేరుతున్నాయని తేల్చారు. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో, ఐఫోన్ తయారీ సంస్థ యాపిల్ రష్యాలో తన కార్యకలాపాలను నిలిపివేయడం వల్ల, అక్కడకు అక్రమంగా ఐఫోన్‌లు తరలి వెళుతున్నాయి. అందువల్లే మన దేశంలో కొన్ని ఐఫోన్ మోడళ్లకు కొరత ఏర్పడుతోందని చెబుతున్నారు.

✦ ఐఫోన్ 17 సిరీస్‌లోని కొత్త ఐఫోన్‌లను కొనుగోలు చేసిన 90 రోజుల్లోపు విదేశీ సబ్‌స్క్రైబర్ ఐడెంటిటీ మాడ్యూల్ (సిమ్) కార్డులతో యాక్టివేట్ చేస్తే భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని యాపిల్ అధికారిక పంపిణీదార్లు, భారతీయ మొబైల్ ఫోన్ రిటెయిలర్లను హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఐఫోన్‌లను అనధికారిక (గ్రే) మార్కెట్‌లకు అక్రమంగా మళ్లించడాన్ని నిరోధించేందుకే ఈ హెచ్చరికలు చేశారు. తమనుంచి వచ్చిన ఏదైనా ఫోన్ 90 రోజుల్లోపు విదేశీ సిమ్‌తో యాక్టివేట్ అయినట్లు తేలితే, పెద్ద మొత్తంలో జరిమానా విధిస్తామని రిటెయిలర్లకు పంపిణీదార్లు తెలిపారు. యాపిల్ పాలసీ ప్రకారం, అటువంటి సందర్భాల్లో రిటెయిలర్ స్టోర్ కోడ్‌ను బ్లాక్ చేస్తామనీ హెచ్చరించారు.

✦ ఈ చర్య ఎందుకు?: రష్యా, ఆఫ్రికా, పశ్చిమాసియాల్లో లాభాల మార్జిన్ అధికంగా ఉంటున్నందునే, కొందరు రిటెయిలర్లు పెద్ద సంఖ్యలో ఐఫోన్లను అక్కడకు అనధికారికంగా పంపుతున్నారని సమాచారం. ఫలితంగానే మనదేశంలో ఐఫోన్ 17 మోడల్స్ కొన్ని లభించడం లేదు. మనదేశం నుంచి అక్టోబరులో ఎగుమతి అయిన మొత్తం స్మార్ట్‌ఫోన్లలో మూడోవంతు (1.6 బిలియన్ డాలర్లు - సుమారు రూ.14,000 కోట్లు) ఐఫోన్‌లే ఉండటం గమనార్హం.

✦ ఐఫోన్ 17 మోడళ్లలో 256 జీబీ, 512 జీబీ ఫోన్లకు మనదేశంలో ఎక్కువగా కొరత కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఐఫోన్ 17 సిరీస్ కొత్త ఫోన్లపై అందిస్తున్న రూ.6,000 క్యాష్‌బ్యాక్‌ను కూడా రూ.1,000కు సంస్థ తగ్గించింది. మన దేశంలో అధికారికంగా ఎంఆర్‌పీ రూ.82,900 ఉండగా, ఎగుమతి ధర రూ.88,500గా ఉంది.

ఏప్రిల్-సెప్టెంబరులో పెట్టుబడులు రూ.67,870 కోట్లు



అదానీ గ్రూప్ వెల్లడి

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి అర్ధ భాగం (ఏప్రిల్-సెప్టెంబరు)లో అదానీ గ్రూప్ మూలధన వ్యయాలను పెంచడంతో, ప్రధాన మౌలిక సదుపాయాల వ్యాపారాలు వృద్ధిని కొనసాగించాయి. రికార్డు స్థాయిలో ఆదాయం నమోదైంది. ఏప్రిల్-సెప్టెంబరులో ఈ గ్రూప్ రూ.67,870 కోట్ల (7.6 బిలియన్ డాలర్ల) పెట్టుబడులు పెట్టడంతో, స్థూల ఆస్తులు రూ.6.77 లక్షల కోట్ల (76 బి.డాలర్ల)కు చేరాయి. పూర్తి ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న రూ.1.5 లక్షల కోట్ల మూలధన వ్యయాల లక్ష్యాన్ని చేరుకుంటామని గ్రూప్ తెలిపింది. అంతర్జాతీయంగా మౌలిక సదుపాయాల రంగంలో ఉన్న కంపెనీలతో పోలిస్తే ఆస్తులపై ప్రతిఫలం (ఆర్ఓఏ) అత్యధికంగా 15.1% లభించింది.

✦ అదానీ గ్రూప్ 12 నెలల ఎబిటా జీవనకాల గరిష్ఠస్థాయి అయిన రూ.92,943 కోట్ల (10.4 బిలియన్ డాలర్ల)కు చేరింది. వార్షిక ప్రాతిపదికన ఇది 11.2% ఎక్కువ. 2025-26 తొలి అర్ధ భాగంలో ఎబిటా రూ.47,375 కోట్లుగా నమోదైంది. గ్రూప్ ప్రధాన వ్యాపారాలైన యుటిలిటీస్ (అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ పవర్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ టోటల్ గ్యాస్), రవాణా (అదానీ పోర్ట్స్ అండ్ ఎస్ఈజెడ్), మౌలిక సదుపాయాల (అదానీ ఎంటర్‌ప్రైజెస్) కార్యకలాపాల నుంచే ఇందులో 83% వాటా లభించింది.

✦ నికర అప్పు/ఎబిటా నిష్పత్తి మెరుగైంది. గ్రూప్ నిర్దేశించుకున్న శ్రేణి 3.5-4.5 రెట్లతో పోలిస్తే 3 రెట్ల వద్ద సౌకర్యవంతంగా ఉంది. రూ.57,157 కోట్ల (6.4 బి.డాలర్ల) నగదు నిల్వలు గ్రూప్ చేతిలో ఉన్నాయి. ఇవి స్థూల రుణాల్లో 17 శాతానికి సమానం.

✦ అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఆస్తులు రూ.17,595 కోట్ల మేర పెరిగాయి. తర్వాత స్థానాల్లో అదానీ గ్రీన్ ఎనర్జీ (రూ.12,314 కోట్లు), అదానీ పవర్ (రూ.11,761 కోట్లు) ఉన్నాయి.

క్వాలిటీ వాల్స్ బోర్డులో డైరెక్టర్ల నియామకం


హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) నుంచి విభజనకు ముందు క్వాలిటీ వాల్స్ (ఇండియా) డైరెక్టర్ల బోర్డులో పలు నియామకాలు చోటుచేసుకున్నాయి. ఒక నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు, ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, నలుగురు స్వతంత్ర డైరెక్టర్లు కలిపి మొత్తంగా 7 మంది డైరెక్టర్లను నియమించినట్లు కంపెనీ తెలిపింది. 2025 డిసెంబరు 1 నుంచి హెచ్‌యూఎల్ నుంచి క్వాలిటీ వాల్స్ అధికారికంగా విడిపోయి.. స్వతంత్ర సంస్థగా కార్యకలాపాలు నిర్వహించనుంది.

ఆఖర్లో అమ్మకాల ఒత్తిడి

సెన్సెక్స్ ▼ 331 — 84901
నిఫ్టీ ▼ 109 — 25960

● రూ.2.54 లక్షల కోట్లు తగ్గిన మదుపర్ల సంపద
● 46 పైసలు పుంజుకున్న రూపాయి

ఎఫ్ఐఐ అమ్మకాలు.. రూ.4171.75 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు.. రూ.4512.87 కోట్లు



ఆఖరి గంటలో అమ్మకాలు వెల్లువెత్తడంతో స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. నిఫ్టీ కీలక 26,000 పాయింట్ల స్థాయిని నిలబెట్టుకోవడంలో విఫలమవ్వడంతో, మదుపర్లు జాగ్రత్తపడి లాభాల స్వీకరణకు దిగారు. భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారు ఆలస్యం కావొచ్చన్న అంచనాలు మార్కెట్ సెంటిమెంటును దెబ్బతీశాయి. విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్ఐఐలు) అమ్మకాలూ ప్రతికూల ప్రభావం చూపాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 50 పైసలు పుంజుకుని 89.16 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు ధర 0.18% పెరిగి 62.67 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.54 లక్షల కోట్లు తగ్గి రూ.469.68 లక్షల కోట్ల (5.27 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

మధ్యాహ్నం వరకు సానుకూలమే..: బీఎస్ఈ సెన్సెక్స్ (క్రితం ముగింపు 85,231.92) ఉదయం 85,320 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ఆరంభమైంది. మధ్యాహ్నం వరకు సానుకూల ధోరణిలోనే కదలాడి ఒక దశలో 85,473.47 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. ఆ తర్వాత అమ్మకాల ఒత్తిడి పెరగడంతో నష్టాల్లోకి జారుకుంది. చివరకు 331.21 పాయింట్ల నష్టంతో 84,900.71 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 108.65 పాయింట్లు కోల్పోయి 25,959.50 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 26,142.80 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 25,912.15 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని ఈ సూచీ నమోదుచేసింది.

8 మినహా మిగతావి నష్టాల్లో..: సెన్సెక్స్ 30 కంపెనీల్లో 8 మినహా మిగతా కంపెనీల షేర్లు నష్టాల్లో ముగిశాయి. భెల్ 2.98%, టాటా స్టీల్ 1.61%, మహీంద్రా అండ్ మహీంద్రా 1.59%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.18%, ట్రెంట్ 1.16%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.14%, టీఎంపీసీ 1.1%, బజాజ్ ఫైనాన్స్ 1.09% తగ్గాయి. టెక్ మహీంద్రా 2.43%, ఏషియన్ పెయింట్స్ 0.46%, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 0.35%, ఇన్ఫోసిస్ 0.31%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.09% పెరిగాయి.

✦ కొత్తగా నోటిఫై చేసిన లేబర్ కోడ్‌ల వల్ల లక్షల మంది కార్మికులకు విస్తృత ప్రయోజనాలు కలుగుతాయని స్విగ్గీ అభిప్రాయపడిన నేపథ్యంలో ఈ సంస్థ షేర్లు సోమవారం బీఎస్ఈలో 4.9% పెరిగి రూ.404.55 వద్ద ముగిశాయి.

✦ సుదీప్ ఫార్మా తొలి పబ్లిక్ ఆఫర్ రెండో రోజుకు 5.09 రెట్ల స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలోనూ 4.96రెట్లు అధికంగా బిడ్‌లు దాఖలయ్యాయి.

✦ వాతావరణం మార్పు, పర్యావరణ సమస్యలపై పనిచేసే అంకురాల్లో పెట్టుబడులు పెట్టేందుకు రూ.2,000 కోట్లు సమీకరించే యోచనలో ఎస్‌బీఐ వెంచర్స్ ఉంది. ఈ రూ.2,000 కోట్ల ఫండ్‌ను వచ్చే ఏడాది జనవరి- మార్చిలో ప్రారంభించాలని అనుకుంటున్నట్లు సంస్థ తెలిపింది.

హెచ్ఏఎల్ షేర్లకు 'తేజస్' సెగ

దుబాయ్ ఎయిర్‌షోలో విన్యాసాలు చేస్తూ తేజస్ యుద్ధ విమానం కుప్పకూలిన ప్రభావంతో.. ఆ విమానాన్ని తయారు చేసిన **హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్** (హెచ్ఏఎల్) షేరు సోమవారం తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ఒక దశలో 8.48% నష్టపోయి రూ.4,205.25కు దిగివచ్చింది. ఆ తర్వాత కాస్త పుంజుకున్నా, 3.31% నష్టంతో రూ.4,443 వద్ద స్థిరపడింది. కంపెనీ కార్యకలాపాలు, ఉత్పత్తిపై విమాన దుర్ఘటన ప్రభావం ఉండదని కంపెనీ వివరణ ఇచ్చింది.

కెనరా బ్యాంక్ ఈడీగా సునీల్ కుమార్

కెనరా బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా సునీల్ కుమార్‌ను ఎంపిక చేశారు. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. దీనికి ముందు పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో చీఫ్ జనరల్ మేనేజర్‌గా ఆయన విధులు నిర్వహిస్తున్నారు.

కరెంట్ అఫైర్స్



★ 2025, అక్టోబరు 9 నుంచి మూడేళ్ల కాలానికి భారతీయ రిజర్వు బ్యాంకు నూతన డిప్యూటీ గవర్నర్‌గా ఎవరు నియమితులయ్యారు? (రాజేశ్వర్‌రావు స్థానంలో ఈ నియామకం జరిగింది.)
జ: శిరీష్ చంద్ర ముర్ము

★ 2025, సెప్టెంబరు 25న అమెరికా ఏ దేశంతో వ్యూహాత్మక పౌర అణు సహకార ఒప్పందం పై సంతకం చేసింది? జ: తుర్కియే

మాదిరి ప్రశ్నలు

★ ప్రతిష్ఠాత్మక బీబీఎల్ (బిగ్ బాష్ లీగ్) జట్టుతో ఒప్పందం కుదుర్చుకున్న తొలి భారత క్రికెటర్‌గా ఇటీవల ఎవరు వార్తల్లో నిలిచారు? (2025–26 సీజన్‌లో ఇతడు సిడ్నీ థండర్‌కు ప్రాతినిధ్యం వహిస్తాడు.)
జ: రవి చంద్రన్ అశ్విన్

★ కేంద్రం ఇటీవల ఏ ఐఐటీని 'ఐక్యరాజ్య సమితి ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా నామినేట్ చేసింది? (ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని ప్రకటించింది.) జ: ఐఐటీ మద్రాసు

మరింత సమాచారం

త్వరగా ఉద్యోగం సాధించాలంటే..!

జాబ్ స్కిల్స్

'నాతో పాటే ఉద్యోగ ప్రయత్నం మొదలుపెట్టాడు. నాకంటే అతడికి ఎక్కువ విద్యార్హతలు ఏమీ లేవు.. కానీ అతడికి ఉద్యోగం వచ్చింది. నాకు ఎందుకు రాలేదు?'.. ఇది కొత్తగా ఉద్యోగ ప్రయత్నాలను మొదలు పెట్టినవారిలో ఎక్కువమందికి ఎదురయ్యే ప్రశ్న. ఇలాంటి సందర్భాల్లో అభ్యర్థులు తమ లోపాలను అధిగమించడానికి ప్రయత్నించాలి. నేర్చుకున్నదాంతో సరిపెట్టుకోకుండా అదనపు పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. కలుపుగోలుతనాన్ని అలవాటు చేసుకోవాలి. తమ కంటే ముందు ఉద్యోగం సాధించిన మిత్రుల సలహాలను తీసుకోవాలి. ఇలాంటి నైపుణ్యాలను ఏవిధంగా అభివృద్ధి చేసుకోవాలో తెలుసుకోవాలంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

విధ్వంసకర గాలుల విపరీత గండం!

జనరల్ స్టడీస్ — విపత్తు నిర్వహణ

సముద్రాల్లో అల్పపీడన ప్రాంతం చుట్టూ ఏర్పడే అస్థిర వాతావరణ వ్యవస్థే చక్రవాతం. ప్రత్యేకించి ఉష్ణమండల ప్రాంతంలో, మూడు వైపుల్లో సముద్రాలతో ఉన్న భారత ఉపఖండాన్ని ఏటా వణికించే ప్రకృతి విపత్తు. పెనుగాలులు, భారీవర్షాలు, వరదలతో విధ్వంసకర పరిస్థితులను సృష్టించే ఆ చక్రవాతాలు సంభవించే విధానం, విస్తరించే తీరు, ఏర్పడే పరిణామాల గురించి పోటీ పరీక్షార్థులకు సమగ్ర అవగాహన ఉండాలి. దేశంపై చక్రవాతాల ప్రభావం తీవ్రంగా ఉండటానికి దోహదపడుతున్న భౌగోళిక పరిస్థితులను అర్థం చేసుకోవాలి. వాటి వల్ల జరిగే నష్టాన్ని తగ్గించడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవాలి.



చక్రవాతాలు - భారత్ పరిస్థితి

* ప్రపంచంలోనే అత్యంత చక్రవాత ప్రభావిత ప్రాంతం భారత్. * సగటున ఏటా 5-6 చక్రవాతాలు భారత ఉపఖండాన్ని ప్రభావితం చేస్తున్నాయి. * ఇందులో 2-3 చక్రవాతాలు అత్యంత ప్రమాదకరంగా ఉంటున్నాయి. * ప్రపంచ వ్యాప్తంగా వచ్చే చక్రవాతాల్లో 10% ఈ ప్రాంతంలోనే సంభవిస్తున్నాయి. * బంగాళాఖాతం, అరేబియా సముద్రాల్లో ఏర్పడే చక్రవాతాల నిష్పత్తి 4 : 1 నిష్పత్తిలో ఉంటుంది. * దేశంలో సంభవించే మొత్తం చక్రవాతాల్లో దాదాపు 80% తూర్పుతీర రేఖను తాకుతున్నాయి. * పశ్చిమతీర ప్రాంతంలో తుపాన్ల ప్రభావం ఎక్కువగా ఉన్న రాష్ట్రం గుజరాత్. * తూర్పుతీర ప్రాంతంలో తుపాన్ల ప్రభావానికి ఎక్కువగా గురయ్యే రాష్ట్రాలు - ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు. * దక్షిణాది రాష్ట్రాలతో పోల్చుకుంటే పశ్చిమ తీరంలోని గుజరాత్, మహారాష్ట్ర చక్రవాతాల బారిన పడటానికి మరింత అనువుగా ఉన్నాయి. * అండమాన్ - నికోబార్ దీవులు, లక్షదీవులు నిత్యం తుపాన్లు, చక్రవాతాలకు గురవుతుంటాయి. * ప్రపంచంలో చక్రవాతాలు ఏర్పడే ఇతర ప్రాంతాలతో పోలిస్తే, బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో ఉద్భవించే ఉష్ణమండల చక్రవాతాల ఆవృత్తి (ఫ్రీక్వెన్సీ) చాలా ఎక్కువ.



చక్రవాతాలు

సైక్లోన్ (చక్రవాతం) అనే పదం 'సైక్లాస్' అనే గ్రీకు పదం నుంచి పుట్టింది. దీని అర్థం 'చుట్టుకుని ఉన్న పాము'. చక్రవాతంలో గాలులు సర్పిలాకారంలో తిరగడం వల్ల దానికి ఆ పేరు వచ్చింది. ఈ పదాన్ని మొదటిసారిగా హెన్రీ పెడింగ్టన్ 1840లో ప్రతిపాదించి, ఉపయోగించారు.


హెన్రీ పెడింగ్టన్

బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో కనిపించే ఉష్ణమండల తుపాన్లు చూడటానికి పాముల్లా చుట్టలు చుట్టి ఉండటంతో 'సైక్లోన్' అని నామకరణం చేశారు. ఆయన రాసిన గ్రంథం 'ది సెయిలర్స్ హార్న్ బుక్ ఫర్ ది లా ఆఫ్ స్టోర్మ్స్'. చక్రవాతాలు విస్తారమైన పరిధి కలిగి, పెనుగాలులతో కూడిన అల్పపీడన కేంద్రం చుట్టూ వలయాకారంలో తిరిగే విధ్వంసక తుపానులు. చక్రవాతాలు, తుపాన్ల గురించి అధ్యయనం చేయడాన్ని 'టెంపెస్టాలజీ' అంటారు. గతంలో సంభవించిన చక్రవాతాలు, తుపాన్ల గురించి అధ్యయనం చేయడాన్ని 'పేలియోటెంపెస్టాలజీ'గా పేర్కొంటారు. కొరియాలిస్ ప్రభావంతో ఉత్తరార్ధ గోళంలోని చక్రవాతంలో గాలులు అపసవ్య దిశలో, దక్షిణార్ధంలోని చక్రవాతాలు సవ్య దిశలో తిరుగుతుంటాయి. బలమైన గాలులతో కుండపోత వర్షాలను కురిపిస్తాయి. దాంతో సముద్రమట్టాలు పెరిగి వరద ఏర్పడుతుంది.

రెండు రకాలు: చక్రవాతాలు ఏర్పడే ప్రదేశాల ఆధారంగా వాటిని ఉష్ణమండల చక్రవాతాలు, సమశీతోష్ణ మండల చక్రవాతాలు అని రెండు రకాలుగా విభజించవచ్చు. ఉష్ణమండల చక్రవాతాలను ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో పలు పేర్లతో పిలుస్తారు. 1) జపాన్, చైనా తీరాలకు ఆనుకుని ఉన్న పశ్చిమ పసిఫిక్ ప్రాంతం - టైఫూన్లు 2) పశ్చిమ ఇండియా దీవులను ఆనుకుని ఉన్న అరేబియన్ సముద్రం- హరికేన్లు 3) ఫిలిప్పీన్స్ తీరాన్ని ఆనుకుని ఉన్న పశ్చిమ పసిఫిక్- బాగీలు. 4) హిందూ మహాసముద్రంలో తుపాన్లుగా పిలుస్తారు. 5) ఆస్ట్రేలియా వాయవ్య తీరాన్ని ఆనుకుని ఉన్న హిందూ మహాసముద్రంలో విల్లీ విల్లీలు అంటారు. మొత్తం భారత భూభాగంలో 8% తుపాను ప్రభావిత ప్రాంతంలో ఉంది. 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 84 జిల్లాలు తుపాన్లకు గురవుతున్నాయి. ప్రపంచంలోని ఉష్ణమండల తుపాన్లలో దాదాపు 10% తుపాన్లకు ఇండియా ప్రభావితమవుతోంది. దేశ పశ్చిమ తీరంతో పోలిస్తే తూర్పుతీర ప్రాంతాలపై బంగాళాఖాతంలో ఏర్పడే చక్రవాతాల వల్ల తుపాన్ల తాకిడి ఎక్కువ. ఇందుకు భౌగోళిక, వాతావరణ కారణాలు ఉన్నాయి. * వాతావరణంలో ఉండే నీటి ఆవిరి ఆధారంగా తుపాన్లు బలపడతాయి. తూర్పు తీరంలో నదీ ప్రవాహాలు ఎక్కువగా ఉండటంతో బంగాళాఖాతంలో మంచి నీరు ఎక్కువగా ఉంటుంది. అది ఉపరితలంపై ఒక పలుచటి పొర మాదిరి ఏర్పడి, సులభంగా వేడెక్కి ఆవిరిగా మారుతుంది. అదే అరేబియా సముద్రంలో ఈ విధంగా త్వరగా వేడెక్కే పలుచటి మంచినీటి పొర ఉండదు. * అరేబియా సముద్రం కంటే బంగాళాఖాతం వేడిగా ఉంటుంది. తుపాన్లు ఏర్పడటానికి సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత వేడిగా ఉండాలి. బంగాళాఖాతానికి మూడు వైపుల్లో భూమి ఉంటుంది. అక్టోబరు, నవంబరు, డిసెంబరుల్లో సముద్ర ఉపరితలం మీద ఉష్ణోగ్రతకు, మూడువైపుల్లో ఉండే భూభాగాల మీద ఉష్ణోగ్రతకు ఎక్కువ వ్యత్యాసం ఉండటంతో వాయు పీడనం పెరుగుతుంది. * తూర్పుగాలులు పశ్చిమాన టిబెట్ వరకూ విస్తరిస్తాయి. ఈ గాలుల తూర్పు ప్రవాహం నేరుగా దక్షిణ హిందూ మహాసముద్రంలో ఏర్పడిన శాశ్వత అధిక పీడన ప్రాంతంలోకి దిగుతుంది. సెప్టెంబరు చివరికి అది తూర్పు నుంచి పడమర దిశగా స్థిరపడి పశ్చిమం వైపు అంటే భారత తూర్పు తీరం వైపు వీయడం మొదలవుతుంది. ఇందులో తుపాన్లు ఏర్పడతాయి. * బంగాళాఖాతంలో సైక్లోన్‌లు ఏప్రిల్, మే; అక్టోబరు, నవంబరుల్లో ఏర్పడతాయి.

చక్రవాతం అంటే అల్పపీడన కేంద్రం చుట్టూ విస్తారమైన పరిధిలో, పెనుగాలులతో కూడిన వలయాకారంలో తిరిగే అధిక పీడన పవన వ్యవస్థ. ఇది ట్రోపో ఆవరణంలో ఏర్పడే ఒక అల్పపీడన వాతావరణ స్థితి.



భారత్‌లో తుపాన్ల ప్రభావం తీవ్రతకు కారణాలు: * తక్కువ లోతు ఉన్న ఖండతీరపు అంచు, ఖండతీరం వాలు ప్రాంతాలు. * భారత తీరప్రాంతాల్లో జనాభా పరిమాణం, జనసాంద్రత ఎక్కువ. అంటే దుర్బల పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి.


ఉష్ణమండల చక్రవాతాలు, అవి ఏర్పడే విభిన్న దశలన్నింటిలోనూ తీవ్రమైన ప్రాణ, ఆస్తి నష్టాలను కలిగిస్తాయి. చక్రవాతాలనేవి ఉప్పెనలు, వరదలు, పెనుగాలులు, టోర్నడోలు, పిడుగులు తదితర భిన్న రకాల విపత్తుల సమాహారం. అవి వేటికవే ప్రాణ, ఆస్తి నష్టాలను కలిగిస్తాయి. ఇవి విడిగా లేదా ఇతర విపత్తులతో కలిసి ఆస్తి, ప్రాణ నష్టాలను కలిగించే సామర్థ్యాన్ని పెంపొందించుకుంటాయి.

ఉష్ణమండల చక్రవాతంలోని భాగాలు

1) **చక్రవాతపు కన్ను:** పరిణతి చెందిన చక్రవాతంలో అత్యుత్తమమైన భాగం చక్రవాతపు కన్ను. 10 నుంచి 50 కి.మీ. వ్యాసంతో ఉంటుంది. మేఘరహితంగా, ప్రశాంతంగా ఉండి వర్షం పడని ప్రాంతం. 1977, నవంబరులో ఏర్పడిన దివిసీమ చక్రవాతంలో అత్యల్పంగా 911 మిల్లీబార్ పీడనం నమోదైంది.

2) **ఐ-వాల్:** చక్రవాతపు కన్ను చుట్టూ 10 నుంచి 15 కి.మీ.ల పరిధిలో ఉన్న ప్రాంతం. దీని ఎత్తు 10 నుంచి 15 కి.మీ.ల వరకు ఉంటుంది. అత్యంత ప్రమాదకర ప్రాంతం. అత్యధిక పవన వేగంతో కుంభవృష్టి పడుతుంది. చక్రవాతం మరణాల్లో 80 శాతానికి కారణమైన ఉప్పెనలకు ఈ ప్రాంతమే కారణం.

3) **రెయిన్ బాండ్స్:** ఐ-వాల్ చుట్టూ వందల కి.మీ. పొడవున్నప్రాంతం. క్యుములోనింబస్ మేఘాల వల్ల అధికవర్షం కురుస్తుంది.



4) **ఔటర్ స్టోర్మ్ ఏరియా:** చక్రవాతపు కేంద్రం నుంచి 250 కి.మీ.ల వెలుపల ఉన్న ప్రాంతం. ఇక్కడ క్యుములస్ మేఘాలు కనిపిస్తాయి.

గత 50 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన చక్రవాతాల సంఖ్య 1942. వాటి వల్ల సంభవించిన మరణాలు 7,79,324. ఆస్తి నష్టం 1,407 బిలియన్ డాలర్లు. సగటున చక్రవాతాల వల్ల రోజుకు 42 మంది మృత్యువాత పడుతుండగా, 78 మిలియన్ డాలర్ల ఆస్తి నష్టం జరుగుతోంది.

ఉష్ణమండల చక్రవాతాలు - అనుకూలతలు

ఎ) 27 సెంటీగ్రేడ్‌ల ఉష్ణోగ్రతను నమోదు చేసే విశాలమైన సముద్ర భాగాలు, ఈ ఉష్ణోగ్రతలు 60-70 మీటర్ల లోతు వరకు ఉండాలి. బి) ద్రవీభవన గుప్తోష్ణం అందుబాటులో ఉండాలి. సి) సర్పిలాకారపు భ్రమణానికి కొరియాలిస్ ప్రభావం కారణమవుతుంది. డి) తీరానికి తరలించడానికి తూర్పు పవనాలు, 5 కి.మీ. ఎత్తు వరకు సరిపడినంతగా వాతావరణంలో తేమ కావాలి. ఇ) ఊర్ధ్వ గాలి ప్రసరణ వేగంలోని స్వల్ప వ్యత్యాసాలు. ఎఫ్) అంతకు ముందు నుంచి ఉన్న బలహీన అల్పపీడన ప్రాంతం లేదా నిమ్నస్థాయి చక్రవాత ప్రసరణం.

నోట్: ఉష్ణమండల చక్రవాతాలు వెచ్చని సముద్ర జలాల్లోని రెండు అర్ధ గోళాల్లో 5 డిగ్రీల నుంచి 20 డిగ్రీల అక్షాంశాల మధ్య ఏర్పడతాయి. భూమధ్యరేఖను దాటి మరో అర్ధగోళంలోకి ప్రవేశించవు. ఇవి సాధారణంగా ప్రపంచ పవనాలు వీచే దిశలో చలిస్తాయి.



రచయిత: సక్కరి జయకర్

'నేను కవిని.. తండ్రి వైద్యుడు.. తల్లి తోటమాలి!'


హరప్పా నాగరికత శిథిలాలు

భారతదేశ వాయవ్య భాగంలో సుమారు అయిదు వేల ఏళ్ల కిందట ప్రపంచ తొలి నాగరికతల్లో ఒకటైన సింధు లోయ నాగరికత వర్ధిల్లింది. నగర ప్రణాళిక, క్రమబద్ధమైన ఇళ్ల నిర్మాణం, మురుగునీటి వ్యవస్థ, ప్రామాణిక తూకాలు, వస్తు తయారీలో నైపుణ్యం, వాణిజ్యం తదితర ఎన్నో విశిష్టతలను సొంతం చేసుకుంది. అనంతర కాలంలో వైదిక సంస్కృతి, రాజ్యాలు ఆవిర్భవించాయి. పితృస్వామ్యం ప్రబలమై, కులవ్యవస్థ పటిష్ఠమై సమాజ నియమాల్లో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ పరిణామక్రమం, ఉపఖండంలో ప్రాచీన నాగరికతలు విస్తరించిన ప్రదేశాలు, నాటి ఆనవాళ్లు దొరికిన ప్రాంతాలపై పోటీ పరీక్షార్థులకు సమగ్ర పరిజ్ఞానం ఉండాలి. సింధు నాగరికత, వేద కాలం నాటి సామాజిక వ్యవస్థ, మత నియమాలు, సాంస్కృతికంగా, సాహిత్య పరంగా సాధించిన ప్రగతి, వేదాలు, ఉపనిషత్తుల్లోని ప్రధానాంశాలు, ఆ విషయాలను పరిశోధించి వెలుగులోకి తెచ్చిన శాస్త్రవేత్తల గురించి అవగాహన పెంచుకోవాలి.

భారతదేశ చరిత్ర

తొలి నాగరికతలు

1. కింది వాటిలో శ్రుతి సాహిత్యంలో భాగం కానిది?
   1) వేదాలు 2) ఉపనిషత్తులు
   3) ఉపవేదాలు 4) బ్రాహ్మణాలు
2. కింది ఏ శాసనాల్లో సూర్య, మరుత్‌ల గురించి ఉంది?



   1) హిట్టైట్ శాసనాలు
   2) కస్సైట్ శాసనాలు
   3) ద్రవిడ శాసనాలు
   4) ఏదీకాదు
3. కింది వాటిలో సరికాని దాన్ని గుర్తించండి.
   1) వేదం అనే పదం విద్ అనే పదం నుంచి ఆవిర్భవించింది.
   2) వేదం అంటే అత్యున్నత జ్ఞానం అని అర్థం.
   3) స్వామి దయానంద 'గో బ్యాక్ టు వేదాస్' అన్నారు.
   4) వేదాలను స్మృతులు అని పిలుస్తారు.
4. ఆత్మ, ప్రకృతి రహస్యాల గురించి వివరించేది?
   1) బ్రాహ్మణాలు 2) అరణ్యకాలు
   3) ఉపనిషత్తులు 4) వేదాంగాలు
5. కింది వాటిలో సరైన దాన్ని గుర్తించండి.
   1) యజ్ఞయాగాది, క్రతువుల్లో ఉచ్చరించే మంత్రాల గురించి యజుర్వేదంలో ఉంది.
   2) రుగ్వేదంలో 1020 శ్లోకాలు ఉన్నాయి.
   3) బ్రాహ్మణాలు వచన రూపంలో ఉంటాయి.
   4) అరణ్యకాలు, ఉపనిషత్తులు బ్రాహ్మణాలకు అనుబంధాలు.
6. కింది వాటిలో వేదాంగాన్ని గుర్తించండి.
   1) వ్యాకరణ 2) వైశేషిక 3) సాంఖ్య 4) యోగ
7. కింది వాటిని జతపరచండి.
   1) న్యాయ ఎ) గౌతముడు
   2) వైశేషిక బి) కనాదుడు
   3) సాంఖ్య సి) కపిలుడు
   4) యోగ డి) పతంజలి
   1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
   2) 1-ఎ, 2-సి, 3-బి, 4-డి
   3) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
   4) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి
8. అంతర్గత జీవన విధానాన్ని వివరించి, బహిర్గత కర్మలను వ్యతిరేకించినవి?
   1) వేదాంగాలు 2) ఉపవేదాలు
   3) షడ్దర్శనాలు 4) ఇతిహాసాలు
9. దశరాజ యుద్ధానికి సంబంధించి సరైంది ఏది?
   1) భరత, పురు తెగల మధ్య జరిగింది.
   2) భరత తెగకు సలహాలు, సూచనలు చేసింది వశిష్ఠుడు.
   3) ఈ యుద్ధం పరూష్ని నదీ తీరంలో జరిగింది.
   4) పైవన్నీ
10. తొలివేద ఆర్యుల ఆర్థిక వ్యవస్థకు సంబంధించి సరికానిది?
    1) వీరి ప్రధానవృత్తి - పశుపోషణ
    2) ఒక మనిషి విలువ వంద గోవులకు సమానం.
    3) రుగ్వేదం 7వ భాగంలో భూమిని దున్నడం గురించి ఉంది.
    4) వీరి జీవన విధానంలో గుర్రాలు ప్రధాన పాత్ర పోషించాయి.
11. కింది నదులను వైదికయుగ పేర్లతో జతపరచండి.
    1) జీలం ఎ) విపాస
    2) చినాబ్ బి) శతుద్రి
    3) రావి సి) పరూష్ని
    4) సట్లెజ్ డి) అసికిని
    5) బియాస్ ఇ) వితస్థ
    1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి, 5-ఇ
    2) 1-ఇ, 2-డి, 3-సి, 4-బి, 5-ఎ
    3) 1-ఎ, 2-బి, 3-ఇ, 4-సి, 5-డి
    4) 1-ఎ, 2-ఇ, 3-డి, 4-సి, 5-బి
12. ఎ) తొలివేద ఆర్యులు ప్రకృతి శక్తులను ఆరాధించారు.
    బి) తొలివేద ఆర్యుల కాలంలో దేవాలయాల నిర్మాణాలు ఊపందుకున్నాయి.
    1) ఎ సరైంది 2) బి సరైంది.
    3) ఎ, బి సరైనవి. 4) ఎ, బి సరికావు.
13. తొలి వేదకాలంలో తెగ నాయకుడు?
    1) విరాట్ 2) సామ్రాట్
    3) గృహపతి 4) రాజన్
14. ఆర్యులు తూర్పు గంగా మైదానానికి విస్తరించారనేందుకు ఆధారం?
    1) ఐతరేయ బ్రాహ్మణం 2) చాందోగ్య ఉపనిషత్తు
    3) పురుషసూక్తం 4) శతపథ బ్రాహ్మణం
15. 'నేను కవిని, మా తండ్రి వైద్యుడు, మా తల్లి తోటమాలి' అనే వాక్యం ఏ వేదంలో ఉంది?
    1) రుగ్వేదం 2) యజుర్వేదం
    3) సామవేదం 4) అధర్వణ వేదం
16. కిందివాటిలో సరైన దాన్ని గుర్తించండి.
    ఎ) వేదంలో చివరి భాగాలను ఉపనిషత్తులు అంటారు.
    బి) తొలివేద ఆర్యుల ప్రధాన యుద్ధదేవుడు ఇంద్రుడు.
    సి) ఇంద్రుడికి సహాయకుడు మారుత్స్.
    డి) అదితి, పృథ్వి, ఉషస్ ఆర్యుల కాలం నాటి స్త్రీ దేవతలు.
    1) ఎ, బి 2) ఎ, బి, సి 3) ఎ, డి 4) ఎ, బి, సి, డి
17. మహాభారత యుద్ధం సుమారుగా ఎప్పుడు జరిగింది?
    1) క్రీ.పూ. 1250 2) క్రీ.పూ. 600
    3) క్రీ.పూ. 950 4) క్రీ.పూ. 700
18. మలివేదకాలంనాటి ప్రారంభంలో ప్రధాన రాజ్యం?
    1) పాంచాల, కురు 2) కోసల, మగధ
    3) పాంచాల, మగధ, గాంధార 4) కురు, అస్మక
19. మలివేదకాలం నాటి వర్ణవ్యవస్థకు సంబంధించి సరికానిది?
    1) ఈ కాలంలో శూద్రులకు ఉపనయన అర్హత లేదు.
    2) ఈ కాలంలో కులవ్యవస్థ పటిష్ఠమైంది.
    3) వృత్తి విభజన ఈ కాలంలో బలంగా లేదు.
    4) శూద్ర పురుషులు ఎక్కువ వర్ణం కలిగిన స్త్రీలను వివాహమాడరాదు.
20. కింది వాటిలో సరైంది?
    ఎ) అగ్ని - తొలివేద ఆర్యుల ప్రధాన దేవుళ్లలో ఒకరు
    బి) సోమ - ఆర్యులు సేవించే మత్తు పానీయం
    సి) ద్విజులు - రెండుసార్లు జన్మించేవారు
    డి) నిష్క - ఆర్యుల కాలంలో బంగారు నాణెం
    1) ఎ, బి 2) ఎ, బి, సి
    3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి
21. కింది వాటిలో హరప్పా పూర్వ సంస్కృతిని గుర్తించండి.
    1) బెలుచిస్థాన్ 2) మక్రాన్
    3) నాల్ 4) పైవన్నీ
22. కింది వాటిలో సరికానిది గుర్తించండి?
    1) మక్రాన్ సంస్కృతిలో చనిపోయిన వారిని దహనం చేసేవారు.
    2) పరిమళద్రవ్యాలను ఉంచే రాతిపెట్టెలు కుల్లీలో కనుక్కున్నారు.
    3) కుల్లీ - మెసొపొటేమియా మధ్య సముద్ర వాణిజ్యం జరిగింది.
    4) బెలుచిస్థాన్‌లో వ్యవసాయ ఆనవాళ్లు లభించలేదు.
23. సింధు ప్రాంతాలైన బన్వాలీ, రాఖీఘరి ఏ రాష్ట్రానికి చెందినవి?



    1) హరియాణా 2) గుజరాత్
    3) రాజస్థాన్ 4) మహారాష్ట్ర
24. సింధు నాగరికత లిపికి సంబంధించి సరికానిది?
    1) సింధు లిపికి ఎక్కువగా ఎడమ నుంచి కుడికి రాసి ఉంది.
    2) ఈ లిపి ప్రోటో-ద్రవిడ లిపి అని మహదేవన్ అన్నారు.
    3) ఈ లిపిని 1853లో గుర్తించారు.
    4) సింధు లిపి సంకేతాలు, గుర్తులు కలిగి ఉంటుంది.
25. పూసల తయారీ పరిశ్రమలకు సంబంధించిన ప్రాంతం?
    1) లోథాల్ 2) చన్హుదారో
    3) హరప్పా 4) 1, 2
26. సింధు నగర నిర్మాణానికి సంబంధించి సరికానిది?
    1) ప్రధాన వీధులు ఉత్తర, దక్షిణాలకు ఉంటాయి.
    2) ఒకే పరిమాణం ఉన్న ఇటుకలను ఉపయోగించారు.
    3) సింధు ప్రజల ఇళ్లలో బావి, స్నానాల గది కచ్చితంగా ఉంటాయి.
    4) స్నానాల గది పెరడు వైపున, రోడ్డుకు దూరంగా ఉంటుంది.
27. కిందివాటిలో సింధునాగరికత ప్రధానలక్ష్యం కానిది?
    1) ఒకే రకమైన పట్టణ ప్రణాళిక ఉండటం.
    2) భూగర్భ మురుగు నీటిపారుదల వ్యవస్థ.
    3) పితృస్వామిక లక్షణాలు ఉండటం.
    4) ఒకే రకమైన కొలతలు పాటించడం.
28. సింధు నాగరికత కాలంనాటి చెక్క నాగలి బయట పడిన ప్రాంతం?
    1) కాళీభంగన్ 2) లోథాల్
    3) మొహంజోదారో 4) ఎక్కడా లభించలేదు
29. కిందివాటిలో సింధు పట్టణాలన్నీ ఒకే పరిపాలనలో, ఒకే రాజ్యంగా ఉండేవి అనడానికి ఆధారం.
    1) కళల్లో ఏకరూపత 2) ఇటుకల పరిమాణం
    3) ఒకే విధమైన నిర్మాణాలు 4) పైవన్నీ
30. 'బ్రాహుయ్'కు ఏ భాషతో సంబంధం ఉంది?
    1) సంస్కృత భాష 2) యూరోపియన్ భాషలు
    3) ఇండో-యూరోపియన్ భాషలు
    4) ద్రవిడ భాషలు
31. కింది వాటిలో సింధు దిగుమతుల్లో సరికానిది?
    1) రాగి - రాజస్థాన్ 2) బంగారం - కర్ణాటక
    3) వజ్రాలు - ఇరాన్ 4) వెండి - అఫ్గానిస్థాన్
32. సింధు ప్రజల కుండలకు సంబంధించి సరికానిది.



    1) హరప్పా ప్రజలు కుమ్మరి చక్రాన్ని ఉపయోగించారు.
    2) సింధు ప్రజల కుండలపై వృక్షాల బొమ్మలు, వృత్తాలు కనిపిస్తాయి.
    3) వీరు ఒకే ఆకారం, పరిమాణం ఉన్న కుండలను తయారుచేశారు.
    4) కుండల పరిశ్రమ సింధు ప్రజల ప్రధాన పరిశ్రమల్లో ఒకటి.
33. సింధు ప్రజల ప్రధాన దేవత అమ్మతల్లి విగ్రహాలు దేనితో తయారుచేశారు?
    1) రాయి 2) రాగి 3) కంచు 4) మట్టి
34. సింధు ప్రజల కాలంనాటి ముద్రికలు దేని గురించి సమాచారం అందిస్తాయి?
    1) సింధు ప్రజల మతం
    2) సింధు ప్రజల లిపి
    3) సింధు ప్రజల భాష
    4) 1, 2



రచయిత: కాకులూరు వెంకటేశ్వర్లు

సమాధానాలు

1-3, 2-2, 3-4, 4-3, 5-2, 6-1, 7-1, 8-3, 9-4, 10-3, 11-1, 12-1, 13-1, 14-4, 15-1, 16-1, 17-3, 18-1, 19-3, 20-4, 21-4, 22-4, 23-1, 24-1, 25-4, 26-4, 27-3, 28-4, 29-4, 30-4, 31-3, 32-3, 33-4, 34-1.

ఒక వస్తువు స్థానభ్రంశానికి అనులోమానుపాతంలో ఉండి, సమతాస్థితి స్థానం వైపు పనిచేసే పునరుద్ధరణ బలం వల్ల కలిగే ఆవర్తన చలనాన్ని సరళ హరాత్మక చలనం అంటారు. నిలువు తలంలో తేలికైన, సాగని ఒక తీగకు ఒక ద్రవ్యరాశిని వేలాడదీసినట్లయితే ఆ వ్యవస్థను లఘులోలకం అంటారు. దీన్ని కొద్దిపాటి కోణంతో కదిలిస్తే సరళ హరాత్మక చలనం చేస్తుంది. వేలాడే బిందువుకు డోలన కేంద్రానికి మధ్య ఉన్న దూరాన్ని లోలకం పొడవు అంటారు. లోలకం గురుత్వ కేంద్రాన్ని డోలన కేంద్రం అంటారు. ఒక డోలనానికి రెండు సెకన్లు పట్టే లోలకాన్ని సెకన్ల లోలకం అని పిలుస్తారు.


తక్కువ బలంతో తోసినా.. ఎక్కువ దూరం వెళ్లే ఊయల!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఫిజిక్స్

డోలనాలు - సరళ హరాత్మక చలనం

లఘులోలకం - శక్తి నిత్యత్వ నియమం

లఘులోలకం డోలనాలు చేస్తున్నప్పుడు దాని మొత్తం యాంత్రిక శక్తి స్థిరంగా ఉంటుంది. అంత్య బిందువుల్లో స్థితిశక్తి అత్యధికంగా, గతిశక్తి అత్యల్పంగా (0) ఉంటాయి.



విరామ స్థానం 'O' వద్ద

గతిశక్తి = అత్యధికం

స్థితిశక్తి = అత్యల్పం

స్థితిశక్తి లేదా అత్యధిక విలువ $= \frac{1}{2} m\omega^2 A^2$

$\omega = \sqrt{g / l}$

- లోలకం A నుంచి O కి వచ్చేటప్పుడు స్థితిశక్తి తగ్గి, గతిశక్తి పెరుగుతూ ఉంటుంది.
- O నుంచి B కి పోయేకొద్దీ గతిశక్తి తగ్గి, స్థితిశక్తి పెరుగుతూ ఉంటుంది.
- మధ్యలో ఏదైనా బిందువు వద్ద లోలకం రెండు శక్తులను కలిగి ఉంటుంది. అయితే వాటి మొత్తం ఎల్లవేళలా $1/2\ m\omega^2A^2$కు సమానంగా ఉంటుంది. కాబట్టి శక్తి నిత్యత్వ నియమాన్ని పాటించినట్లు చెప్పవచ్చు.

అవరుద్ధ డోలనాలు

సరళ హరాత్మక చలనంలో ఉన్న వస్తువు చుట్టూ ఆవరించిన యానకం కొంత నిరోధాన్ని కలిగించడంతో డోలనాల శక్తి, కంపన పరిమితి కాలం గడిచేకొద్దీ క్షీణిస్తూ చివరికి ఆగిపోతాయి. ఇలాంటి డోలనాలను 'అవరుద్ధ డోలనాలు' అంటారు.

- అవరుద్ధ కంపనాల్లో వ్యవస్థ శక్తి నిరంతరం తగ్గిపోతూ ఉంటుంది. కానీ కొద్దిపాటి అవరుద్ధ బలాలతో డోలనాలు సరళ హరాత్మక చలనాన్ని కొనసాగిస్తాయి.
- అవరుద్ధ బలం పరిసర యానకంపై ఆధారపడుతుంది. సరళ హరాత్మక చలనంలో ఉన్న వస్తువును గాలిలో కాకుండా ద్రవంలో ముంచితే నిరోధ బలం ఎక్కువ ఉండటం వల్ల అవరుద్ధ డోలనాలు జరిగి క్రమంగా శక్తి క్షీణిస్తుంది. సాధారణంగా అవరుద్ధ బలం వస్తువు వేగానికి అనులోమానుపాతంలో ఉంటూ వ్యతిరేక దిశలో పని చేస్తుంది.

$F_d = -b.v$

- అవరుద్ధ స్థిరాంకం యానకం స్నిగ్ధత ధర్మంపై, వస్తువు ఆకృతి, పరిమాణంపై ఆధారపడుతుంది.

బలాత్కృత కంపనాలు

ఒక వస్తువుపై బాహ్య ఆవర్తన బలం పని చేయడం ద్వారా కంపనాలు మొదలైతే ఆ వస్తువు తన సొంత సహజ పౌనఃపున్యంతో కాకుండా బాహ్యబల పౌనఃపున్యంతో డోలనాలు/కంపనాలు చేస్తుంది. ఇలాంటి కంపనాలను బలాత్కృత కంపనాలు అంటారు.


బలాత్కృత కంపనాలు జరిగే సమయంలో కింది అంశాలు గమనించవచ్చు. అవి:


- బాహ్య బలం పౌనఃపున్యం వస్తువు సహజ పౌనఃపున్యం సమానం కావాల్సిన అవసరం లేదు.
- కంపన పరిమితి స్థిర విలువగా ఉంటుంది.
- బలాత్కృత కంపనాలు బాహ్య బలం పౌనఃపున్యంపై ఆధారపడి ఉంటాయి.
- బలాత్కృత కంపనాలు వస్తువు స్వభావంపై ఆధారపడతాయి.
- బలాత్కృత కంపనాలు అవరుద్ధ బలంపై ఆధారపడతాయి.
- పౌనఃపున్య భేదం ఎంత తక్కువగా ఉంటుందో, కంపన పరిమితి అంత ఎక్కువగా ఉంటుంది.

ఉదా: ఒక వ్యక్తి ఊయలలో కూర్చున్నప్పుడు, మరో వ్యక్తి ఊయలపై బాహ్యబలం ప్రయోగించి డోలనాలు ఏర్పడేలా చేసి, మళ్లీమళ్లీ ఊపడం ద్వారా బలాత్కృత డోలనాలను ఏర్పర్చగలడు. అప్పుడు ఊయల సొంత పౌనఃపున్యంతో కాకుండా బాహ్య ఆవర్తన బల పౌనఃపున్యంతో డోలనాలు చేస్తుంది.

- వీణలోని తీగను మీటినప్పుడు తీగ చేసే కంపనాల వల్ల పక్క పెట్టెలో గాలి బలాత్కృత కంపనాలు చేయడం మొదలు పెడుతుంది. ఫలితంగా ధ్వని పెద్దగా వినిపిస్తుంది. బాహ్యబలం (తీగను మీటడం) ఆపగానే బలాత్కృత కంపనాలు కూడా ఆగిపోతాయి.

ఒక శృతి దండాన్ని కంపింపజేసి నేరుగా ధ్వనిని వినడం కంటే దాన్ని ఒక టేబుల్‌కి తగిలించినప్పుడు ధ్వని పెద్దగా వినిపిస్తుంది. ఇందుకు శృతి దండం కలిగించిన బాహ్య ఆవర్తన బలం కారణంగా టేబుల్ ఉపరితలం బలాత్కృత కంపనాలు చేస్తుంది.





- అవరుద్ధ కంపనాలకు సంబంధించిన గ్రాఫ్‌ను పరిశీలించినప్పుడు కాలం గడిచేకొద్దీ వ్యవస్థ మొత్తం శక్తి ఘాతాంకంగా తగ్గుతుందని అర్థం చేసుకోవచ్చు.

అనునాదం

ఒకే సహజ పౌనఃపున్యాలు ఉన్న రెండు వస్తువులు ఒకదానినొకటి ప్రభావితం చేసుకున్నప్పుడు వాటి డోలన పరిమితి అత్యధికంగా ఉంటుంది. ఈ దృగ్విషయాన్ని అనునాదం అంటారు.

- అనునాదం అనేది బలాత్కృత కంపనాల్లో ఒక ప్రత్యేక సందర్భం.
- సైద్ధాంతికంగా అనునాదంలో కంపన పరిమితి అనంతం.

నిత్యజీవిత ఉదాహరణలు: కవాతు చేసే సైనికుల పటాలం వంతెన పైకి రాగానే వారిని నడవమని చెబుతారు. ఎందుకంటే కవాతు ద్వారా ఉత్పన్నమయ్యే కంపనాల పౌనఃపున్యం వంతెన సహజ పౌనఃపున్యానికి సమానమైతే అనునాదం ఏర్పడుతుంది. అప్పుడు వంతెన అధిక కంపన పరిమితితో కంపించి కూలిపోయే ప్రమాదం ఉంటుంది.

- బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు ఒక్కొక్కసారి కిటికీ అద్దాలు ఎక్కువ శబ్దం చేయడాన్ని గమనించవచ్చు. వేగం పెరిగినా, తగ్గినా ఈ ధ్వని కూడా తగ్గుతుంది. ఎందుకంటే కిటికీ అద్దాల సహజ పౌనఃపున్యం, ఇంజిన్ నుంచి వచ్చే కంపనాల పౌనఃపున్యం సమానమైనప్పుడు అనునాదం జరిగి పెద్ద ధ్వని ఉత్పత్తి అవుతుంది.
- ఊయలను ఒక క్రమంలో నెడుతూ ఉంటే తక్కువ బలంతో తోసినప్పటికీ చాలా ఎక్కువ దూరం వెళుతుంది.
- భూకంపాల సమయంలో భూకంప తరంగాల పౌనఃపున్యం భవంతుల సహజ పౌనఃపున్యం సమానమైతే నష్ట తీవ్రత అధికంగా ఉంటుంది.
- ఒక పొడవాటి గొట్టంలో కొంతమేర నీటితో నింపి పైన ఉండే గాలి స్తంభం దగ్గర శృతి దండాన్ని కంపింపజేస్తే, ఒకానొక ఎత్తు వద్ద ధ్వని గరిష్ఠంగా వినిపిస్తుంది. అప్పుడు లోపల అనునాదం జరుగుతుంది. ఈ ప్రయోగం ద్వారా గాలిలో ధ్వని వేగాన్ని లెక్కించవచ్చు. ఇది సుమారుగా 330 మీ./సె.

సూత్రం: ధ్వని వేగం (v) = పౌనఃపున్యం (γ) × తరంగదైర్ఘ్యం (λ)



టీవీ లేదా రేడియోలో ఒక స్టేషన్‌ను ట్యూన్ చేస్తున్నామంటే, గాలిలో విస్తరించి ఉన్న ఆ కేంద్రం తరంగాల పౌనఃపున్యాన్ని టీవీ లేదా రేడియో సహజ పౌనఃపున్యానికి సరిపోయేలా మార్చుతున్నట్లు అర్థం. దీంతో అనునాదం జరిగి అత్యధిక కంపన పరిమితిలో తరంగాలు కంపించి కార్యక్రమం స్పష్టంగా కనిపిస్తుంది.



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

Word of the Day 841

Eminent

Telugu meaning: ప్రముఖ, ప్రసిద్ధ

English meaning: The word eminent (ఎమినెంట్) is an adjective that describes someone who is famous, respected, or distinguished in a particular field.

Synonyms: Distinguished, Renowned;

Antonyms: Obscure, Unknown

Usage: **1.** The seminar was led by an eminent scientist who had contributed greatly to medical research.

2. She dreams of becoming an eminent figure in the field of environmental law.

Current Affairs



Prime Minister Narendra Modi participated in the G20 Leaders' Summit hosted by South African President Cyril Ramaphosa in Johannesburg on 22 November 2025, marking his 12th appearance at a G20 Summit. Speaking at the session on "Inclusive and sustainable economic growth leaving no one behind", he lauded the South African presidency for advancing work on skilled migration, tourism, food security, artificial intelligence, the digital economy, innovation and women empowerment, while also noting that several historic decisions from the New Delhi Summit were being carried forward.

The Indian Institute of Creative Technologies (IICT) signed a Memorandum of Understanding (MoU) with Australia's Deakin University during the ongoing Waves Bazaar, held alongside the International Film Festival of India (IFFI) 2025. The agreement, part of the Australia-India Creative Collaboration initiative in partnership with the National Film Development Corporation (NFDC).

India and Israel have formally signed the Terms of Reference (ToR) to initiate negotiations for a Free Trade Agreement (FTA), marking a major step toward deepening bilateral economic cooperation. The ToR was signed in Tel Aviv by India's Minister of Commerce and Industry Piyush Goyal and Israel's Minister of Economy and Industry Nir Barkat.


Rabih Alameddine has won the National book award for fiction for The True True Story of Raja the Gullible (and His Mother), a darkly comic saga spanning six decades in the life of a Lebanese family.

- Organized by the National Book Foundation, the awards recognize the best of American literature across five categories: Fiction, Nonfiction, Poetry, Young People's Literature, and Translated Literature.

For more Current Affairs: Scan QR code

ఇంటర్నేషనల్ డే ఫర్ ది ఎలిమినేషన్ ఆఫ్ వయొలెన్స్ ఎగైనెస్ట్ ఉమెన్

ప్రపంచవ్యాప్తంగా నేటికీ మహిళలపై దాడులు, దౌర్జన్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుత నవీన నాగరికతలోనూ అనేక మంది కనీస మానవ హక్కులకు దూరంగానే ఉన్నారు. అనుకున్నది చేసే స్వేచ్ఛ, ఆర్థిక స్వాతంత్ర్యం లేవు. నిత్యం ఆంక్షలు, అణచివేతలతో అనేక విధాలుగా స్త్రీలు వివక్షకు గురవుతూనే ఉన్నారు. శారీరక, మానసిక వేధింపుల నుంచి ఆర్థిక దోపిడీ వరకు వివిధ రూపాల్లో మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టే లక్ష్యంతో ఏటా **నవంబరు 25న 'మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం'**గా (International Day for the Elimination of Violence against Women) నిర్వహిస్తారు. మహిళల హక్కులను కాపాడటంతోపాటు లింగ ఆధారిత హింస వల్ల కలిగే సమస్యల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.



హింస అంటే?

నవంబరు 25 చరిత్రలో ఈనాడు

మహిళలపై జరుగుతున్న హింస అంటే శారీరక, లైంగిక, మానసిక వేధింపులు, మహిళల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో పాటు వారి వ్యక్తిగత జీవితాన్ని ఇబ్బందిపెట్టే చర్యలుగా ఐక్యరాజ్యసమితి (ఐరాస) పేర్కొంది.

- స్త్రీ, పురుషుల మధ్య ఉన్న అసమానతలు, అసమస్థాయి సంబంధాల వ్యక్తీకరణే హింస అని ఐరాస నిర్వచించింది.

భారతదేశంలో..

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక ప్రకారం.. 2023లో మహిళలపై 4,48,211 దాడులు జరిగాయి. 2022తో (4,45,256) పోలిస్తే ఇవి 0.04% పెరిగాయి.

- భర్త, అతడి తరఫు బంధువులు పెట్టే హింసలపై అత్యధికంగా 1,33,676 కేసులు నమోదయ్యాయి.
- కిడ్నాప్‌లు 88,605 జరిగాయి.
- మహిళలపై దాడులు 83,891 జరిగాయి. అత్యాచారాలు 29,670 చోటుచేసుకున్నాయి.
- వరకట్న మరణాలు 6,156 చోటుచేసుకున్నాయి.

చారిత్రక నేపథ్యం

1960 కాలంలో డొమినికన్ నియంత రాఫెల్ ట్రుజిల్లో పాలనకు వ్యతిరేకంగా పాట్రియా, మినర్వా, మరియా థెరిస్సా అనే సోదరీమణులు పోరాటం చేశారు. స్త్రీల హక్కుల కోసం ఉద్యమాలు చేశారు. తన పాలనకు ఆ ముగ్గురూ అడ్డుపడుతున్నారని భావించిన రాఫెల్ అదే ఏడాది నవంబరు 25న వారిని చంపించాడు. ఈ ఘటనను అంతర్జాతీయ సమాజం ఖండించింది. డొమినికన్ వ్యాప్తంగా రాజు పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాలు జరిగాయి. 1961లో రాజు హత్యకు గురయ్యాడు.


- లాటిన్ అమెరికా, కరేబియన్‌లోని మహిళా కార్యకర్తలు ఏటా నవంబరు 25న లింగ ఆధారిత హింస వ్యతిరేక దినంగా పాటించాలని 1981లో తీర్మానించారు. ఆ ముగ్గురు సోదరీమణులు చూపిన తెగువకు జ్ఞాపకార్థంగా ఆ రోజును ఎంపిక చేశారు.

భారతదేశంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాల తీరు తెన్నులు సహా పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

రాష్ట్ర ఆర్థిక సంఘం, సహకార సంస్థలు

భారతదేశం ఒక సమాఖ్య వ్యవస్థ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆర్థిక వనరుల పంపిణీ సక్రమంగా జరగాల్సి ఉంటుంది. దీని కోసం ఆర్థిక సంఘాలను ఏర్పాటు చేస్తుంటారు. ఈ సంఘం రాజ్యాంగబద్ధమైన సంస్థ. ఈ కమిషన్ ఇచ్చే సిఫార్సులకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయదారులను, వృత్తి కార్మికులను ఆదుకోవడానికి సహకార సంస్థలు ఏర్పాటయ్యాయి.



రాష్ట్ర ఆర్థిక సంఘం

- 73వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని అనుసరించి ప్రతి రాష్ట్రంలో 243 (i) ప్రకారం గవర్నర్ రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేస్తారు. కేంద్ర ఆర్థిక సంఘాన్ని 280వ నిబంధన ప్రకారం రాష్ట్రపతి ఏర్పాటు చేస్తారు. ఈ సంఘంలో ఒక ఛైర్మన్, నిర్దేశించిన సంఖ్యలో సభ్యులు ఉంటారు.
- ఛైర్మన్, సభ్యులుగా నియమితులు కావాలంటే ఆర్థిక విషయాల్లో నిష్ణాతులై ఉండాలి. పరిశోధన, బోధనా రంగాల్లో అనుభవం ఉన్నవారిని గవర్నర్ నియమిస్తారు.

నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుల తొలగింపు విధానం మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Apprentice Posts

Bank of Baroda is inviting applications for the recruitment of Graduate Apprentice posts in all states across the country. The total no. of posts is 2,700. The application fee is Rs.800. Eligible candidates can apply online before 1st December 2025.

Joint Entrance Examination (Main)-2026

The Joint Entrance Examination, JEE (Main) comprises two papers. Paper-1 is conducted for admission to Undergraduate Engineering Programs (B.E/ B.Tech.) at NITs, IIITs, other Centrally Funded Technical Institutions (CFTIs), and Institutions/ Universities funded/recognised by participating State Governments. Eligible candidates can apply online before 27 November 2025.

Did You Apply..?

Today (November 25) is the last date for the following Jobs/ Apprentice posts.

- 19 Multi-Tasking Staff Posts in ICMR-IIIM.
  Eligibility: Matriculation or equivalent, Intermediate.
- Teaching and Non-Teaching posts in AU, Visakhapatnam.
  Eligibility: Bachelor's degree, PG.
- Jobs in the Department of Women Development and Child Welfare, Anantapur.
  Eligibility: Tenth, Diploma/Degree.

For more information and other notifications - scan QR code

Bank Exams

Quantitative Aptitude

Cuboid - Cube

1. The sum of length, breadth and height of a cuboid is 19 cm and its diagonal is 13 cm. Find the total surface area of the cuboid.

A) 198 sq.cm B) 192 sq.cm
C) 190 sq.cm D) 172 sq.cm
E) 183 sq.cm

2. Find the total surface area of a cuboid whose dimensions are 23 cm, 18 cm, 5 cm.

A) 1238 sq.cm B) 1248 sq.cm
C) 1225 sq.cm D) 1228 sq.cm
E) 1222 sq.cm

3. Find the length of the longest bamboo that can be placed in a room 21 m long 16 m broad and 12 m height.

A) 27 m B) 50 m C) 29 m
D) 26 m E) 32 m

4. Find the volume of a cuboid whose dimensions are 17 m, 10 m and 5 m.

A) 825 cu.m B) 750 cu.m
C) 800 cu.m D) 850 cu.m
E) 775 cu.m

5. The area of a side of a box is 130 sqcm. The area of other side of the box is 50 sqcm. If the area of the upper surface of the box is 65 sqcm, then find the volume of the box.

A) 650 cu.cm B) 725 cu.cm
C) 600 cu.cm D) 700 cu.cm.
E) None of the above

6. A water tank in the form of a cuboid has its base 27 m long 12 m wide and 15 m deep. Initially, the tank is full but later when water is taken out of it, the level of water in the tank reduce by 4 m. The volume of water left in the tank:

A) 3364 cu.m B) 3654 cu.m
C) 3564 cu.m D) 3664 cu.m
E) 3781 cu.m

7. A cuboid water tank contains 288 litres of water. Its depth is $\frac{1}{4}$ of its length and breadth is $\frac{1}{3}$ of $\frac{1}{5}$ of the sum of the length and depth. The length of tank is:

A) 26 dm B) 24 dm C) 25 dm
D) 28 dm E) 27 dm

8. The number of bricks, each measuring 18 cm × 10 cm × 6 cm, required to construct a wall 27 m long, 8 m high and 48 cm thick, while the mortar occupies 7% of the volume of the wall is:

A) 89028 B) 89200 C) 89820
D) 89280 E) 91001

9. The dimensions of an open box are 45 cm × 40 cm × 25 cm. Its thickness is 2.5 cm. If 1 cubic cm of metal used in the box weight 0.46 gms. Find the weight of the box.

A) 6.21 kg B) 6.12 kg
C) 6.5 kg D) 6.6 kg
E) 6.83 kg

10. the breadth of a room is $1\frac{1}{3}$ times of its height and $\frac{1}{3}$ of its length. The volume of the room is 1152 cu.m. The length of the room is:

A) 18 m B) 6 m C) 24 m
D) 4 m E) 11 m

11. The length of a hall is 18 m and the width is 15 m. The sum of the areas of the floor and roof is equal to the sum of the areas of the four walls. Find the volume of the hall.

A) $2209\frac{10}{11}$ cum B) $2209\frac{1}{11}$ cum
C) $2209\frac{5}{11}$ cum D) $2209\frac{7}{11}$ cum
E) $2207\frac{10}{11}$ cm

12. The diagonal of a cube is $9\sqrt{3}$ cm. Find its surface area.

A) 496 sq cm B) 729 sq cm
C) 468 sq cm D) 486 sq cm
E) None of the above

13. Sides of two cubes are in the ratio of $\sqrt{5} : 3$. Find the ratio of their surface areas.

A) 5 : 9 B) 9 : 5 C) 5 : 3
D) 3 : 5 E) None of the above

14. A solid cube of volume 19,683 cu.cm is cut into 9 cubes of equal volumes. The ratio of the surface areas of the original cube to the sum of the surface areas of four of the smaller cubes is:

A) 4 : 3 B) 5 : 3 C) 3 : 4
D) 3 : 5 E) None of the above

15. The sides of cube are decreased by $13\frac{1}{3}\%$ each. Find the percentage change in its volume.

A) 34.33% B) 34.9% C) 36%
D) $33\frac{1}{3}\%$ E) 37%

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas,
Subject Expert

బరోడా బ్యాంకులో.. అప్రెంటిస్ అవుతారా!

బ్యాంకు ఉద్యోగాల సన్నద్ధతలో ఉన్నవారు అప్రెంటిస్ కోసమూ ప్రయత్నించవచ్చు. ఈ అనుభవంతోనూ భవిష్యత్తులో రాణించడానికి వీలవుతుంది. అందువల్ల తాజా గ్రాడ్యుయేట్లు దీనిపై దృష్టి సారిస్తే మంచిది. ఇటీవలే బ్యాంక్ ఆఫ్ బరోడా 2,700 పోస్టుల భర్తీకి ప్రకటన వెలువరించింది. పరీక్షతో అవకాశం కల్పిస్తారు. ఎంపికైనవారు ప్రతి నెలా రూ.15,000 స్టైపెండ్ అందుకోవచ్చు.



అప్రెంటిస్‌షిప్ అవకాశం పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కోరుకున్న రాష్ట్రంలో ఖాళీలకు పోటీ పడొచ్చు. అయితే ఆ రాష్ట్ర అధికారిక భాషల్లో మాట్లాడటం, చదవడం, రాయడం వచ్చుండాలి.

అప్రెంటిస్‌గా విజయవంతమైనవారికి నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎన్ఎస్‌డీసీ) సర్టిఫికెట్ అందిస్తుంది. ఏడాది అప్రెంటిస్ అనుభవంతో ప్రైవేట్ బ్యాంకులు, ఇన్స్యూరెన్స్, ఇతర ఆర్థిక సంస్థల్లో సులువుగానే అవకాశం పొందొచ్చు. అందువల్ల ఈ పోస్టులకు పోటీ పడటమే మంచిది. ముఖ్యంగా బ్యాంకు ఉద్యోగాలే లక్ష్యంగా ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలి. ఈ పరీక్ష రాయడం వల్ల సన్నద్ధత ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవడానికి వీలవుతుంది. తర్వాత రాసే పరీక్షలకు మంచి అనుభవంగానూ పనికొస్తుంది. అయితే ఇప్పటికే బ్యాంకుల్లో అప్రెంటిస్‌గా సేవలందించినవారికి అవకాశం ఉండదు.

పరీక్ష

ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. వంద మార్కులకు ఉంటుంది. ఇందులో జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్, కంప్యూటర్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లిష్.. ఒక్కో విభాగం నుంచీ 25 చొప్పున 100 ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ప్రతి సరైన జవాబుకూ ఒక మార్కు. రుణాత్మక మార్కులు లేవు.

పరీక్షలో అర్హత మార్కులు పొందినవారికి స్థానిక భాషలో పరీక్ష నిర్వహిస్తారు. పది లేదా ఇంటర్‌లో ఆ భాషను చదువు కున్నవారు దీన్ని రాయనవసరం లేదు. స్థానిక భాషలో ఉత్తీర్ణులకు.. ధ్రువపత్రాలు పరిశీలించి, వైద్య పరీక్షలు నిర్వహించి, అప్రెంటిస్‌గా నియమిస్తారు. ఏపీ, తెలంగాణల్లో ఖాళీలకు దరఖాస్తు చేసుకుని, పది/ఇంటర్‌లో తెలుగు ఒక సబ్జెక్టుగా ఉన్నవారు లాంగ్వేజ్ టెస్టు రాయనవసరం లేదు.

ఈ అంశాల్లో ప్రశ్నలు

జనరల్/ ఫైనాన్షియల్ అవేర్‌నెస్: ఈ విభాగంలో ఆర్థికాంశాలకు ప్రాధాన్యం. ఆర్‌బీఐ, బ్యాంకింగ్ వ్యవస్థ, బ్యాంక్ పదజాలం, బీమా, రెపో, రివర్స్ రెపో, వడ్డీరేట్లు, బ్యాంకుల కార్యకలాపాలు, బ్యాంకుల విలీనం, తాజా ఆర్థిక నిర్ణయాలు, బ్యాంకులు-ప్రధాన కార్యాలయాలు-అధిపతులు.. తెలుసుకోవాలి. జనరల్ అవేర్‌నెస్‌లో భాగంగా తాజా సంఘటనలకు ప్రాధాన్యమివ్వాలి. దేశ చరిత్ర, సంస్కృతి, భౌగోళిక వ్యవస్థ, పాలిటీ, సైన్స్‌ల్లో ప్రాథమిక అవగాహనను పరిశీలిస్తారు. వీటికోసం 8,9,10 తరగతుల్లోని ముఖ్యాంశాలు చదువుకుంటే సరిపోతుంది. వర్తమాన వ్యవహారాల కోసం జులై, 2025 నుంచి పరీక్ష తేదీ వరకు ముఖ్య సంఘటనలు అంటే.. నియామకాలు, అవార్డులు, విజేతలు, ఎన్నికలు, పుస్తకాలు- రచయితలు, ప్రముఖుల పర్యటనలు, మరణాలు..వీటికి ప్రాధాన్యమివ్వాలి.

జనరల్ ఇంగ్లిష్: ఖాళీలు పూరించడం, వాక్యంలో తప్పును గుర్తించడం, సమానార్థాలు, వ్యతిరేక పదాలు, తప్పుగా ఉన్న పదాన్ని గుర్తించడం, జాతీయాలు, సామెతలు, ప్రత్యక్ష, పరోక్ష వాక్యాలుగా మార్చడం, వాక్యంలో పదాలను క్రమ పద్ధతిలో అమర్చడం, కాంప్రహెన్షన్..తదితర విభాగాల నుంచే వీటిని అడుగుతారు. హైస్కూల్, ఇంటర్మీడియట్ స్థాయి ఆంగ్ల పాఠ్యపుస్తకాల్లోని వ్యాకరణాంశాలు బాగా చదువుకున్నవారు ఎక్కువ మార్కులు పొందవచ్చు.

క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్: క్వాంటిటేటివ్ విభాగంలో.. నంబర్ సిస్టమ్, ఫండమెంటల్ అరిథ్‌మెటికల్ ఆపరేషన్స్‌ల నుంచి ప్రశ్నలు వస్తాయి. అరిథ్‌మెటిక్ ఆపరేషన్స్‌లో భాగంగా.. శాతాలు, నిష్పత్తి, సరాసరి, చక్రవడ్డీ, బారువడ్డీ, లాభనష్టాలు, కాలం-పని, కాలం-దూరం, డిస్కౌంట్.. మొదలైనవి బాగా చదవాలి. రీజనింగ్‌లో.. వెర్బల్, నాన్ వెర్బల్ ప్రశ్నలు ఉంటాయి. సెమాంటిక్ ఎనాలజీ, సింబాలిక్ ఆపరేషన్స్, నెంబర్ ఎనాలజీ, ట్రెండ్స్, ఫిగర్ ఎనాలజీ, వెన్ డయాగ్రమ్స్, నంబర్ క్లాసిఫికేషన్, సిరీస్, కోడింగ్-డీకోడింగ్, వర్డ్ బిల్డింగ్... తదితర విభాగాల్లో ప్రశ్నలు వస్తాయి.

కంప్యూటర్ నాలెడ్జ్: కంప్యూటర్ ఉపయోగించి, చిన్న పనులు పూర్తిచేయగలరా, లేదా తెలుసుకునేలా ప్రశ్నలు ఉంటాయి. వర్డ్, ఎక్సెల్, ఇంటర్నెట్, వెబ్ బ్రౌజింగ్, ఈమెయిల్, యూఆర్ఎల్, హెచ్‌టీటీపీ, వెబ్‌సైట్లు.. వీటి గురించి తెలుసుకోవాలి. ఇంజినీరింగ్ విద్యార్థులు, డిగ్రీలో కంప్యూటర్ సైన్స్ చదువుకున్నవారు ఈ ప్రశ్నలకు సులువుగానే సమాధానాలు గుర్తించగలరు.

సన్నద్ధత

- నిర్ణీత వ్యవధిలో ఎక్కువ ప్రశ్నలకు సరైన జవాబులు గుర్తించినవారే విజేత కాగలరు. ఒక్కో ప్రశ్నకు గరిష్ఠంగా 36 సెకన్ల సమయమే ఉంటుంది. ఇంత తక్కువ వ్యవధిలో సమాధానం గుర్తించాలంటే.. పరీక్షకు ముందు వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేస్తేనే సాధ్యమవుతుంది.
- కొన్ని ప్రశ్నలకు సమాధానం గుర్తించడానికి ఎక్కువ సమయం అవసరం కావచ్చు. అలాంటి వాటి జోలికి వెళ్లకుండా సులువుగా ఉండి, తక్కువ వ్యవధిలో జవాబు రాబట్టగలిగేవి ముందుగా చేయాలి. ఆ తర్వాతే మిగిలినవాటిని ప్రయత్నించాలి.
- రుణాత్మక మార్కులు లేనందున బాగా ఆలోచించి, విచక్షణతో తెలియని ప్రశ్నలకూ జవాబులు గుర్తించడమే మంచిది.
- ఐబీపీఎస్ క్లరికల్, గతంలో నిర్వహించిన అప్రెంటిస్ పాత, మాదిరి ప్రశ్నపత్రాలు వీలైనన్ని సాధన చేయాలి.
- కనీసం పది నమూనా పరీక్షలైనా రాసి, జవాబులు విశ్లేషించుకోవాలి. ఇబ్బంది పడుతున్న విభాగం/ చాప్టర్లను ప్రాధాన్యంతో చదివి, వీలైనన్ని ప్రశ్నలు సాధన చేస్తే పరీక్షలో ఎక్కువ మార్కులు పొందడానికి అవకాశం ఉంటుంది.
- నేర్చుకున్న అంశాలన్నీ పరీక్షకు వారం/పది రోజుల ముందు పునశ్చరణ చేస్తే తెలిసిన ప్రశ్నలకు సరైన జవాబులు గుర్తించడం తేలికవుతుంది.

ముఖ్య వివరాలు

ఖాళీలు: 2700. ఏపీలో 38, తెలంగాణలో 154.

అర్హత: డిగ్రీ

వయసు: నవంబరు 1, 2025 నాటికి 20-28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులకు గరిష్ఠ వయసులో సడలింపు ఉంది.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీలకు లేదు. దివ్యాంగులకు రూ.400. మిగిలిన అందరికీ రూ.800

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 1

వెబ్‌సైట్: https://bankofbaroda.bank.in/career/

మాండరిన్ నేర్చుకోవచ్చా?

ఐటీ జాబ్ చేసి మానేశాను. ఇప్పుడు కెరియర్‌ను మళ్లీ ప్రారంభించాలి అనుకుంటున్నాను. ఐటీ వైపు వెళ్లే ఆలోచన లేదు. చైనీస్ మాండరిన్ నేర్చుకుని ట్యూటర్‌గా బోధించాలనుంది. ఎక్కడ నేర్చుకోవచ్చు? - సాంబశివరావు



ఇటీవలి కాలంలో నలభై, యాభై ఏళ్ల మధ్య వయసులో ఉన్న చాలా మంది చేస్తోన్న ఉద్యోగాలను వదిలి కొత్త మార్గాలను వెతుకుతున్నారు. ముఖ్యంగా ఐటీ రంగంలో పని చేసే వాళ్ల పని ఒత్తిడి, ఉద్యోగ భద్రత లేకపోవడం, ఎక్కువ సమయం కంప్యూటర్ ముందు గడపలేకపోవడంతో పాటూ ఇతర ఆరోగ్య కారణాల వల్ల వేరే ఉద్యోగానికి మారడం అవసరమని భావిస్తున్నారు. మీరు కూడా ఐటీ ఉద్యోగం మానేసి, ఇప్పుడు పూర్తిగా భిన్నమైన దారిలోకి వెళ్లాలనుకుంటున్నారు. ఇలాంటి సందర్భంలో చైనీస్ మాండరిన్ భాష నేర్చుకోవడం ఎంతో ప్రయోజనకరం.

ప్రపంచవ్యాప్తంగా చైనీస్ భాషకు ఉన్న డిమాండ్ రోజు రోజుకీ పెరుగుతోంది. అంతర్జాతీయ వ్యాపారం, ఐటీ సేవలు, బీపీఓ, కేపీఓ రంగాలు, అనువాద సేవలు, విదేశీ విద్య, పర్యాటకం వంటి పలు రంగాల్లో మాండరిన్ భాషకు మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయి. భారత మార్కెట్‌లో కూడా చైనా కంపెనీలు, చైనాతో వ్యాపారం చేసే సంస్థల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, ఈ భాష నేర్చుకున్నవారికి ఉద్యోగాలు లభించే అవకాశాలు ఉన్నాయి.

చైనీస్ మాండరిన్ భాష నేర్చుకోవడానికి హైదరాబాద్‌లో మంచి శిక్షణ సంస్థలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైంది ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ. ఇది విదేశీ భాషల్లో విద్యావకాశాలను కల్పిస్తున్న ప్రముఖ కేంద్రీయ విశ్వవిద్యాలయం. ఇక్కడ చైనీస్‌లో సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అదే విధంగా, రామకృష్ణ మఠం వారి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ కూడా చైనీస్ భాషలో మంచి పాఠ్యాంశాలను అందిస్తోంది. వీటికి తోడు చాలా ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్‌లూ చైనీస్ మాండరిన్‌లో శిక్షణ అందిస్తున్నాయి. కానీ, ప్రైవేట్ సంస్థను ఎంచుకొనేముందు ఆ సంస్థ విశ్వసనీయత గురించి పూర్తిగా తెలుసుకోండి. ఆసక్తి ఉంటే కోర్స్‌ఎరా, యుడెమి లాంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానూ నేర్చుకోవచ్చు.

మాండరిన్ నేర్చుకుని చైనీస్ లాంగ్వేజ్ ట్యూటర్‌గా స్థిరపడొచ్చు. అవకాశం ఉంటే, ఇంటి నుంచే ఆన్‌లైన్ క్లాసులు కూడా నిర్వహించవచ్చు. అంతేకాకుండా, కంపెనీలకు అవసరమైన ట్రాన్స్‌లేటర్, ఇంటర్‌ప్రెటర్‌గా పని చేయవచ్చు.

ఒక సంవత్సరం పాటు ప్రయత్నిస్తే.. చైనీస్ మాండరిన్‌లో మంచి పట్టు సాధించవచ్చు. ముందుగా ప్రాథమికాంశాలు నేర్చుకుని, ఆ తర్వాత ఇంటర్మీడియట్, అడ్వాన్స్‌డ్ స్థాయి కోర్సులు పూర్తిచేస్తే ఉద్యోగావకాశాలు మరింత విస్తరిస్తాయి. ఈ భాషలో నైపుణ్యం సంపాదించిన తర్వాత, ట్యూటర్‌గా, ట్రాన్స్‌లేటర్‌గా, చైనీస్ కస్టమర్స్ ఎక్కువగా ఉన్న సంస్థల్లో ఉద్యోగం చేయడం సాధ్యమవుతుంది. ఒక సంవత్సరం పాటు ప్రతి రోజూ కనీసం మూడు గంటల సమయం కేటాయిస్తే, చైనీస్ మాండరిన్ భాష మీ కెరియర్‌కు ఒక కొత్త మార్గాన్ని చూపిస్తుంది.

-ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

సేల్స్

సంస్థ: ప్రైమ్‌పాత్‌వే
నైపుణ్యాలు: బిజినెస్ డెవలప్‌మెంట్, క్లయింట్ ఇంటరాక్షన్, క్లయింట్ రిలేషన్‌షిప్, క్లయింట్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ (సీఆర్ఎం), కోల్డ్ కాలింగ్, కౌన్సెలింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, ఇన్‌సైడ్ సేల్స్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, సేల్స్, సేల్స్ మేనేజ్‌మెంట్, సేల్స్ స్ట్రాటజీ, సేల్స్ సపోర్ట్
స్టైపెండ్: రూ.10,000-15,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 20
☛ https://shorturl.at/x2gKz

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: ఎక్రాస్ ద గ్లోబ్ (ఏటీజీ)
నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, డిజిటల్ అడ్వర్‌టైజింగ్, డిజిటల్, ఈమెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సెర్చ్ ఇంజిన్, సోషల్‌మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.2,500-10,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 19
☛ https://tinyurl.com/3bnxb3w4

కంటెంట్ మార్కెటింగ్ (క్రియేటివ్ రైటింగ్, డిజైన్)

సంస్థ: ఆర్చ్‌స్కేల్ గిల్డ్
నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, గ్రాఫిక్ డిజైన్, సెర్చ్ ఇంజిన్, సోషల్‌మీడియా మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.7,000-11,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 19
☛ https://shorturl.at/sKag2

పైతాన్ డెవలప్‌మెంట్

సంస్థ: ప్రైమ్‌ట్రేడ్.ఏఐ
నైపుణ్యాలు: క్లినికల్ డేటా మేనేజ్‌మెంట్, క్రిప్టోగ్రఫీ, పైతాన్, రెస్ట్ ఏపీఐ, స్టాక్ ట్రేడింగ్
స్టైపెండ్: రూ.10,000-15,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 19
☛ https://tinyurl.com/yejj4s89

చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ)

సంస్థ: ఆర్టిక్లిమ్
నైపుణ్యాలు: అకౌంటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఫైనాన్స్, ఎంఎస్-ఎక్సెల్
స్టైపెండ్: రూ.4,000-5,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 20
☛ https://shorturl.at/F1C5Q

మొబైల్ యాప్ డెవలప్‌మెంట్


సంస్థ: అలైన్ టర్టిల్ నైపుణ్యాలు: ఆండ్రాయిడ్, ఐఓఎస్, రియాక్ట్, రియాక్ట్ నేటివ్, రెస్ట్ ఏపీఐ, ఎక్స్‌కోడ్
స్టైపెండ్: రూ.5,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 18
☛ https://tinyurl.com/5n8aye7c

సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ (ఎస్ఈఓ)

సంస్థ: శంకర్ గ్రూప్
నైపుణ్యాలు: డిజిటల్, సెర్చ్ ఇంజిన్, సోషల్‌మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, గూగుల్ యాడ్‌వర్డ్స్, గూగుల్ అనలిటిక్స్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.3,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 18
☛ https://shorturl.at/P9DSu

యూసీఐఎల్‌లో కొలువులు

ఝార్ఖండ్‌లోని యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) రెగ్యులర్ ప్రాతిపదికన మైనింగ్ మేట్, వైండింగ్ ఇంజిన్ డ్రైవర్, బాయిలర్ ఆపరేటర్ కమ్ కంప్రెషర్ అటెండెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



మొత్తం ఖాళీలు 107
- మైనింగ్ మేట్ (సీ) - 95
- వైండింగ్ ఇంజిన్ డ్రైవర్ (బీ) - 09
- బాయిలర్- కమ్- కంప్రెషర్ అటెండెంట్ (ఏ): 03

అర్హత: పోస్టులను అనుసరించి పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు వైండింగ్ ఇంజిన్ డ్రైవర్ కాంపిటెన్సీ, మైనింగ్ మేట్ / ఫోర్‌మెన్ సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

వయసు: మైనింగ్ మేట్‌కు 40 ఏళ్లు; వైండింగ్ ఇంజిన్ డ్రైవర్‌కు 32 సంవత్సరాలు; బాయిలర్-కమ్-కంప్రెషర్ అటెండెంట్‌కు 30 ఏళ్లు మించకూడదు.

వేతనం: మైనింగ్ మేట్‌కు నెలకు రూ.29,190- రూ.45,480; వైండింగ్ ఇంజిన్ డ్రైవర్ (బీ)కు రూ.28,790- రూ.44,850; బాయిలర్-కమ్-కంప్రెషర్ అటెండెంట్‌కు రూ.28,390 - రూ.44,230.

ఎంపిక: రాత పరీక్ష/ ట్రేడ్ టెస్ట్/ సైకోమెట్రిక్ టెస్ట్/ గ్రూప్ ఎక్సర్‌సైజ్/ పర్సనల్ ఇంటర్వ్యూతో ఎంపిక చేస్తారు.

దరఖాస్తు ఫీజు: జనరల్‌కు రూ.500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు లేదు.

దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభ తేదీ: 01-12-2025

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31-12-2025.

వెబ్‌సైట్: https://ucil.gov.in/jobportal/public/index.php

టీఆర్‌టీసీలో...

గువాహటిలోని టూల్ రూమ్ అండ్ ట్రెయినింగ్ సెంటర్ (టీఆర్‌టీసీ) జనరల్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్, బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్ (బీసీఏ) అప్రెంటిస్ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలను నిర్వహిస్తోంది, అర్హత గల అభ్యర్థులు డిసెంబరు 3వ తేదీ ఇంటర్వ్యూకు హాజరుకావచ్చు.

- జనరల్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ - 03
- బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్ (బీసీఏ) అప్రెంటిస్ - 03

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగాల్లో ఆర్ట్స్/ సైన్స్/ కామర్స్ గ్రాడ్యుయేషన్ లేదా బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్‌లో ఉత్తీర్ణులై ఉండాలి.

స్టైపెండ్: నెలకు రూ.12,000. **ఇంటర్వ్యూ తేదీ:** డిసెంబరు 3 **ఎంపిక:** ఇంటర్వ్యూతో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. **వేదిక:** టూల్ రూమ్ అండ్ ట్రెయినింగ్ సెంటర్, గువాహటి ఈపీఐపీ, అమింగావ్ ఇండస్ట్రియల్ ఏరియా, నార్త్ గువాహటి-(అసోం). **వెబ్‌సైట్:** https://trtcguwahati.org/

టీఎంసీలో ఉద్యోగాలు

టాటా మెమోరియల్ సెంటర్ (టీఎంసీ) ముంబయి.. ఒప్పంద ప్రాతిపదికన కోడర్, సూపర్‌వైజర్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. అభ్యర్థులు డిసెంబరు 9న ఇంటర్వ్యూకు హాజరుకావచ్చు.

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ (బయొలాజికల్ సైన్సెస్ లేదా లైఫ్ సైన్సెస్)లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. **వేతనం:** నెలకు రూ.36,000. **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా. **ఇంటర్వ్యూ తేదీ:** 2025 డిసెంబరు 9 **వేదిక:** రూమ్ నం.205, 2వ అంతస్తు, సెంటర్ ఫర్ క్యాన్సర్ ఎపిడెమియాలజీ, అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ ట్రీట్‌మెంట్, రిసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఇన్ సెక్టార్ 22, ఖార్ఘర్, నవీ ముంబయి - 410 210. **వెబ్‌సైట్:** https://tmc.gov.in/m_events/events/jobvacancies

బెల్‌లో అప్రెంటిస్‌లు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్.. డిప్లొమా, ఇంజినీర్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్ శిక్షణకు ప్రకటన జారీ చేసింది. అర్హత గల అభ్యర్థులు నవంబరు 27 వరకు దరఖాస్తు చేసుకోవాలి. సదరన్ రీజియన్ (తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, పాండిచ్చేరి) ప్రాంతానికి చెందిన అభ్యర్థులు అర్హులు.

- గ్రాడ్యుయేట్ ఇంజినీర్ (బీఈ/బీటెక్) అప్రెంటిస్
- డిప్లొమా అప్రెంటిస్

విభాగాలు: మెకానికల్ ఇంజినీరింగ్, మెకట్రానిక్స్, సివిల్ ఆర్కిటెక్చర్, కెమికల్ ఇంజినీరింగ్, కమర్షియర్ అప్రెంటిస్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, లైబ్రరీ సైన్స్

అర్హత: డిప్లొమా, ఇంజినీరింగ్/ టెక్నాలజీలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత

స్టైపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.17,500; డిప్లొమా అప్రెంటిస్‌లకు రూ.12,500. **వయసు:** 25 సంవత్సరాలు మించకూడదు.

ఎంపిక: విద్యార్హత మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా.

వాక్-ఇన్-సెలక్షన్స్ తేదీ: 27.11.2025.

వేదిక: సెంటర్ ఫర్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, జలహల్లి పోస్ట్, బెంగళూరు.

వెబ్‌సైట్: https://bel-india.in/

స్టడీ మంత్ర.. 147!



143 గురించి విన్నాంగానీ.. ఈ 147 ఏంటీ కొత్తగా అనుకుంటున్నారు కదా.. ఇదే స్టడీ మంత్ర.

విద్యార్థులు, ఉద్యోగార్థులు ఎన్నో విషయాలను చదివి.. వాటిని జాగ్రత్తగా గుర్తుంచుకోవాలి. అలాంటివారి కోసమే ఈ 147. విద్యార్థి దశ నుంచి ఉద్యోగ స్థాయికి ఎదగడానికి ఎంతో కష్టపడతారు. సాధారణంగా పరీక్షల ముందు ఎవరిని అడిగినా అందరి నోటా 'అరె చదివాగానీ గుర్తురావడం లేదు' అనే మాటే వినిపిస్తుంటుంది. అలాకాకుండా చదివింది మర్చిపోకుండా ఉండాలంటే ఈ చిట్కాను ప్రయత్నించొచ్చు.

- ఏ సబ్జెక్ట్ అయినా సరే మొదటి రోజు చదివి, అక్కడి నుంచి సరిగ్గా నాలుగో రోజు ఒక్కసారి రివిజన్ చేయండి.
- తర్వాత ఏడో రోజూ మళ్లీ రివిజన్ చేయండి. ఇలా చేస్తే చదివినవి మర్చిపోరు. ఇదే 147. సైకాలజిస్టులు కొంత మంది విద్యార్థులపై ఈ సూత్రాన్ని ప్రయోగించారు. మొదట కొంత మందికి ఒక కంటెంట్ ఇచ్చి చదవమని చెప్పారు. వారిలో కొంతమందిని విడిగా రెండో గ్రూప్ చేసి అదే కంటెంట్‌ని 4, 7 రోజులు కూడా మళ్లీ చదివేలా చేశారు. ఇదే పునశ్చరణ (రివిజన్).
- రెండో గ్రూపు సభ్యులు అడిగిన ప్రతి ప్రశ్నకూ సమాధానాలు సరిగ్గా చెప్పారు. దీన్ని బట్టి ఏ విషయాన్ని అయినా విద్యార్థులు నియమిత కాల వ్యవధిలో తిరిగి చదువుతుంటే మెదడు చక్కగా భద్రపరుచుకుంటుందని రుజువైంది. దాంతో మర్చిపోకుండా ఉండగలుగుతాం అన్నమాట! ఒకసారి ప్రయత్నిస్తే రివిజన్ పవర్ ఏమిటో మీకూ అర్థమవుతుంది.

– పనపాన కీర్తన, ఈజేఎస్

రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ).. 84 పోస్టులను భర్తీచేయనుంది. డిగ్రీ, ఎంబీఏ/పీజీడీఎం అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు. సీబీటీ, స్కిల్ టెస్ట్/ ఇంటర్వ్యూలతో నియామకాలుంటాయి.

నేషనల్ హైవే అథారిటీలో...



రాతపరీక్ష, స్కిల్‌టెస్ట్/ ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలతో ఎంపిక చేస్తారు. కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష (సీబీటీ) 120 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. వ్యవధి రెండు గంటలు.

డిప్యూటీ మేనేజర్ (ఫైనాన్స్ అండ్ అకౌంట్స్), అకౌంటెంట్‌లకు: ప్రశ్నపత్రంలో రెండు పార్ట్‌లు ఉంటాయి. రీజనింగ్ టెస్ట్/ జనరల్ మెంటల్ ఎబిలిటీ/ ఇంటెలిజెన్స్ టెస్ట్ 10 ప్రశ్నలు, మ్యాథమెటికల్ ఆప్టిట్యూడ్ నుంచి 10 ప్రశ్నలు, జనరల్ నాలెడ్జ్ నుంచి 10 ప్రశ్నలు ఇస్తారు. పార్ట్-2లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ (జనరల్ వెర్బల్ ఎబిలిటీ) - 10 ప్రశ్నలు, సబ్జెక్టు సంబంధిత ప్రశ్నలు 80 అడుగుతారు. దీంట్లో అర్హత పొందినవారిని ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. దీనికి 15 మార్కులు.

స్టెనోగ్రాఫర్‌కు: సీబీటీ 120 మార్కులకు నిర్వహిస్తారు. రీజనింగ్ టెస్ట్/ జనరల్ మెంటల్ ఎబిలిటీ/ ఇంటెలిజెన్స్- 30 ప్రశ్నలు, జనరల్ నాలెడ్జ్ 30 ప్రశ్నలు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ (జనరల్ వెర్బల్ ఎబిలిటీ) - 60 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. వ్యవధి 2 గంటలు. దీంట్లో ప్రతిభ కనబరిచినవారికి ఐదు నిమిషాల డిక్టేషన్ ఇస్తారు. నిమిషానికి 80 పదాల వేగంతో డిక్టేషన్ తీసుకుని దాన్ని కంప్యూటర్‌పై ఇంగ్లిష్‌లో 50 నిమిషాలు/ హిందీలో 65 నిమిషాల వ్యవధిలో ట్రాన్స్‌స్క్రిప్ట్ చేయగలగాలి.

సన్నద్ధత: డిప్యూటీ మేనేజర్, అకౌంటెంట్ పోస్టుల రాత పరీక్షలో.. సబ్జెక్టు సంబంధిత అంశాలకు ఎక్కువ మార్కులు కేటాయించారు. వీటిల్లోని ముఖ్యాంశాలను చదివి పునశ్చరణ చేసుకోవాలి. మాక్ టెస్టులు రాయడం వల్ల ప్రయోజనం ఉంటుంది. సమయ నిర్వహణ, బలాలు బలహీనతలపై అవగాహన వస్తుంది. స్టెనోగ్రాఫర్ ప్రశ్నపత్రంలో ఇంగ్లిష్ లాంగ్వేజ్‌కు ఎక్కువ మార్కులు ఉన్నాయి. దీనికి సంబంధించిన ఒకాబ్యులరీ, గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటుగా డిక్టేషన్, టైపింగ్ వేగాలపైనా దృష్టి పెట్టాలి. రీజనింగ్, జనరల్ నాలెడ్జ్ ప్రశ్నల కోసం పోటీ పరీక్షల పాత ప్రశ్న పత్రాలను సాధన చేయాలి.

ముఖ్యాంశాలు

మొత్తం ఉద్యోగాల్లో ఎక్కువ సంఖ్యలో ఖాళీలున్న వాటి వివరాలు...

1. **డిప్యూటీ మేనేజర్ (ఫైనాన్స్ అండ్ అకౌంట్స్)–9:** డిగ్రీ, ఎంబీఏ (ఫైనాన్స్).
2. **అకౌంటెంట్–42:** బీకామ్, చార్టర్డ్ అకౌంటెన్సీ -సీఏ (ఇంటర్మీడియట్)/ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ (సీఎంఏ).
3. **స్టెనోగ్రాఫర్–31:** డిగ్రీ, నిమిషానికి 80 పదాల వేగంతో డిక్టేషన్ తీసుకోవాలి. ఇంగ్లిష్‌లో 50 నిమిషాలు/ హిందీలో 65 నిమిషాల వ్యవధిలో దాన్ని కంప్యూటర్‌పై ట్రాన్స్‌స్క్రిప్ట్ చేయాలి.

వయసు: స్టెనోగ్రాఫర్‌కు 28 సంవత్సరాలు మించకూడదు. మిగతా అన్ని పోస్టులకూ గరిష్ఠ వయసు 30 ఏళ్లు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్లు సడలిస్తారు.

దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు లేదు.

వేతన శ్రేణి: డిప్యూటీ మేనేజర్ (ఫైనాన్స్ అండ్ అకౌంట్స్)కు నెలకు రూ.56,100-1,77,500. అకౌంటెంట్‌కు నెలకు రూ.29,200-92,300.

స్టెనోగ్రాఫర్‌కు నెలకు రూ.25,500-81,100. మూలవేతనానికి అదనంగా డీఏ, హెచ్ఆర్ఏ, టీఏ, ఇతర సదుపాయాలు ఉంటాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15.12.2025

వెబ్‌సైట్: www.nhai.gov.in

నల్సా కార్యనిర్వాహక ఛైర్మన్‌గా జస్టిస్ విక్రమ్‌నాథ్ నియామకం



దిల్లీ: జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ (నల్సా) కార్యనిర్వాహక ఛైర్మన్‌గా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ నియమితులయ్యారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదంతో ఈ నియామకం జరిగింది. సుప్రీంకోర్టులో సీజేఐ తర్వాత అత్యంత సీనియర్ అయిన న్యాయమూర్తి నల్సా కార్యనిర్వాహక ఛైర్మన్ పదవిని చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. ✦ సుప్రీంకోర్టు న్యాయ సేవల కమిటీ (ఎస్‌సీఎల్ఎస్‌సీ) నూతన ఛైర్మన్‌గా జస్టిస్ జె.కె.మహేశ్వరిని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నియమించారు. సోమవారం నుంచే ఈ నియామకాలు అమల్లోకి వచ్చాయి.

చైనా, జపాన్‌ల మధ్య ముదిరిన ఉద్రిక్తత

బీజింగ్: తైవాన్‌కు 110 కిలోమీటర్ల దూరంలోని జపాన్ దీవి యోనాగునిలో శత్రు విమానాలు, క్షిపణులను అడ్డుకోగల క్షిపణులను మోహరించాలని జపాన్ ప్రభుత్వం నిర్ణయించడంపై చైనా మండిపడింది. జపాన్ నిర్ణయం చాలా ప్రమాదకరమని, దీనివల్ల ప్రాంతీయ ఉద్రిక్తతలు, సాయుధ ఘర్షణ ప్రమాదం పెరుగుతాయని చైనా విదేశాంగశాఖ ప్రతినిధి మావ్ నింగ్ సోమవారం హెచ్చరించారు. తైవాన్ తన అంతర్భాగమని డ్రాగన్ పేర్కొంటోంది. తైవాన్‌పై చైనా కనుక దాడి చేస్తే అది జపాన్ మనుగడకు ప్రమాదకరమని, అదే జరిగితే తాము అమెరికాతో కలిసి ప్రతిచర్య తీసుకుంటామని జపాన్ ప్రధాన మంత్రి సనే తకాయిచి ఇటీవల స్పష్టం చేశారు. ఆదివారంనాడు యోనాగుని దీవిని సందర్శించిన జపాన్ రక్షణ మంత్రి షింజిరో కొయిజుమి తమ దేశంపై ప్రత్యర్థులు దాడి జరిపే ప్రమాదాన్ని నివారించడానికి ఈ దీవిలో క్షిపణులను మోహరించబోతున్నామని చెప్పారు.

రూ.720 కోట్లతో క్వాంటమ్ కేంద్రాలు

- కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ వెల్లడి

దిల్లీ: భౌతిక, వస్తు విజ్ఞాన, ఇంజినీరింగ్ శాస్త్రాల సాయంతో క్వాంటమ్ చిప్స్ వంటి పరికరాలను ఉత్పత్తి చేసే క్వాంటమ్ ఫ్యాబ్రికేషన్, సెంట్రల్ సదుపాయాలను ఐఐటీ- బాంబే, ఐఐఎస్‌సీ - బెంగళూరు, ఐఐటీ కాన్పుర్, ఐఐటీ-దిల్లీలలో ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర విజ్ఞాన, సాంకేతిక పరిజ్ఞాన శాఖ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. జాతీయ క్వాంటమ్ మిషన్ పథకం కింద రూ.720 కోట్ల విలువైన ఈ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. సోమవారం ఐఐటీ బాంబేను సందర్శించిన ఆయన మీడియాతో మాట్లాడారు. దేశం సాంకేతికంగా అగ్రస్థానానికి చేరేందుకు ఈ అత్యాధునిక సదుపాయాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలల్లో 'క్వాంటమ్' ప్రయోగశాలలు

ముంబయి: క్వాంటమ్ పరిశోధనలకు సంబంధించి 100 ఇంజినీరింగ్ కళాశాలలకు కేంద్రం అండగా నిలుస్తుందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(డీఎస్‌టీ) కార్యదర్శి ప్రొఫెసర్ అభయ్ కరండికర్ తెలిపారు. ఈ పరిశోధనల్లో భాగంగా ఆయా కళాశాలల్లో రూ.1 కోటి వ్యయంతో ప్రయోగశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు ఐఐటీ-బాంబేలో జరిగిన ఓ కార్యక్రమంలో కరండికర్ మాట్లాడారు. ఎంపిక చేసిన ఇంజినీరింగ్ కళాశాలల్లో అండర్ గ్రాడ్యుయేట్ మైనర్ ప్రోగ్రామ్ బోధనల కోసం ప్రయోగశాలలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. దీని కోసం దాదాపు 500 కళాశాలల నుంచి ప్రతిపాదనలు వచ్చాయని... అయితే వాటిలో 100 కళాశాలలను ఎంపిక చేసినట్లు అభయ్ వెల్లడించారు.

గేమింగ్ సంస్థల డిపాజిట్ల స్తంభన

దిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్ సంస్థలైన విన్‌జో, గేమ్స్‌క్రాఫ్ట్‌లకు చెందిన రూ.523 కోట్ల డిపాజిట్లను స్తంభింపజేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం వెల్లడించింది. భారత్‌లో ఆన్‌లైన్ గేమింగ్‌ను నిషేధించిన నేపథ్యంలో ఈ సంస్థలు తమవద్ద ఉన్న సొమ్మును తిరిగి ఆటగాళ్లకు చెల్లించకుండా తమవద్దే ఉంచుకున్నాయని విచారణ సంస్థ తెలిపింది. ఈ వేదికలపై నమోదైన మనీలాండరింగ్ కేసులో భాగంగా ఈడీ ఈ నెల 18 నుంచి 22 వరకూ దిల్లీ, బెంగళూరు, గురుగ్రామ్ నగరాల్లో పలుచోట్ల సోదాలు నిర్వహించింది. ఈ సంస్థల మాతృసంస్థలైన నిర్దేశ నెట్‌వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్, గేమ్స్‌క్రాఫ్ట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, విన్జో గేమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలపై, వాటి ప్రమోటర్లపై నిర్వహించిన దాడుల్లో ఈ సొమ్మును కనుగొన్నారు.

బాలబాలికల ఆలోచనలు, వేగాల్లో తేడాలు

దిల్లీ: మత్తు మందుల అలవాటు ఉన్న కుటుంబాలకు చెందిన బాలబాలికల మెదళ్లు పనిచేసే తీరు భిన్నంగా ఉంటుందని అమెరికాలో ఒక పరిశోధన నిగ్గు తేల్చింది. 9-11 ఏళ్ల వయోవర్గంలోని 1,900 మంది బాలబాలికలపై ఈ అధ్యయనం జరిగింది. మెదడు విశ్రాంత స్థితిలో ఉండటాన్ని డిఫాల్ట్ మోడ్ అంటారు. ఈ స్థితిలో రకరకాల ఆలోచనలు ముప్పిరిగొనవచ్చు. పగటి కలలు కనడమూ జరుగుతుంది. డిఫాల్ట్ స్థితిలో సానుకూల ఆలోచనలు రావచ్చు, ప్రతికూల ఆలోచనల్లోకి జారిపోనూవచ్చు. మాదక ద్రవ్యాలను వినియోగించే అలవాటున్న కుటుంబాల్లో బాలికలు ప్రతికూల ఆలోచనల నుంచి, మానసిక ఒత్తిడి నుంచి అంత తేలికగా బయటపడలేరని పరిశోధనలో తేలింది. ఫలితంగా వారు కూడా మాదక ద్రవ్యాలను ఆశ్రయించే ప్రమాదం ఉంది. అదే బాలురైతే బయటి విషయాలపైకి దృష్టి మళ్లించి ప్రతికూల ఆలోచనల నుంచి తేలికగా బయటపడగలరు. కానీ, ఈ క్రమంలో వారు మనసును ఉత్తేజపరచడానికని మద్యం, మాదకద్రవ్యాలను ఆశ్రయించే ప్రమాదం లేకపోలేదు. బాలికలు ప్రతికూల ఆలోచనలకు బ్రేకులు వేయడానికి కష్టపడుతూ మత్తుమందులను ఆశ్రయిస్తే, బాలురు బ్రేకులు లేకుండా దూకుడు పెంచి ప్రమాదకరమైన అలవాట్లకు లోను కావచ్చని అమెరికాలోని కార్నెల్ వైద్య కళాశాల పరిశోధకురాలు ఏమీ కుసియెస్కీ హెచ్చరించారు. ఇటువంటి బాలికలకు మానసిక ఒత్తిడిని అధిగమించడంలోనూ, బాలురకు ఆ వేగాన్ని అదుపు చేసుకోవడంలోనూ శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని ఆమె వివరించారు.

ఎస్ఐఆర్‌లో 99% దరఖాస్తుల పంపిణీ

- 50.50 కోట్లమందికి జారీచేశాం: ఈసీ
- బెంగాల్‌లో కొనసాగుతున్న రాద్ధాంతం
- బంగ్లాదేశీయులు వెనుదిరగడాన్ని పరిశీలించిన గవర్నర్



కోల్‌కతాలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న బీఎల్‌వోలు

దిల్లీ, కోల్‌కతా: దేశంలో తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)లో ఇప్పటివరకు 99% మేర దరఖాస్తుల పంపిణీ పూర్తయిందని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) వెల్లడించింది. రెండో దశ ఎస్ఐఆర్‌లో పాల్గొనాల్సి ఉన్న 50.97 కోట్ల మంది ఓటర్లలో సోమవారం వరకు 50.50 కోట్ల మందికి ఇచ్చామని తెలిపింది. పశ్చిమబెంగాల్‌లో ఈ ప్రక్రియపై రాజకీయ రాద్ధాంతం కొనసాగుతోంది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ)కి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం మరో లేఖ రాశారు. తక్షణం ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఒప్పంద ప్రాతిపదికన నియమించిన డేటా ఎంట్రీ ఆపరేటర్లను, 'బంగ్లా సహాయతా కేంద్ర' సిబ్బంది సేవలను ఎస్ఐఆర్ కార్యకలాపాల్లో ఉపయోగించుకోరాదంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవో అన్ని జిల్లాల ఎన్నికల అధికారులకు జారీ చేసిన ఆదేశాలను ఆమె ప్రస్తావించారు. ఎస్ఐఆర్ మొదలయ్యాక బెంగాల్ నుంచి బంగ్లాదేశ్‌కు తిరిగి వలసపోతున్నవారితో రద్దీగా మారిన హకీంపుర్ సరిహద్దు చెక్‌పోస్టును గవర్నర్ సి.వి.ఆనందబోస్ సందర్శించారు. బీఎస్ఎఫ్ అధికారులతో, స్థానికులతో మాట్లాడారు. పరిస్థితిని స్వయంగా చూడాలనే క్షేత్రస్థాయికి వచ్చానని చెప్పారు. ఆయన మంగళవారం ముర్షిదాబాద్‌లో పర్యటిస్తారు.

10 లక్షల ఫాంలు వెనక్కి రాకపోవచ్చు!

బెంగాల్‌లో 10 లక్షల ఎస్ఐఆర్ దరఖాస్తులు తిరిగి వెనక్కి రాకపోవచ్చని ఇప్పటివరకు అంచనా వేసినట్లు ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) మనోజ్‌కుమార్ అగర్వాల్ చెప్పారు. ఆ ఓటర్లంతా అక్కడ లేకపోవడమో, చనిపోవడమో, వేరేచోటకు శాశ్వతంగా మారిపోవడమో జరిగి ఉంటుందని తెలిపారు. 4.55 కోట్ల దరఖాస్తుల్ని రాబట్టి, డిజిటలీకరించామని వివరించారు. తమ పని ఒత్తిడి తీవ్రంగా పెరిగిపోయిందంటూ బెంగాల్‌లో ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొంటున్న బూత్‌స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) కోల్‌కతాలో నిరసనకు దిగారు. రెండేళ్లు తీసుకునే పనిని నెలరోజుల్లో ఎలా చేయగలమని ప్రశ్నిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలోకి చొరబడేందుకు ప్రయత్నించారు. అడ్డుకున్న పోలీసులతో ఘర్షణకు దిగారు. ఎస్ఐఆర్‌ను ప్రతిపక్షాలు వ్యతిరేకించడాన్ని భాజపా తప్పుపట్టింది. చొరబాటుదారులు ఓటర్లుగా చెలామణీ అవుతూ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయకుండా ఉండేందుకే ఎస్ఐఆర్ చేపడుతున్నారని పేర్కొంది. చొరబాటుదారులతో ఎక్కడా ఎవరూ అధికారాన్ని హస్తగతం చేసుకోకూడదనేదే ఈ ప్రక్రియ ఉద్దేశమని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది దిల్లీలో విలేకరుల సమావేశంలో చెప్పారు. మమత, రాహుల్ గాంధీ వంటి నేతలు ఈసీపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

ఐఎన్ఎస్ మాహె ప్రత్యేకతలు..



ముంబయి: నౌకాదళంలో కొత్తగా చేరిన మాహె నౌకకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. మన బలగాలకు అండగా ఉంటూ, శత్రువు వెన్నువిరిచేలా దీని పనితీరు ఉంటుంది.
✦ ఈ నౌక చాలా నిశ్శబ్దంగా కదులుతుంది. దీంతో శత్రు జలాంతర్గాములు దీని రాకను గుర్తించలేవు. అందుకే దీన్ని 'సైలెంట్ హంటర్'గా పిలుస్తున్నారు.
✦ సోనార్ వ్యవస్థ దీనికి అదనపు ఆకర్షణ. శత్రు జలాంతర్గాములు, మందుపాతరలు, సముద్రంలో ఇతర ప్రమాదాల ముప్పులను కనిపెట్టేందుకు ఈ వ్యవస్థ నౌకకు కళ్లు, చెవులుగా పనిచేస్తుంది.
✦ డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన అభయ్ సోనార్ వ్యవస్థను ఇందులో ఏర్పాటుచేశారు. దీంతో నౌక చుట్టూ ఉన్న ప్రాంతాలను నిరంతరం గమనించే వీలు ఉంటుంది. జలాంతర్గాముల శబ్దాలు, వాటి కదలికలను ఇది వేగంగా గుర్తిస్తుంది.
✦ సముద్రంలో బాగా లోతువరకు నిఘా వేసేందుకు వీలుంటుంది. ఈ నౌక నుంచి ఓ కేబుల్ విడిపోయి సముద్ర గర్భంలో శత్రు ముప్పును పసిగడుతుంది.
✦ ఐఆర్ఎల్ యాంటీ-సబ్‌మెరైన్ రాకెట్ లాంచర్, 30 ఎంఎం తుపాకీ, అధునాతన.. అత్యంత తేలికపాటి టోర్పెడో లాంచర్, జలాంతర్గాముల్ని ధ్వంసం చేసే మందుపాతరలు, రిమోట్ కంట్రోల్ గన్ వంటి ఆయుధ వ్యవస్థలు ఉన్నాయి.
✦ తక్కువ లోతుండే ప్రాంతాల్లో ఇది చాలా సమర్థంగా పని చేయగలదు. ఈ యుద్ధ నౌక పొడవు 78 మీటర్లు. దీంతో ఇది సముద్ర జలాల్లో వేగంగా, స్థిరంగా కదలగలదు.
✦ దీని వేగం.. గంటకు 25 నాటికల్ మైళ్లు. వేగవంతంగా చేపట్టాల్సిన సహాయక చర్యల్లో ఇది కీలకం. నౌకలో ఏడుగురు అధికారులు, 50 మంది నావికులు ఉంటారు.

10 వేల ఏళ్లలో తొలిసారి పేలిన అగ్నిపర్వతం

- అప్రమత్తతలో విమానయాన సంస్థలు
- ఉత్తరభారతానికి బూడిద, పొగల సెగ



ఇంటర్నెట్ డెస్క్: ఆఫ్రికా దేశం ఇథియోపియాలో హేలీ గుబ్బి అనే అగ్నిపర్వతం 10 వేల సంవత్సరాల్లో తొలిసారిగా పేలింది. భారీ విస్ఫోటం కారణంగా పెద్దఎత్తున బూడిదతోపాటు పొగలు వెలువడుతున్నాయి. ఇవి నింగిలో వేల మీటర్ల ఎత్తుకు చేరుకోవడంతో.. విమాన రాకపోకలపై ప్రభావం పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే సోమవారం కేరళలోని కన్నూర్ నుంచి అబుధాబీకి బయల్దేరిన విమానాన్ని మార్గ మధ్యలో అహ్మదాబాద్‌కు దారిమళ్లించారు. అగ్నిపర్వతం ఇథియోపియాలోని అఫర్ రీజియన్‌లో ఉంది. గత 10 వేల సంవత్సరాల్లో ఇది పేలినట్లు రికార్డులు లేవు. తాజా విస్ఫోటాన్ని స్థానిక చరిత్రలో అత్యంత అసాధారణమైన ఘటనల్లో ఒకటిగా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మారుమూల ప్రాంతం కావడంతో ప్రాణ, ఆస్తి నష్టం వివరాలు తెలియరాలేదు. దీన్నుంచి పెద్దఎత్తున వెలువడిన బూడిద, పొగ ఇప్పటికే ఎర్ర సముద్రం మీదుగా ఒమన్, యెమెన్ దేశాలకు విస్తరించాయి. దీంతో అక్కడి అధికారులు అప్రమత్తమయ్యారు.

హేలీ గుబ్బి అగ్నిపర్వతం నుంచి వెలువడుతున్న బూడిద, పొగ ఉత్తర భారతానికీ విస్తరించే అవకాశం ఉందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతం మీదుగా వెళ్లాల్సిన విమాన సర్వీసులపై ప్రభావం పడుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పౌర విమానయానశాఖ అధికారులు, విమానయాన సంస్థలు ఇప్పటికే ఈ వ్యవహారంపై దృష్టి సారించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే సంబంధిత సంస్థలకు డీజీసీఏ సోమవారం అడ్వైజరీ జారీ చేసింది. మరోవైపు హేలీ గుబ్బి విస్ఫోటం కారణంగా కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి జెడ్డా, దుబాయి వెళ్లాల్సిన రెండు విమాన సర్వీసులు రద్దయ్యాయి.

కోచింగ్ సెంటర్ల పెరుగుదలపై పార్లమెంటరీ కమిటీ సమీక్ష

దిల్లీ: దేశంలో వేగంగా పెరుగుతున్న కోచింగ్ సెంటర్ల ప్రభావాన్ని, వాటి వల్ల ఏర్పడుతున్న సామాజిక సమస్యలను పరిశీలించాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నిర్ణయించింది. ఇటీవల రాజస్థాన్‌లోని కోటా వంటి ప్రాంతాల్లో విద్యార్థులు ఒత్తిడితో ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు పెరుగుతుండడంతో కోచింగ్ సెంటర్ల నిర్వహణపై కేంద్రం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో వాటి పనితీరును పరిశీలించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు కమిటీ వివరించింది. విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడలపై ఏర్పాటైన ఈ కమిటీ.. విద్యార్థులపై కృత్రిమ మేధ ప్రభావాన్ని కూడా పరీక్షించనుంది.

త్వరలో భారత్-ఈయూ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

- జనవరిలో సంతకాలు జరిగే అవకాశం

దిల్లీ: స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై భారత్-ఐరోపా సమాఖ్య (ఈయూ) మధ్య చాలా అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందానికి సంబంధించి గత కొంతకాలంగా చర్చలు జరుగుతున్నాయి. ఉక్కు, కార్లు, కార్బన్ సుంకాలకు సంబంధించి జరుగుతున్న చర్చలు డిసెంబరుకల్లా కొలిక్కి రానున్నాయి. ఈ నేపథ్యంలో ఎఫ్‌టీఏపై వచ్చే ఏడాది దిల్లీలో జరిగే సదస్సులో సంతకాలు చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. దీంతో పాటు ఈయూతో కీలక రక్షణ ఒప్పందాన్ని కూడా భారత్ కుదుర్చుకోనుందని సమాచారం.

వ్యక్తిగత ప్రతీకారం కోసం న్యాయ వ్యవస్థ దుర్వినియోగం

- సుప్రీంకోర్టు ఆవేదన



దిల్లీ: దేశ క్రిమినల్ న్యాయవ్యవస్థ వ్యక్తిగత ప్రతీకారం తీర్చుకోడానికి సాధనం కారాదని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టం చేసింది. కొందరు వ్యక్తులు న్యాయ వ్యవస్థను స్వార్థప్రయోజనాల కోసం దురుపయోగపరుస్తున్నారని తీవ్రంగా నిరసించింది. ఇలాంటి వారిపట్ల న్యాయస్థానాలు అప్రమత్తంగా ఉండాలని, సమాజ నిర్మాణంపై ప్రతికూల ప్రభావం చూపే చర్యలను మొగ్గలోనే తుంచివేయాలని పేర్కొంది. గువాహటికి చెందిన ఒక వ్యాపారిపై ఐపీసీలోని సెక్షన్ 420 (మోసం), సెక్షన్ 406 (క్రిమినల్ నమ్మకద్రోహం) కింద నమోదైన కేసుల్ని కొట్టివేస్తూ జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో అప్పీలుదారుడైన నిందితుడు ఇందర్ చంద్ బాగ్రికి వ్యతిరేకంగా మోసం, నమ్మకద్రోహం నేరాలు మోపారని, అయితే అవి పొసగలేదని ఫిర్యాదును, సాక్ష్యాధారాలను పరిశీలించిన ధర్మాసనం స్పష్టం చేసింది. వివాదాస్పదమైన ఆస్తికి సంబంధించిన విక్రయ పత్రాన్ని చెల్లనిదిగా ప్రకటించేందుకు ఫిర్యాదుదారు సివిల్ చట్టాలను ఉపయోగించవచ్చని స్పష్టం చేసింది. ఇందర్ చంద్ర బాగ్రిపై మోపిన అభియోగాలను కోర్టు కొట్టివేసింది. మోసానికి, నమ్మకద్రోహానికి ఉన్న తేడాను ధర్మాసనం విడమరిచింది. మోసంలో నేరం చేయాలన్న ఆకాంక్ష మొదటి నుంచీ ఉంటుందని, ఆ ఉద్దేశంతోనే నేరానికి పాల్పడే వ్యక్తి తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తారని పేర్కొంది. అయితే నమ్మకద్రోహం కింద ఒక వ్యక్తిని నమ్మినట్లు నిరూపించాలని తెలిపింది.

1న కృష్ణ జన్మభూమి, షాహీ ఈద్గా వివాదం కేసులో వాదనలు వింటాం

- సుప్రీం కోర్టు వెల్లడి


దిల్లీ: కృష్ణ జన్మభూమి, షాహీ ఈద్గా మసీదు వివాదంపై అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన రూలింగ్‌ను సవాలు చేస్తూ హిందూ సంస్థ ఒకటి దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలను డిసెంబరు 1వ తేదీ నుంచి వింటామని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ అంశంలో వాదనలను వివరంగా వినాల్సి ఉందని జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ అలోక్ అరాథేలతో కూడిన ధర్మాసనం సోమవారం అభిప్రాయపడింది. మథురలోని వివాదాస్పద స్థలంలో ఉన్న షాహీ ఈద్గా మసీదును తొలగించాలని కోరుతూ ఓ హిందూ సంస్థ.. విడిగా దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన అలహాబాద్ హైకోర్టు.. హిందూ భక్తులందరికీ ప్రతినిధిగా భావిస్తామని రూలింగ్ ఇచ్చింది. దీనిని సవాలు చేస్తూ మరో హిందూ సంస్థ సుప్రీం కోర్టును ఆశ్రయించింది.

బాలుడిపై కుక్క దాడి.. తెగిపడిన చెవి

దిల్లీ: ఆడుకుంటున్న ఆరేళ్ల బాలుడిని పిట్‌బుల్ జాతి కుక్క తీవ్రంగా గాయపరిచింది. ఆ బాలుడి చెవి తెగిపడేందుకు కారణమైన ఈ సంఘటన దిల్లీలోని ప్రేమ్‌నగర్ ప్రాంతంలో ఆదివారం జరిగింది. బడికి సెలవు కావడంతో తన అన్నతో కలిసి బంతిని క్యాచ్ పట్టే ఆట ఆడుతున్న బాలుడు ఈ దారుణానికి బలయ్యాడు. బాలుడు బంతిని పట్టుకునేందుకు పరుగుతీస్తుండగా పొరుగింట్లోని కుక్క అతనిపై లంఘించినట్టు వీధిలోని సీసీటీవీ కెమెరా సాక్ష్యం చెబుతోంది. బాలుడిని గట్టిగా కరుస్తూ ఉన్న ఆ కుక్కను తరమడానికి మరో ఇద్దరు బాలురు తీవ్రంగా కష్టపడాల్సి వచ్చింది. కుక్క యజమాని రాజేశ్‌పాల్‌పై భారతీయ న్యాయ సంహిత లోని వివిధ సెక్షన్ల కింద కేసుపెట్టి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కుక్క తన యజమాని చేతి నుంచి విడిపించుకొని ఈ దారుణానికి పాల్పడిందని బాధితుని తాత కామేశ్వర్ రాయ్ తెలిపారు. మనవడి తల వెనుక భాగంలో ఎనిమిది నుంచి పది కుక్కకాట్లు పడ్డాయని తెలిపారు.

ఆపరేషన్ సిందూర్‌లో

కృష్ణుడి సందేశాన్నే అనుసరించాం: రాజ్‌నాథ్



చండీగఢ్: ప్రతీకారంతోనో, అత్యాశతోనో కాకుండా ధర్మ సంస్థాపన కోసం యుద్ధం చేయాలని పాండవులకు శ్రీకృష్ణ పరమాత్ముడు బోధించిన విధంగానే ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టామని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. ధర్మబద్ధమైన మార్గంలో పయనించేవారు ఎప్పుడూ భయపడకూడదని అర్జునుడికి శ్రీకృష్ణుడు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రబోధించడం ద్వారా మాత్రమే కాకుండా చర్యలతో ధర్మాన్ని రక్షించాలని గీతలో చెప్పిందే తాము ఆచరించామని చెప్పారు. కురుక్షేత్ర విశ్వవిద్యాలయం, విదేశీ వ్యవహారాల శాఖల ఆధ్వర్యంలో సోమవారం హరియాణాలోని కురుక్షేత్రలో జరిగిన '10వ అంతర్జాతీయ భగవద్గీత సదస్సు'లో ఆయన ప్రసంగించారు.

మరపురాని రీతిలో బుద్ధి చెప్పాం

"పహల్గాం ఘటన.. శాంతికాముక భారత్‌కు సవాల్ విసిరింది. హుందాతనం మన బలహీనత అని ఉగ్రవాదులు, వారి పోషకులు భావించారు. రణక్షేత్రంలో ధర్మ పరిరక్షణ చేయాలని చెప్పే గీతాసారం మనకు స్ఫూర్తి అని వారు విస్మరించారు. ఆపరేషన్ సిందూర్ అనే ధర్మబద్ధ చర్య ద్వారా మన బలగాలు ఇచ్చిన సమాధానాన్ని ఉగ్రవాదులు ఈరోజుకీ మరిచిపోలేకపోతున్నారు. మనంతట మనం యుద్ధాలు కోరుకోకపోయినా మన జోలికి ఎవరైనా వస్తే తాటతీస్తామే గానీ పారిపోబోమని ప్రపంచానికి చాటాం. ఇది సైనిక చర్య మాత్రమే కాదు.. మన స్వావలంబనకు, ఆత్మగౌరవానికి ప్రతీక" అని మంత్రి వివరించారు. అర్జునుడికి కర్మయోగ గురించి శాశ్వత సందేశాన్ని కురుక్షేత్ర నుంచే కృష్ణుడు ఇచ్చారని, భౌగోళిక సరిహద్దులకు అతీతంగా ఇది అందరికీ వర్తిస్తుందని చెప్పారు. అర్జునుడికి మార్గనిర్దేశం చేయడానికే కాకుండా మానవాళి ఉమ్మడి చైతన్యాన్ని మేల్కొలపడానికి గీతాసారం దోహదపడుతుందని రాజ్‌నాథ్ వివరించారు. నైరాశ్యం నెలకొన్నప్పుడు ఇదొక కాంతిరేఖలా నిలుస్తుందన్నారు.

డిజిటల్ లైంగిక నేరస్థుడికి జీవిత ఖైదు

సియోల్: దక్షిణ కొరియాలో ఆన్‌లైన్‌లో లైంగిక వేధింపులకు, బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడిన 33 ఏళ్ల వ్యక్తికి జిల్లా కోర్టు ఒకటి సోమవారం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. కిమ్ నోక్ వాన్ 2020 ఆగస్టు నుంచి 2025 జనవరి వరకూ ఆన్‌లైన్‌లో బ్లాక్ మెయిల్ ముఠా నడుపుతూ మొత్తం 261 మందిని లైంగికంగా వేధించాడు. వారిలో డజను మందికిపైగా మైనర్ బాలికలపై లైంగిక అత్యాచారం జరిపాడు. అతడి ఆన్ లైన్ ముఠా సభ్యులు 10 మందికి కోర్టు రెండు నుంచి నాలుగేళ్ల జైలు శిక్షలు విధించింది. సామాజిక మాధ్యమాల్లో సెక్స్ పరంగా ప్రలోభపెట్టే పోస్టులు పెట్టే మహిళలు, తమకు తెలిసిన మహిళల చిత్రాలను డిజిటల్ మార్గంలో అసభ్యంగా చిత్రించే ఫొటోలను టెలిగ్రామ్ చాట్‌రూమ్‌లలో ప్రచారంలో పెట్టే పురుషులు కిమ్ బాధితుల జాబితాలో ఉన్నారు. వీరి గుట్టు బయటపెడతానంటూ అతగాడు బ్లాక్ మెయిల్ చేసి తన వలలోకి కొత్తవాళ్లను తీసుకురావాలంటూ ఒత్తిడి చేసేవాడు. వారి డిజిటల్ అసభ్య చిత్రాలను ప్రచారంలో పెట్టేవాడు. వీరిలో మైనర్ బాలికలే ఎక్కువ. కిమ్ అత్యాచారం చేసిన 16 మందిలో 14 మంది మైనర్ బాలికలే. 13 మందితో తన లైంగిక అకృత్యాలను అతడు వీడియో తీశాడు కూడా. ఆ మైనర్లలో కొందరితో ఇతర బాలికలను తన వలలోకి తీసుకొచ్చేట్లు ఒత్తిడి చేశాడు. 70 మంది బాధితులకు చెందిన అసభ్య చిత్రాలు, వీడియోలను ఆన్‌లైన్‌లో పంపిణీ చేశాడు.

ఔషధ గుణాల పుట్టగొడుగు..

హరియాణా రైతుకు లాభాల సాగు



ఈటీవీ భారత్: హరియాణాలోని మోర్నీ ప్రాంతానికి చెందిన ఓ రైతు ఔషధ గుణాలు ఉన్న పుట్టగొడుగుల సాగులో లాభాలు ఆర్జిస్తున్నారు. బడియాల్ గ్రామానికి చెందిన వీరేంద్ర బజ్వాన్.. గనోడెర్మా పుట్టగొడుగును శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. వీటి పెంపకంపై సోలన్‌లోని మష్రూమ్ రీసెర్చ్ డైరెక్టరేట్‌లో వీరేంద్ర శిక్షణ పొందారు. గనోడెర్మా పుట్టగొడుగుకు ఉండే ఔషధ గుణాల వల్ల దీన్ని 'మ్యాజికల్ మష్రూమ్' అని పిలుస్తారు. వీటిని శతాబ్దాలుగా వైద్య చికిత్సల్లో ఉపయోగిస్తున్నారు. ఈ పుట్టగొడుగు నుంచి తయారైన ఉత్పత్తులు షుగర్ నియంత్రణ, క్యాన్సర్, అల్సర్లు, చర్మ వ్యాధులను నియంత్రించడంలో ఉపయోగపడతాయి. 'వీఎండబ్ల్యూ న్యూట్రాస్యూటికల్స్' అనే కంపెనీని స్థాపించిన వీరేంద్ర బజ్వాన్.. గనోడెర్మా, శిటాకే, కార్డిసెప్స్ వంటి హెర్బల్ ఉత్పత్తులను తయారుచేస్తున్నారు. తన ఉత్పత్తులను 28 దేశాలకు ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బజ్వాన్ తెలిపారు. కొన్నిదేశాల్లో ఎగుమతి ప్రక్రియ ప్రారంభమైందని.. మరికొన్నింటిలో లైసెన్స్ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం గనోడెర్మా పౌడర్‌ను కిలో రూ.21,000లకు అమ్ముతున్నట్లు తెలిపారు. ఈ సాగులో మంచి ఫలితాలు సాధించిన వీరేంద్రను 2025 ఆగస్టు 21న హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ సత్కరించారు. హిస్సార్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ప్రగతిశీల రైతు అవార్డును పొందారు. అంతేకాదు పుట్టగొడుగుల ప్రచార కమిటీలో వీరేంద్రను సభ్యుడిగా నియమిస్తూ హరియాణా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీటి పెంపకంపై లక్ష మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చే బాధ్యతను ఆయనకు అప్పగించింది.

అపహరించిన కారుతో ప్రజలపైకి దూసుకెళ్లాడు

- టోక్యోలో ఒకరి మృతి.. 11 మందికి గాయాలు

టోక్యో: అపహరించిన కారుతో ఓ నిందితుడు జన సమూహం పైకి దూసుకెళ్లిన ఘటనలో ఒకరు మృతి చెందారు. మరో 11 మంది గాయపడ్డారు. ఈ ఘటన జపాన్ రాజధాని టోక్యో నగరంలో సోమవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 80 ఏళ్ల వృద్ధుడు ప్రాణాలు కోల్పోయినట్లు టోక్యో మెట్రోపాలిటన్ పోలీస్ విభాగం ప్రతినిధి వెల్లడించారు. పార్కింగ్ స్థలంలో ఉంచిన కారును అపహరించిన నిందితుడు పారిపోతున్న క్రమంలో పలువురిపైకి దూసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన 37 ఏళ్ల వ్యక్తిని అరెస్టు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

పాక్ ఉపఎన్నికల్లో పీఎంఎల్-ఎన్ విజయం!

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో జాతీయ అసెంబ్లీకి చెందిన 13 స్థానాలకు ఆదివారం ఉప ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అధికార పాకిస్థాన్ ముస్లిం లీగ్ - నవాజ్ (పీఎంఎల్-ఎన్) 12 స్థానాల్లో విజయం సాధించినట్లు అనధికార వర్గాలు తెలిపాయి. మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు చెందిన పీటీఐ పార్టీ ప్రతినిధుల్ని అనర్హులుగా ప్రకటించిన నేపథ్యంలో 13 స్థానాలకు ఉపఎన్నికలు జరిగాయి.

దక్షిణాఫ్రికా నుంచి భారత్ చేరుకున్న ప్రధాని

దిల్లీ: జీ20 శిఖరాగ్ర సదస్సు కోసం మూడు రోజుల పర్యటన నిమిత్తం దక్షిణాఫ్రికాకు వెళ్లిన ప్రధాని మోదీ సోమవారం భారత్‌కు చేరుకున్నారు. ఈ సమావేశంలో ప్రపంచ నేతలతో ఫలప్రదమైన చర్చలు జరిగాయని, అనేక దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడతాయని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశాన్ని నిర్వహించిన దక్షిణాఫ్రికా ప్రభుత్వానికి.. ఆ దేశ అధ్యక్షుడు రమఫోసాకు 'ఎక్స్' వేదికగా మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

వచ్చే ఏడాది భారత్‌కు కెనడా ప్రధాని

జొహన్నెస్‌బర్గ్: ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నే వచ్చే ఏడాది భారత్‌లో పర్యటించనున్నారు ఈ విషయాన్ని కెనడా ప్రధాని కార్యాలయం ఆదివారం ధ్రువీకరించింది. దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన జీ-20 శిఖరాగ్ర సదస్సులో మోదీ ఆయన్ను ఆహ్వానించారు.

వివాదాస్పద వ్యాఖ్యలను సమర్థించుకున్న అజిత్ పవార్

ఛత్రపతి సంభాజీనగర్: ఓటేస్తే నిధులిస్తా అంటూ ఇటీవల చేసిన వివాదాస్పద వ్యాఖ్యల్ని మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ సమర్థించుకున్నారు. మహారాష్ట్రలో వచ్చే నెల 2న 246 మున్సిపల్ కౌన్సిళ్లకు, 42 మున్సిపల్ పంచాయత్‌లకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న అజిత్ పవార్.. తమ పార్టీ అభ్యర్థికి ఓటేస్తేనే మాలెగావ్ నగర పంచాయతీకి నిధుల కొరత లేకుండా చూస్తానని పేర్కొన్నారు. తమ పార్టీ అభ్యర్థిని తిరస్కరిస్తే తానూ తిరస్కరిస్తానని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన బహిరంగంగా నిధుల ఆశచూపి ఓటు అడగటంపై విమర్శలొచ్చాయి. దీనిపై సోమవారం పర్భణీ జిల్లాలో జరిగిన మరో సభలో అజిత్ పవార్ స్పందించారు. "మీడియా నన్ను గమనిస్తోంది. నిధుల్ని గురించి నేను చెప్పిన మాటల్ని పరిశీలిస్తోంది. ఏమైనా జరిగితే వారికి వెంటనే అజిత్ పవార్ గుర్తుకొస్తారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించ కూడదని నాకు తెలుసు. పని చేసేవారు పొరపాట్లు చేయడమూ నిజమే. నేను 35 ఏళ్లుగా ఎన్నో ఆరోపణలు ఎదుర్కొన్నాను. అయితే నేను ఎవరికీ ఏమీ రుణపడి లేను'' అని అజిత్ స్పష్టంచేశారు.

స్యాల్‌కు రష్యా వాయుసేన నివాళి

- దుబాయ్ ఎయిర్ షో నుంచి వైదొలిగిన అమెరికా బృందం
- భారత 'వింగ్ కమాండర్' గౌరవార్థం నిర్ణయం

ఇంటర్నెట్ డెస్క్: దుబాయ్ ఎయిర్‌షోలో భారత వాయుసేనకు చెందిన తేజస్ యుద్ధ విమానం కూలిపోయిన దుర్ఘటనలో వింగ్ కమాండర్ నమాంశ్ స్యాల్ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎయిర్‌షోలో ఆయనకు రష్యా వాయుసేనకు చెందిన రష్యన్ నైట్స్ నివాళి అర్పించింది. 'మిస్సింగ్ మ్యాన్ ఫార్మేషన్' విన్యాసం చేసి స్యాల్‌ను గుర్తుచేసుకుంది. ఇది తీరని వేదన అని ఆ దుర్ఘటనపై విచారం వ్యక్తం చేసింది. విధి నిర్వహణలో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయిన వారి గౌరవార్థం ఈ విన్యాసం చేస్తుంటారు. మరోవైపు స్యాల్ దుర్మరణం పాలైనప్పటికీ యుద్ధవిమానాల విన్యాసాలను కొనసాగిస్తున్న దుబాయి ఎయిర్ షో 2025 నిర్వాహకుల తీరుపై అమెరికా ఎయిర్ ఫోర్స్ కెప్టెన్ టైలర్ ఫెమా హియెస్టర్ విమర్శలు కురిపించారు. వింగ్ కమాండర్ స్యాల్ గౌరవార్థం తమ బృందం తుది విన్యాసాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు.

భక్తులను నాటి తితిదే పాలకులు మోసగించారు

● ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఈనాడు, అమరావతి: "తిరుమలలో దేవుడిని నమస్కరించేందుకు మోకరిల్లినప్పుడు మన భక్తిని, విశ్వాసాన్ని వైకాపా హయాంలోని అప్పటి తితిదే బోర్డు పాలకులు, అధికారులు వమ్ము చేశారు. ప్రతి భక్తుడినీ వారు మోసగించారు. మన పవిత్ర విశ్వాసాలను దెబ్బతీశారు" అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు. 2019-24 మధ్య కాలంలో 20 కోట్ల కల్తీ లడ్డూలు తయారు చేసిన వార్తలను సోమవారం 'ఎక్స్'లో ఆయన పోస్టు చేస్తూ ఈ మేరకు స్పందించారు. "వైకాపా పాలనలో తిరుమలను సుమారు 10.97 కోట్ల మంది దర్శించారు. మీ కుటుంబం, పొరుగువారితో సహా మనమందరం తిరుమల వెళ్లాం. రోజూ సగటున 60 వేల మంది భక్తులు తిరుమలకు వెళ్తున్నారు. తిరుమల మనకు కేవలం ఒక ఆలయం మాత్రమే కాదు. మనలో ఉన్న భక్తికి అది ప్రాణం. అంతటి విశ్వాసాన్ని, భక్తిని వారు దెబ్బతీశారు" అని పేర్కొన్నారు.

ధర్మేంద్ర మరణం బాధాకరం

● ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ప్రముఖ నటుడు ధర్మేంద్ర మరణం చాలా బాధాకరమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. 'ధర్మేంద్ర మహానటుడు, మరపురాని నటనతో కోట్ల మంది హృదయాలను గెలుచుకున్నారు. భారతీయ సినీ పరిశ్రమకు ఆయన అందించిన సేవలు తరతరాలకు గుర్తుండిపోతాయి. ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

ధర్మేంద్ర మృతిపై పవన్‌కల్యాణ్ దిగ్భ్రాంతి

ఈనాడు, అమరావతి: "హిందీ చిత్ర పరిశ్రమలో తొలితరం యాక్షన్ హీరోగా సినీ ప్రియులను ఆకట్టుకున్న ధర్మేంద్ర.. యాక్షన్ కింగ్‌గా, హీ మ్యాన్‌గా పేరు పొందారు. ఆయన కన్నుమూశారని తెలిసి చింతించాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను" అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. "షోలే, చుప్కే చుప్కే, ధర్మ్ వీర్, సీతా ఔర్ గీత, యాందోకి బారాత్ వంటి చిత్రాలతో తనదైన నటన శైలిని ధర్మేంద్ర చూపించారు. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి' ' అని పేర్కొన్నారు.

గండికోట నుంచి జలజీవన్ మిషన్‌కు 3.3 టీఎంసీల నీరు

ఈనాడు, అమరావతి: జలజీవన్ మిషన్ కింద రక్షిత నీటి పథకాలకు గండికోట జలాశయం నుంచి 3.378 టీఎంసీల నీటిని వాడుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఒకవేళ ఎప్పుడైనా గండికోట జలాశయానికి నీటి కొరత ఉంటే పంచాయతీరాజ్ రక్షిత నీటి సరఫరా విభాగం ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అవుట్‌ఫాల్ కాలువల పునరుద్ధరణకు రూ.27 కోట్లు

ఈనాడు, అమరావతి: విజయనగరం జిల్లా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం బయట ఉన్న నాలుగు అవుట్‌ఫాల్ కాలువలను పునరుద్ధరించడంతో పాటు వరద నీరు కాలువల్లోకి వెళ్లేలా పనులు చేపట్టనున్నారు. ఇందుకు ప్రభుత్వం రూ.27 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. హడ్కో మంజూరు చేసిన రూ.1,000 కోట్ల రుణం నుంచి ఈ నిధులు ఖర్చు చేయాలని, ఈ పనులను జలవనరులశాఖ చేపట్టేందుకు అనుమతి ఇస్తున్నామని పేర్కొన్నారు.

'జలజీవన్' పనుల్లో ముందడుగు

● గడువులోగా పూర్తి చేసేందుకు యత్నం

ఈనాడు, అమరావతి: జలజీవన్ మిషన్ (జేజేఎం)లో చేపట్టిన ప్రాజెక్టుల పనులు వేగవంతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రూ.4,500 కోట్ల అంచనాలతో రెండోసారి టెండర్లు పిలిచిన ఐదు ప్రాజెక్టుల పనులు 2027 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో అడుగులు వేస్తోంది. నిధుల కొరతను అధిగమించేందుకు జాతీయ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి బ్యాంకు (ఎన్‌ఏబీఎఫ్) నుంచి రూ.10 వేల కోట్ల రుణం తీసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈలోగా పనుల్లో పురోగతి, గడువులోగా పూర్తి చేసేందుకు తీసుకోవలసిన చర్యలు, భూ సేకరణ, పెండింగ్‌లోని ఇతర సాంకేతిక అంశాలపై రెండు రోజుల రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఇంజినీర్లతో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ తాడేపల్లిలో సమీక్ష నిర్వహించారు. తూర్పు, పశ్చిమ గోదావరి, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో నాలుగు ప్రాజెక్టుల పనుల పురోగతిపై చర్చించారు. చిత్తూరు, పులివెందులు, డోన్, ఉద్దానం ప్రాజెక్టులపై మంగళవారం సమీక్షించనున్నారు.

సుపరిపాలనపై ఎమ్మెల్యేలు, ఎంపీలతో కార్యశాల

- ప్రజల్లో సంతృప్తస్థాయి పెంచేందుకు చర్యలు
- ఆర్టీజీఎస్ సమీక్షలో చంద్రబాబు



ఆర్టీజీఎస్‌లో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: సుపరిపాలన అంశంపై వచ్చే నెలలో ఎమ్మెల్యేలు, ఎంపీలతో కార్యశాల నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. అధికారుల్లోనూ పాలనాసామర్థ్యాలు పెరిగేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. సుపరిపాలన ద్వారానే ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరుగుతుందని, క్షేత్రస్థాయిలో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడం ద్వారానే దీన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల అమలు, పౌరసేవలకు సంబంధించి ప్రతి అంశంలోనూ జవాబుదారీతనం కీలకమని, ఈ మేరకు 175 నియోజకవర్గాల్లోనూ సామర్థ్యాల పెంపు జరగాలని నిర్దేశించారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో సోమవారం వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కీలక ఆదేశాలిచ్చారు.

పౌరసేవలను మెరుగ్గా అందించాలి..

● పౌరసేవలను ప్రభుత్వ శాఖలు మరింత మెరుగ్గా అందించాలి. మంత్రులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి వివిధ అంశాలను ప్రజల ముందుంచాలి. ప్రభుత్వ శాఖలు, విభాగాలు సాంకేతికతను అందిపుచ్చుకోవడంతో పాటు సామర్థ్యాలు పెంచుకోవాలి.

● ప్రజల్లో సానుకూలత పెరిగేలా క్షేత్రస్థాయి వరకూ చర్యలు చేపట్టాలి. మొక్కజొన్న, పత్తి, అరటి పంటలకు సంబంధించిన సమస్య పరిష్కరించి రైతులకు ధర దక్కేలా చేస్తున్నాం.

● ఆర్థిక, ఆర్థికేతర అంశాలను దృష్టిలో పెట్టుకుని ప్రాధాన్యక్రమంలో పనులు పూర్తి చేయాలి.

● నిరంతరం డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలి. నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో ప్రజామోదం మేరకే పనులు చేపట్టాలి. గ్రామీణ ప్రాంతాల్లోనూ గ్రామ సభల అనుమతులు లేకుండా పనులు చేపట్టవద్దు. నరేగా పనులకూ ఇదే నిబంధన వర్తిస్తుంది.

అవేర్ యాప్ వినియోగించేలా చూడాలి...

● వాతావరణ హెచ్చరికలు సహా 42 అంశాల్లో నిరంతర సమాచారం కోసం అవేర్ యాప్‌ను ప్రజలు వినియోగించేలా చూడాలి.

● అన్ని ప్రభుత్వ శాఖలూ వాటి సమాచారాన్ని డేటా లేక్‌కు అనుసంధానించాలి. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో బ్యాండ్ విడ్త్ కనెక్టివిటీ పెంచాలి.

● సంక్షేమ వసతిగృహాల్లో తాగునీరు, పరిశుభ్రత తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలి. (దీని కోసం ఓ ప్రత్యేక యాప్‌ను రూపొందించి రోజువారీ తనిఖీలు చేస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.)

● తిరుమలలో తితిదే భక్తులకు అందించే సేవలు, రద్దీ నిర్వహణ, భద్రత తదితర అంశాలను అధ్యయనం చేసి ఇతర దేవాలయాల్లో అమలు చేయాలి.

ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించాలి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వాయు, జల కాలుష్యంతోపాటు పారిశ్రామిక, బయో వ్యర్థాలపై సమగ్రంగా అధ్యయనం జరపాలని నిర్దేశించారు. ఆ ఫలితాల ఆధారంగా రాష్ట్రాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలని కోరారు. కాలుష్య నియంత్రణపై సచివాలయంలో సోమవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాలుష్య నియంత్రణ నిబంధనలు, నియమాలను అతిక్రమించే సంస్థలు, వ్యక్తులకు తొలుత హెచ్చరికలు జారీ చేసి, ఆ తర్వాత వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలిలో ఖాళీల భర్తీకి అవసరమైన సిబ్బందిని ఇవ్వాలని పీసీబీ ఛైర్మన్ కృష్ణయ్య కోరగా.. చంద్రబాబు అందుకు ఆమోదం తెలిపారు. ముఖ్యమంత్రి అధికారులకు జారీ చేసిన ఆదేశాలు ఇవి.

గాలి నాణ్యతను విశ్లేషించి.. అవేర్ 2.0తో అనుసంధానించాలి

● అన్ని కోణాల్లో గాలి నాణ్యతను విశ్లేషించాలి. ఈ వ్యవస్థ పర్యవేక్షణ కోసం అధునాతన సాంకేతికతను వినియోగించాలి. ఆ డేటాను అవేర్ 2.0కు అనుసంధానించాలి.

● స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను దృష్టిలో పెట్టుకుని పరిశ్రమలకు అనుమతులిచ్చే విషయంలో అవసరమైన మార్పులు తీసుకురావాలి. మైనింగ్ కాలుష్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి.

● రెడ్‌జోన్ పరిధిలోని పరిశ్రమలకు 12 రోజులు, ఆరెంజ్ జోన్ పరిధిలోని పరిశ్రమలకు 10 రోజులు, గ్రీన్‌జోన్‌లోని పరిశ్రమలకు 3 రోజుల్లోగా అవసరమైన అనుమతులు ఇవ్వాలి.

● నీటి శుద్ధి ప్లాంట్లు అన్నింటినీ త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి. కాలుష్య నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి.

● సూక్ష్మసేద్యంలో భాగంగా పంట పొలాల్లో ప్లాస్టిక్ షీట్ల వినియోగం వల్ల దీర్ఘకాలంలో ఇబ్బందులు తలెత్తే ప్రమాదముంది. అందుకే బయోషీట్లు వాడేలా రైతులకు అవగాహన కల్పించాలి.

● కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై శిక్షణను ఇచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయండి.

48 గంటల్లో బయో వ్యర్థాలను తరలించాలి

* గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. వివిధ వ్యర్థాలను సర్క్యులర్ ఎకానమీ పాలసీకి అనుసంధానించాలి.

* రాష్ట్రంలో 15,526 హెల్త్‌కేర్ ఫెసిలిటీస్ ఉన్నాయి. వాటి నుంచి వెలువడే బయో వ్యర్థాలను 48 గంటల్లోగా తరలించేలా చర్యలు తీసుకోవాలి. వీటి పర్యవేక్షణకు టెక్నాలజీ, సీసీ కెమెరాలు వినియోగించాలి.

ఇది యావత్ దేశం గర్వించే క్షణం

● భారత మహిళా కబడ్డీ జట్టుకు చంద్రబాబు అభినందనలు

ఈనాడు, అమరావతి: భారత మహిళల కబడ్డీ జట్టు.. ప్రపంచ కప్ విజేతగా నిలవడంపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. జట్టు సభ్యులకు 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలిపారు. "ఇది యావత్ దేశం గర్వించే క్షణం. భారతమాత ముద్దుబిడ్డల శక్తి, సంకల్పం, అపార పట్టుదలకు ఈ విజయం గుర్తు" అని చంద్రబాబు కొనియాడారు.

● మరో పోస్టులో విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్.. భారత మహిళా కబడ్డీ జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు.

పోలవరం- నల్లమలసాగర్ ప్రాజెక్టు డీపీఆర్ తయారీకి టెండర్లు

ఈనాడు, అమరావతి: పోలవరం నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు (పీఎన్‌ఎల్‌పీ) డీపీఆర్ తయారీకి రూ.9.10 కోట్లతో జలవనరులశాఖ టెండర్లు పిలిచింది. ఈ నెల 27 నుంచి ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆన్‌లైన్‌లో టెండరు దరఖాస్తులు దాఖలు చేయాల్సి ఉంటుంది. డిసెంబరు 11 సాయంత్రం 4 గంటల వరకు టెండరు షెడ్యూల్స్ అనుమతిస్తారు. అదేరోజు సాయంత్రం 5 గంటలకు సాంకేతిక బిడ్ తెరుస్తారు. డిసెంబరు 17న ప్రైస్ బిడ్ తెరిచి గుత్తేదారును ఎంపిక చేస్తారు. ఈ మేరకు గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు వెంకటరత్నం టెండర్ నోటీసు జారీ చేశారు.

పరిశ్రమలతోనే కాదు.. ఉద్యాన సాగుతోనూ ఆదాయమే

- రాయలసీమ రైతులు ఆ సంగతిని నిరూపించాలి
- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్
- సీమ అభివృద్ధి ప్రణాళికలపై అధికారులతో సమీక్ష



ఈనాడు, అమరావతి: "రాయలసీమ రైతులకు మరింత ఆదాయం పెరగాలంటే ఉద్యాన పంటల సాగును మరింత విస్తృతం చేయాలి. సీమలో మరింత అభివృద్ధి జరిగేందుకు అవసరమైన అన్ని వనరులూ ఉన్నాయి. ఇప్పటికే అనేక పరిశ్రమలు, కంపెనీలను ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయిస్తోంది. దీనికి తోడు పండ్ల ఎగుమతుల ద్వారా చక్కని ఆదాయం పొందొచ్చు" అని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. సోమవారం ఆయన రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక, ఇతర శాఖల అధికారులతో సమావేశమయ్యారు. రాయలసీమ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్, కార్యదర్శి రోనాల్డ్ రోస్, జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి కేశవ్ ఏమన్నారంటే..

● తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలను ఆనుకుని రాయలసీమ ఉంది. ఇది ఎంతో అనుకూలాంశం. ఉద్యాన పంటల ఉత్పత్తులను ఆయా రాష్ట్రాలకు ఎగుమతి చేయవచ్చు. కొన్ని ఉద్యాన పంటలకు విదేశాల్లో ఎంతో డిమాండ్ ఉంది. ఆ పంటల సాగు చేపట్టడం వల్ల విదేశాలకు ఎగుమతి చేస్తే మంచి ఫలితాలు వస్తాయి.

● ఉద్యాన పంటల సమాచారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇప్పటికే సీమలో గతంలో ఎన్నడూ లేని స్థాయిలో సాగునీటిని అందిస్తున్నాం. ఆ నీటిని సద్వినియోగం చేసుకుని పంటలే కాదు పండ్లతోటల పెంపకం చేపట్టాలి. అధికారులు సైతం ఈ విషయంలో అక్కడి రైతులకు అవగాహన కల్పించాలి.

● కియా పరిశ్రమ వల్ల ఉమ్మడి అనంతపురం జిల్లాలో జీఎస్‌డీపీ పెరిగింది. పరిశ్రమల వల్లే కాదు.. ఉద్యాన పంటల ద్వారా కూడా ఆదాయం సృష్టించవచ్చని రాయలసీమ రైతులు నిరూపించాలి.

● రైతులకు ఆదాయం పెరిగితే రాష్ట్రానికి ఆదాయం పెరుగుతుంది.

● కోనసీమలో వరి సాగు చేసే రైతుల కన్నా రాయలసీమలో ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ఆదాయం ఎక్కువ వస్తోంది. రెండు ఎకరాల్లో పండ్లతోటలు సాగు చేసి రూ.కోట్లలో ఆదాయం పొందిన వారూ ఉన్నారు. రూ.లక్షల్లో ఆదాయం పొందిన రైతులూ ఉన్నారు. ఆర్గానిక్ పంటలతో రాబడి ఎంతో బాగుంది.

రైతుల కష్టాలపై జగన్‌ది మొసలి కన్నీరు

● జగన్‌పై తెదేపా ఎంపీ అప్పలనాయుడు ధ్వజం



ఈనాడు, దిల్లీ: అధికారంలో ఉన్నప్పుడు రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేసిన మాజీ సీఎం జగన్.. ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. ఆయన సోమవారం ఇక్కడ ఏపీ భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. 'ఇప్పుడు రైతుల గురించి మాట్లాడుతున్న జగన్.. తన పాలనలో వారికి చేసిన మంచి ఏంటో చెప్పాలి. ఆయన ఐదేళ్లలో రైతులు ఇబ్బందులు పడ్డా కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం 18 నెలల్లో అన్నదాతా సుఖీభవ పథకం కింద రెండు విడతల్లో రూ.14 వేలు ఇచ్చింది. త్వరలో మూడో విడత రూ.6 వేలు కూడా విడుదల చేసి రైతులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటుంది' అని స్పష్టం చేశారు. జగన్ తన స్వప్రయోజనాల కోసం రప్పారప్పా ర్యాలీలు నిర్వహిస్తూ ప్రజలను, వ్యవస్థలను భయభ్రాంతులకు గురిచేయాలని కుట్ర పన్నుతున్నారని ఎంపీ విమర్శించారు.

ఇంధన పరిరక్షణ అవార్డులకు ఎస్‌ఈసీఎం దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ప్రధాన ఇంధన వినియోగ రంగాలైన పరిశ్రమలు, విద్యా సంస్థలు, పట్టణ- స్థానిక సంస్థలు 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ అవార్డులు-2025' పోటీల్లో పాల్గొనాలని ఏపీ జెన్‌కో ఎండీ, రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్‌ఈసీఎం) సీఈవో ఎస్.నాగలక్ష్మి కోరారు. రాష్ట్ర ఇంధన శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏపీఎస్‌ఈసీఎం వరుసగా ఐదో ఏడాది నిర్వహిస్తున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. "రాష్ట్రంలో ప్రధాన ఇంధన వినియోగ రంగాల మధ్య ఆరోగ్యకర పోటీ నిర్వహించి, ఇంధన నిర్వహణ, ఆధునిక సాంకేతికతల వినియోగం, కర్బన ఉద్గారాల తగ్గింపు వంటి అంశాల్లో పురోగతి సాధించిన సంస్థలను గుర్తించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఈ పోటీల ద్వారా పరిశ్రమలు, సంస్థలను ఆధునిక ఇంధన పొదుపు విధానాలు అనుసరించేలా ప్రోత్సహిస్తున్నాం. ఏడాదికి 30 వేల ఎంటీవోఈ పైగా ఇంధన వినియోగం ఉన్న థర్మల్ ప్లాంట్లు, సిమెంట్ పరిశ్రమలు. . వెయ్యి ఎంటీవోఈ పైగా వినియోగం ఉన్న ఫార్మా పరిశ్రమలు.. 50 కిలోవాట్లు అంతకంటే ఎక్కువ కనెక్టెడ్ లోడ్ ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు, హోటళ్లు పోటీల్లో పాల్గొనవచ్చు. ఆర్టీసీ బస్సు డిపోలు, బస్టాండ్లు, పట్టణ- స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు కూడా పోటీ పడొచ్చు. అర్హత ఉన్న సంస్థలు ఎస్‌ఈసీఎం-2025కు సంబంధించిన దరఖాస్తులను డిసెంబర్ 5లోగా అధికారిక ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా సమర్పించాలి" అని సూచించారు.

వక్ఫ్ ఆస్తుల నమోదు గడువును పొడిగించండి

కేంద్ర మంత్రికి సీఎం చంద్రబాబు లేఖ

ఈనాడు, అమరావతి: ఉమ్మీద్ పోర్టల్‌లో వక్ఫ్ ఆస్తుల వివరాల నమోదు గడువు పొడిగించాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుకి ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ రాశారు. రాష్ట్రంలో 4,748 రిజిస్టర్డ్, మరో 10 వేలు రిజిస్టర్ కానీ వక్ఫ్ ఆస్తులున్నాయన్నారు. ఇప్పటివరకు 3,100 వక్ఫ్ ఆస్తుల వివరాలు పోర్టల్‌లో నమోదు చేశామని, సాంకేతిక కారణాల వల్ల మిగతా వాటి నమోదులో జాప్యం నెలకొందని కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. తుది గడువు డిసెంబరు 5తో ముగుస్తుండటంతో ముస్లిం సమాజంలో ఆందోళన నెలకొందన్నారు. పోర్టల్‌లో అప్‌లోడ్ గడువును మరో 12 నెలలు పొడిగించాలని కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు లేఖ రాయడం పట్ల మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఫరూక్, ఆ శాఖ సలహాదారు ఎంఏ షరీఫ్, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, పలు ముస్లిం సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

పేదల ఇళ్ల స్థలాలపై వైకాపా నేత కన్ను

● తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్ని స్థానిక వైకాపా నేత ఆక్రమించి, తన బంధువుల పేరు మీదకు మార్చుకున్నాడని బాపట్ల జిల్లా మార్టూరు మండలం డేగలమూడికి చెందిన జాగర్లమూడి సాంబయ్య ఆరోపించారు. ఈ మేరకు మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీ అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. చెరువు కంఠం భూమిని ఆక్రమించిన వైకాపా నాయకులు.. తమ ఇంటికి దారి లేకుండా చేశారని కృష్ణా జిల్లా నాగాయలంక మండలానికి చెందిన పోతురాజు వాపోయారు. తన భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కడప జిల్లా పులివెందులకు చెందిన పూల ప్రసాద్ ఫిర్యాదు చేశారు.

సదరం సేవలకు డబ్బుల వసూళ్లు

● స్లాట్లు బదిలీచేస్తామంటూ మోసం

● దళారులను నమ్మొద్దని ప్రభుత్వం సూచన

ఈనాడు, అమరావతి: వైకల్య ధ్రువపత్రాల జారీకి నిర్దేశించిన సదరం శిబిరాల సేవలు ఉచితమని ప్రభుత్వం ప్రకటిస్తే.. కొందరు దళారులు సదరం స్లాట్ బుకింగ్, ట్రాన్స్‌ఫర్ కోసం దివ్యాంగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇతర జిల్లాల్లో స్లాట్ బుక్ చేసి, తర్వాత సొంత జిల్లాకు బదిలీ చేస్తామని రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు డిమాండ్ చేస్తూ దివ్యాంగులను మోసగిస్తున్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి రావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. 'స్లాట్ బుకింగ్, ట్రాన్స్‌ఫర్ కోసం దళారుల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దు. దళారులు/మధ్యవర్తుల ద్వారా బుక్ చేసినా, వారికి డబ్బులు ఇచ్చినా. మీ స్లాట్ బదిలీ జరగదు. అలాంటి వాటిని రద్దుచేస్తాం" అని ప్రభుత్వం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దివ్యాంగులు అప్రమత్తంగా ఉండాలని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించింది. ఎవరైనా మోసపుచ్చే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించింది.

రెండు రోజుల్లో అన్ని పూర్తైపోయాయ్

రాష్ట్రంలో 118 ఆసుపత్రుల్లో వైకల్య నిర్ధారణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా 31,500 స్లాట్లు విడుదల చేస్తే అన్ని స్లాట్లు రెండు రోజుల్లోనే బుక్ అయ్యాయి. ఈ క్రమంలోనే అవకతవకలు చోటుచేసుకుంటున్నాయనే వాదన వినిపిస్తోంది. ఈ ప్రక్రియ సవ్యంగా సాగిందా? లేదంటే దళారుల జోక్యం ఏమైనా ఉందా? అనే కోణంలో ప్రభుత్వం ఆరా తీస్తోంది. వాస్తవానికి సదరం స్లాట్ బదిలీ కోరుకునే దివ్యాంగులు పీజీఆర్ఎస్ పోర్టల్‌లో రిక్వెస్ట్ పెట్టుకోవాలి. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో జరిగే గ్రీవెన్స్‌లో, డీసీహెచ్ఎస్ కార్యాలయంలోనూ లిఖిత పూర్వక అభ్యర్థన ఇవ్వొచ్చు. ప్రస్తుతం స్లాట్ బుక్ అయిన ఆసుపత్రి అధికారిక మెయిల్ ద్వారా రిక్వెస్ట్ పెట్టుకోవచ్చు. వీటిలో ఏదో ఒక విధంగా అభ్యర్థన పెట్టుకుంటే దివ్యాంగులు కోరిన ఆసుపత్రికి స్లాట్ ట్రాన్స్‌ఫర్ ఉచితంగా జరుగుతుందని అధికారులు వెల్లడించారు.

ఆరోగ్యాంధ్ర సాకారానికి సమగ్ర కార్యాచరణ

● 10 మంది అంతర్జాతీయ స్థాయి నిపుణులతో కమిటీ

● సీఎం అధ్యక్షతన డిసెంబర్‌లో తొలి సమావేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా.. 2047 నాటికి 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' సాధన దిశగా ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ చేపట్టింది. ఈ క్రమంలో 10 మంది అంతర్జాతీయ స్థాయి నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి సలహా మండలిని ఏర్పాటు చేసింది. ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న విధానాలు, అనుభవాలు, అందుబాటులో ఉన్న సాంకేతిక నైపుణ్యం, వ్యూహాలతో రాష్ట్రాన్ని ఆరోగ్య రంగంలో అగ్రస్థాయిలో నిలిపేందుకు ఈ నిపుణుల సలహా మండలి చేపట్టాల్సిన బాధ్యతలను ప్రభుత్వం పేర్కొంది. డిసెంబర్‌లో ఈ కమిటీ తొలి సమావేశం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరగనుంది.

సలహా మండలి సభ్యులు వీరే..

1. పీటర్ పియాట్, వ్యవస్థాపక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, యూఎన్ ఎయిడ్స్ సంస్థ
2. డాక్టర్ సౌమ్య స్వామినాథన్, మాజీ ప్రధాన శాస్త్రవేత్త, డబ్ల్యూహెచ్‌వో
3. ప్రొఫెసర్ ఇక్ ఇంగ్ టేవ్, పబ్లిక్ హెల్త్ డీన్, సింగపూర్ విశ్వవిద్యాలయం
4. డాక్టర్ గగన్‌దీప్ కాంగ్, డైరెక్టర్, బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్
5. డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి, ఛైర్మన్, ఏఐజీ హాస్పిటల్, హైదరాబాద్
6. మార్గరెట్ ఎలిజబెత్ క్రుక్, ప్రొఫెసర్, హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్
7. డాక్టర్ నిఖిల్ టాండన్, ప్రొఫెసర్, ఎయిమ్స్ దిల్లీ
8. రిజ్వాన్ కొయిటా, ఛైర్మన్, నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ (ఎన్ఏబీహెచ్)
9. శ్రీకాంత్ నాదముని, ఖోస్లా ల్యాబ్స్ వ్యవస్థాపకులు
10 ఆర్తి అహుజా, కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి

సలహా మండలికి నిర్దేశించిన లక్ష్యాలు ఇవీ..

● స్వర్ణాంధ్ర విజన్-2047కు అనుగుణంగా రాష్ట్ర ప్రజలకు పూర్తి ఆరోగ్యం, ఆహ్లాదం కల్పించేలా సమగ్ర ప్రణాళిక రూపకల్పన

● మాతాశిశు ఆరోగ్య పరిరక్షణ, అసాంక్రమిక వ్యాధుల నిర్మూలనకు సృజనాత్మకతతో కూడిన ఆలోచనలు, విస్తృత స్థాయిలో అమలు చేయదగ్గ మార్గాలను సూచించడం

● ఆరోగ్య పథకాలను సాంకేతికత ఆధారంగా సమర్థంగా అమలుచేయడానికి చర్యలు

● రాష్ట్రాన్ని గ్లోబల్ హెల్త్ హబ్‌గా మార్చడం.

పొరుగు సేవల ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

● ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్

ఈనాడు, అమరావతి: ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినందున అందులో పనిచేస్తున్న సుమారు 8 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు కోరారు. గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రస్థాయి సమావేశం సోమవారం జరిగింది. దామోదరరావు మాట్లాడుతూ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్, డేటా ఎంట్రీ ఇతర విభాగాల్లో ఉద్యోగులకు చెల్లించే జీతాలే అన్ని కేటగిరీల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకూ చెల్లించాలన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ఆర్టీసీలో కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు యాజమాన్యం ద్వారా నేరుగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులందరికీ ఏకరూప దుస్తులు 21అందించాలని, పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి, ఈయూ ప్రధాన కార్యదర్శి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

● ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా ఎల్.నాగసుబ్బారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడిగా టి.ముత్యాలరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వేముల బాజీ, ప్రధాన కార్యదర్శిగా గంగాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా సుధీర్, కోశాధికారిగా కుమార్‌నాయక్, సంయుక్త కార్యదర్శిగా మధుసూదన్, ప్రచార కార్యదర్శిగా ప్రసాద్‌కుమార్ ఎన్నికయ్యారు.

2029లో పులివెందులలోనూ వైకాపా ఓటమి ఖాయం

● గ్రంథాలయ పరిషత్తు ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

ఈనాడు, అమరావతి: సమాజం తలదించుకునేలా వైకాపా నేతల భాష ఉందని ఏపీ గ్రంథాలయ పరిషత్తు ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ధ్వజమెత్తారు. వారి తీరు, ఆ పార్టీ అధినేత జగన్ వైఖరి ఇలాగే కొనసాగితే 2029 ఎన్నికల్లో పులివెందులలో కూడా వైకాపా ఓటమి ఖాయమని పేర్కొన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వివిధ ఆర్థిక నేరాల్లో ఏ1గా ఉన్న జగన్ వాటి నుంచి తప్పించుకోవడానికే విచారణకు హాజరుకాకుండా జాప్యం చేస్తున్నారని విమర్శించారు.

ఉయ్యాలవాడ త్యాగస్ఫూర్తి చిరస్మరణీయం: జగన్

ఈనాడు, అమరావతి: ఆంగ్లేయులపై తొలి తిరుగుబాటు జెండా ఎగురవేసి, బ్రిటిష్ వ్యతిరేక పోరాటానికి నాంది పలికిన స్వాతంత్ర్య సమరయోధుడు.. మన తెలుగు వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని వైకాపా అధ్యక్షుడు జగన్ తెలిపారు. 'ఉయ్యాలవాడ ధైర్య సాహసాలు, త్యాగస్ఫూర్తి చిరస్మరణీయం. అలాంటి మహావీరుడి పేరు స్మరించుకుంటూ కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టుకోవడం మనందరికీ గర్వకారణం. ఆ మహనీయుడి జయంతి సందర్భంగా నివాళులు' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టాలి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ సూర్యకాంత్‌కు వైకాపా అధ్యక్షుడు జగన్ శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టేలా ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని కాంక్షిస్తున్నట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తుల గ్రాట్యుటీ పరిమితి పెంపు

ఈనాడు, అమరావతి: కేంద్ర న్యాయశాఖ లేఖకు అనుగుణంగా హైకోర్టు న్యాయమూర్తులకు గ్రాట్యుటీ పరిమితిని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఫరూక్ తెలిపారు. 2024 జనవరి 1 నుంచి గ్రాట్యుటీ మొత్తాన్ని రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచినట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సాయిప్రసాద్

ఈనాడు, అమరావతి: రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా జి.సాయిప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయనకు ఇప్పుడు రెవెన్యూ శాఖ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. సీసీఎల్ఏ జి.జయలక్ష్మి ఇప్పటి వరకు రెవెన్యూ ఇన్‌ఛార్జి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

కడపలోని అవినీతి అధికారులను సస్పెండ్ చేయాలి

● రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ ధర్నా

ఈనాడు, అమరావతి: కడప బీసీ సంక్షేమశాఖ అవినీతి అధికారులను సస్పెండ్ చేయాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్(ఆర్ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌నాయుడు డిమాండ్ చేశారు. విజయవాడలోని బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ కార్యాలయం ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్కడి అధికారుల అవినీతిపై నివేదిక అంది నెల రోజులు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమేంటని ప్రశ్నించారు. వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేదంటే అమరావతిలో నిరవధిక దీక్షలకు దిగుతామని హెచ్చరించారు.

మందు మంచిదో కాదో... తేల్చేదెట్లా?

- పట్టాలెక్కని ప్రయోగశాలలు
- 2017 నుంచి నిర్మాణంలోనే ఔషధ నియంత్రణ ల్యాబ్
- ప్రాంతీయ ల్యాబ్‌లు పూర్తయినా ప్రారంభంలో జాప్యం
- సిబ్బంది, పరికరాలు సమకూరితేనే నిర్దేశిత పరీక్షలకు వీలు



విశాఖపట్నంలో ప్రారంభానికి నోచుకోని ప్రాంతీయ ప్రయోగశాల

ఈనాడు, అమరావతి: ప్రజలకు నాణ్యమైన ఔషధాలు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అడ్డంకులు తొలగడం లేదు. నాసిరకం మందుల విక్రయాలను అడ్డుకోవడానికి.. ఔషధ నియంత్రణ విభాగం తనిఖీలు చేసి నమూనాలు సేకరిస్తోంది. ఆ నమూనాలను పరీక్షించేందుకు అవసరమైనన్ని ప్రయోగశాలలు అందుబాటులో లేకపోవడం సమస్యగా మారింది. దీంతో వైద్యశాలలు, ప్రజలకు వెళ్తున్న ఔషధాల నాణ్యత గుర్తింపు ప్రహసనంగా మారింది.

చొరవ చూపితే ఫలాలు

సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీం(సీఎస్‌ఎస్) కింద కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు.. ఔషధ నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయి. అందులోభాగంగా 60:40 నిష్పత్తిలో నిధులు సమకూర్చి ఔషధ నియంత్రణ పాలన విభాగాలు, ప్రయోగశాలలను ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం. ఔషధ నియంత్రణ రాష్ట్ర పాలన విభాగం- రాష్ట్ర ప్రయోగశాల నిర్మాణం మినహా.. విశాఖపట్నం, కర్నూలు ప్రాంతీయ ల్యాబ్‌లతోపాటు మరో 11 డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాల నిర్మాణం పూర్తయ్యింది. వీటి ప్రారంభానికి మీనమేషాలు లెక్కిస్తున్నారు.

ఎన్నాళ్లకు.. ఇంకెన్నేళ్లకు?

రాష్ట్రంలో 50 వేల ప్రైవేటు మందుల దుకాణాలు ఉన్నాయి. ప్రస్తుతం చేస్తున్న పరీక్షల్లో ఒకటిరెండు శాతం ఔషధాల్లో నాణ్యత లోపం వెలుగు చూస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వసతులు అందుబాటులోకి వస్తే మరింత నిశితంగా పరిశీలించి.. ప్రజలకు నాణ్యమైన మందులను అందించవచ్చు.



విజయవాడలో నిర్మాణం పూర్తికాని ఔషధ నియంత్రణ ల్యాబ్

◆ రాష్ట్ర ఔషధ నియంత్రణ పరిపాలన విభాగం, రాష్ట్రస్థాయి ల్యాబ్.. విజయవాడలోని జీజీహెచ్ ప్రాంగణంలో అరకొర వసతుల మధ్య నడుస్తున్నాయి. పాత జీజీహెచ్ దగ్గర ఆధునాతన వసతులతో రాష్ట్రస్థాయి ల్యాబ్ ఏర్పాటుకు భవనాల నిర్మాణం 2017 నుంచి సాగుతూనే ఉంది. వైకాపా సర్కారు దీన్ని పూర్తిగా పక్కన పెట్టేసింది. కూటమి ప్రభుత్వం కొలిక్కి తెస్తుందనే ఆశతో ప్రజలు ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రస్థాయి ల్యాబ్‌లో నెలకు 350 నుంచి 400 పరీక్షలే జరుగుతున్నాయి. మాత్రలు, సిరప్‌ల లాంటి వాటినే ఇక్కడ పరీక్షిస్తున్నారు. ఇంజక్షన్ల నాణ్యత పరీక్షలకు కోల్‌కతాలోని ల్యాబ్‌కు ఆధారపడాల్సి వస్తోంది. ఇక్కడే రూ.6 కోట్లతో మైక్రోబయాలజీ ల్యాబ్ ఏర్పాటుచేస్తే నమూనాలను కోల్‌కతాకు పంపాల్సిన అవసరం ఉండదు. సుమారు రూ.12 కోట్లు వెచ్చించి రాష్ట్రస్థాయి ల్యాబ్ నిర్మాణం పూర్తిచేసి, మౌలిక సదుపాయాలు, యంత్ర పరికరాలు, సిబ్బందిని సమకూరిస్తే ఇప్పుడు జరుగుతున్న పరీక్షల సంఖ్య 10 రెట్లు పెరిగే అవకాశం ఉంది.

◆ విశాఖపట్నం, కర్నూలులో రీజినల్ ల్యాబ్‌ల నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభంలో జాప్యం చోటుచేసుకుంటోంది. విశాఖలో డ్రగ్ కంట్రోల్ జేడీ కార్యాలయం, ప్రాంతీయ ల్యాబ్‌లను రూ.1.54 కోట్లతో నిర్మించారు. కర్నూలులో డీడీ కార్యాలయంతో పాటు, రీజినల్ ల్యాబ్‌ను రూ.99.18 లక్షలతో నెలకొల్పారు. ఈ రెండు ల్యాబ్‌లూ అందుబాటులోకి వస్తే ప్రతినెలా 3 వేల పరీక్షలు చేయొచ్చు.

◆ శ్రీకాకుళం, అమలాపురం, నరసరావుపేట, ఒంగోలు, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, మదనపల్లె, కావలి తదితర చోట్ల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల కార్యాలయాల నిర్మాణం పూర్తయినా ప్రారంభించలేదు. దీంతో ప్రతినెలా రూ.లక్షల్లో అద్దెల భారం పడుతోంది.

◆ ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(ఏపీఎంఎస్‌ఐడీసీ) ప్రభుత్వ ఆసుపత్రులకు పంపిణీ చేసే మందుల నమూనాల నాణ్యత నిర్ధారణ పరీక్షలకు రూ.కోట్లు వెచ్చించి హైదరాబాద్, కోల్‌కతా, బెంగళూరు, పుణె, ముంబయి ల్యాబ్‌లకు పంపుతున్నారు. రాష్ట్రస్థాయి ల్యాబ్‌లో అన్ని హంగులూ సమకూరిస్తే స్థానికంగా పరీక్షలు వీలవుతుంది. సమయం, నిధులు ఆదా అవుతాయి.

రాష్ట్రవ్యాప్తంగా 4,018 ఛార్జింగ్ కేంద్రాలు

- రూ.385.57 కోట్లతో ప్రాజెక్టులు
- 'పీఎం ఈ డ్రైవ్' కింద ప్రతిపాదన

డిస్కంలు ప్రతిపాదించిన ఛార్జింగ్ కేంద్రాలు	
ద్విచక్ర/ఆటోలు	2,371
కార్లు	1,512
విద్యుత్ బస్సులు/ట్రక్‌లు	135

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ వాహనాలకు భారీ ఎత్తున ప్రోత్సహించే క్రమంలో భాగంగా ఛార్జింగ్ నెట్‌వర్క్, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద విద్యుత్ బైక్‌లు, ఆటోలు, కార్లు, బస్సుల కోసం 4,018 ఛార్జింగ్ కేంద్రాలు అందుబాటులోకి తెచ్చేందుకు రూ.385.57 కోట్లతో ప్రాజెక్టును రూపొందించారు. దీని కింద ఏపీఈపీడీసీఎల్ పరిధిలో 628, ఏపీసీపీడీసీఎల్ పరిధిలో 165, ఎస్‌పీడీసీఎల్ పరిధిలో 209 లొకేషన్లను గుర్తించింది. ప్రధాన పట్టణాలు, జాతీయ రహదారులను అనుసంధానంగా ఉన్న ప్రాంతాలను ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించింది. ఈ మేరకు కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు వెళ్లాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ బాధ్యతలను నెడ్‌క్యాప్ నిర్వహిస్తుంది. ఈవీ పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్ల (ఈవీ పీసీఎస్) మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడంలో డిస్కంలు ఏజెన్సీలుగా వ్యవహరిస్తాయి. పీఎం పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద దేశవ్యాప్తంగా విద్యుత్ ఛార్జింగ్ కేంద్రాల కోసం కొనుగోలు చేసే పరికరాలపై రాయితీలు ఇచ్చేందుకు రూ.2 వేల కోట్లు, వాహనానికి ఛార్జింగ్ కోసం ప్లగ్ ఇన్ చేసేందుకు అవసరమైన ఈవీ సప్లై ఎక్విప్‌మెంట్ (ఈవీఎస్‌ఈ)కు కేంద్రం పలు రాయితీలు నిర్దేశించింది.

ఛార్జింగ్ కేంద్రాలకు కేంద్రం ఇచ్చే సబ్సిడీ వివరాలు			
కేటగిరీ	లొకేషన్‌లు	మౌలిక సదుపాయాలపై సబ్సిడీ(%)	ఈవీఎస్‌ఈపై రాయితీ(%)
ఎ	రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వ ఆవరణలో	100	100
బి	సొంత భూమిలో ఏర్పాటు చేసి.. ప్రభుత్వ/పీఎస్‌యూ నిర్వహిస్తే	80	70
సి	పై రెండు కేటగిరీలు కాని ప్రాంతాల్లో	80	--
డి	బీఎస్‌ఎస్.. బీసీఎస్‌లకు	80	---

వాహనానికి ఛార్జింగ్ కోసం ప్లగ్ ఇన్ చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు

ఈవీ ఛార్జింగ్ కనెక్టర్ ప్రమాణాలు

విభాగం	ఛార్జర్ సామర్థ్యం (కిలోవాట్లు)
ద్విచక్ర/ఆటోలు	12
కార్లు/బస్‌లు/ట్రక్‌లు	డీసీ 50 నుంచి 250
ఈ-బస్‌లు/ఈ-ట్రక్‌లు:	డీసీ హై పవర్ 250 నుంచి 500

★ ఈ-బస్‌లు/ఈ-ట్రక్‌లకు ఫాస్ట్ ఛార్జింగ్ కోసం ఛార్జింగ్ గన్ కనీసం 120 కిలోవాట్లు ఉండాలి.

◆ డిస్కంలు ఈవీ ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే వాటిని ఛార్జ్ పాయింట్ ఆపరేటర్ల (సీపీవో) ద్వారా నిర్వహించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. సీపీవోలు ఛార్జింగ్ సేవలు వినియోగించుకున్న వారి నుంచి యూనిట్‌కు రూ.15 చొప్పున వసూలు చేస్తారు. అందులో కొంత మొత్తాన్ని డిస్కంలకు చెల్లించాలి. ఈ ప్రక్రియ టెండరు ద్వారా నిర్వహించనున్నారు.

పట్టణాల ఎంపికకు ప్రమాణాలు

పట్టణాలు, జాతీయ రహదారుల వెంట వాహనాలు నిలిపేందుకు అనువైన ప్రాంతాల్లోనే ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని కేంద్రం సూచించింది.
◆ 2011 జనాభా లెక్కల ఆధారంగా 10 లక్షలకు పైగా జనాభా ఉండాలి.
◆ స్మార్ట్ సిటీల కింద ఇప్పటికే కేంద్రం గుర్తింపు ◆ రాష్ట్ర రాజధాని నగరం
◆ జాతీయ శుద్ధ గాలి పథకం (ఎన్‌సీఏపీ) కింద ఎంపికైన పట్టణాలు
◆ వాటితోపాటు అర్హత కలిగిన సంస్థలు వాటి అవసరాలకు అనుగుణంగా ఇతర నగరాల్లో ఈవీ పీసీఎస్ ఏర్పాటు చేయొచ్చు.

జాతీయ రహదారుల వెంట..: రాష్ట్ర, అంతర్రాష్ట్ర రహదారుల వెంట ఈవీ కేంద్రాలు ఏర్పాటుకూ కేంద్రం అనుమతిస్తుంది. టోల్‌గేట్‌లోని వాహనాల సంఖ్య ఆధారంగా ఎక్కువ రద్దీ ఉండే రహదారులు, పెద్ద నగరాలు, పారిశ్రామిక హబ్‌లు, పోర్టులకు అనుసంధానంగా ఉన్న హైవేలపై ఏర్పాటు చేయొచ్చు.

త్వరలో అమెరికా ఉపగ్రహాన్ని ప్రయోగించనున్న ఇస్రో

- భవిష్యత్తులో అన్ని రైళ్లలో రియల్‌టైమ్ పర్యవేక్షణ
- 'ఇరిసెట్' 68వ వార్షికోత్సవంలో ఇస్రో ఛైర్మన్ డా.వి.నారాయణన్



జ్యోతి వెలిగిస్తున్న ఇస్రో ఛైర్మన్ డా.వి.నారాయణన్. చిత్రంలో శైలేష్ గుప్తా, సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, రాజేశ్‌కుమార్ పాండే, శరత్‌కుమార్ శ్రీవాస్తవ

ఈనాడు, హైదరాబాద్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ వచ్చే నెలలో అమెరికాకు చెందిన సమాచార ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపనుందని ఇస్రో ఛైర్మన్ డా.వి.నారాయణన్ తెలిపారు. 'మన ఉపగ్రహ ప్రయోగ వాహక నౌక 'లాంచ్ వెహికిల్ మార్క్ 3' ద్వారా అమెరికా శాటిలైట్‌ను డిసెంబరులో అంతరిక్షంలోకి తీసుకెళ్తున్నాం. ఇది అమెరికా, భారత్‌ల సంయుక్త ప్రయోగం కాదు.. భారత్ పూర్తిస్థాయిలో చేపట్టిన వాణిజ్య ప్రాజెక్టు' అని పేర్కొన్నారు. సోమవారం తార్నాకలోని ఇండియన్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజినీరింగ్ అండ్ టెలికమ్యూనికేషన్ (ఇరిసెట్) 68వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సాంకేతికత పురోగతితో భవిష్యత్తులో అన్ని రైళ్లలో రియల్‌టైమ్ పర్యవేక్షణ సాధ్యమవుతుందని చెప్పారు. ప్రస్తుతం సుమారు 10వేల రైళ్లకు రియల్‌టైమ్ వ్యవస్థను అనుసంధానించారని తెలిపారు. 2027లో గగన్‌యాన్ యాత్ర చేపడతామని, 2035లోగా సొంత స్పేస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని, 2028లో మొదటి మాడ్యూల్‌ను పంపిస్తామని తెలిపారు. అనంతరం కోర్సుల్లో శిక్షణ పొందుతున్న ప్రతిభావంతులకు బహుమతులను అందించి టెక్నికల్ మ్యాగజైన్ 'జ్ఞానదీప్'ను ఆవిష్కరించారు.

ప్రవాసాంధ్ర బీమాతో ధీమా

- విదేశాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులకు భరోసా

ఈనాడు, అమరావతి: విద్య, ఉద్యోగం, ఇతర వృత్తుల కోసం విదేశాలకు వెళ్లిన వ్యక్తులు ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత వైకల్యానికి గురైతే.. ఆయా కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రవాసాంధ్రులకు అండగా నిలిచేలా ప్రభుత్వం 'ప్రవాసాంధ్ర భరోసా బీమా'ను అమలు చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ బీమా పథకాన్ని ఇటీవల ప్రారంభించారు. ఉద్యోగాలు చేస్తూ న్యాయపరమైన సమస్యలు ఎదుర్కొనేవారికి ఈ పథకం చేయూతనిస్తుంది. మహిళా ఉద్యోగులు, గర్భిణులకు ఆర్థికసాయం అందించి భరోసా ఇవ్వనుంది. ఉద్యోగులు, వలస కార్మికులు, విద్యార్థుల కోసం ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్‌ఆర్‌టీఎస్) ద్వారా ఈ పథకాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇందుకోసం జాతీయ బీమాసంస్థతో ఒప్పందం చేసుకుంది. సంఘటన జరిగినప్పుడు బీమా ప్రయోజనాలు బాధిత కుటుంబాలకు అందేలా ఏపీఎన్‌ఆర్‌టీఎస్ దగ్గరుండి పర్యవేక్షిస్తుంది. ఈ భరోసా లభించాలంటే విదేశాలకు వెళ్లేవారు http://apnrts.ap.gov.in/insurance వెబ్‌సైట్‌లో కనీస ప్రీమియం చెల్లించి తమ వివరాలు నమోదుచేసుకోవాలి.

వలస వెళ్లేవారిలో రెండో రాష్ట్రం ఏపీనే..

రాష్ట్రం నుంచి ఇతర దేశాలకు వలస వెళ్లినవారు 35 లక్షల మంది ఉంటారని అంచనా. కేరళ తర్వాత ఇతర దేశాలకు వెళుతున్నవారు మన రాష్ట్రం నుంచే అత్యధికంగా ఉన్నారు. వీరిలో గల్ఫ్ ప్రాంతానికి వెళ్లినవారు 8 లక్షల మంది ఉంటారు. వీరిలో బీమా అర్హత, అవసరం ఉండేవారు దాదాపుగా 5 లక్షల మంది ఉంటారని అంచనా.

★ విదేశాల్లో ఏడాదికి 300 మందికి పైగా మృత్యువాత పడుతున్నట్లు సమాచారం వస్తోందని ఏపీఎన్‌ఆర్‌టీఎస్ అధికారులు చెబుతున్నారు. సమాచారం అందని మరణాలు మరో 10% వరకు ఉంటాయి.

పథకం వివరాలు..

★ ఇతర దేశాలకు వెళ్లి ఉద్యోగాలు చేసేవారికి, చదువుకునే వారి కోసం ఈ పథకం
★ ఒకసారి నమోదు చేసుకుంటే ఉద్యోగులకు మూడేళ్లు, విద్యార్థులకు ఏడాదిపాటు వర్తిస్తుంది.
★ ఈ పథకానికి 18-60 ఏళ్ల మధ్య వయసున్నవారు అర్హులు ★ ఉద్యోగులు, వలస కార్మికులు రూ.590 (మూడేళ్లకు), విద్యార్థులు రూ.180 (ఏడాది కాలానికి) ప్రీమియం చెల్లించాలి.
★ బీమా పొందినవారు విదేశాల్లో ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యం కలిగినా రూ.10లక్షలు పరిహారంగా ఇస్తారు.

విద్యార్థులకు...

★ ప్రమాదం వల్ల సంభవించే గాయాల చికిత్సకు ఆసుపత్రి ఖర్చుల కింద రూ.లక్ష చెల్లిస్తారు
★ ప్రమాదం కారణంగా చదువు కొనసాగించలేని పరిస్థితి ఉంటే ఆ వ్యక్తికి, ఒక సహాయకుడికి స్వదేశానికి వచ్చేందుకు విమాన ఛార్జీలు చెల్లిస్తారు.

ఉద్యోగులు, వలస కార్మికులకు...

★ ప్రమాదంలో మరణించినవారి భౌతికకాయాన్ని స్వదేశానికి తరలించడానికి లేదా అంగవైకల్యం కలిగిన వ్యక్తి స్వదేశానికి వచ్చేందుకు ఒక సహాయకుడితోపాటు విమాన ఛార్జీలను చెల్లిస్తారు.
★ ప్రమాదం వల్ల మరణించి లేదా శాశ్వత అంగవైకల్యం కలిగిన వారి కుటుంబసభ్యులకు ఆసుపత్రి ఖర్చుల కింద బీమా కాలపరిమితి వరకు ఏడాదికి రూ.50వేల చొప్పున చెల్లిస్తారు
★ ఉద్యోగ సమయంలో కంపెనీలతో న్యాయపరమైన సమస్యలు తలెత్తితే పరిష్కరించుకునేందుకు రూ.45 వేలు
★ గర్భిణులకు ప్రసూతి ఖర్చుల కింద సాధారణమైతే రూ.35వేలు, సిజేరియన్ అయితే రూ.50వేలు ఇస్తారు.

నమోదుకు కావాల్సిన పత్రాలు

★ పాస్‌పోర్ట్, విదేశాల్లో నివసిస్తున్నట్లు ఆధారం (వీసా/సివిల్ ఐడీ/అకామా/ఆఫర్ లెటర్)

పోలవరంతో భద్రాచలంపై ప్రభావం

- తొలిదశ స్థాయిలో నీరు నిల్వ చేసినా ముంపు
- పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశంలో తెలంగాణ
- మీటింగ్ మినిట్స్ వివరాలు వెలుగులోకి..

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో గోదావరిపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు మొదటి దశలోనూ నీటిని నిల్వ చేస్తే వెనుక జలాల కారణంగా భద్రాచలం పట్టణం ముంపునకు గురవుతుందని తెలంగాణ స్పష్టం చేసింది. ఈ పట్టణంతోపాటు మొత్తం ఎనిమిది ప్రవాహాలు (వాగులు, డ్రైనేజీ) వెనుక జలాలతో ప్రభావితమవుతాయని పేర్కొంది. ఈనెల 7వతేదీన హైదరాబాద్‌లో జరిగిన పోలవరం ప్రాజెక్టు అథారిటీ 17వ సమావేశంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అథారిటీ కార్యనిర్వాహక అధికారి (సీఈవో), కేంద్ర జల సంఘం ఛైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ(పీపీఏ) సమావేశం జరిగింది. దీనికి సంబంధించిన మినిట్స్‌ను సోమవారం విడుదల చేశారు.



వివరాలు..

పోలవరం ప్రాజెక్టును రెండు దశలుగా నిర్మిస్తున్నట్లు పీపీఏ పేర్కొంది. తొలిదశ నిర్మాణం కింద ప్రాజెక్టులో 41.45 మీటర్ల వద్ద మాత్రమే నీటిని నిల్వ చేయనున్నారని, ప్రస్తుతం ఆ మేరకు పనులు జరుగుతున్నాయంది. సుప్రీంకోర్టు 2022, సెప్టెంబరు 6న ఇచ్చిన ఆదేశాల ప్రకారం ప్రాజెక్టుతో ఏర్పడే వెనుక జలాల ముంపుపై కేంద్ర జలసంఘం సాంకేతికపరమైన సమావేశాలు నిర్వహించిందని తెలిపింది. తమ రాష్ట్రంలోని గోదావరి నీటిమట్టాలపై పరిశీలన జరపాలని తెలంగాణ కోరుతోందని తెలిపింది. ఈఏడాది ఏప్రిల్ 8న ఈ అంశాలపై పీపీఏ.. సీఈవో అంతర్రాష్ట్ర సమావేశం నిర్వహించారని, పోలవరం రెండోదశ నిర్మాణంలోపు ముంపు ఏర్పడే ప్రాంతాల రక్షణకు చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పింది. భద్రాచలం సమీపంలో ఎటపాక వద్దనున్న వాగు (స్ట్రీం) 40.25 మీటర్ల స్థాయిలోనే ఉంటుందని తెలంగాణ పేర్కొంది. పోలవరం వెనుక జలాలు ఈవాగు ద్వారా పట్టణంలోకి వచ్చే అవకాశాలున్నాయంది. కిన్నెరసాని, ముర్రేడు వాగు.. మొత్తం 8 ప్రవాహాలపై వెనుకజలాలు ప్రభావం చూపుతాయంది. దీనిపై సంయుక్త సర్వేచేసి రక్షణ చర్యలు చేపట్టాలంది. తెలంగాణ విజ్ఞప్తితో.. పోలవరం మొదటి దశ నిల్వ ప్రభావంపై అధ్యయనానికి కమిటీ ఏర్పాటుకు నిర్ణయించినట్లు పీపీఏ సీఈవో స్పష్టం చేశారు. వర్షాలు పూర్తిగా తగ్గాక.. తెలంగాణ నీటిపారుదలశాఖ, ఏపీ జలవనరుల శాఖ, పీపీఏ నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి సర్వే పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. పోలవరం- బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు చేపడితే పోలవరంపై ప్రభావం పడుతుందని తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలపై పీపీఏ స్పందిస్తూ.. ఆ ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ నివేదికను అధ్యయనం చేసి సీడబ్ల్యూసీకి నివేదిక ఇచ్చామని సీఈవో స్పష్టం చేశారు. పీపీఏ అనేది కొత్త ప్రాజెక్టుల ప్రతిపాదనలను పరిశీలించదని, తెలంగాణ సరైన వేదిక వద్ద అభ్యంతరాలను లేవనెత్తాలని ఆయన సూచించారు.

తాత్కాలిక ఎసైన్‌మెంట్ పేరుతో.. భూములపై హక్కుల నిరాకరణ సరికాదు

- పిటిషనర్ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించండి
- విశాఖ జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: మాజీ సైనికోద్యోగులకు ప్రొవిజినల్ (తాత్కాలిక) ఎసైన్‌మెంట్ చేశారనే కారణంతో భూములపై హక్కులను నిరాకరించడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ఆ భూమిని ఒకసారి సాగులోకి తెచ్చినప్పుడు డి-ఫారం పట్టా జారీ చేయడం లాంఛనప్రాయమేనని తెలిపింది. ఎసైన్ చేసిన పదేళ్ల తర్వాత ఆ భూములను విక్రయించుకోవచ్చని సూచించింది. ఇండియన్ నేవీలో జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ హోదాలో పనిచేసిన అధికారి మాజీ సైనికోద్యోగుల కోటా కింద ఎసైన్డ్ భూమి పొందేందుకు అర్హులని స్పష్టంచేసింది. పిటిషనర్‌కు కేటాయించింది 'ఇసుక దిబ్బ పోరంబోకు' భూములని, వాటిని ఎసైన్ చేయడానికి వీల్లేదన్న ప్రభుత్వ సహాయ న్యాయవాది(ఏజీపీ) వాదనను తోసిపుచ్చింది. పిటిషనర్ అప్పారావు భూమిని నిషేధిత జాబితా (సెక్షన్ 22ఏ) నుంచి తొలగించాలని, ఆరు వారాల్లో నిరభ్యంతర పత్రం జారీచేయాలని విశాఖ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తితో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చింది. ◆ విశాఖపట్నానికి చెందిన పి.సి.అప్పారావు ఇండియన్ నేవీలో జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ హోదాలో పదవీ విరమణ చేశారు. విశాఖ జిల్లా కొత్తవలస గ్రామంలో ఆయనకు 1978లో మాజీ సైనికోద్యోగుల కోటా కింద 5.10 ఎకరాలను ప్రభుత్వం ఎసైన్ చేసింది. ఆ భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో 22ఏ నుంచి తొలగించాలని ఆయన విశాఖ కలెక్టర్‌ను కోరారు. ఆ అభ్యర్థనను తిరస్కరిస్తూ కలెక్టర్ 2020 జూన్ 19న ఉత్తర్వులిచ్చారు. దీన్ని సవాలు చేస్తూ అప్పారావు 2022లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 15న విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. 22ఏ నుంచి తొలగించే వ్యవహారంపై కలెక్టర్‌కు తాజాగా విజ్ఞప్తి చేయాలని సూచించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆయన ధర్మాసనం ముందు అప్పీల్ చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది జీఎల్ నరసింహారెడ్డి వాదనలు వినిపించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం అప్పారావుకు చెందిన భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్‌ను ఆదేశించింది.

ఓఆర్ఆర్‌పై కారు దగ్ధం.. వ్యక్తి సజీవ దహనం


జవహర్‌నగర్, శామీర్‌పేట, న్యూస్‌టుడే: అవుటర్ రింగురోడ్డు పక్కన నిలిపిన కారులో.. ఒక్కసారిగా మంటలు చెలరేగి ఒక వ్యక్తి సజీవ దహనమైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం జైగిరి గ్రామానికి చెందిన తల్లపల్లి దుర్గాప్రసాద్(30).. ఓ ప్రైవేటు డిజిటల్ న్యూస్‌ఛానల్ భాగస్వామిగా ఉన్నారు. ఆదివారం తన ఫోర్డ్ ఎకో స్పోర్ట్ కారులో వ్యాపార పని నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చారు. సోమవారం తెల్లవారుజామున 4.30 గంటలకు తన కారులో ఒక్కరే స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో ఓఆర్ఆర్‌పై శామీర్‌పేట-కీసర రోడ్డు పక్కన నిలిపి ఉన్న కారు మంటల్లో కాలిపోతున్నట్లు డయల్ 100కు సమాచారం అందింది. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న శామీర్‌పేట పోలీసులు అగ్నిమాపక యంత్రంతో మంటలను ఆర్పించారు. డ్రైవరు సీటులోని వ్యక్తి పూర్తిగా కాలిపోయి ఎముకలు తేలాయి. కారు నంబరు ఆధారంగా మృతుడిని గుర్తించారు. చలికి కారులో హీటర్ వేసుకుని నిద్రిస్తుండగా మంటలు చెలరేగి ఉంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు.

అక్రమ కాల్ సెంటర్ల కేసులో కీలక నిందితుడి అరెస్టు

దిల్లీ: అమెరికా జాతీయులను లక్ష్యంగా చేసుకుంటూ నడిపిన అక్రమ కాల్ సెంటర్ల కేసుకు సంబంధించి కీలక నిందితుడిని సీబీఐ అరెస్టు చేసింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అందులో వీసీ ఇన్‌ఫోమెట్రిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అక్రమ కార్యకలాపాల వెనుక ఉన్న నిందితుడు వికాస్ కుమార్ నిమర్‌ను గత వారం లఖ్‌నవూలో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపింది. 'నిందితుడి లఖ్‌నవూ నివాసంపై సోదాలు నిర్వహించాం. ఆ దాడుల్లో అమెరికా జాతీయులను లక్ష్యంగా చేసుకుంటూ మరో అక్రమ కాల్ సెంటర్‌ను కూడా నిమర్ నడుపుతున్నట్లు కనుగొన్నాం. 52 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నాం' అని సీబీఐ పేర్కొంది. పుణె, హైదరాబాద్, విశాఖపట్నంలో నిర్వహిస్తున్న అక్రమ కాల్ సెంటర్ల సైబర్ మోసాలపై గతేడాది సెప్టెంబరు 24న సీబీఐ కేసు నమోదు చేసింది. ఆ కేసు దర్యాప్తులో భాగంగానే ఈ అరెస్టు జరిగింది.

తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు ఎన్టీఆర్

తెలంగాణ మంత్రి తుమ్మల



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో తుమ్మల నాగేశ్వరరావు, మట్టా రాగమయి, టీడీ జనార్దన్

కల్లూరు, న్యూస్‌టుడే: తెలుగుజాతి గర్వించదగ్గ మహనీయుడు ఉమ్మడి ఆంధ్ర మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం దారుకాబంజర్‌లో అభిమానులు ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో తుమ్మల నాగేశ్వరరావు, ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ, ఎన్టీఆర్ ట్రస్ట్ భవన కార్యదర్శి టీడీ జనార్దన్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విగ్రహావిష్కరణ అనంతరం మంత్రి మాట్లాడుతూ.. వ్యవసాయదారుడిగా మట్టి పిసుక్కునే తనలాంటి వారిని సైతం చట్టసభలకు తీసుకెళ్లిన ఘనత ఎన్టీఆర్‌దే అని పేర్కొన్నారు. ఆయనిచ్చిన అవకాశంతోనే సత్తుపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయగలిగానన్నారు. ఆనాడు ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలనే నేటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్నాయని గుర్తు చేశారు. నేటికీ ఎన్టీఆర్ ప్రియశిష్యుడిగా తనకు గుర్తింపు ఉందన్నారు. అలాగే చంద్రబాబునాయుడు తనకు సుదీర్ఘకాలం అవకాశం ఇచ్చారని చెబుతూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ(దెందులూరు) ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, టీజీఐడీసీ అధ్యక్షుడు మువ్వా విజయబాబు, నాయకులు వాసిరెడ్డి రామనాథం, పి.జయరామ్, కేతినేని హరిచంద్ర, సీహెచ్ రాజేశ్వరరావు, తుళ్లూరి బ్రహ్మయ్య, పోట్రు శ్రీనివాసరావు, కొంగర రామకృష్ణ, షేక్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

నా కోసం నెదర్లాండ్స్‌కు వచ్చింది మీరేనా?!

- ఐదో రోజు విచారణలో పోలీసులను అడిగిన ఐబొమ్మ రవి



ఈనాడు, హైదరాబాద్: దమ్ముంటే పట్టుకొమ్మంటూ పోలీసులకు సవాల్ విసిరిన ఐబొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి ఒకానొక సమయంలో భయపడ్డాడా... విదేశాల్లో ఉన్నా తన చుట్టూ ఎవరో తిరుగుతున్నారని ఆందోళనకు గురయ్యాడా... పోలీసులకు మస్కా కొట్టగలననే అతి విశ్వాసంతో హైదరాబాద్‌కు వచ్చి చిక్కాడా... ఈ ప్రశ్నలకు ఔననే సమాధానమే వస్తోంది. రవిని ఐదు రోజులు కస్టడీకి తీసుకున్న పోలీసులు విచారణలో కీలక ఆధారాలు సేకరించారు. సోమవారం కస్టడీ గడువు ముగియటంతో న్యాయస్థానంలో హాజరుపరిచి చంచల్‌గూడ జైలుకు తరలించారు. మరో నాలుగు కేసుల్లో అరెస్ట్ చేసి.. కస్టడీకి తీసుకొనేందుకు సిద్ధమవుతున్నారు. పోలీసుల విచారణలో వెల్లడైన విషయాలిలా ఉన్నాయి.

విడాకుల ముందు.. భార్యతో ఒప్పందం

కూకట్‌పల్లిలోని గేటెడ్ కమ్యూనిటీలో 2015లో రవి సొంతిల్లు కొన్నాడు. తన ఐటీ కంపెనీ నుంచి వచ్చే ఆదాయంతో వాయిదాలు చెల్లించేవాడు. రెండేళ్ల తర్వాత బ్యాంకు రుణాన్ని తీర్చేశాడు. డబ్బు సంపాదించడం లేదంటూ తనను అవమానించిన భార్యను దూరం పెట్టాడు. కన్నకూతుర్నీ పట్టించుకోవటం మానేశాడు. 8 నెలల పసికందు అని కూడా చూడకుండా కొట్టేవాడంటూ విదేశాల్లో ఉన్న మాజీ భార్య ఫోన్ ద్వారా పోలీసులకు తెలిపింది. అతడి ప్రవర్తన నచ్చకే విడాకులు తీసుకున్నట్టు చెప్పింది. విడిపోయిన తర్వాత భార్యకు, కుమార్తెకు తాను సంపాదించిన ఆస్తిపాస్తులపై ఎలాంటి హక్కు లేకుండా భార్యతో ఒప్పందపత్రంపై సంతకం తీసుకున్నాకే విడాకులకు ఆమోదం చెప్పినట్టు సమాచారం.

'పాన్‌పై ఫొటో నాదే.. పేరు స్నేహితుడిది'

పోలీసులకు పట్టుబడినా తన వివరాలను పేపాల్ గోప్యంగా ఉంచుతుందనే నమ్మకంతో పైరసీ సినిమాల డొమైన్లకు దాని ద్వారా చెల్లింపులు చేశాడు. వెల్లెల ప్రహ్లాద్‌కుమార్ పేరుతో తీసుకున్న పాన్‌కార్డుపై మాత్రం తన ఫొటోనే ఉపయోగించాడు. దీనిపై పోలీసులు ప్రశ్నించగా... 2007-08లో అమీర్‌పేట్‌లో ఉన్నప్పుడు తన మిత్రుడు ప్రహ్లాద్‌కుమార్ పేరుతో పాన్‌కార్డు తీసుకున్నట్టు తెలిపాడు. అతడి ఫోన్ నంబరు, చిరునామా అడిగినపుడు తనకు తెలియదంటూ దాటవేశాడు.

ఎలా పట్టుబడ్డాడంటే...!

పైరసీ సినిమాలు అప్‌లోడ్ చేసిన సర్వర్ల ఐపీ అడ్రస్ ఆధారంగా డొమైన్ల నోడల్ అధికారి ఫోన్ నంబరును పోలీసులు సేకరించారు. ఆ నోడల్ అధికారే తాము వెతుకుతున్న మోసగాడని మొదట్లో పోలీసులు గ్రహించలేదు. విదేశీ దర్యాప్తు సంస్థలేవైనా ఏదైనా సమాచారం కోరితే.... కోర్టు అనుమతి కావాలంటూ అమెరికా అధికారులు చెబుతారు. కానీ, నోడల్ అధికారినంటూ పరిచయం చేసుకున్న వ్యక్తి ఐబొమ్మ, బప్పం డొమైన్లలో పైరసీ సినిమాలున్నట్టు ఆధారాలు పంపాలంటూ మెయిల్ చేయటంతో పోలీసులకు అనుమానం వచ్చింది. మరోవైపు, తన గురించి పోలీసులు కూపీ లాగుతున్నట్టు రవి గ్రహించాడు. తాను నెదర్లాండ్స్‌లో ఉన్నట్టు వారికి తెలిసిపోయిందని అనుమానించాడు. 'నా కోసం నెదర్లాండ్స్‌కు వచ్చింది మీరేనా!' అంటూ సైబర్ క్రైమ్ పోలీసులను ఐదో రోజు విచారణలో అడగటమే ఇందుకు నిదర్శనం. పోలీసులు పట్టుకుంటారన్న భయం మొదలైనప్పటి నుంచి 20 రోజుల పాటు పోలాండ్, ఫ్రాన్స్‌లో ఉన్నాడు. అయితే, పోలీసుల నుంచి ఎలాంటి మెయిల్ రాకపోవటంతో ధీమాగా హైదరాబాద్‌కు వచ్చి చిక్కాడు. నిందితుడి స్నేహితుల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. లావాదేవీలను గుర్తించేందుకు ఫోరెన్సిక్ ఆడిటింగ్ బృందం పనిచేస్తోంది.

పోలవరం-నల్లమలసాగర్‌పై జీఆర్‌ఎంబీకి లేఖ?

సీడబ్ల్యూసీకి కూడా లేఖ రాసేందుకు తెలంగాణ నిర్ణయం!

ఈనాడు, హైదరాబాద్: ఏపీ ప్రభుత్వం పోలవరం-నల్లమలసాగర్(పీఎన్‌ఎల్‌పీ) అనుసంధాన ప్రాజెక్టు నిర్మాణానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) రూపకల్పనకు టెండరు పిలవడంతో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైనట్లు తెలిసింది. దీనిపై గోదావరి బోర్డు(జీఆర్‌ఎంబీ), కేంద్ర జల సంఘానికి నీటిపారుదలశాఖ లేఖ రాయనున్నట్లు తెలిసింది. ఇదివరకు ఏపీ ప్రభుత్వం పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు డీపీఆర్ రూపకల్పనకు టెండర్ పిలిచిన సమయంలోనూ తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ ప్రాజెక్టు ప్రీ ఫీజుబులిటీ రిపోర్టును ఏపీ ప్రభుత్వం సీడబ్ల్యూసీకి కూడా పంపగా అక్కడి నుంచి సంబంధిత రాష్ట్రాలు, పీపీఏ, కృష్ణా, గోదావరి బోర్డులకు కేంద్రం పంపించింది. దీనిపై తెలంగాణ ఆక్షేపణ వ్యక్తంచేసింది. ఈ క్రమంలో ఏపీ డీపీఆర్ టెండర్‌ను రద్దు చేసుకుంది. అయితే, పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును మరో రూపంలో ఏపీ చేపట్టనుందంటూ ఇటీవల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్రానికి కూడా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఏపీ టెండరు పిలిచిన పీఎన్‌ఎల్‌పీ ప్రాజెక్టుపై నీటిపారుదలశాఖ జీఆర్‌ఎంబీ, సీడబ్ల్యూసీలకు లేఖల ద్వారా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. పీఎన్‌ఎల్‌పీ ప్రాజెక్టు డీపీఆర్ రూపకల్పనకు ఏడాది కాలవ్యవధితో రూ.9.10 కోట్లకు ఏపీ టెండరు పిలిచింది.